నియె. ఓతండ్రీ! నాపరాక్రమమును జూడుము. నే నతిశీఘ్రముగ శ్రీరాముని సంహరించెదనని చెప్పి రక్తమాల్యాంబరములను ధరించి యభిచారహోమమును చేయుటకుద్యమించె. ఆహోమకుండమునుండి దివ్యరథమును రప్పింపఁదలఁచి హోమమును చేయుచుండె. అట్లు గుహయందుఁ బ్రవేశించి రహస్యముగ హోమమును చేయునపుడు ఆహోమకుండమునకు నూర్ధ్వభాగమునందు కృష్ణసర్పమును ద్రేలాడఁగట్టె. మఱియు నాయింద్రజిత్తు రక్తపుష్పాంబరములను ధరించినవాఁడును, రక్తచందనమును పూసికొనినవాఁడును, రక్తపుష్పాక్షతలను ధరించినవాఁడును నై చండ్రమామిడి, అత్తి, జీడిమామిడి మొదలుగాఁగల వృక్షములయొక్క సమిత్తులచేతను మాంసాదిపదార్థములచేతను మనుష్యశిరస్సులచేతను. మత్స్యమాంసములచేతను విభీతకఫలాదులచేతను సర్వఖండములచేతను మండూకములచేతను చర్మములు దంతములు స్నాయువులు మొదలగువానిచేతను నానావిధవనమృగములయొక్క మాంసములచేతను కన్నులను మూసికొని హోమమును చేసె. ఆసమయమునందు విభీషణుఁడు ఆ హోమధూమమును జూచి శ్రీరామునితో నిట్లనియె. ఓరఘుకులోత్తమా! దురాత్ముఁడగు నింద్రజిత్తు హోమమును బ్రారంభించె. ఆహోమము పూర్తిపొందెనేని దేవదానవులుకూడ నింద్రజిత్తు జయింపఁజాలరు. కావున శీఘ్రముగ లక్ష్మణునిచేత నింద్రజిత్తును చంపింపుము. పదిరెండుసంవత్సరములకాలము నిద్రాహారములను మానుకొనినవాఁడు తప్ప నితరుఁడు ఇంద్రజిత్తును సంహరింపఁజాలఁడు. అట్టివాఁడు మనసైన్యమునందు లక్ష్మణుఁడు తప్ప మఱియొక్కఁడు లేఁడు. బ్రహ్మదేవుఁడు దురాత్ముఁడగు నింద్రజిత్తునకు లక్ష్మణునిచేత మరణము కలుగుననియె. లక్ష్మణుఁడు అయోధ్యాపట్టణమును విడిచినదిమొదలుకొని నిద్రాహారముల నెఱుఁగఁడు. నిన్ను సేవించుటకొఱకు లక్ష్మణుఁ డీవిధముగ సంచరించుచున్నాఁడు. ఈవృత్తాంతమును సర్వమును నేను తెలిసికొంటిననియె. అట్లు చెప్పి రామాజ్ఞనుపొంది సకలవానరసైన్యముతోఁగూడ లక్ష్మణుని పురస్కరించుకొని పోయి నికుంభిలాహోమమును చేయుచున్న యింద్రజిత్తును జూచె. ఆసమయమునందు లక్ష్మణుఁడు అంగదుని భుజములమీఁద నెక్కి యాగ్నేయాస్త్రమును సంధానముచేసి మిగులఁదీక్ష్ణములగు బాణములను బ్రయోగించె. అప్పుడు ఇంద్రజిత్తు ప్రయోగించిన నాగాస్త్రమును గరుడాస్త్రముచే రూపుమాపె. అట్లుచేసి పర్వతాస్త్రమును బ్రయోగించె. అనంతరమందు పర్జన్యాస్త్రమును వాయవ్యాస్త్రముచేత శాంతినిపొందించె. మఱియు నివ్విధముగానే యనేకాస్త్రములను ప్రయోగించినను ఆయింద్రజిత్తు గుహలోనుండి బయలునకురాకపోవుటచేత హనుమంతుఁ డాగుహాద్వారముననైచినశిలలను చూర్ణముచేసి లోపలఁ బ్రవేశించి నానావిధవాక్యములచేత బెదరించుటచేత నయ్యింద్రజిత్తు హోమమును విడిచిపెట్టి మిగులఁద్వరకలవాఁడై రథము నెక్కి యుద్ధమును జేయుటకు లక్ష్మణుని యెదుటికి వచ్చె. అట్లువచ్చి నానావిధములును మిగులఁగ్రూరములును నగు నస్త్రములను బ్రయోగించె.

అంతట లక్ష్మణుఁడు కోపోద్దీపితుఁడై దివ్యాస్త్రములచేత నింద్రజిత్తుయొక్క రథమును గుఱ్ఱములను ధనుస్సును ధ్వజమును విరిచివైచె. మఱియును క్షణమాత్రములోపల దృఢమగు కవచమును చించివైచె. అంతట నాయింద్రజిత్తు వేఱొకధనుస్సునుధరించి లక్ష్మణునిమీఁద బాణవర్షమును గురిపించె. అప్పుడు లక్ష్మణుఁ డధికకోపముకలవాఁడై యొక్క బాణమును బ్రయోగించి ఆయింద్రజిత్తుయొక్క దక్షిణభుజమును బాణముతోఁగూడ ఖండించె. అప్పుడు మేఘనాదుఁడు వామహస్తముతో మిగులభయంకరుఁడై మిక్కిలి శ్రేష్ఠమగు శూలమునుధరించి లక్ష్మణునిచంపుటకు పరుగిడి వచ్చుచుండె. అంతట లక్ష్మణుఁ డామేఘనాదునివామహస్తమును శూలముతోఁగూడ ఖండించి రావణునెదుట పడునట్లుచేసె. ఆసమయమునందు లంకాపట్టణములోనివారందఱును మిగులనాశ్చర్యమును పొందిరి. అంతట నయ్యింద్రజిత్తు నోరునుతెఱచికొని లక్ష్మణుని మ్రింగుటకు వచ్చుచుండె. అప్పుడు లక్ష్మణుఁడు రామనామాంకితమగు దివ్యశరమునుసంధించి శ్రీరామునిపాదపద్మములను స్మరించుచుఁ బ్రయోగించిన నాబాణముపోయి మేఘనాదునిశిరస్సును ఖండించి క్రిందఁబడవైచె. ఆసమయమునందు దేవతలందఱును సంతసించి లక్ష్మణు ననేకవిధముల స్తోత్రముచేసిరి. పుష్పవర్షమును గురిపించిరి. అంతఁ గొంతసేపటికి లక్ష్మణుఁడు యుద్ధాయాసమునుదీర్చుకొని శంఖమును పూరించె. ఆశంఖనాదమును విని సీతామహాదేవి త్రిజటయనుదానిని పంపి సకలవృత్తాంతమును దానివలనఁదెలిసికొని యధికానందమునుపొందె. అంతట హనుమంతుఁ డామేఘనాదునిశిరస్సును శ్రీరామునకుఁజూపుటకు తీసికొనిపోదమని లక్ష్మణాదులను త్వరపఱిచె. ఆసమయమునందు లక్ష్మణుఁడు అంగదునిభుజములమీఁదనెక్కి నానావిధములయిన వాద్యములతోఁగూడ రామునిదగ్గఱకుఁబోయె. పోయి రామునకు నమస్కరించి యింద్రజిత్తుయొక్క శిరస్సును రామునకుఁజూపె. ఆశిరస్సునుజూచి రాముఁడు సంతోషించి లక్ష్మణుని కౌఁగిలించుకొనియె. అంతట నక్కడ రావణుఁడు యింద్రజిత్తుయొక్క భుజమునుచూచి పుత్త్రుఁడు మరణమునుపొందినవృత్తాంతమును విని పుత్త్రదుఃఖముచేత గ్రిందఁబడి మూర్ఛనుపొందె. అంతఁ గొంతసేపటికి తెలివినొంది ధైర్యమునుపొంది ఖడ్గమునుధరించి సీతామహాదేవిని చంపుటకుఁ బోయె. ఆసమయమునందు సుపార్శ్వుఁడను మంత్రిపుంగవుఁ డారావణుని నివారింపఁ దలఁచి రావణునిహస్తమునుపట్టుకొని యిట్లనియె. ఓ రాక్షసరాజోత్తమా! కోపమువలన నాఁడుదానిఁజంపుటకు యత్నించుచున్నావు. ఇట్లే చేయుటతగునా? ఇట్లు చేయుటతగదు. కావున నీపీదుష్కార్యమునువదలి మాతోఁగూడ యుద్ధమునకువచ్చి శ్రీరాముని లక్ష్మణునితోఁగూడ సంహరించి సీతనుపరిగ్రహింపుమనియె. ఆవచనమును విని రావణుఁడు సీతనుచంపుటను మానుకొనియె. ఆసమయమునందు ఇంద్రజిత్తుభార్యయగు సులోచనయనునది మేఘనాదునిభుజమును చూచి ఆ యింద్రజిత్తుయొక్క పరాక్రమాదిగుణములను తలఁచుకొని యధికముగ దుఃఖమునుపొందుచుం

డె. ఆసమయమునందు మేఘనాదునిభుజము తనవద్దనున్న బాణముచేత భూమియం దిట్లనిలిఖించె. ఎట్లనిన:—ఓతరుణీ! నీవు దుఃఖమునుపొందకుము. నేను శేషుఁడగు లక్ష్మణునిబాణములచేత మరణమునుపొందితిని. అందువలన ముక్తుఁడనైతిని. ఓతరుణీ! నీవుకూడ రామునిదగ్గరకుఁబోయి నమస్కరించి నాశిరస్సును యాచింపుము. రాముఁ డాశిరస్సును నీకిచ్చును, దానితోఁగూడ నీవగ్నియందుఁ బ్రవేశింపు మని వ్రాసె. ఆయక్షరములను చదువుకొని యాసులోచనయనునది సంతోషించి యావృత్తాంతమును రావణమందోదరులకుఁ దెలిపె. అనంతరమందు నానాలంకారములచేత నలంకరింపఁబడినదై శిబికమీఁద నెక్కి రామునిదగ్గరకుఁబోయె. అప్పుడు వానరోత్తములు ఆసులోచననుఁజూచి సీతామహాదేవిని రావణుఁడు భయముచేత రామునిదగ్గరకుపంపుచున్నాఁడని తలఁచిరి. అట్లుతలఁచి సీతామహాదేవినిచూతమని యందఱును పరుగిడిరి. అట్లు పరుగిడిపోయి యాశిబికనుచుట్టుకొనిరి. చుట్టుకొని యాయంగనను సులోచనగాఁ దెలిసికొనిరి. అంతలోపల శిబికనువహించినవా రాశిబికను రామునిదగ్గరకుఁ దీసికొనిపోయిరి. అంతట సులోచనయనునది శిబికనుండి దిగి శిరస్సునువంచి శ్రీరామునకు నమస్కరించి భర్తయగు నింద్రజిత్తుయొక్క శిరస్సునుగోరె. అప్పుడు శ్రీరాముఁ డిట్లనియె. ఓతరుణీ! దయకలవాఁడ నగుటచేత నీభర్తయగు నింద్రజిత్తును జీవింపఁజేసెదను. కావున నీవగ్నియందు ప్రవేశింపకుము. నీకు భర్తకావలయునను నపేక్ష కలిగియున్నదా? నీయభిప్రాయమును తెలుపుము నిన నాసులోచన యిట్లనియె. ఓరఘుకులోత్తమా! నీవుదయకలవాఁడవగుటచేత నాభర్తను జీవింపఁ జేయఁగలవాఁడ వనుటకు సందేహములేదు. నాభర్తయగు నింద్రజిత్తు మరలజీవించెనేని లక్ష్మణునిహస్తమువలన మరల మరణమెట్లుగలుగును. లక్ష్మణునిహస్తముచేత మరణము కలుగుటవలన నాభర్త ముక్తినిపొందెను. కావున నాభర్తజీవింపవలయునని నాకపేక్షలేదనిచెప్పి యాశిరస్సునే యాచించి కైకొనియె. అనంతరమందు రామునకు నమస్కరించి యాశిరస్సునుదీసికొనిపోయి యతనికళేబరమునందు సంధానముచేసి నికుంభిలాహోమకుండసమీపమునయున్న భుజములను తెప్పించి భర్తృదేహమునందు సంధానమునుచేసి యాశరీరముతోఁగూడ నగ్నియందుఁ బ్రవేశించె. అంతట సులోచన దివ్యదేహమునుధరించినదై భర్తతోఁగూడ వైకుంఠమునకుఁబోయె. అంతట రావణుఁడు సుహృన్మిత్రాదులతోఁగూడుకొని యుద్ధమునుచేయుటకు బయలువెడలె. అట్లువచ్చి మిగులభయంకరమైన యుద్ధమునుచేయుచుండఁగా రాముఁడు వారలనందఱను సంహరించి యొక్కబాణముచేత రావణుని విసరి లంకాపట్టణమునందుఁ బడవైచె. అప్పుడు రావణుఁడు మయునివలన కృత్రిమమగు రామశిరస్సునుచేయించికొని సీతయొద్దకుఁబోయె. అట్లు రావణుఁడు పోవుటకుముందుగ బ్రహ్మదేవుఁ డావృత్తాంతము సీతతో నోసీతా! కృత్రిమమగు రామశిరస్సునుదెచ్చి రావణుఁడు నీకుఁగనఁబఱుచును. నీవు భయము

నుపొందకుము. వ్యసనమును పొందకు మనిచెప్పి యాబ్రహ్మదేవుఁ డంతర్ధానమును పొందె. అంతట రావణుఁడువచ్చి యాశిరస్సును జూపి యిట్లనియె. ఓసీతా! రాముని జంపితిని. కావుననీవునన్ను భజింపుమనియె. ఆసమయమునందు సీతామహాదేవి యధోముఖియై యిట్లనియె. ఓరావణుఁడా! రామునిబాణములచేత యుద్ధరంగమునందు పడవేయఁబడిన నీశిరస్సుల నేచూడఁగలననినవిని రావణుఁడు సిగ్గుచేత వంపఁబడినశిరస్సుకలవాఁడై తనగృహమునకుఁ బోయె. అంతట నక్కడ వానరులందఱును రామాజ్ఞచేత లంకాపట్టణమునందుఁ బ్రవేశించి యాలంకాపట్టణమును సర్వమును కాల్చివైచె. ఆసమయమునందు హనుమంతుఁడు లంకాపట్టణమును కాల్చినవిధముగ కోలాహలధ్వనికలిగె. అప్పుడు రావణుఁడు తనగృహములుకూడ కాలిపోవుటనుజూచి మిగులవేగముగ మేఘాస్త్రమును బ్రయోగించె. ఆయస్త్రముచేత నగ్నియంతయును శాంతమగుటచేత వానరులందఱును బయలువెడలిపోయిరి. అంతట శుక్రునివచనమునువిని రావణుఁడు ఏకాంతముగ గుహయందుఁబ్రవేశించి మౌనియై హోమమునుచేసె. మఱియు నాసమయమునందు రావణుఁడు మిగుల నధికమగుప్రయత్నముతో కవాటమునుమూయించె. మఱియు నిదివఱకు నింద్రజిత్తు సంపాదించినవిధముగ సకలవస్తువులనుసంపాదించి ప్రేతాసనమునందుఁగూర్చుండి హోమకుండమునకు నాలుగువైపులను శస్త్రములనుపఱచి పదిసంవత్సరములవయస్సుకల బాలురశిరస్సులతోడను మాంసముతోడను హోమమునుచేసె. అంతట నాహోమగుండమునుండి బయలువెడలుధూమమును చూచి విభీషణుఁ డావృత్తాంతమును రామునకుఁదెలిపి యిట్లనియె. ఓరఘుకులోత్తమా! ఇప్పుడు రావణుఁడుచేయు హోమము పూర్తి అయినయెడల జయింపనలవికానివాఁ డగును. కావున నిప్పు డారావణునిహోమమునకు విఘ్నమును కలిగింపుమనియె. అంతట రాముఁడు వానరులనుపంపె. అప్పుడు వానరులందఱును లంకాప్రాకారమునుదాటి రావణునిగృహమునందుఁ బ్రవేశించిరి. అట్లు ప్రవేశించినను రావణుఁడు హోమముచేయు ప్రదేశముకనఁబడకపోయె. ఆసమయమునందు విభీషణునిభార్యయగు సరమయనునది రావణుఁ డుండుచోటును కరసంజ్ఞచేతఁజూపె. అంతట నంగదుఁడు పాదఘట్టనములచేత రావణుఁడున్న గుహాద్వారమునందలి శిలలను బ్రద్దలుచేసె. అట్లుచేసి యాగుహయందుఁబ్రవేశించి పిడికిటిపోటుచేత రావణునిబొడిచె. మఱియును దక్కినవానరులందఱును మిగులనాదరముతో వృక్షములచేత నారావణునిగొట్టిరి. అట్లెన్నివిధములఁగొట్టినను కదలకయున్న రావణునిజూచి యావానరులందఱును మందోదరి రోదనమునుచేయుచుండఁగా కేశపాశమునుబట్టి రావణునిదగ్గఱకు నీడ్చికొనివచ్చిరి. ఆసమయమునందా మందోదరి విడిచిపోయిన కట్టువస్త్రముకలదియును కంచుకమునువదలినదియును నయ్యె. అట్లు వానరులచే నానావిధముగ బాధనుపొందుచు రోదనమునుచేయుచున్న మందోదరిని జూచి రావణుఁడు మిగులఁదత్తరకలవాఁడై హోమమునువిడిచిలేచి వానరులసంహరిం

చుట కుద్యమించె. ఇంతలో నావానరులందఱును శ్రీరాముని సమీపమునకుఁ
బరుగిడిపోయిరి. అంతట నిక్కడ మందోదరి యిట్లనియె. ఓ రాక్షసరాజోత్తమా!
నావచనమును వినుము. సీతను రామునకిచ్చి విభీషణునకు పట్టాభిషేకమునుచేసి
నాతోఁగూడ నరణ్యమునకుఁబోయి సుఖముగ తపస్సునుచేయుమనియె. ఆవచన
మును విని రావణుఁ డిట్లనియె. ఓయంగనామణీ! రాముఁడు సాక్షాన్నారాయ
ణుఁడనియును, సీత మహాలక్ష్మియనియును, నేనెఱుఁగుదును. కావున రాముని
హస్తమువలన మరణమును పొందఁదలఁచి నేను సీతనపహరించితిని. రాముని
హస్తమువలననేను మరణమునుపొందినయెడల నేను పరమపదమునుపొందుదును.
నేను మరణమును పొందినపిమ్మట నీవగ్నిప్రవేశమునుచేయుము. అట్లు చేసితివేని
నీవుకూడ పరమపదమును పొందఁగలవని చెప్పి మిగులత్వరకలవాఁడై యుద్ధమున
కుఁ బోయె. అట్లు రావణుఁడు బయలువెడలు సమయమునందు ముందుగ నొకముం
డి రావణునకుఁ గనఁబడియె. రావణునికిరీటము క్రిందఁబడియె. అట్లగుటచేత రావ
ణుఁడు తనమనస్సునందు దృఢముగ మరణముకలుగునని తలఁచె. అంతట ధైర్యము
నుతెచ్చికొని యారావణుఁడు యుద్ధరంగమునందుఁబ్రవేశించి వానరులందఱునుచూ
చుచుండఁగ కృత్రిమసీతను మిగులఁదీక్ష్ణములగు బాణములచేతఖండించె. అట్లు రావ
ణునిచేత సీతఖండింపఁబడుటనుచూచి వానరులందఱును మిగులవ్యసనముకలవారై
యావృత్తాంతమును రామునకుఁదెలుపుటకుఁ బోయిరి. అంతలోపల బ్రహ్మదేవుఁ
డక్కడకువచ్చి మిగులనాదరముతో రామున కిట్లనియె. రావణుఁడు కృత్రిమసీతను
ఖండించెను. కావున నీవావిషయమునుగురించి దుఃఖింపకుమనిచెప్పి యంతర్ధానము
నుపొందె. అప్పుడు రాముఁడు వానరులతోఁగూడ నావృత్తాంతమును తెలిసికొని
దుఃఖమునువదలి యుద్ధముకొఱకు బయలువెడలిరి. ఆసమయమునందు దేవేంద్రుని
వాక్యానుసారముగ మాతలి యనువాఁడు దివ్యరథముతోఁగూడ రామునిదగ్గరకు
వచ్చె. వచ్చి దివ్యములయిన శస్త్రాస్త్రవాహనములతోఁ గూడుకొనినదియును,
వజ్రాయుధము టెక్కెము మొదలగువానిచేతఁ బ్రకాశింపఁజేయఁబడినదియును,
మిగుల శ్రేష్ఠములగు యస్త్రములతోఁ గూడుకొనినదియును నగు నాదివ్యరథమును
రామునిమ్రోలనుంచె. అంతట రాముఁ డారథమునెక్కి యుద్ధమునుచేయుటకుఁ బ్రా
రంభించె. అప్పుడు ఆగ్నేయాస్త్రముచేత నాగ్నేయాస్త్రమును దైవాస్త్రముచేత
దైవాస్త్రమును పరమాస్త్ర వేత్తయగు రాముఁడు నివారించె. అనంతరమం దా
రావణుఁడు మిగులభయంకరమగు నాగాస్త్రమును బ్రయోగించె. అప్పుడు రాముఁ
డు గరుడాస్త్రముచేత నాయస్త్రమును ప్రయోగించె. అట్లు రావణుఁడు ప్రయోగిం
చునస్త్రములను రాముఁడు ప్రత్యస్త్రములచేత నివారించుచుండఁగా రావణుఁడు
పర్జన్యాస్త్రమును ప్రయోగించె. ఆయస్త్రమును శ్రీరాముఁడు వాయవ్యాస్త్రము
చేత నివారించె. అట్లు పర్జన్యాస్త్రమును నివారించి యాగ్నేయాస్త్రమును మరలఁ

ప్రయోగించె. రావణాసురుఁడు మరలపర్జన్యాస్త్రమును ప్రయోగించి రాముఁడు ప్రయోగించిన యాగ్నేయాస్త్రమును నివారించె. మఱియు నారాముఁడు ప్రయోగించిన బాణాస్త్రాదులచేత రావణసైన్యమును నపరిమితముగ ఖండించె. ఆసమయమునందు రామ రావణులయుద్ధమునుచూచుటకు దేవతలందఱును వచ్చి యంతరిక్షమునందు నిలిచిరి. మఱియును గంధర్వకిన్నర యక్షాదులుకూడ ననేకములగు విమానములతోఁగూడ నంతరిక్షమునందు నిలిచిరి. ఆసమయమునందు రామునిరథమునందలి యశనిధ్వజమును రావణుఁడు ఖండించె. అట్లు ధ్వజహీనమైన తనరథమునుచూచి హనుమంతునిపిలిచి యోహనుమంతా, కొంచెముసేపు రథముమీఁద ధ్వజముండు చోట నుండుమనియె. అందులకాహనుమంతుఁ డంగీకారమునుపొంది మిగులవేగముగ తాళవృక్షము నొకదానిం బెల్లగించి దివ్యమగు రామునిరథమునందు బెట్టి యావృక్షముమీఁదఁగూర్చుండె. అప్పుడు రావణుఁ డాహనుమంతునిజూచి మిగుల ద్వేషకలవాఁడై యారామునిరథమునందలి తాలమును ఛత్రమును అశ్వములను హనుమంతుని ఇంద్రధనుస్సును తొమ్మిదిబాణములను ప్రయోగించికొట్టె. ఆసమయమునందు మాతలియును హనుమంతుఁడును మూర్ఛనుపొందిరి. అంతట క్షణమాత్రములోపల హనుమంతుఁడు స్వస్థచిత్తుఁడయ్యె. అప్పుడు శ్రీరాముఁడు హనుమంతునిభుజములమీఁదనెక్కి యుద్ధరంగమునందునిలిచి మిగులభయంకరమైన యుద్ధమునుచేసె. అంతట రావణుఁడు పరిఘయను నాయుధమును హనుమంతునిహృదయమునందుఁ బ్రయోగించె. అప్పుడు హనుమంతుఁడు మరల మూర్ఛనుపొంది క్రిందఁబడియె. ఆసమయమునందు శ్రీరాముఁడు తనరథమును స్మరించె. అంతట దారుకుఁడు గరుడధ్వజాది చిహ్నములతోఁగూడుకొనిన రథమునుగొనివచ్చె. ఆరథమును చూచి రాముఁ డారథమునకుఁ బ్రదక్షిణనమస్కారములను చేసి మిగులసంతోషముకలవాఁడై యారథముమీఁదనెక్కి శార్ఙ్గమను ధనుస్సునుధరించె. అనంతరమందు మిగుల దీక్ష్ణములయిన బాణములచేత రావణునిరథమును చూర్ణముచేసె. రావణునికూడ భయపడె. అంతట రావణుఁడు వేఱొక రథమునెక్కి మరల రామునిమాఱ్కొనియె. అంతట రాముఁడు మిగుల దీక్ష్ణములైన బాణములచేత రావణుని శిరస్సులను ఖండించె. ఖండించి యాశిరస్సులను నాకాశమునకు నెగరవైచె. ఆసమయమునం దాశిరస్సులు తమకు రామహస్తమువలన నాశముకలిగెను కదా యను సంతోషముచేత నవ్వుచు నంతరిక్షమునందుండి మరలవచ్చి రామునిపాదములయందుఁబడె. అట్లుపడిన శిరస్సులనుజూచి రాముఁడు తననుజంపుటకు వచ్చినవనితలఁచి మరల బాణములచేత ననేకశకలములనుగాఁజేసె. ఆసమయమునందు రావణుఁ డనేకనూరుల శిరస్సులుకలవాఁడై మిగుల నాశ్చర్యకరముగ గన్పట్టె. మఱియును రాముఁ డెన్నిశిరస్సులను ఖండించుచుండెనో అన్నిశిరస్సులు

మరలఁ గలుగుచుండె. అంతట శ్రీరాముఁడు రావణునకు నాశముకలుగకపోవుట కాశ్చర్యమును పొందినవాఁడై విభీషణుని వచనానుసారముగ రావణుని నాభిదేశమునందు కుండలాకారముగ నమృతమున్నదని తెలిసికొని యాగ్నేయాస్త్రముచేత నయ్యమృతమును శోషింపఁజేసె. అనంతరమందు తొమ్మిది శిరస్సులను ఖండించె. అప్పుడు రావణుఁ డొక్కశిరస్సుతో రెండుబాహువులతోడనుఁ గూడుకొనినవాఁడై మిగులభయంకరమగు యుద్ధమును చేసె. అప్పుడు రామ రావణులకు మిగులభయంకరమైన యుద్ధముకలిగె. అంతట శ్రీరాముఁడు దారుక వాక్యమును విని రావణుని మర్మదేశమునందుఁగొట్టె. మఱియును బ్రహ్మాస్త్రమును ప్రయోగించి రావణుని శిరస్సును సముద్రమునందుఁ బడవైచె. ఆసమయమునందు రావణునిశరీరమునుండి బయలువెడలిన జ్యోతిస్సూర్యునివలెఁ బ్రకాశించుచు సకలదేవతలును చూచుచుండఁగ శ్రీరామునియందుఁ బ్రవేశించె. అప్పుడు దేవతలందఱును సంతసించి పుష్పవర్షమునుఁ గురిపించిరి. ఆకాశమునందు దేవవాద్యములు మ్రోఁగె. అప్సరస్స్త్రీలు నృత్యమునుచేసిరి. అంతట రాముఁడు విభీషణునిచేత రావణునకు పరలోకక్రియలను చేయించి యదివఱకు హనుమంతునివశమున నుంచఁబడిన లంకాపట్టణమునందు విభీషణుని పట్టాభిషిక్తునిగాఁ జేసె. పిమ్మట విభీషణాదులతోఁగూడ హనుమంతుని నశోకవనమునకుఁ బంపి సీతామహాదేవి సకలవృత్తాంతమును వినుపించె.

ఇట్లు శతకోటిరామాయణాంతర్గత శ్రీమదానంద రామాయణమున
సారకాండమునందు రావణాదిరాక్షసులవధ మను నామ
ధేయముకల పదునొకండవసర్గ ముగిసెను.

✱ శ్రీరాముఁడు సీతతోఁగూడ నయోధ్యాపట్టణమునకుఁ బోవుట. ✱

ఓపార్వతీ! అవ్విధముగ రావణాదులందరును మరణమునుపొందిన పిమ్మట సుగ్రీవాదివానరులు సీతామహాదేవికి మంగళస్నానముచేయించి దివ్యవస్త్రాదులచేత నలంకరింపఁబడిన దానినిగాఁజేసి యాందోళికమునందుఁ గూర్చుండఁబెట్టి వేత్రపాణులు వెంటరాగ రామునిదగ్గఱకుఁ దీసికొని వచ్చిరి. మఱియు నాసమయమునందు నానావిధములగు వాద్యఘోషములును వేశ్యాకాంతల నృత్యములును మనోహరములై యుండె. అంతట సీతామహాదేవి యాసనమునుండిదిగి పాదచారిణియై, శ్రీరామునిదగ్గరకు నడచిపోయి శ్రీరామునకు నమస్కరించి భర్తకెదుట సిగ్గుచేతఁ దలవంచుకొనియుండె. రాముఁడుకూడ ఆసీతనుఁజూచి పరిశుద్ధురాలినిగాఁ దెలిసికొనియును ఎల్లవారికిని విశ్వాసముకలుగుటకొఱకు కిట్లనియె. శత్రుగృహమునందు నివసించునట్టి యోసీతా! నీయిష్టానుసారముగఁ బొమ్ము ? బ్రహ్మదేవుఁడువచ్చి ప్రార్థించినను నిన్ను నంగీకరింపననియె. ఆవచనమును విని సీతామహాదేవి లక్ష్మణునిచేత పావనమగు కాష్ఠసముదాయములు చేర్పించి యగ్నినిఁదరికొల్పి స్నానము

నుచేసివచ్చి యిట్లనియె. ఓయగ్నిదేవా! నేను రామునికంటె నితరుని మనస్సుచేతఁగూడ నెఱుఁగను. ఈమాట నిజమైనయెడల నీవు శీతలుఁడ వగుమని చెప్పి యాయగ్నియందుఁ బ్రవేశించె. అప్పుడు దేవతలును దశరథుఁడునువచ్చి జానకీదేవి పరిశుద్ధురాలని చెప్పిరి. ఇంతలోపల నగ్నిదేవుఁ డాసీతకు నానావిధాలంకారములచేత నలంకారమును కల్పించుకొనివచ్చి యిట్లనియె. ఓరాముఁడా! పూర్వము పంచవటీతీరమునందు నీవు నాయందుసమర్పించిన సీతను గైకొనుమనిచెప్పి యాసీతను సమర్పించె. అప్పుడు శ్రీరాముఁడు సీతనుకౌఁగిలించుకొని తనతొడయందు కూర్చుండఁబెట్టుకొనియె. ఆసమయమునందు పూర్వము సత్త్వరజస్తమోగుణములచేత మూఁడువిధములుగ విభజింపఁబడియున్న సీతామహాదేవి యేకాకారములయ్యె. అంతట నింద్రాదిదేవతలు శ్రీరాముని ననేకవిధములస్తోత్రమునుచేసి యుద్ధరంగమునందు మరణమునుపొందిన వానరులను నమృతవర్షముచేత జీవింపఁజేసిరి. ఆసమయమునందు తొలుతవచ్చిన వానరులలో నొకవానరుఁడు కనఁబడకపోవుటచేత ఆవానరుఁ డెక్కడని హనుమంతుని నడుగగా, ఆవానరుఁడు కుంభకర్ణునిచేత భక్షింపఁబడెననియును వాని నఖరోమాదులున్నను అమృతవర్షముచేత జీవింపలేదనియును చెప్పి హనుమంతుఁడు మరల నిట్లనియె. ఓరఘుకులోత్తమా! అమృతవర్షముచేత మరల జీవింతురనియెడు తలంపుతో మృతినొందినరాక్షసులనందఱ సముద్రమునందు బడవైచితి మనియె. అప్పుడు శ్రీరాముఁడు ఆవానరునితెచ్చి యిమ్మని యమధర్మరాజుతో చెప్పఁగా యమధర్మరాజు ఆవానరునితెచ్చిసమర్పించె. అంతట శ్రీరాముఁడు సంతోషించి రథమునుతెచ్చినమాతలి కాజ్ఞనిచ్చి స్వర్గమునకుఁ బంపె. అంతట విభీషణుఁడు ప్రార్థించినను శ్రీరాముఁడు మంగలస్నానమును చేయుట నంగీకరింపక భరతుని ముందుగఁ జూడఁదలఁచితిననియె. అంతట రాముఁడు సకలవానరులతోఁగూడ పుష్పకవిమానము నెక్కె. ఆసమయమునందు రామాజ్ఞచేత విభీషణుఁడును రథముతోఁగూడ నాపుష్పకవిమానము నెక్కెను. అంతట దేవతలందఱును రామునితో పోయివచ్చెదమని చెప్పి తమలోకమునకుఁ బోయిరి. మఱియు నప్పుడు దశరథుఁడుకూడ రామునితోఁ జెప్పి స్వర్గమునకుఁ బోయె. అనంతరమందు పుష్పకారూఢుఁడై యున్న రామునితో విభీషణుఁ డిట్లనియె. ఓరాముఁడా! నీతత్త్వమును వినవలయునని కోర్కెకలిగియున్నది. పాతాళలోకమునందలి మైరావణగృహమునకు నీవుపోయినపుడు క్షణమాత్రములోపల దుష్టులగు నారాక్షసుల నిరుష్వరింజంపక కాలహరణమును చేయుటకు కారణమేమనిన, రాముఁడు నవ్వుచు నిట్లనియె. ఓవిభీషణా! బ్రహ్మదేవుఁడు మైరావణుని ప్రాణములను ధరించిన తుమ్మెదలు హనుమంతునిచేత మరణమునుపొందునట్లు నియమించె. కావున నేను హనుమంతుఁడు వచ్చువఱకును నిరీక్షించితిని. మఱియును హనుమంతునకు రామ లక్ష్మణులను విడిపించె ననుకీర్తి రావలసియున్నది. ఆహేతువుచేతఁగూడ నే నూరకుంటిని. అట్లు

కాదేని క్షణమాత్రములో సల వారలను సంహరించి యుందును. మఱియు నోవిభీషణా! ఇషికాస్త్రముచేత కాకాసురుని నేత్రములను బ్రద్దలుసేసితిని. మారీచుని నూరామడదూరముననున్న సముద్రమునందుఁ బడవైచితిని. అట్టినేను పాతాళలోకమునందు కాలహరణమునుచేసినది హనుమంతునకు కీర్తినికలిగించుటకేకాని వేఱొక కార్యమునకుఁ గాదనిన విని హనుమంతుఁడు విభీషణునితో నిట్లనియె. ఓవిభీషణా! సేతుబంధనకాలమునందు గర్వితుఁడనైన నాతోక తెగిపోయినప్పటి వృత్తాంతమును మఱచితివి కాఁబోలు. శ్రీరామునిముందర నాపరాక్రమ మధికమైనదని తలఁపవచ్చునా? ఈరాముఁడు దాసుఁడనగు నాకుఁ గీర్తినికలిగించుటకు కాలహరణము చేసెనేకాని వేఱొక్కటి కాదనియె. ఆవచనములను విని విభీషణుఁడు రామునకు పరమభక్తితో నమస్కరించి షోడశోపచారములచేతఁ బూజించె. అంతట త్రిజటకు వరమునిచ్చుటకు సీతచేతప్రార్థింపఁబడి సీతయందలి గౌరవముచేతఁ బోయి త్రిజటకు వరమునిచ్చె. మఱియును వస్త్రాలంకారాదులచేత త్రిజటను నలంకరింపఁ జేయించి యోత్రిజటా! శుభములనుకలుగఁజేయునట్టి నావాక్యమును వినుము. కార్తికమాఘ చైత్రవైశాఖము లను నాలుగుమాసములయందును మూఁడుదినములు నీనిమిత్తముగ మానవులు స్నానమును చేయుదురు. అందువలన నీవు ధన్యురాలవగుదువు. లోకములో ఏమానవులు మూఁడుదినములును స్నానమునుచేయరో అట్టి మానవు లామాసములయందు చేసిన పుణ్యమును సర్వమును హరింపుము. మఱియునొక్క వచనమును చెప్పెదను. అపరిశుద్ధగృహములయందు చేయఁబడిన హవ్యకవ్యములును, కోపముతో నీయఁబడిన దానములును, పాదశౌచములేని యభ్యంగమును, తిలహీనమగుతర్పణమును నిన్నుఁబొందుననియె. ఇవ్విధముగ వరములనిచ్చి శ్రీరాముఁడు పరివారసమేతముగ నంతరిక్షమార్గమునఁబోవుచు రాముఁడు సీతామహాదేవికి యుద్ధభూమియందలి చిత్రములు సేతుబంధము మొదలగువాని జూపుచుండె. అట్లుపోవుచు విభీషణవాక్యానుసారముగ శ్రీరాముఁడు విమానమునుండి క్రిందదిగి యాసేతువును ఖండించె. ఆచోటు ఇప్పటికిని ధనుష్కోటియని చెప్పఁబడును. ఆక్షేత్రమునందు స్నానమును చేయువారికి కైవల్యము లభించును. మఱియు నక్కడ నిప్పటికిని రామవిగ్రహము కోదండపాణియను నామముకలదై యున్నది. ఓపార్వతీ! ఇవ్విధముగ సర్వమును జరిగినపిమ్మట సంపాతి యనువాఁ డెదురుగవచ్చిన రాముఁడు వానిం గౌగిలించుకొని జటాయుతీర్థము నొక్కదాని నిర్మింపుమనియె. అంతట నాసంపాతి రాముని వచనానుసారముగ తమ్ముఁడగు జటాయువునకు సంతోషముకలుగుటకొఱకు జటాయుతీర్థమును కల్పించె. అంతట శ్రీరాముఁడు సీతామహాదేవికి దర్భశయనము మొదలగువానింజూపి మఱియు ననేకములగు విచిత్రములను జూపుచుఁ గిష్కింధాపట్టణమునకు పోయె. అప్పుడు శ్రీరాముఁడు వానరులభార్యల నందఱను విమానమునందుఁ గూర్చుండఁబెట్ట

కొని మార్గమధ్యమునందలి యనేకవిచిత్రములను చూపుచు ప్రవర్షణాచలమునకుఁ బోయెను. అనంతరమందు ఋశ్యమూకాచలమునకును పంపాసరోవరమునకును మిగుల లోతగు కృష్ణానదినిచూచి వానియందలి విచిత్రములను చూపుచుఁ బోవుచుండె. అంతట గోదావరీతీరమునందుఁ బ్రకాశించుచున్న పంచవటీక్షేత్రమును చూచె. పిమ్మట సుతీక్ష్ణాగస్త్యుల యాశ్రమములను చూచుచుఁ బోవుచుండిరి. అట్లు పోవునపుడు శ్రీరాముఁడు ఓసీతా! అత్రిమునివరు నాశ్రమమును చిత్రకూటపర్వతమును చూడుము. కాళిందీనదిని గంగానదిని భరద్వాజాశ్రమమును చూడుము. అనిచెప్పి భరద్వాజమునివరునిచేతఁ బ్రార్థింపఁబడి పుష్పకవిమానమునుండి దిగి యామునివరు నాశ్రమమునందు సుఖముగ నివసించె. అట్లు శ్రీరాముఁడు భరద్వాజాశ్రమమునందు నివసించినదినము మాఘ శుక్ల చతుర్దశియయ్యె. అప్పటికి పదునాలుగుసంవత్సరములు పూర్ణములయ్యె. అప్పుడు భరద్వాజమునివరుఁడు తనదు తపోమహిమచేత భూలోకమునందే స్వర్గమును నిర్మించి వానరాదిసమేతులగు సీతారామాదులను పూజించె. ఆసమయమునందు రాముఁడు హనుమంతుని పిలిచి యిట్లనియె. ఓయాంజనేయా! నీ విక్కడనుండి యయోధ్యాపట్టణమునకుఁబోయి నావృత్తాంతమును సర్వమును తెలియఁజేయుము. మఱియు నోయాంజనేయా! మార్గమధ్యయందలి శృంగిబేరపురమునందున్న వాఁడును నాకుమిత్త్రుఁడును నయిన గుహునితోఁగూడ నావృత్తాంతమును చెప్పుమనియె. ఆవృత్తాంతమునువిని హనుమంతుఁడు భగవదాజ్ఞానుసారముగఁ జేసెదనని చెప్పి బయలువెడలిపోయి ముందుగ గుహునితో రామునివృత్తాంతమును సర్వమును తెలియఁజేసె. ఆవృత్తాంతమును గుహుఁడు విని పరమానందముకలవాఁడై శ్రీరామునిసమీపమునకుఁ బోయె. అంత నక్కడ నందిగ్రామమునందు నివసించియున్న భరతుఁడు శ్రీరాముఁడు బయలువెడలిపోయి నేటికి పదునాలుగుసంవత్సరములయినను శ్రీరాముఁడు రాకపోయెనేయని తలఁచికొని దుఃఖించి యగ్నియందుఁ బ్రవేశించుటకు సన్నద్ధుఁడయ్యె. అట్లు సన్నద్ధుఁడై శత్రుఘ్నునితో నిట్లనియె. ఓతమ్ముఁడా! నేటివఱకును రామ లక్ష్మణులు రాకపోవుటచేత రావణునితో యుద్ధమునందు చంపఁబడిరని తలఁచుచున్నాఁడను. సకలరాజులును తమతమసైన్యములతోఁగూడ లంకాపట్టణమునకుఁబోయి రామునకు సహాయముచేయునటులఁ బ్రయత్నించితిని. ఈదినమునందు సూర్యాస్తమానమైన పిమ్మట నేను అగ్నియందుఁబ్రవేశించెదను. నీవు సకలరాజులతోఁగూడ లంకాపట్టణమునకుఁ బోయి రావణునితో యుద్ధమును చేసి సీతామహాదేవిని విడిపించి పిమ్మట మాకు పరలోకక్రియలను చేయుము. నో తమ్ముఁడా! రామాదిబంధువులకు ముందుగ నుదకదానమునుచేసి పిమ్మట నాకుదకదానమును చేయుమనిన విని పౌరులు జానపదులు రాజులు శత్రుఘ్నుఁడు తల్లులు కౌసల్యాదులు సుమంత్రాదిమంత్రులు పురస్త్రీలు సేవకులు మొదలగువారందఱును భరతునిఁజుట్టుకొని యధికమగు దుఃఖమునవలంబించియుండిరి. అంతట భరతుని ననేక

విధముల నారాధించుచు సరయూనదికిఁ బోయిరి. పోయి చితిని నిర్మించుకొని సరయూనదియందు స్నానమునుచేసి యనేకములగు దానములనుచేసిరి. పిమ్మట నగ్నిదేవున కేను ప్రదక్షిణములనుచేసి రామునకును లక్ష్మణునకును సీతకును తల్లులకును గురునకును మునులకును నమస్కరించి తమ తమ యిష్టదేవతలనుధ్యానించుచు సూర్యాస్తమానకాలము నిరీక్షించుచుండిరి. ఆసమయమునందు అత్యధికమైన కోలాహలధ్వని కలిగియుండె. ఇంతలోపల హనుమంతుఁడు అంతరిక్షమునందుండి యగ్నియందుఁ బ్రవేశింపఁదలఁచియున్న భరతునిఁజూచి గద్గదస్వరముకలవాఁడయ్యును, అమృతమును వర్షించునట్టి వచనములనుచెప్పి మృదుమధురవచనములతో నిట్లనియె. ఓవీరుఁడా! భరతుఁడా! అగ్నియందుఁ బ్రవేశింపకుము. శ్రీరాముఁడువచ్చియున్నాఁడు. సీతాలక్ష్మణులతోఁగూడ భరద్వాజాశ్రమమునందు నివసించియున్నాఁడు. సకలవానరసైన్యములతోఁగూడ వచ్చునట్టిరాముని రేపు చూడఁగలవు. శ్రీరాముఁడుకూడ నిన్నుఁజూచుటకు మిగుల నుత్కంఠకలవాఁడై యున్నాఁడనియె. ఇట్లు హనుమంతుఁడు చెప్పినవాక్యమును విని భరతుఁడు అమృతముచేతఁ దడపఁబడినవానివలె నధికానందముకలవాఁడై యగ్నిదేవునకు నమస్కరించి తిరిగి హనుమంతునకు నమస్కరించె. అంతట హనుమంతుఁడుకూడ భరతునకు నమస్కరించి రామునివృత్తాంతమును సర్వమును వినిపించె. ఆవృత్తాంతమును సర్వమును విని భరతు డధికానందముకలవాఁడై యయోధ్యాపట్టణమును సర్వమును నలంకరింపఁజేసె. మఱియు నయోధ్యాపట్టణమునందలి సకలవీథులయందును తోరణాదులనుకట్టించి పురజనులతోఁగూడ నెదురుగఁబోయె. అట్లుపోవునపుడు మత్తగజమును ముందునిడుకొని రామునిపాదుకలను శిరస్సుమీఁదఁబెట్టుకొనియె. అంతట పదునైదవసంవత్సరమునందలి ప్రథమదివస ప్రాతఃకాలమునందు దక్షిణపు దిక్కునుండి వచ్చుచున్న రామునిపుష్పకవిమానమును చూచె. అట్లు వచ్చుచున్న విమానమునుజూచి సాష్టాంగనమస్కారమును చేసె. అంతలో రాముఁడు పుష్పకవిమానమునుండిదిగి భరతుని కౌఁగిలించుకొనియె. మఱియు నాసమయమునం దనేకాకారముల నవలంబించి పురజనులనందఱను కౌఁగిలించుకొనియె. మఱియు నివ్విధముగ రాముఁడు ముందువెనుకలులేకుండునట్లు సకలజనులకును నాలింగనసుఖమును కలుగఁజేసె. ఆసమయమునం దనేకులగు రాములనుచూచి పురజనులందఱును నధికాశ్చర్యముకలవారైరి. అనంతరమందు కన్నీళ్లతోఁగూడుకొనిన భరతుని నూరార్చి తల్లులకును వసిష్ఠారుంధతులకును నమస్కారమునుచేసె. అంతట నానావిధవాద్యాదులతోఁగూడ మెల్లమెల్లగ నందిగ్రామమునకుఁ బోయె. అనంతరమందు శ్మశ్రుకర్మోద్వర్తనమును తైలాభ్యంగనమును చేయించుకొనియె. పిమ్మట నందిగ్రామమునందే నానావిధములగు మంగళకార్యములనుచేసె. మఱియు నాగ్రామమునందు నానావిధములగు మంగళవాద్యములు మ్రోగుచుండె. మఱియును పురస్త్రీలందఱును రత్నదీపముల

చేత రామునకు నీరాజనమును సల్పిరి. అనంతరమందు సీతామహాదేవి యత్తలకును
అరుంధతీదేవికిని ప్రదక్షిణ నమస్కారములనుచేసె. అనంతరమం దాసీతామహాదేవి
వందనీయులగు బ్రాహ్మణులకును వృద్ధులకును యథాక్రమముగ నమస్కారముల
నుచేసె. అప్పుడు కౌసల్య మొదలగువారు సీతామహాదేవిని కౌఁగిలించుకొనిరి. అ
నంతరమం దాకౌసల్యాదులందఱును సీతామహాదేవికి వాద్యఘోషములతోఁ
గూడ మంగళస్నానమునుచేయించిరి. అప్పుడు సీతామహాదేవి వస్త్రాలంకారభూ
షణాదులచేత నలంకరింపఁబడియె. ఆసమయమునందు భరతుఁడు తానుపూజించు
చున్న పాదుకలను రామునకుసమర్పించె. అనంతరమందు భరతుఁడు మిగులవినయ
ముతో శ్రీరామున కిట్లనియె. ఓరఘుకులోత్తమా! నాయందు న్యాసభూతముగ
నుంచఁబడిన రాజ్యమును సర్వమును సమర్పించితిని. ఇంతవఱకు నీవు నాకుసమర్పించు
నప్పుడు కలిగియున్న కోశాదులను పదిరెట్లధికముగఁ జేసితిని. ఓరాజోత్తమా! ఇఁక
నీరాజ్యమును సర్వమును పరిపాలింపుమనియె. ఆవృత్తాంతమును సర్వమునువిని నీయి
ష్టానుసారముగఁజేసెద నని చెప్పి భరతునికూర్చుండుమనియె. అనంతరమందు శ్రీరా
ముఁడు దివ్యవస్త్రములనుధరించి సీతతోఁగూడ రథమునెక్కి వాద్యఘోషములను
వినుచు నృత్యాదులను జూచుచు నయోధ్యాపట్టణమునకుఁ బోయె. ఆసమయ
మునందు పురస్త్రీలందఱును మేడమీఁదఁగూర్చుండి పుష్పవర్షమునుగురిపించిరి. మ
ఱియు ననేకులు మార్గమధ్యమునందు నానావిధములయిన బలులతోఁగూడ నీరా
జనమును చేసిరి. అంతట రాముఁడు నిజగృహము దగ్గరకుఁబోయి రథమునుండిదిగి
ముందుగ సీతను గృహములోనికిఁ బంపి పుష్పకవిమానముతో నిట్లనియె. ఓపుష్పక
విమానమా! నీవుపోయియిదిమొదలుకొని కుబేరునిసేవింపు మనినవిని యాపుష్పకవి
మానము కుబేరునిదగ్గఱకుఁ బోయె. అంతట శ్రీరాముఁడు వానరులతోఁగూడ సభా
మధ్యమునందుఁగూర్చుండి వానరులందఱకును నానావిధవస్తువులచేత రమ్యముల
యిన గృహములను నివసించుటకు నియమించె. అంతట వసిష్ఠమునివరుఁడు రాజ్య
మునుచేయుటకు రామునిపట్టాభిషిక్తునిగాఁ జేసె. ఆపట్టాభిషేకకాలమునందు హను
మదాది వానరులుపోయి నాలుగుసముద్రములనుండి జలకుంభములను గొనివచ్చిరి.
అంతట సకలరాజులును, మహావాద్యములు మ్రోఁగుచుండఁగను లక్ష్మణుఁడు ఛత్ర
మునుపట్టుచుండఁగను భరతుఁడు సవ్యపార్శ్వమునందుండి చామరమును వీచుచుం
డఁగను శత్రుఘ్నుఁడు వామపార్శ్వమునందు వింజామరమును వీచుచుండఁగను హ
నుమంతుఁడు పాదుకలనుపట్టుచుండఁగను మహాతేజోవంతులగు సుగ్రీవాది వానరో
త్తములు నాలుగుదిక్కులయందును నివసించియుండఁగను, సుగ్రీవుఁడు జలపాత్రము
ను విభీషణుఁడు ఆదర్శమును అంగదుఁడు తాంబూలపాత్రమును జాంబవంతుఁడు
వస్త్రకోశమును ధరించుచుండఁగను రాముని సింహాసనమందుఁ గూర్చుండఁ బెట్టిరి.
సంపాతి యనువాఁడు లక్ష్మణునకు వామపార్శ్వమునందు నిలిచియుండె. భరతునకు

వామపార్శ్వమునందు గుహుఁడనువాఁడు నిలిచియుండె. మకరధ్వజుఁడనువాఁడు శత్రుఘ్నునకు వామపార్శ్వమునందుండె. గరుడుఁడు హనుమంతునకు వామపార్శ్వమునందు నిలిచియుండె. చిత్రరథ విజయ సుమంత్ర దారుకులనువారు సుగ్రీవాదులకు పార్శ్వమునందు నివసించియుండిరి. దేవతలును కిన్నర కింపురుష గంధర్వాదులును నానావిధోపకరణములను గైకొనియుండిరి. ఆసమయమునందు దేవేంద్రుఁడు మిగులభక్తికలవాఁడై సకలరత్నములతోఁ గూడుకొన్నదియును మణికాంచనభూషితమును ముత్యాలహారమును గైకొని నిలిచియుండె. దేవగంధర్వాదులు శ్రీరాముని కీర్తిని గానముచేయుచుండిరి. వేశ్యాస్త్రీలు నృత్యములను చేయుచుండిరి. ఆసమయమునందు దేవదుందుభులు మ్రోఁగుచుండె. పుష్పవర్షముకురియుచుండె. ఆసమయమునందు పరమశివుఁడ నగునేను భరతునిచేత నధికముగాఁ బూజింపఁబడినవాఁడనై యిట్లని స్తోత్రముచేసితిని. ఎట్లనిన :—

“శ్లో. సుగ్రీవమిత్రం పరమంపవిత్రం సీతాకలత్రం నవమేఘగాత్రం,
కారుణ్యపాత్రం శతపత్రనేత్రం శ్రీరామచంద్రం సతతంనమామి. ౧
సంసారసారం నిగమప్రచారం ధర్మావతారం హృతభూమిభారం,
సదావికారం సుఖసింధుసారం శ్రీరామచంద్రం సతతంనమామి. ౨
లక్ష్మీవిలాసం జగతాం నివాసం లంకావినాశం భువనప్రకాశం,
భూదేవవాసం శరదిందుహాసం శ్రీరామచంద్రం సతతంనమామి. ౩
మందారమాలం వచనేరసాలం గుణైర్విశాలం హృతసప్తతాలం,
క్రవ్యాదకాలం సురలోకపాలం శ్రీరామచంద్రం సతతంనమామి. ౪
వేదాంతగానం సకలైస్సమానం హృతారిమానం త్రిదశప్రధానం,
గజేంద్రయానం విగతావసానం శ్రీరామచంద్రం సతతంనమామి. ౫
శ్యామాభిరామం నయనాభిరామం గుణాభిరామం వచనాభిరామం,
విశ్వప్రణామం కృతభక్తకామం శ్రీరామచంద్రం సతతంనమామి. ౬
లీలాశరీరం రణరంగధీరం విశ్వైకసారం రఘువంశహారం,
గంభీరనాదం జితసర్వవాదం శ్రీరామచంద్రం సతతంనమామి. ౭
ఖలేకృతాంతం స్వజనేవినీతం సామోపగీతం మనసాప్రతీతం,
రాగేణగీతంవచనాదతీతం శ్రీరామచంద్రం సతతంనమామి.” ౮

అని శ్రీరాముని ప్రార్థించితిని. ఓపార్వతీ! ఇప్పుడు నాచేతచేయఁబడిన యీ శ్రీరామాష్టకమును భక్తితో వినువారును పఠించువారును సకలాభిలాషలను పొందుదురు. ఓపార్వతీ! ఈవిధముగా శ్రీరాముని స్తోత్రము చేసి నే నాసభయందు నిలిచియుంటిని. ఇంతలోపల దశరథుఁ డనుమహారాజు సూర్యసన్నిభుఁడై విమానమునందుండి సీతారాములను చూచి శ్రీరాముని పరమాత్మునిగా స్తోత్రముచేసి యిట్లనియె. నేను ధన్యుఁడనైతిని. నాతల్లిదండ్రు

లును ధన్యులైరి. ఈదేశమంతయును ధన్యమయ్యెను. కులమంతయును ధన్య
మైనది. ఇప్పుడు శ్రీరాముఁడు పట్టాభిషిక్తుఁడగుటచేత సర్వమును ధన్యమైనదని యు
నండగియున్నదనిచెప్పి శ్రీరామునితో నిట్లనియె. ఓరాముఁడా! ధన్యురాలయిన ఇ
టువంటి నిన్నుఁగన్నతల్లి యగుకౌసల్య ధన్యురాలయ్యె. ఇప్పుడు కౌసల్యమిగుల
నుత్సాహముకలదై నిన్నుఁజూచుచున్న దనిన శ్రీరాముఁడు విని తండ్రియగు దశరథు
నకు నమస్కరించె. ఆసమయమునందు కౌసల్య మొదలుగాఁగల రాజభార్యలును
పురజనులును భరత శత్రుఘ్నులును దశరథమహారాజునకు నమస్కరించిరి. అంతట
నాదశరథమహారాజు వారలనందఱను చూచి సంతోషించి సకలదేవతలతోడను కూ
డుకొని రాముఁడు మొదలగువారిచేతఁ బూజింపఁబడి పరమేశ్వరుఁడ నగునాతోఁగూ
డ బయలువెడలిపోయె. అంతట దేవతలందఱును తమతమనివాసస్థానములకుఁ బో
యిరి. అంతట సర్వలోకములవారికిని సుఖమునుకలుగఁ జేయునట్టి శ్రీరాముఁడు పట్టా
భిషిక్తుఁడుకాఁగానే భూమియంతయును సస్యసంపన్నమైనదయ్యె. వృక్షములన్ని
యును ఫలవంతములయినవయ్యె. మఱియును పుష్పములన్నియును గంధముకల
వయ్యె. ఆసమయమునందు శ్రీరాముఁడు నూఱుగుఱ్ఱములను నూఱావులను నూఱు
వృషభములను అనేకకోటినరహాలను బ్రాహ్మణులకుదానముచేసె. అంతట భక్తవ
త్సలుఁడగురాముఁడు సూర్యునివలెఁ బ్రకాశించుచున్నదియును సకలరత్నవికారము
యినదియును నగు పూలమాలికను సుగ్రీవునకు సమర్పించె. అనంతరమందు మిగుల
శ్రేష్ఠమగు (అవతంసమును) కర్ణభూషణమును (లేక) శిరోభూషణమును) రాక్షసేం
ద్రుఁడగువిభీషణునకు సమర్పించె. పిమ్మట మిగుల శ్రేష్ఠము లగుబాహుభూషణ
ముల నంగదునకు సమర్పించె. మఱియును కోటిమందిసూర్యులతో సమానముగఁ
బ్రకాశించుచున్నదియును మణులచేతను రత్నములచేతను నలంకరింపఁబడినదియును
నగుముత్యాలహారమును సీతామహాదేవికి మిగులఁ బ్రియముతో సమర్పించె. అప్పు
డు సీతామహాదేవి యాముత్యాలహారమును హనుమంతునిమెడయందు వైచె.
ఆముత్యాలహారముచేత మిగులనధికముగఁ బ్రకాశించె. అట్టి హనుమంతునిఁజూచి
శ్రీరాముఁ డిట్లనియె. ఓహనుమంతా! నేను ప్రసన్నుఁడ నైతిని. కావున నీకభీష్ట
మైనవరమును గోరుమనిన హనుమంతుఁడు శ్రీరామునకు నమస్కరించి యిట్లనియె.
ఓరామచంద్రా! నీనామమును ఎంతకాలము స్మరించినను నాకుఁదృప్తిచాలకయు
న్నది. కావున సర్వకాలములయందును నీనామమునుస్మరించుచు భూతలమునం
దుండవలయునని నాకభిలాషకలిగియున్నది. మఱియు నోరామచంద్రా! నీనామము
భూలోకమునం దెంతకాలముండునో యంతవఱకును నాకళేబరముండునటుల వర
మునిమ్ము? మఱియు నోరామచంద్రా! ఎక్కడెక్కడ లోకములోనివారు పావన
మైన నీకథఁజెప్పుకొందురో అక్కడక్కడ నేనుండునటుల వరమునిమ్ము. సర్వకాల
ములయందును నీచరిత్రమును వినవలయునని నాకుతలంపు గలిగియున్నది. ఓరామ

చంద్రా! దేవాలయము నదీతీరముతీర్థము జలాశయము మొదలగువానికంటె నితరస్థలములందుపావనమైన నీకథ ఆఱుగడియలకంటె నధికకాలముండునటుల ననుగ్రహింపుమనిన విని శ్రీరాముం డిట్లనియె. ఓయాంజనేయా! నీయభిప్రాయానుసారముగ సర్వమును జరుగును. నీవు ముక్తుండవై సుఖముగనుండుము. కల్పాంతమందు నాసాయుజ్యమును బొందుదువు. దీనికిసందేహమేమియును లేదనియె. ఆసమయమునందు సీతామహాదేవి యోయాంజనేయా! నీవున్నచోటునను నాయాజ్ఞానుసారముగ సకలభోగములును వచ్చును. మఱియు నోహనుమంతుండా! గ్రామారామపత్తనములయందును వ్రజఖేటకసద్మములయందును, వనదుర్గపర్వతములయందును, నదులయందును, క్షేత్రతీర్థములయందును, జలాశయపట్టణములయందును, వనాశ్వత్థవటవృక్షములయందును, వనాదులయందును, నీవిగ్రహమును దుఃఖనివృత్తికొఱకు నెల్లవారును పూజింతురు. మఱియు నోహనుమంతా! నిన్ను స్మరించుటచేత భూతప్రేతపిశాచాదులన్నియును నశించుననియె. అంతట రాముండు అయోధ్యాపట్టణమునకు వచ్చినవానరుల కందఱకును నానావిధములైన వస్త్రములను దివ్యాభరణములను నిచ్చి పూజించె. అంతట వానరులందఱును రామునితోంగూడ భోజనశాలలోనికిం బోయి రాముండు ప్రాణాహుతులనుపుచ్చుకొనినపిమ్మట భోజనమునకు ప్రారంభించిరి. ఆసమయమునందు హనుమంతుండు భోజనశాలనుండి యెగిరి రామునిదగ్గఱకుం బోయినవ్వుచు రామునిభోజనపాత్రను దానుతీసికొని రామునియుచ్ఛిష్టమును తాను కొంతభుజించి మిగిలినపక్వాన్నాదుల నందఱభోజనపాత్రలయందు పడునట్లు విసరివైచె. అప్పుడు విభీషణాదులు పాత్రలను విడిచిపెట్టి యిట్లనిరి. ఓయాంజనేయా! నీవు సరియగుకార్యమును చేసితివి. మాకందఱకును రామోచ్ఛిష్టమును భుజించునంతటిభాగ్యమును కలుగంజేసితివి. కావున మేమందఱమును కృతార్థులమైతిమని చెప్పి మిగులసంతోషముతో భుజించిరి. ఆసమయమునందు సంతోషముచేత నెల్లవారును నవ్వుచుటవలన మిగులనధికమైన కోలాహలధ్వనికలిగె. ఆవిషయమును సర్వమును చూచి సీతారాములుసంతోషముతో నవ్వుచుండిరి. ఈవిధముగా సుగ్రీవాదులు నానాకౌతుకములను చేయుచుం గొన్నిదినము లయోధ్యాపట్టణమునందు నివసించిరి. ఇట్లుండఁగా మరల పుష్పకవిమానమువచ్చి యోరామచంద్రా! కుబేరుండు నాతోఁ జెప్పినవాక్యములను చెప్పెదనని యిట్లనియె. ఓవిమానమా! ముందుగ రావణుండు నిన్నపహరించె. అనంతరమందు శ్రీరాముండు రావణునిసంహరించి నిన్నుఁగైకొనియె. కావున రాముండు భూలోకమునందుండునంతకును నీవు రామునిసేవింపుము. శ్రీరాముండు వైకుంఠమునకుఁబోయినపిమ్మట నాయొద్దకురమ్ము? అని చెప్పెనని విని శ్రీరాముండు పరమానందము కలవాఁడై యాపుష్పకవిమానముతో నిట్లనియె. ఓవిమానరాజమా! సుగ్రీవాదులు తమతమపట్టణములకుఁ బోవలయునని తలంచియున్నారు గావున నీవు వారలను

గొనిపోయి వారివారిపట్టణములయందు విడిచివచ్చి గృహద్వారమునకు బయలుఁ నివసించియుండుమనియె. అంతట నావిమానము వానరాదులనుగొనిపోయి వారివారి పట్టణములయందు విడిచివచ్చి రామాజ్ఞానుసారముగ నివసించె. అంతట విభీషణుఁడు లంకాపట్టణమును, మకరధ్వజుఁడు పాతాళలోకమును, సుగ్రీవుఁడు కిష్కింధాపట్టణమును పాలించుచుండిరి. అంతట సుగ్రీవవిభీషణాదులు అయిదాఱుదినములకొకపర్యాయమువచ్చి శ్రీరామునిజూచిపోవుచుండిరి. ఆసమయమునందు శ్రీరాముఁడు కూడ సకలజనులయందును సమానమైన దయకలవాఁడై సకలరాజ్యమును పాలించె. మఱియును రాముఁడు అభిలాషలేనిలక్ష్మణుని యావద్రాజ్యమునం దభిషిక్తునిగాఁ జేసె. లక్ష్మణుఁ డత్యధికమైనభక్తితో రామునిసేవించుటయందధికమయిన భక్తికలవాఁడయ్యె. రాముఁడు పూర్వము విశ్వామిత్త్రునియజ్ఞమునందు రణయాగముపూర్ణముగాక పోవుటచేత అయోధ్యాపట్టణమునం దాయాగమును పూర్తిని జేసె. ఓపార్వతీ! రణయాగవిధానమును సర్వమును వివరించి చెప్పెదను వినుము. రణాంగణము యజ్ఞకుండము. అక్కడనుండి పరుగెత్తిపోక పోవుట వేదోక్తమైన బ్రహ్మాసద్మ మనఁబడును. ఆయజ్ఞమునకు ఘటాటోపము శస్త్రఖణస్వ మనఁబడును. పాషాణఘర్షణము సృక్స్రువములయొక్క సామ్మార్జన మనఁబడును. శాస్త్రములను పరిశుద్ధములైన వానినిగాఁ జేయుటకు భూమియందు బాణాదులను బఱచుటయే పరిస్తరణమని చెప్పఁబడును. ధైర్యము పరిసమూహన మనఁబడును. కాలానలము అత్యధికమైన యగ్నియనఁబడును. వాయురూపమైన స్రువముచేత మాంసమును హోమముచేయుటయే యాహుతియనఁబడును. రక్తధారయే వసుధార యనఁబడును. మిగుల భయంకరమైన హాహాకారమే యోంకారవషట్కారఘోష మనఁబడును. శస్త్రములతేజస్సు అగ్నిజ్వాల యనఁబడును. చెమ్మటకారుటయే ధూమ మనఁబడును. జ్వాలాతిశయము శాంతినిపొందించుటకు చేయునట్టి పృషదాజ్యసేచనము శస్త్రవిమోచన మనఁబడును. జ్ఞానముతోఁగూడ జీవబలినిచ్చుటయే దీపబలియని చెప్పఁబడును. దేహమునం దాశకలజీవులు బలిదీపహారులని చెప్పఁబడుచున్నారు. రామునిహస్తమువలన మరణమునుపొందక పరుగెత్తుటయే బలికినసర్వాత యనఁబడును. రామునిబాణములచేత నశించుటయే పూర్ణాహుతి యనఁబడును. రాముఁడు సవ్యపాదములతో నిలుచుటయే యుచ్చాటన యనఁబడును. దేవతలు పుష్పములను వర్షించుటయే విప్రాభిషేచనమనఁబడును. యుద్ధమునందు జయముసంపాదించుటయే శ్రేయస్సంపాదన మనఁబడును. చరాచరజంతుజాలమునకు సంతోషమును గలిగించుటయే తన గోత్రములవారికి సంతోషమును కల్పించుట యనఁబడును. ఈవిధముగా సుబాహుయుద్ధమునందు కరణయాగము శోభిల్లె. ఆవిధముగానే విశ్వామిత్రుని యజ్ఞముకూడ ప్రకాశించె. పూర్వము విశ్వామిత్రుఁడు తనయజ్ఞమును ముగించి కాలానలరూపుఁడగు రామునకు తృప్తికలుగ

లేదని తలంచి యారాముని విడువకపోయె. అంతట నా విశ్వామిత్రుండు రామునకు తృప్తికరముగఁ జేయవలయునని తలఁచె. అట్లు తలఁచుటచేత శ్రీరాముఁడు విరాధరక్తముచేత పాత్రప్రోక్షణమును చేసె. అనంతరమందు చిత్రగుప్త బలికొఱకు శూర్పణఖయొక్క నాసాకర్ణములను ఛేదించె. ప్రాణాహుతులకొఱకు ఖరదూషణ త్రిశిరోమారీచ కబంధులు వధింపఁబడిరి. శిఖాబంధవిమోక్షముకొఱకు శబరికి శాపవిమోచనమును గావించె. జలస్పర్శనహేతువుకొఱకు వాలిని సంహరించె. లంకాపురదహనము వ్యాజనముగఁ జేయఁబడియె. కుంభకర్ణుఁడన్నమయ్యె. ఇంద్రజిత్తు పక్వాన్నమయ్యె. రాక్షసులు కూరలైరి. సారణుఁడు వరాన్నమయ్యె. ప్రహస్తుఁడు వటకమయ్యె. మఱియును, నికుంభుఁడు పర్పటమును కుంభుఁడు లవణమును కాలనేమి పాయసమును అతికాయుఁడు శర్కరయును ఐరావణుఁడు క్షీరమును మైరావణుఁడు ఘృతమును రావణుఁడు దధ్యోదనమును నైరి. ఇవ్విధముగ కాలానలరూపుఁడగురామునకు నివేదితములై పిమ్మట నతఁడు తృప్తినిపొందె. అట్లు శ్రీరాముఁడు రణయాగమును పూర్ణముగఁజేసి యయోధ్యాపట్టణమునకు వచ్చి అవబృథస్నానమునే పట్టాభిషేకస్నానమునుగాఁ జేసె. ఓపార్వతీ! ఈవిధముగా రణయాగవిషయమును సర్వమును సమగ్రముగఁ దెలియఁజేసితిని. ఓపార్వతీ! శ్రీరాముఁడు కర్తృత్వాదిధర్మములులేని పరమాత్మ రూపుఁడయ్యును లోకములకు సంతోషకరములగు కార్యములనుచేయు వాఁడయ్యె. మఱియు నారాముఁడు గృహస్థధర్మము నవలంబించి యనేకములగు పుణ్యకార్యములను చేసె. శ్రీరాముఁడు రాజ్యమును పాలించుకాలమునందు లోకములో వ్యసనమును పొందువాఁ డెవ్వఁడును లేఁడు. సర్వరోగాదిభయము లేకపోయె. మఱియు నారాముఁడు సకలజనులను పుత్త్రులను గాపాడినవిధముగఁ గాపాడె. ఇట్లుచేయుచు నా శ్రీరాముఁ డయోధ్యాపట్టణమునందు సీతామహాదేవితోఁగూడ సుఖముగ నివసించె. ఓపార్వతీ! ఈవిధముగ శ్రీరాముని రణవృత్తాంతమును సర్వమును నీకు సమగ్రమముగఁ దెలియఁజేసితిని.

ఇట్లు శతకోటిరామాయణాంతర్గత శ్రీమదానందరామాయణమున
సారకాండమునందు శ్రీరామాభిషేకమును తెలుపునట్టి
పదిరెండవసర్గ ముగిసెను.

✷ శ్రీరామహనుమంతుల పరాక్రమవర్ణనము. ✷

ఓపార్వతీ! అట్లు శ్రీరాముఁడు రాజ్యమునుపాలించుచుండగా నగస్త్యమునివరుఁ డనేకమునివరులతోఁగూడ శ్రీరామునిచూచుటకు వచ్చి రామునిచేత గౌరవింపఁబడి తగినయాసనమునందుఁ గూర్చుండె. అంతట మునివరులందఱును తమకుఁ దగినయాసనములయందుఁ గూర్చుండిరి. అంతట నామునులందఱును రామునిచేత కుశలవార్తనడుగఁబడి తాము రామునికుశలవార్తనడుగఁ దలఁచి యిట్లనిరి. ఓరా

మచంద్రా! నీవు పరివారసమేతముగఁ గుశలముగనున్నావా? మాయదృష్టవశముచేత శత్రుసంహారమును సుఖముగఁ జేసిన నిన్నుఁ జూడఁగలిగితిమి. లోకాదృష్టవశముచేత నింద్రజిత్తు మొదలగురాక్షసులందఱును నీచేతఁ జంపఁబడిరి. మఱియు నో రామచంద్రా! నీవు సకలశత్రువులను సంహరించి ధన్యుఁడవై జీవించుచున్నావనిన శ్రీరాముఁ డామునిపుంగవులతో నిట్లనియె. ఓమునికులోత్తములారా! యుద్ధమునం దనేకులు రాక్షసులు చంపఁబడియుండఁగా నింద్రజిత్తును ముందుగఁ బేర్కొనుటకు కారణమేమనిన ముందుగ నగస్త్యమునివరుఁ డిట్లనియె. ఓరఘుకులోత్తమా! యింద్రజిత్తుయొక్క జన్మకర్మముల వృత్తాంతమును సర్వమును సంగ్రహముగఁ జెప్పెదను. వినుము. పూర్వము కృతయుగమునందు బ్రహ్మదేవునకు పులస్త్యుఁడనుపుత్త్రుఁడు కలఁడు. ఆపులస్త్యుఁడు తృణబిందువను రాజేన్ద్రునిపుత్త్రికయందు వేదములకు నిధియును ముల్లోకములయందును ప్రసిద్ధుఁడును నగువిశ్రవోబ్రహ్మను పుత్త్రునిగాఁ గనియె. ఆవిశ్రవోబ్రహ్మ భరద్వాజునిపుత్త్రికయందు వైశ్రవణుఁ డనుపుత్త్రుని గనియె. ఆవైశ్రవణుఁడు బ్రహ్మదేవునిగుఱించి మిగులభయంకరమైన తపస్సును జేసె. ఆతపస్సునకు సంతసించి బ్రహ్మదేవుఁడు ప్రసన్నుఁడై యాతనియభిలాషనుదీర్చి యాతనికి ధనేశత్వము నొసంగె. అంతట నాకుబేరుఁ డొక్కనాఁడు బ్రహ్మచే నీయఁబడిన పుష్పకవిమానమునెక్కి తండ్రియగు విశ్రవోబ్రహ్మయొద్దకుఁబోయి నమస్కరించి యిట్లనియె. ఓతండ్రీ! బ్రహ్మదేవుఁడు నాయభీష్టములనన్నింటిని దీర్చెనుగాని నాకు నివసించుటకుఁ దగినచోటునుమాత్రము చూపలేదు. కావున నేను నివసించుటకుఁ దగినచోటును జూపుమనిన విని యావిశ్రవోబ్రహ్మ యిట్లనియె. ఓపుత్త్రోత్తమా! విశ్వకర్మచేత నిర్మింపఁబడినదియును లంకయనునామధేయముకలదియును నగుపట్టణము చక్కఁగ నలంకరింపఁబడి సముద్రమధ్యమునందున్నది. విష్ణుదేవునివలని భయముచేత రాక్షసు లాలంకాపట్టణమును వదలి రసాతలలోకమునందుఁ బ్రవేశించిరి. కావున నీవుపోయి యాపట్టణమునందు సుఖముగఁ బ్రవేశింపుమనియె. ఆమాటనువిని కుబేరుఁడు బయలువెడలిపోయి యాలంకాపట్టణమునందు చిరకాలము నివసించియుండె. అట్లుండఁగా నొకనాఁడు సుమాలియనురాక్షసుఁడు తనపుత్త్రికతోఁగూడ భూలోకమునందు సంచరించుచు పుష్పకవిమానమునందున్న కుబేరునిఁజూచె. చూచి రాక్షసులకు మేలుచేయువలయునని తలఁచి యిట్లనియాలోచించి కైకసీపుత్త్రికయగు తనకుమార్తెతోఁ నిట్లనియె. ఓపుత్త్రికా! నీవుపోయి విశ్రవోబ్రహ్మను వరింపుము. అట్లుచేసినయెడల నామహానుభావునివలన కుబేరునితో సమానులును ధనాఢ్యులును నగుపుత్త్రులుగలుగుదురు. ఆపుత్త్రులు రాక్షసుల మగుమాకు హితముచేయుదురనిన విని యాయంగనామణి సంధ్యాకాలమునందు మిగులశీఘ్రముగ నమ్మునివరునిదగ్గరకుఁబోయెను. పోయి పాదాంగుష్ఠముచేత నేలనుగీయుచు నధోముఖయైయుండె. ఆసమయమునం దామునివరుఁ డోయంగనా!

నీవెవ్వతెవనియడిగిన నయ్యంగనయిట్లనియె. ఓమునికులోత్తమా! నేనిక్కడకు వచ్చుటకు తగినయభిప్రాయమును తెలిసికొను మనినవిని యామునివరుఁడు కొంతసేపు ధ్యానమునుచేసి సర్వమును తెలిసికొని దానితోనిట్లనియె. ఓయంగనామణీ! నీయభిప్రాయము నేనుజక్కఁగఁదెలిసికొంటిని. నీవు పుత్త్రులనుబడయఁగోరి యిక్కడకువచ్చితివి. ఓతరుణీమణీ! నీవు దారుణకాలమునందు వచ్చితివి. కనుక పరమదారుణు లగునిరువురు రాక్షసులు నీకుఁబుత్త్రులై పుట్టుదురనిన నాయంగనామణియిట్లనియె. ఓమునికులోత్తమా! నీవలనఁబుట్టినపుత్త్రులు రాక్షసులెట్లగుదురనిన నమ్మునివరుఁడు మరలనిట్లనియె. ఓతరుణీ! నీకు మూఁడవకుమారుఁడుపుట్టును. అతఁడు మిగుల బుద్ధిమంతుఁడుకాఁగలఁడనియె. అంతట నారాక్షస స్త్రీ తగినకాలము నందు పుత్త్రులనుగనియె. అందుముందుగ రావణుఁడును కుంభకర్ణుఁడునుపుట్టిరి. అనంతరమందు క్రౌంచి శూర్పణఖ కుంభీనస అనునట్టికన్యకలు ముగ్గురుపుట్టిరి. పిమ్మట విభీషణుఁ డనుమూఁడవకుమారుఁడుపుట్టె. ఆకుమార్తెలు ముగ్గురును దుర్వృత్తికల వారును ప్రాణులనుభక్షించువారును మునులను హింసించువారునునై యుండిరి. అంతట నొక్కనాఁడు రావణునితల్లి రావణునితో లింగమునుదెమ్మని శివునివద్దకుఁ బంపె. అంతట నారావణుఁడు కైలాసపర్వతమునకుఁబోయి మిగులభయంకరమగు తపస్సునుచేసె. అనంతరమందుఁ దనతలనుఛేదించి యాతలకాయతో వీణనుచేయుటకుయత్నించె. అట్లుచేసి ప్రేగులను తంత్రులనుగాఁజేసి తనశరీరమును వీణగాఁజేసె. అంతట షడ్జస్వరములచేత మాటిమాటికిని గానముచేత శివునిస్తోత్రముచేసె. ఆసమయమునందు సకలలోకములకును శుభమునుకలుగఁజేయునట్టి పరమశివుఁడు నందీశ్వరునితో నిట్లనియె. ఓనందికేశుఁడా! నీవుపోయి నీహస్తముతో రావణునిశిరస్సును సంధానముచేసి యిట్లనిచెప్పుము. ఓరావణా! పరమశివుఁడు ఆత్మలింగమును నీకీయుఁడు. ఈశ్వరునభిప్రాయమును నేనుదెలిసికొనుటచేత నీకుఁదెలిపితిని. కావున నీవీతపస్సునుజాలించి యింటికిపొమ్మని చెప్పిరమ్ము? అని యీశ్వరుఁడు చెప్పినమాటలను ఆనందికేశ్వరుఁడు విని రావణునొద్దకుఁబోయి తనహస్తముతో శిరస్సునుసంధానము చేసి శివుఁడుచెప్పినవిషయమును సర్వమునుజెప్పె. అంతట రావణుఁ డారాత్రిని కడపి మరల మఱునాఁటి ప్రాతఃకాలమునందు మునుపటివలెనే గానమును జేయుటకుఁ బ్రారంభించెను. మరల మునుపటివలెనే శివుఁడు నందికేశ్వరుని బంపె. ఇవ్విధముగఁ బదిదినములుగడచె. పరమశివుఁడు సంతోషముకలవాఁడై ప్రసన్నతను పొందియిట్లనియె. ఓరావణా! నీతపస్సునకు సంతసించితిని. నీకభీష్టమైనవరమును కోరుమనియె. అంతటనారావణుఁ డాపరమశివునిజూచి యీశ్వరునిచేత సంధానముచేయఁబడిన శిరస్సుకలవాఁడై యాత్మలింగము నిమ్మనిప్రార్థించె. మఱియును పార్వతిని భార్యనుగానిమ్మనియె. అందుల కాపరమశివుఁ డంగీకరించి యథేష్టముగఁబోఁదలఁచి యిట్లనియె. ఓరావణా! నాకు సంతోషమును కలుగఁ

జేయుటకొఱకు నీవు పదిపర్యాయములు శిరస్సును ఖండించుకొంటివి. అట్టిశిరస్సులు పదియును మరల మునుపటివలె నుండఁగలవనియె. అంతట నప్పుడురావణుఁడు సంతసించి పార్వతినిగైకొని తననగరమునకుఁ బోవయత్నించె. ఆసమయమునందు పరమేశ్వరుఁడిట్లనియె. ఓరావణా ! నీవు మఱియొకకల్పమునందు నూఱు శిరస్సులుకలఁవాడవును రెండునూఱ్లభుజములుకలవాడవునైతివి. అప్పుడు నారాయణుఁడు నిన్నుమోసపుచ్చి యాత్మలింగమును పార్వతిని అపహరించె. కావున నీవుపోయి సముద్రతీరమునందున్న నాయాత్మలింగమును గైకొమ్మనియె. అంతట రావణుఁడు బయలువెడలిపోయి నారాయణునివలన మోహపెట్టఁబడి యాత్మలింగమును పార్వతినివిడిచిపెట్టి మందోదరియను కన్నియను పరిగ్రహించి తల్లియభీష్టమును నెవేర్చకయే తల్లియొద్దకుఁబోయి సిగ్గుచేతఁ దలనువంచుకొనియె. అప్పుడు తల్లి పుత్త్రుడగు రావణునభిప్రాయము తెలిసికొని రావణసోదరులకు వివాహమునుచేసె. అంతట నొక్కనాఁడు కైకసియనునది పుష్పకవిమానమునందున్న కుబేరునిజూచి పుత్త్రులనుపిలిచి ఛీ ఛీ! యని నిందించుచు నిట్లనియె. ఓపుత్త్రులారా ! మీరు నపుంసకులరు. మరణమును పొందినవారితో సమానులరు. కుబేరుని యైశ్వర్యమునుచూచియును మీరుసిగ్గులేక సంచరించుచున్నారు. ఇట్లుండుట తగునా ? అని తల్లియగుకైకసి చెప్పినవాక్యములనువిని యారావణాదులు గోకర్ణమునకుఁబోయిరి. అట్లుపోయినపిమ్మట నక్కడ కుంభకర్ణుఁడు పదివేలసంవత్సరములు మిగులభయంకరమైన తపస్సునుచేసె. ధర్మాత్ముఁడును సత్యధర్మపరాయణుఁడును నగువిభీషణుఁడుకూడ పాదాంగుష్ఠముచేతనిలిచి యైదువేల సంవత్సరములు తపస్సుచేసె. అంతట దశాననుఁడు (రావణుఁడు) ధూమాహారుఁడై వేయిదివ్యసంవత్సరములు తపస్సునుచేసె. అట్లు వేయిదివ్యసంవత్సరములు కాఁగాఁనే యొకశిరస్సును కోసి యగ్నియందు హోమమునుచేసె. ఈనియమముగాఁ దొమ్మిదివేలసంవత్సరములు తపస్సునుచేసె. అనంతరమందు పదియవశిరస్సునుకూడ చూచుటకు యత్నించె. ఆసమయమునందు బ్రహ్మదేవుఁడు ప్రసన్నుఁడై యిట్లనియె. ఓరావణా ! నీకభీష్టమైన వరమునుకోరుమనిన, రావణుఁడు నాకుమరణము లేకుండునట్లు వరమునొసంగుమని చెప్పి మఱియునిట్లనియె. ఓబ్రహ్మదేవా ! గరుడగంధర్వయక్ష రాక్షసులవలనను, బ్రహ్మ విష్ణు మహేశ్వరులవలనను, మరణములేకుండునట్లును, వీఱందఱును నాకుఁ దృణప్రాయులై యుండు నట్లును వరమునొసంగుమనియె. ఆవచనములకు బ్రహ్మదేవుఁ డంగీకరించి యతనిశిరస్సులను మరల సంధానముచేసె. విభీషణునకు సద్బుద్ధిని అమరత్వమునిచ్చె. ఆసమయమునందు దేవేంద్రపదవినికోరిన కుంభకర్ణుని మోహపెట్టుటచేత నాకుంభకర్ణుఁడాఱుమాసములకాలము నిద్రనుపొందునట్లును, మరల నొకదినమునందు ఆఱుమాసములకుఁ దగినయాహారమును తినునట్లును, మరల నిద్రనుపొందునట్లును వరముని

మ్మని ప్రార్థించె. బ్రహ్మదేవుఁడు వానికిష్టమగువరమునిచ్చె. అంతట నాబ్రహ్మదేవుఁడు అంతర్ధానమునుపొందె. పిమ్మట నారాక్షసులు మువ్వురును తమగృహమునకుఁబోయిరి. ఆసమయమునందు సుమాలియనువాఁడు తనమనుమలు వరములను పొందినవృత్తాంతమును విని భయరహితుఁడై ప్రహస్తాదిరాక్షసులతోఁగూడ పాతాళలోకమునుండి భూలోకమునకువచ్చె. అంతట రావణాసురుఁడు మంత్రులమాటలనువిని కుబేరుని లంకాపట్టణమునుండి తరిమివైచి లంకాపట్టణమునాక్రమించి లంకారాజ్యమును సర్వమును పాలించుచుండె. అంతట కుబేరుఁడు తండ్రియొద్దకుఁబోయి యతనికి నమస్కరించి యతనియాజ్ఞానుసారముగఁ గైలాసశిఖరమునకుఁబోయి తపస్సునుచేసి శివునిసంతోషపఱిచె. అనంతరమందు శివునితోస్నేహమునుచేసి శివానుగ్రహమువలన నక్కడ నలకాపట్టణమును విశ్వకర్మచేత నిర్మింపఁజేసికొని దిక్పాలకత్వమునుపొంది యాపట్టణమునందు నివసించె. అంత నక్కడ రావణుఁడు తనచెలియలగుశూర్పణఖను విద్యుజ్జిహ్వుఁడనువానికిచ్చి వివాహమునుచేసె. పిమ్మట నావిద్యుజ్జిహ్వునకు దండకారణ్యరాజ్యమునొసంగె. మఱియును పినతల్లికొడుకులగు ఖరదూషణత్రిశిరులను ఆవిద్యుజ్జిహ్వునకు సహాయమునుచేయుటకిచ్చె. అంతట మధువనమును వానికొసంగె. ఖడ్గజిహ్వుఁడనువానికి క్రౌంచియనుదానినిచ్చి వివాహమునుచేసి మఱియొకలంకను కానుకగానొసంగె. వైరోచనుఁడనువానికి వృత్రజ్వాలయనునామధేయముకలదానినిచ్చె. అనంతరమందు శైలూషుఁడను నామముకలవాఁడును మహానుభావుఁడును నగుగంధర్వరాజుయొక్క కుమార్తెను కుంభకర్ణుఁడను రాజునకిచ్చె. విభీషణునకు సరమయనుదాని నిప్పించి వివాహమునుచేసె. అనంతరమందు రావణునివలన మందోదరియందు మేఘనాదుఁడనుపుత్త్రుఁడుపుట్టె. వాఁడుపుట్టినపుడె మేఘునివలె నత్యధికమగుధ్వనినిచేసె. అందువలన నెల్లవారును నతనికి మేఘనాదుఁడను పేరునుపెట్టిరి. కుంభకర్ణుఁడుమాత్రము సర్వకాలములయందును గుహయందుఁబడి నిద్రనుపొందుచుండె. అంతట రావణుఁడు దేవగంధర్వకిన్నరులను ఋషీశ్వరులను నాగులనుకొట్టిచంపి వారిభార్యలనపహరించె. ఆవృత్తాంతమునుకుబేరుఁడు విని తనతమ్మునియక్రమమునకు వెఱచి దూతనుబంపి యిట్టిదుష్కృత్యములను చేయఁగూడదని తెలిపి రమ్మనియె. అంతట రావణుఁడు కుబేరునివాక్యములనువిని కోపోద్దీపితుఁడై యలకాపట్టణమునకుఁ బోయి కుబేరునిజయించి వానిపుష్పకవిమానము నపహరించె. మఱియు నారావణుఁడు అలకాపట్టణమునందు సేనాసమేతముగనున్నదినమునందు ఒకనాఁటిరాత్రి రంభయనుదేవవేశ్య కుబేరునిపుత్త్రుఁడగు నలకూబరునిచేఁబ్రార్థితురాలై సకలాభరణములను ధరించి యెవ్వరికిని దెలియకుండ నాకాశమార్గమునవచ్చుచుండె. అట్లువచ్చునపుడు దానికాలియందెల చప్పుడుచేత దానిం దెలిసికొనిపట్టి బలాత్కారముగ ననుభవించె. అట్లనుభవించి చిరకాలమునకుఁ దానిని విడిచిపెట్టె. అంతట నారంభ నలకూబరునిదగ్గరకుఁ బోయి యావృత్తాం

తమును సర్వమును దెలిపె. ఆవృత్తాంతమును విని నలకూబరుఁడు కోపోద్దీపితుఁడై యిట్లని శపించె. ఈదినము మొదలుకొని విరక్తురాలును నుత్తమురాలును నగునాఁడుదానిని బలాత్కారముగఁ బట్టినయెడల రావణుఁడు శిరస్సుపగిలి మరణమును పొందునని శపించె. ఇట్లు శపించినవృత్తాంతమును రావణుఁడు చారునివలనఁ దెలిసికొని యదిమొదలుకొని బలాత్కారముగ స్త్రీలననుభవించుటను మానుకొనియె. అంతట నారావణుఁ డక్కడనుండి బయలువెడలి యముని వరుణుని యుద్ధమునందు జయించె. అనంతరమందు దేవేంద్రునిచంపవలయునని యెడు తలంపుతో స్వర్గలోకమునకుఁబోయె. అప్పుడు దేవేంద్రుఁ డారావణునిఁబట్టి బంధించి చెఱసాలయందువైచె. ఆవృత్తాంతమును విని మేఘనాదుఁడు బయలువెడలిపోయి మిగులభయంకరమైన యుద్ధమును చేసి యాయుద్ధమునందు దేవేంద్రునిజయించి మహాబలుఁ డగునామేఘనాదుఁడు దేవేంద్రునిబంధించి తనతండ్రిని చెఱసాలనుండివిడిపించి దేవేంద్రునిపట్టుకొని తనపట్టణమునకుఁబోయె. అంతట బ్రహ్మదేవుఁడుపోయి మేఘనాదున కనేకవరములిచ్చి దేవేంద్రుని విడిపింపఁజేసి తన నివాసస్థానమునకుఁ బోయె. అదిమొదలుకొని యామేఘనాదునకు నింద్రజిత్తను నామధేయముకలిగె. ఓరామచంద్రా! యుద్ధప్రియుఁ డగునింద్రజిత్తు రావణునికంటె బలిష్ఠుఁ డని ప్రసిద్ధినొందె. కావున నోరఘుకులోత్తమా! యింద్రజిత్తు మొదలగువారినని చెప్పితినని యగస్త్యమునివరుఁడు చెప్పి మఱియు నిట్లనియె. అంతట విజయముకల రావణుఁడు క్రమముగ సకలలోకములను జయించి దిక్పతులనుగూడ జయించె. అంతట కైలాసమునకుఁ బోయి కోటగడియలతో సమానములయిన తనదుభుజములచేత కైలాసపర్వతమునుఁ గదల్చె. అప్పుడు పార్వతీదేవి భయమును పొందినదై తన బాహువులతో శివుని కౌఁగిలించుకొనియె. ఆసమయమునందు శివుఁడు తన యెడమకాలి బొటనవ్రేలిచేత కైలాసపర్వతము నణఁచె. అంతట రావణుని భుజములు మర్దితము లయ్యె. ఆసమయమునందు బద్ధుఁడైన చోరునివలె రోదనమును చేయుచుండె. అప్పుడు నందకేశ్వరుఁ డిట్లని శపించె. ఓరావణా! నీవు వానరునివలె చపలస్వభావముకలవాఁడవై చంచల మగుకర్మమును చేసితివి కనుక వానరులచేతను మానవులచేతను నాశమును పొందుదువనియె. అంతటఁ గొన్నిదినములకు పరమశివుఁడు రావణునిభుజములు బయలునకు వచ్చునట్లు తనపాదాంగుష్ఠమును అదుముట చాలించె. పిమ్మట రావణుఁడు తనభుజముల నూడఁదీసికొనియె. అప్పటికిని రావణుఁడు సిగ్గునుపొందనివాఁడును నందికేశునిమాటలను లక్ష్యముచేయనివాఁడును నగుటచేత కార్తవీర్యార్జునునితో యుద్ధమును చేయుటకుఁ బోయె. పోయి కార్తవీర్యార్జునుఁడు పట్టణమునందు లేకుండుటను తెలిసికొని యతనిపట్టణమునందుఁ బ్రవేశింపఁదలఁచి మధ్యాహ్నసమయమున నర్మదానదియందు దిగి శివపూజనుచేసి తన యిరువదిభుజములచేతను యమునానదికి సేతువును గట్టె. అం

దువలన యమునానదియందలి నీరంతయును దిగువభాగమునకుఁ బోక నిలిచె. ఆసమయమునందు మఱియొక్కచోట జలక్రీడలను చేయుచున్న కార్తవీర్యార్జునుఁడు యమునానదియందు జలము రాకుండుటయు, కారణము రావణుఁడే యని యెఱింగి యచ్చోటునకుఁ బోయె. అప్పుడు రావణుఁడు శివపూజను చాలించి యాకార్తవీర్యార్జునితో యుద్ధమును చేసె. ఆయుద్ధమునందు కార్తవీర్యార్జునుఁడు రావణుని బంధించి కాష్ఠములచేత నిర్మింపఁబడిన యేనుఁగుతో క్రీడించునట్లు క్రీడించుటకొఱకు తన కుమారునికిచ్చె. అంతట కార్తవీర్యార్జునుని పుత్త్రుఁ డారావణుని బొమ్మనుగాఁ జేసికొని యాడుచుండె. అంతట పులస్త్యబ్రహ్మవచ్చి యనేకవిధములఁ బ్రార్థించి యారావణుని విడిపించె. అప్పటికిని రావణుఁడు గుణవంతుఁడుగాక మహాబలవంతుఁ డగువాలిని జయింపఁదలఁచి సముద్రమునందు ధ్యానమును చేయుచున్న వాలికి వెనుకభాగమునఁ బోయి వాలినిఁ బట్టుకొనుటకు యత్నించె. ఆసమయమునందు వాలి రావణుఁడు వచ్చుటయును దెలిసికొనినను తెలియనివానివలె నూరకుండి సమీపమునకు వచ్చిన పిమ్మట రావణుని పదితలలను తన చంకక్రింద నణఁచిపెట్టి నాలుగుసముద్రములకును గొనిపోయి అయ్యాసముద్రములయందు స్నానదానాదికమును చేసి మరల కిష్కింధాపట్టణమునకుఁబోయి తన కుమారునిమాఁదీ యతనిని ముద్దుపెట్టుకొనుటకు చంకనెత్తికొనియె. అప్పుడు వాలియొక్క భుజములు కదలుటచేత రావణుఁడు క్రిందఁబడియె. అప్పుడావాలి తన బంధువులకును స్త్రీలకును ఆరావణునిఁజూపి యుయ్యెలకు మీఁదిభాగమునం దారావణుని వ్రేలాడఁగట్టె. అప్పు డారావణుఁడు తలక్రిందుగఁ గట్టఁబడియుండుటచేత నంగదునిమూత్ర మారావణుని నోటియందుఁ బడె. ఇవ్విధముగఁ జిరకాలము గడచిన పిమ్మట రావణుని పోయిరమ్మనియె. అంతట రావణుఁడు వాలితో స్నేహమునుచేసి యథేచ్ఛముగ బయలువెడలిపోయి పుష్పకవిమానముమీఁదనెక్కి సకలలోకములయందును సంచరించుచుండె. అట్లు రావణుఁడు సకలవీరులను జయించుచుఁ గ్రమముగఁ బాతాళలోకమునకుఁ బోయె. పోయి కోటిమందిసూర్యులవలెఁ బ్రకాశించుచున్న బలిచక్రవర్తియొక్క పట్టణమును చూచె. అప్పుడు ఆబలిచక్రవర్తియొక్క తేజస్సుచేతఁ గొట్టఁబడిన తేజస్సుకల దగుటచేత నాపుష్పకవిమానము చలింపకుండె. అంతట నారావణుఁడు పుష్పకవిమానమునుండి దిగి యొంటిగ పాదచారియై బయలువెడలిపోయి యాపట్టణమునందుఁ బ్రవేశింపఁబోయె. అప్పుడో రామచంద్రా! ఆరావణుఁడు ద్వారదేశమునందు వామనరూపముతో నున్న నిన్నుఁ జూచె. ఆసమయమునందు నీవు కోటిమందిసూర్యులతో సమానమైన దేహచ్ఛాయకలవాఁడవును పచ్చనిపట్టువస్త్రమునుధరించినవాఁడవును నాలుగుభుజములుకలవాఁడవును ద్వారపాలకుఁడవును నైయుండఁగా నారావణుఁ డిట్లనియె. ఓరీద్వారపాలకా! ఈనగరమునందున్న రాజెవ్వఁడనియడిగిన నీవూరకుండుటచేత మరల నిట్లనియె. ఓరీ! వామ

నుండా! నేనడిగినదానికి ప్రత్యుత్తరము నీయకుండుటకుఁ గారణమేమి? అనియడిగి నిన్ను చెవిటివానినిగాఁ దలఁచి బలిచక్రవర్తియొక్క గృహములోనికిఁ బోయె. పోయి భార్యతోఁగూడ పాచికలనాడుచుండిన బలిచక్రవర్తినిజూచె. చూచి కొంచెమసేపూరకుండి బలిచక్రవర్తియొక్క సంపదనుచూచె. ఆసమయమునందు బలిచక్రవర్తియొక్క హస్తమునుండి పాచికతొలఁగి క్రిందఁబడియె. అప్పుడు బలిచక్రవర్తి యాపాచికలను తెమ్మని రావణునకాజ్ఞాపించె. రావణుఁడు దానిని తీసికొనివచ్చుటకుఁబోయి హస్తముతో నాపాచికనెత్తఁగా నదికదలకపోయె. అంతట నతఁడు తన యిరువదిభుజములచేతను దానినెత్తుటకు ప్రారంభించె. అప్పుడతనిప్రేళ్లు ఆపాచిక క్రిందఁబడినలిగి యధికముగ బాధకలనై రక్తప్రవాహముకలవయ్యెనుగాని యిప్పటికిని నదిలేవకపోయె. మఱియు నతనిప్రేళ్లుకూడ బయలునకురాకపోయె. అప్పుడు రావణుఁ డాబాధకుఁదాళఁజాలక రోదనమునుచేసె. అప్పుడు బలిచక్రవర్తిపోయి దానిందీసికొనివచ్చి ఛీ ఛీ! యిట్టిపనివాఁ డిక్కడ నుండుట యేలయనిచెప్పి బయలునకుఁబొమ్మని వెడలఁగొట్టె. అంతట రాజదూత లతనిందీసికొనిపోయి గుఱ్ఱముల పురీషమునందుఁ బడవైచిరి. అక్కడఁ గొన్నిదినములుండి యొక్కనాఁడు ద్వారపాలకుఁడవగు నీదగ్గరకువచ్చి నిన్ను ననేకవిధములప్రార్థించి నన్ను బయలునకుఁ బంపుమని యడుగఁగా నీవు పాదాంగుష్ఠముచేతఁ జిమ్మి యంతరిక్షమునఁబడవైచితివి. అంతట రావణుఁ డావేగముచేతఁబోయి లంకాపట్టణమునందుఁబడియె. అప్పుడు రావణుఁడు లంకాపట్టణమునందుఁ బ్రవేశించి మరల జన్మించినట్లుతలఁచె. అప్పటికిని రావణుఁడు బుద్ధిహీనుఁడై పుష్పకమునెక్కి సకలలోకములను స్వాధీనముగఁ జేసికొనవలయు ననియెడుతలంపుతో సకలదేశములయందును దిరుగుచు నీయయోధ్యాపట్టణమునకువచ్చి నీపూర్వుఁడగు ననరణ్యునిజూచె. చూచి యతనితో యుద్ధమును చేసి యాయుద్ధమునందు అనరణ్యునిక్రిందఁబడవేయఁగా నాయనరణ్యుఁ డిట్లని శపించె. ఓరీ! రావణా! నిరపరాధ నగునాకపకారమునుచేసితివి కనుక నావంశమునందు నారాయణుఁడు శ్రీరాముఁ డనునామధేయముతోఁ బుట్టి నిన్ను పుత్త్రమిత్త్రాదులతోఁగూడ సంహరించుననియె. అవ్విధముగ శపించి యంతటితో శరీరమునుచాలించి స్వర్గలోకమునకుఁ బోయె. అంతట నొకనాఁడు సనత్కుమారమునివరుని ఏకాంతమునందుఁజూచి రావణుఁడు నమస్కరించి యిట్లనియె. ఓమునికులోత్తమా! దేవతలలో నధికుఁడెవ్వఁడనిన నమ్మునివరుఁడు విష్ణుదేవుఁడధికుఁడనిన మరల నిట్లనియె. ఓమునికులోత్తమా! ఆవిష్ణుదేవునివలన మృతినిపొందువా రేగతినిపొందుదురనిన నమ్మునివరుఁడు విష్ణుదేవునివలన మరణమునుపొందినవాఁడు ముక్తినిపొందుననిన మరల రావణుఁ డిట్లనియె. ఓమునికులోత్తమా! నా కేయుపాయముచేత విష్ణుదేవునివలన మరణముకలుగునో చెప్పుమనిన నమ్మునివరుఁ డిట్లనియె. ఓరాక్షసోత్తమా! త్రేతాయుగమునందు విష్ణుదేవుఁడు నరరూపముతో రాముఁడై పుట్టఁగలఁడు. అప్పుడు

నీవు అయోధ్యాపురవాసి యగు రామునితో మిగుల భయంకరమగు వైరము నవలంబించి యతనివలన మరణమును పొందుము. అంతట నీవు ముక్తిని పొందుదువనియె. ఆవృత్తాంతమును వినియుండుటచేత రావణుఁడు నీతో విరోధమును పెట్టుకొనుటకొఱకు గోదావరీతీరమునందు నివసించియున్న సీతామహాదేవిని నపహరించె. అపహరించి యశోకవనమునందుఁ బెట్టి తాను మరణమును పొందవలయు ననియెడు తలంపుతో తల్లినిఁ గాపాడిన విధముగఁ గాపాడె. మఱియు నో రామచంద్రా! ఆరావణుఁ డొక్కనాఁడు నారదమునివరునిఁ జూచి నమస్కరించి సవినయముగ నిట్లనియె. భగవంతుఁడవైన యో నారదమునివర్యా! యుద్ధమును చేయుటకు మహాబలులగువా రెక్కడనున్నారో తెలుపుము. నీవు ముల్లోకముల వృత్తాంతమును తెలిసినవాఁడవుకదా? అనిన విని యానారదమునివరుఁడు చిరకాలము యోజించి యిట్లనియె. ఓ రాక్షసోత్తమా! శ్వేతద్వీపమునందు నివసించినవారు మహాబలవంతులై యున్నారు. వారు అత్యున్నతమైన శరీరముగలవారు. వారందఱును విష్ణుపూజారతులై యున్నారు. మఱియును, పూర్వము విష్ణుదేవునిచేత వధింపఁబడినవారే యిప్పుడు అజేయులై యున్నవారు. వారిని సురాసురులుకూడ జయింపనలవికానివారై యున్నారనియె. అంతట నారావణుఁడు మంత్రులతోఁ గూడ పుష్పకవిమానము నెక్కి యతివేగముగ శ్వేతద్వీపవాసులతో యుద్ధమును చేయుటకు బయలువెడలిపోయె. అట్లు కొంతదూరము పోయిన పిమ్మట శ్వేతద్వీపవాసులయొక్క తేజస్సుచేతఁ గొట్టఁబడిన తేజస్సుకలదై రావణుని పుష్పకవిమానము కదలఁజాలనిదయ్యె. అంతట నారావణుఁడు పుష్పకవిమానమును విడిచి పాదచారియై యాద్వీపమునందుఁ బ్రవేశించె. అట్లు ప్రవేశించినతోడనే యుకయోఁషుది ఆరావణుని చేతఁబట్టుకొని యొకదాసితోఁగూడ పుష్పములు కోసికొని వచ్చుట కరణ్యమునకుఁ బోయె. అట్లుపోవుచు నయ్యంగన యిట్లనియె. ఓరీ! నీ వెవ్వఁడవు. ఎవ్వనిచేతఁ బంపఁబడి యిక్కడకు వచ్చితివి. నీవృత్తాంతమును సర్వమును తెలుపుమనియె. అంతట నందలి స్త్రీలందఱును పరిహాసమును చేయుచు తమహస్తములతో నారావణుని ముఖముమీఁదఁ గొట్టిరి. అనంతరమందు అతని నధోముఖముగ వ్రేలాడవేసి గిరగిరఁ ద్రిప్పిరి. పిమ్మట మఱియొకతె యారావణుని పాదములను పట్టుకొని చెండును ఎగురవేసినవిధముగ నెగురవైచె. ఇట్లు కొంతసేపు క్రీడించి తుదకు విసరివేయఁగా నారావణుఁడు క్రౌంచద్వీపమునందలి యొకశౌచకూపమునందుఁ బడియె. ఇవ్విధముగ నారావణుఁడు శ్వేతదీపమునందలి స్త్రీలచేత విసరివేయఁబడి క్రౌంచద్వీపమునందు ప్రవేశించిన పిమ్మట మిగుల నాశ్చర్యమును పొంది యిట్లని తలఁచె. ఆహా! విష్ణువుచేత మరణమును పొందినవారు ఇట్టి బలముకలవారైరి. కనుక నేనుకూడ విష్ణువుచేత మరణమును పొంది యీ శ్వేతద్వీపమునందు నివసించెద ననియె. మఱియును, విష్ణుదేవున కేవిధముగఁ గోపమువచ్చునో యావిధముగాఁ బ్రవర్తించెదనని తలఁచె. నిట్లు నిశ్చయించి యరణ్యమునందున్న సీతామహాదేవిని

అపహరించె. మఱియు నోరఘుకులోత్తమా! ఆరావణుఁడు సీతామహాదేవిని మహాలక్ష్మినిగాఁ దెలిసికొనియే యపహరించె. మఱియు నారావణుఁడు నీవలన మరణమునుపొందఁగోరి సీతామహాదేవిని తల్లినిపాలించినవిధముగఁ బాలించుచుండెనని విని శ్రీరాముఁడిట్లనియె.

* వాలి సుగ్రీవుల జన్మవృత్తాంతము *

ఓయగస్త్యమునివర్యా! నీవలన వాలిసుగ్రీవుల జన్మవృత్తాంతమును వినఁదలఁచితిని. ఇంద్రసూర్యులు వాలిసుగ్రీవులై రనివిందును. ఆవృత్తాంతమును సవిస్తరముగఁ జెప్పుమనిన నగస్త్యమునివరుఁ డిట్లనియె. ఓరఘుకులోత్తమా! పూర్వ మొకనాఁడు బ్రహ్మదేవుఁడు సువర్ణమయమగు మేరుపర్వతమునందు నివసించియుండఁగా అతనికన్నులనుండి యానందబాష్పములు బయలువెడలె. ఆయానందాశ్రువులను బ్రహ్మదేవుఁడు దోసిలియందుధరించి కొంచెముసేపు ధ్యానించి వానినివిడిచిపెట్టె. అవ్విధమున నాయశ్రువులు క్రిందఁబడినతోడనే మిగులగొప్పవాఁడగు నొకవానరుఁడు పుట్టె. అట్టివానరునిజూచి యాబ్రహ్మదేవుఁడు ఓబిడ్డా! నీవు సర్వకాలములయందును ఇక్కడనే యుండుమనియె. అంతట నావానరుఁ డిట్లు చిరకాలము నివసించియుండఁగా నొక్కనాఁడు ఫలమూలాదులకొఱకాపర్వతప్రాంతమునందుఁ దిరుగుచుండె. అట్లుతిరుగుచు నొక్కచోట దివ్యోదకముకల యొకదిగుడుబావిని జూచె. చూచి యాబావియందలియుదకమును ద్రావుటకొఱకు దానియందుఁ బ్రవేశింపఁబోవుచు నాయుదకమునందుఁ దననీడనుచూచి దానియందు మఱియొకవానరమున్నదని తలఁచి యాబావియందుదుమికె. అప్పుడు దానియందు వేఱొకవానరమునుగానక బయలునకువచ్చె. అప్పు డాఋక్షవిరజుఁ డనువానరుఁ డొకనారీరత్నమైయుండె. అట్లు తాను స్త్రీరూపమునుపొందుటకు మిగుల నాశ్చర్యమునుపొందె. ఆసమయమునందు దేవేంద్రుఁడు మార్గమునఁబోవుచు నయ్యంగననుజూచి కామబాణతప్తుఁడై దానితో సురతక్రీడనుసలుపకయే వీర్యమునువిడువఁగా నావీర్యము ఆవానరముయొక్క వాలముందు ప్రదేశమునందుఁ బడియె. అందువలన దేవేంద్రునితో సమానమైన పరాక్రమముకల వాలి యనువానరుఁడు పుట్టె. ఆసమయమునందే సూర్యుఁడుకూడ నచ్చోటునకువచ్చె. వచ్చి యాంగనారూపముతోనున్న ఋక్షవిరజునిఁ జూచి కామమోహితుఁడై యతనికంఠప్రదేశమునందు అత్యధికమైన తన వీర్యమును విడిచె. అంతట వెంటనే సుగ్రీవుఁ డనువాఁడు పుట్టె. పిమ్మట నాతరుణీమణి యాయిరువురుపుత్త్రులను చేతఁబట్టికొని కొంతదూరముపోయి యొక్కచోట నిద్రనుపొందె. అంతట ప్రాతఃకాలమునందు మేల్కాంచి మునుపటివలె వానరాకృతికలవాఁడయ్యె. అంతటఁబోయి యావృత్తాంతమును సర్వమును చెప్పఁగా విని బ్రహ్మ యతనికి

మిగుల శ్రేష్ఠమైన కిష్కింధాపుర రాజ్యమునిచ్చె. అంతట నాఋుక్షవిరజుఁడు తన పుత్త్రద్వయముతోఁగూడఁ గొంతకాలము వానరరాజ్యమునుచేసి కొన్నిదినములైన పిమ్మట కాలధర్మమునుపొందె. అంతట వాలియనువాఁడు వానరాధిపతి యయ్యెనని యగస్త్య మునివరుఁడు చెప్పిన శ్రీరాముఁడు విని మరల నిట్లనియె.

✷ హనుమంతుని జన్మవృత్తాంతము. ✷

ఓమునికులోత్తమా! ఈసుగ్రీవుఁడు కిష్కింధాపట్టణమునుండి వెడలఁగొట్టఁబడిన పిమ్మట సుగ్రీవునకు వాయుపుత్త్రుఁడగుహనుమంతుఁడు మంత్రియయ్యెనని యును, హనుమంతుఁడు తన పరాక్రమమును తానెఱుఁగఁడనియును, విందును. కావున హనుమంతుని వృత్తాంతమును సర్వమును వినవలయునని తలంపు కలిగి యున్నది. కావున నాయభీష్టమును దీర్పుమనిన నయ్యగస్త్య మునివరుఁ డిట్లనియె. ఓరఘుకులోత్తమా! పూర్వము అంజనపర్వతమునందు కేసరియను వానరుఁడుకలఁడు. ఆవానరున కిరువురుభార్యలు కలరు. ఆయిరువురిలో నొకతెయగు నంజనాదేవి యాపర్వతమునందు సంచరించుచుండఁగా నంతరిక్షమునుండి గృధ్రముఖమునుండి పాయసమయమైన యొక పిండము క్రిందఁబడియె. ఆపిండము కైకేయీహస్తమునుండి గృధ్రతీసికొనివచ్చి క్రిందఁ బడవైచిన తోడనే యాపిండమును భక్షించె. ఆ సమయమునందు మార్జారాస్యయగు మఱియొకవానరస్త్రీ యేగుదెంచె. అప్పుడు దానితోఁగూడ నాయంజనయనువానరస్త్రీ విహరించుచుండఁగా గాలివలన నయ్యిరువురి వస్త్రములును తొలఁగిపోయె. అప్పుడు వాయుదేవుఁడు వచ్చి యంజనాదేవిని అనేకవిధములఁ బ్రార్థించి దానితో సురతసుఖము ననుభవించె. అంతట నావిధముగానే నిఋుతియనువాఁడు వచ్చి మార్జారాస్యనువరించి దానితోఁ గ్రీడించె. అంతట నంజనాదేవియందు హనుమంతుఁడును మార్జారాస్యయందు మిగులభయంకరమును ఘుర్ఘురధ్వనికలదియును అయిన పిశాచమును పుట్టిరి. ఓరఘుకులోత్తమా! చైత్రమాసమునందలి మఖానక్షత్రయుక్తమైన యేకాదశియందు శత్రుసంహారమును చేయునట్టి హనుమంతుఁడు పుట్టె. మఱియు నోరామచంద్రా! హనుమంతుఁడు పూర్ణిమయందుఁ బుట్టె నని చెప్పుదురు. అది మఱియొక కల్పమునందలి వృత్తాంతమని తెలియవలయును. ఓరామచంద్రా! ఇఁక నాహనుమంతుని వృత్తాంతమును చెప్పెదను. వినుము. ఓరామచంద్రా! ఆహనుమంతుఁడు పుట్టినతోడనే యుదయించుచున్న సూర్యునిఁజూచి పక్వఫలమని తలఁచి యాపండును భుజించుట కొఱకు విలాసముగ నాకాశమున కేఁగె. అట్లు హనుమంతుఁడు వాయువేగమువంటి వేగముతో నైదునూఱుల యోజనములదూరము పోవుచుండఁగా నాదినమమావాస్యయయ్యె. ఆసమయమునందు రాహువనుగ్రహము సూర్యుని మింగుటకు

యత్నించివచ్చుచు సూర్యుని మ్రింగఁదలఁచి వచ్చుచున్న వానరునిఁజూచె. అంతట రాహువు భయముకలవాఁడై సూర్యునివిడిచిపెట్టి తన్ను మ్రింగునేమో యనుభయముతోఁ బరుగిడి యింద్రునొద్దకుఁబోయి యిట్లనియె. ఓదేవోత్తమా! సర్వకాలములయందును నాచేత స్పృశింపఁబడుచున్న సూర్యునకు విఘ్నము వచ్చియుండుటచేత నిఁకమీఁద నిన్ను బాధించెదను. అందుల కంగీకరింపనియెడల శీఘ్రముగ నాకుఁ గలిగినవిఘ్నమును నివారింపుమనిన విని యింద్రుఁడు వెల్లయేనుఁగుమీఁద నెక్కి వజ్రాయుధధారియై బయలువెడలె. ఆసమయమునందు దేవతలుకూడ నతనితోఁ బయలువెడలిరి. అంతట నింద్రుఁ డతివేగముగఁబోయి హనుమంతునిమీఁద వజ్రాయుధమును బ్రయోగించె. అట్లు దేవేంద్రుఁడు వజ్రాయుధమును బ్రయోగింపఁగా దానిదెబ్బచేత హనుమంతుఁడు ఆకాశమునుండి యొకకొండగుహయందుఁ బడియె. ఆసమయమునందు హనుమంతునిదౌడ భగ్నమయ్యె. కావున నాయాంజనేయునకు హనుమంతుఁ డనిపేరుకలిగె. అట్లు హనుమంతుఁడు క్రిందఁబడినవెంటనే వాయుదేవుఁ డధికముగాఁ గోపమునుపొందె. అనంతరమందు నావాయుదేవుఁడు హనుమంతుని నోదార్చుచు తాను స్తబ్ధుఁడై యూరకుండె. అట్లు వాయుస్తంభనమైనతోడనే సకలజనులును క్రిందఁబడిరి. మఱియును ముల్లోకములవారును శవాకారమునుపొందిరి. మఱియు నెక్కడఁజూచినను హాహాకారము లతిశయించె. ఆసమయమునందు బ్రహ్మదేవుఁడు దేవేంద్రుని ఛీ ఛీ! యని నిందించుచు మిగుల వేగముగ వాయువుదగ్గఱకుఁబోయి వాయువును బ్రార్థించి నమస్కరించి యిట్లనియె. ఓవాయుదేవా! నీవు దేవేంద్రుఁడు చేసినతప్పును మన్నింపుము. నీపుత్త్రుఁ డగుహనుమంతుని జీవింపఁజేసి కోరె నన్నివరముల నిచ్చెదననిన వాయుదేవుఁడు విని సంతసించి చలించుట కారంభించె. అంతట ముల్లోకములవారును మరలజీవించిరి. ఆసమయమునందు తేరుకొన్నప్రాణముకలవాఁడై ముందర నిలిచియున్న హనుమంతునిజూచి బ్రహ్మదేవుఁ డిట్లనియె. ఓకపివర్యా! నీవు మరణములేనివాఁడవును వజ్రమువంటి దేహముకలవాఁడవును నగుదువు. మఱియు నోయాంజనేయా! నావరానుసారముగ నీవు విష్ణుదేవునకు సాహాయ్యమును చేయుదువు. నీవెక్కడకుఁబోయినను ఆతంకములేనివాఁడవై సకలకార్యములను నెరవేర్పఁగలవు. మఱియు నీవు నారాయణునియందు సంతతభక్తికలవాఁడ వగుదువనిచెప్పి యాబ్రహ్మదేవుఁ డంతర్ధానమునుపొందె. అప్పుడు రాహువు తొంటియట్లసూర్యునిఁబట్టఁ బోయెననిన విని శ్రీరాముఁ డిట్లనియె. ఓయగస్త్యమునివర్యా! దేవేంద్రుఁడు రాహువునకు సూర్యునినిచ్చె. ననిచెప్పితివికదా? అట్లు సూర్యుని ఇచ్చుటకుఁ గారణమేమనిన నగస్త్యమునివరుఁ డిట్లనియె. ఓరఘుకులోత్తమా! తొల్లి రాహువనువాఁడు రాక్షసుఁడు, అమృతమును పానముచేయుటచేత మరణములేనివాఁడయ్యె. ఆరాక్షసుఁడు అప్పుడప్పుడు దేవతలను మ్రింగవచ్చును. ఆసమయమునందు దేవతలు సూర్యచంద్రులను సమర్పించుదురు. అప్పుడు

సకలజనులును పుణ్యకార్యములనుచేసి యాగాహుతులను పాఱదోలుదు రనిచెప్పి మరల నిట్లనియె. ఓరఘుకులోత్తమా! హనుమంతుని జన్మవృత్తాంతమునుమాత్రము తెలిపితినిగాని యాతని పరాక్రమాధిక్యమును చెప్పలేను. అతనిపరాక్రమమును వర్ణింప నెవ్వరును సమర్థులుకారు. అయినను గొంతవఱకుఁ జెప్పెదను. వినుము. ఆహనుమంతుఁడు మునులయాశ్రమములందుఁ దిరుగుచు మునిబాలకులను భయపఱిచి వారిచేతులయందుఁగల దర్భాసనములను బలాత్కారముగఁ గైకొనుచుండును. అట్లుసేయుటనుజూచి మునులందఱును నిట్లని శపించిరి. ఓవానరోత్తమా! ఈనిమిషముమొదలుకొని నీపరాక్రమము నీకుఁ దెలియకపోవుననియును, ఇతరులు చెప్పినయెడల నీపరాక్రమము నీకుఁ దెలియుననియును చెప్పిరి. కావున నోరామచంద్రా! హనుమంతుఁడు తనపరాక్రమమును మఱచి సుగ్రీవునొద్దనుండె. తర్వాత వానరులందఱును సీతను గానక ప్రాయోపవేశమును చేసినకాలమునందు జాంబవంతుఁడు స్తోత్రముచేయుటచేత హనుమంతుఁడు తనకంతటి పరాక్రమము కలదనియును తెలిసికొనవాఁడై లంకాపట్టణమునకుఁబోయివచ్చె నని చెప్పి మఱియు నిట్లనియె. ఓరాముఁడా! నీవడిగిన విషయమును సర్వమును చెప్పితిని. ఓరఘుకులోత్తమా! నీవు పరమేశ్వరుఁడవు. కావున సర్వమును నీవెఱుఁగుదువు. అయినను భక్తుల మగుమమ్ములను గౌరవింపఁ దలఁచి తెలియనివానివలె నడిగితివని యగస్త్యమునివరుఁడు చెప్పెనని చెప్పి పరమశివుఁ డిట్లనియె. ఓపార్వతీ! ఆయగస్త్యమహాముని ఈవిధముగా రామునిస్తోత్రముచేసి రామునిచేతఁబూజింపఁబడి మునివరులతోఁగూడ తనయాశ్రమమునకుఁబోయె. ఓపార్వతీ! ఆయగస్త్యమహాముని వచ్చునప్పుడును పోవునప్పుడునుగూడ వింధ్యుఁడు లేచునని తలంపుతో వింధ్యనకుఁ గనఁబడకయేపోయె. అంతట రాముఁడు తమ్ములు మొదలగువారితోఁ గూడుకొని సంసారివలె గృహమునందు నివసించె. మఱియు నారాముని కే విషయములందాసక్తిలేకపోయినను సీతతోఁగూడ విషయముల ననుభవించుటకలిగె. ఇవ్విధముగ శ్రీరాముఁడు హనుమంతుఁడు మొదలగువారితోఁ గూడుకొని రాజ్యమునుపాలించుచున్న సమయమునందు భూమియంతయును సస్యసంపన్నమైయుండె. వృక్షములన్నియును ఫలవంతములై యుండె. సకలజనులును తమతమ ధర్మములయందాసక్తికలవారై యుండిరి. స్త్రీలందఱును పతివ్రతలై యుండిరి. లోకములో నెక్కడను పుత్త్రమరణము లేకయుండె. అంతట నొక్కనాఁడు రాముఁడు తమ్ములు హనుమంతుఁడు మొదలగువారు వెంటరాఁగా సీతతోఁగూడ విమానమునెక్కి భూలోకమునందంతటను సంచరించుచు ననేకములయిన యమానుషకృత్యములను చేయుచుండె. మఱియును, పరమాత్మరూపుఁడగు రాముఁడు లోకముల కుపదేశమునుచేయుటకొఱకనేకములగు శివలింగములను స్థాపించె. మఱియు నధికదక్షిణలుకల యశ్వమేధాదియాగములను మెండుగఁజేసె. మఱియు నోపార్వతీ! పరమానందరూపుఁడగురా

ముఁడు అమానుషము లగుభోగములచేత సీతను రమింపఁజేసె. మఱియును, ధర్మవేత్తయగు రాముఁడు ధర్మమునుదప్పక రాజ్యమునుపాలించె. ఇవ్విధముగఁ బదునొకండువేల సంవత్సరములు రాజ్యమునుచేసి తనదుపుణ్యకథలను ముల్లోకములయందును వ్యాపింపఁజేసె. రాముఁడు రాజ్యము త్రేతాయుగమునందుచేసెను. ఆపదునొకండువేలసంవత్సరములును కలిమానముచేత పదునొకండు లక్షలగును. ఓపార్వతీ! రాముఁడు ఏకపత్నీవ్రతము కలవాఁడనియును, రాజర్షి యనియును. అపరిశుద్ధుఁడనియును ప్రసిద్ధినిపొందెను. మఱియు నారామునకు భార్యయును బాణమును నొక్కటియైయుండెను. సీతామహాదేవి ప్రేమచేతను అనువృత్తిచేతను శమాది ధర్మములచేతను పరమసాధ్వియని పేర్కొనఁబడియె. అట్టి సీతామహాదేవిచేత శ్రీరామునకధికముగ ప్రకాశముకలిగియుండెనని పరమశివుఁడు పార్వతికిఁజెప్పి మఱియు నిట్లనియె. ఓపార్వతీ! శ్రీరామునివృత్తాంతమును సర్వమును నీకుఁ జక్కఁగఁ దెలియఁజేసితిని. ఈరామునిచరిత్రమును వినుటచేత నధికముగ మంగళములు కలుగును. ఓపార్వతీ! ఈసారకాండమును వినినమానవులు సకల మనోరథములచేతను నిండినవారగుదురు. మఱియును నిరాయాసముగ మోక్షమును పొందుదురు.

ఇట్లని శతకోటిరామచరిత్రములోనిదియును వాల్మీకిమునివరునిచేత రచియింపఁబడినదియును అయిన శ్రీమదానందరామాయణమునందలి సారకాండమునందు అగస్త్యరామ శివ పార్వతీసంవాదమును తెలుపునట్టి పదుమూఁడవసర్గము ముగిసెను.

ఆనందరామాయణము, సారకాండము

సంపూర్ణము.

శ్రీరస్తు.

శ్రీరామచంద్రపరబ్రహ్మణే నమః.

ఆనందరామాయణము

యాత్రాకాండము.

* వాల్మీకివలన ముందుగ శ్లోకము పుట్టుట. *

అట్లు పరమశివుఁడు చెప్పినపిమ్మట పార్వతీదేవి యిట్లనియె. ఓ దేవోత్తమా! నీవు సారకాండమునందలి వృత్తాంతమును సర్వమును చెప్పితివి. అయినను నాకుఁ దృప్తికలుగక యున్నది. కావున రామునిచరిత్రమునందు ఇంకను నేను వినఁదగిన విషయము లున్నయెడలఁ దెలిపి నన్నుఁ గృతార్థురాలినిగాఁ జేయుము. ఓదేవోత్తమా! మహానుభావుఁ డగురాముఁడు అశ్వమేధయాగము నేవిధముగఁ జేసెను? రామలక్ష్మణభరతశత్రుఘ్నులకు సంతతి కలదా? రామాదులకు పుత్త్రులున్నయెడల వారల వివాహము లేవిధముగ నయ్యె. వారల నందఱను శ్రీరాముఁడు పదునొకండువేల సంవత్సరము లేవిధముగఁ బాలించె. మఱియు నోదేవోత్తమా! శ్రీరాముఁడు ఇంకను ఏయేకార్యములను చేసెను. వానినన్నింటిని తెలుపుమని పార్వతీదేవి యడుగఁగా పరమశివుఁ డిట్లనియె. ఓపార్వతీ! శ్రీరామునిచరిత్రము నూఱుకోట్లగ్రంథముచేత విస్తరించి చెప్పఁబడియున్నది. ఆచరిత్రమునందలి యొక్కొక్క యక్షరము మహాపాతకమును నశింపఁజేయును. వాల్మీకిమునివరుఁడు రామకథను సంపూర్ణముగఁ దెలియఁజేసె. దానిం జెప్పెదను. సావధానచిత్తముకలదానవై వినుము. వాల్మీకిమునివరుఁ డొకనాఁడు స్నానమును చేయుటకొఱకు తమసానదియొద్దకుఁ బోయె. అట్లు పోవునపుడు శిష్యునితోఁగూడఁ బోయి కమండలువును భూమియందుఁ బెట్టి ముందుగ నావశ్యకము లయినకార్యములనుచేసి పిమ్మట శౌచవిధిని నెరవేర్చె. అనంతరమందు దర్భపాణియై యామునివరుఁడు స్నానమునకు వచ్చునంతలో తమసానదియం దొకకౌతుకము కలిగె. దానిని వివరించి చెప్పెదను. ఆతమసానదియందు సంచరించుచున్న క్రౌంచపక్షులరెంటిలో నొకదానిని నిషాదుఁడు బాణముచేతఁ గొట్టె. ఆసమయమునందు స్త్రీ క్రౌంచము భర్తృవియోగముచేత నధికముగ దుఃఖమును పొందె. అట్లు నిషాదునిచేతఁ జంపఁబడిన పక్షిని చూచిన తోడనే యామునివరునకు దయగలిగె. అనంతరమందు నిషాదుఁడు అన్యాయమును చేసెనని రోదనమును చేయుచున్న క్రౌంచిని జూచి యిటనియె.

" శ్లో. మానిషాద ప్రతిష్ఠాం త్వ మగమ శ్శాశ్వతీ స్సమాః,
యత్క్రౌంచమిథునా దేక మవధీః కామమోహితమ్."

(ఓ నిషాదుఁడా! కామవశముచేత కలిసియున్న క్రౌంచ మిథునములో నొకదానిని జంపితివి కనుక నీవు చిరకాలము జీవించువాఁడవు కావు) అనియె. ఇట్లు చెప్పినపుడు ఆమునివరుఁ డాశ్చర్యమును పొంది తనశిష్యునితో నిట్లనియె. ఓశిష్యుఁడా! నే నీ నిషాదుని తిట్టునపుడు బయలు వెడలిన వాక్యము ఛందోబద్ధమై శ్లోకరూపమున నున్నదనిన నా శిష్యుఁడు మరల నావాక్యమును విని యిది ఛందోబద్ధమైన శ్లోక మనుటకు సందేహము లేదనియె. అంతట నమ్మునివరుఁడు పరమానందము కలవాఁ డయ్యె. అంత నామునివరుఁడు ఆతమసానదియందు స్నానమునుచేసి యా శ్లోకార్థమునే యోజించుచు మరలిపోయె. అట్లుపోవునపు డతనిశిష్యుఁ డగు భరద్వాజమునివరున కా శ్లోకార్థమును వినిపించె. పిమ్మట శిష్యునితోఁ గూడ ఆశ్రమమునందు ప్రవేశించి శిష్యుల కనేకములైన కథలను చెప్పుచుండె. ఆసమయమునందు లోకకర్తయగు బ్రహ్మదేవుఁ డక్కడకు వచ్చె. అట్లు వచ్చిన బ్రహ్మదేవుని జూచి వాల్మీకిమునివరుఁడు శీఘ్రముగ లేచి ప్రాంజలియై నమస్కరించుచు మిగుల నాశ్చర్యముకలవాఁడై యుండె. అనంతరమందు అర్ఘ్యపాద్యాదులచేత నాబ్రహ్మదేవుని ననేకవిధములఁ బూజించె. అంతట బ్రహ్మదేవుఁడు తగినయాసనమునందుఁ గూర్చుండి వాల్మీకి మహామునినికూడ కూర్చుండ నియమించె. అంతట బ్రహ్మానుమతిచేత వాల్మీకిమహాముని కూర్చుండి నిశ్చలచిత్తుఁడై యాబ్రహ్మదేవుని ధ్యానముచేయుచుండె. అట్లు కొంతసేపు ధ్యానమునుచేసి పిమ్మట తమసాతీరమునందు జరిగిన వృత్తాంతమును సర్వమును తెలియఁజేసె. ఆవృత్తాంతమును సర్వమును విని యాబ్రహ్మదేవుఁ డిట్లనియె. ఓమునివర్యా! నీముఖమునుండి బయలువెడలినది శ్లోకమనుటకు సందేహమేమియును లేదని చెప్పి మఱియు నిట్లనియె. ఓమునికులోత్తమా! నాయాజ్ఞవలననే నీముఖమునుండి సరస్వతి బయలువెడలినది. కావున నోమునిశ్రేష్ఠా! రాముని చరిత్రమును సర్వమును నీవు శ్లోకరూపముగఁ జేయుము. నారదమునివరునివలన నీవు విన్నవిధముగ ధర్మాత్ముఁడును గుణవంతుఁడును బుద్ధిమంతుఁడును అగురాముని చరిత్రమును చెప్పుము. ఓమునివర్యా! రామలక్ష్మణులయొక్కయును, సీతయొక్కయును, రావణాదులయొక్కయును, రహస్యవృత్తాంతములుకూడ నీకుఁ దెలియఁగలవు. ఓమునివర్యా! నీవాక్యమునందలి యొకవాక్యముకూడ మృషావాక్యము కానేరదు. ఓమునివర్యా! మిగుల మనోహరమైనదియును, రసవంతమైనదియును, అయిన రామకథను శ్లోకబద్ధమైన దానినిగాను చేయుము. ఓమునికులోత్తమా! నీచేతఁ జేయఁబడినకథ యెంతకాలముదనుక భూలోకమునందుండునో అంతవఱకును నీవు నాలోకమునందు నివసింపఁగలవని చెప్పి యాబ్రహ్మదేవుఁడు ధీమంతుఁ డగురాముని చరిత్రమును సర్వమును స్వయముగాఁ

దెలియఁ బఱచె. అంతట బ్రహ్మదవుఁడు అంతర్ధానమును పొందె. అనంతరమందు వాల్మీకిమునివరుఁడు శిష్యునితోఁగూడ విస్మయమును పొందె. పిమ్మట నావాల్మీకి మునివరునిశిష్యు లందఱును మిగుల సంతోషముకలవారై మాటిమాటికిని నాశ్లోకమును పఠించుచుండిరి. మఱియు నామునివరుఁడు సమాక్షరములుకలిగి నాలుగుపాదములు కల శ్లోకమును మాటిమాటికిని పఠించుచు రామచరిత్రమును సర్వమును శ్లోకరూపముగఁ జేయుదునని తలఁచె. అట్లు తలఁచి కీర్తిమంతుఁడగు వాల్మీకిమునివరుఁడు ఉదారవృత్తార్థపదములు కలవియును మనోహరములును అయిన శ్లోకములచేత రామాయణమను కావ్యమును చేసె. ఆరామాయణకావ్యము నూఱుకోట్ల శ్లోకములచేత విస్తరింపఁ జేయఁబడియుండె.

ఇట్లు శ్రీమదానందరామాయణాంతర్గత యాత్రాకాండమునందలి
మొదటిసర్గ ముగిసెను.

✱ శివుఁడుచేసినరామాయణవిభాగము. ✱

ఓపార్వతీ ! వాల్మీకిమునివరునిచేత చేయఁబడిన నూఱుకోట్లరామాయణమును అందలి మునివరులందఱును మహాసంతోషముతో పఠించుచుండిరి. అట్లు మునివరులందఱును రామాయణమును పఠించుచున్న కాలమునందు వినుటకొఱకు దేవతలందఱును విమానములతోవచ్చి యంతరిక్షమునందు నిలిచి వినుచుండిరి. అట్లు విని మిక్కిలి సంతోషముకలవారై పుష్పవర్షమును గురిపించుచు నమ్మునివరుని ననేకవిధములఁ గొనియాడిరి. అంతట దేవగంధర్వయక్ష నాగ కిన్నర మునీశ్వరాదులు రామాయణ కావ్యార్థమును గుఱించి వివాదమును చేయుచుండిరి. అప్పుడు బ్రహ్మాదిదేవతలు రామాయణమును మేము స్వర్గమునకుఁ గొనిపోయెద మనిరి. దితిజపన్నగులు పాతాళలోకమునకుఁ గొనిపోయెద మనిరి. ఋషులును రాజులును రామాయణమహాకావ్యమును మేము ఈభూలోకమునందే పెట్టుకొనియెద మనిరి. మఱియును మేము మీరుతీసికొనిపోవుట కీయమనిరి. ఇవ్విధముగ నెల్లవారును రామాయణకావ్యమును గుఱించి వివాదమును సల్పిరి. ఓపార్వతీ ! ఆసమయమునందు నేను వారిదగ్గరకుఁ బోయి వారలవివాదమును నివారించి క్షీరసముద్రముదగ్గఱకుఁ బోతిని. పోయి శేషశయ్యయందు శయనించియున్న విష్ణుదేవుని ననేకవిధముల స్తోత్రమునుచేసి నానావిధములగు పూజాద్రవ్యములచేత నారాయణుని పూజించి గీతవాద్యాదులను సల్పితిని. అంతట విష్ణుదేవుఁడు మేల్కాంచి నన్నుఁబ్రబుద్ధునిగాఁ జేయుటకుఁ గారణ మేమనియె. అంతట నేను జరిగినవృత్తాంతమును సర్వమును చెప్పితిని. ఆవృత్తాంతమును సర్వమును విని నారాయణుఁడు నవ్వుచు క్షణమాత్రములోపల నాకావ్యమును సర్వమును మూఁడువిధములుగ విభజించె. మఱియును రామాయణమును పదియక్షరములు కల మంత్రములనుగా విభజించె. ఆమంత్రములలో

రెండక్షరములు కల మంత్రమును నా కుపదేశించె. నే నామంత్రమును కాశీపట్టణము నందు మరణమును పొందువారికి మరణకాలమునం దుపదేశించుచుందును. మఱియొక మంత్రమును శేషుఁడు పాతాళలోకమునకుఁ దీసికొని పోయె. ఇంకొక్క మంత్రమును లక్ష్మీదేవి వైకుంఠలోకమునకుఁ దీసికొనిపోయె. గరుడుఁడు మఱియొక మంత్రమును భూలోకమునకుఁ దీసికొనిపోయె. అంతట పాతాళలోకమునందలి వారందఱును శేషునివలనఁ దెలిసికొనిరి. దేవతలందఱును మహాలక్ష్మివలన గ్రహించిరి. భూలోకమునందలి వారందఱును గరుత్మంతునివలనఁ దెలిసికొనిరి. కాని వేఱొకదానివలనఁ దెలియఁ దగదు. మఱియు నోపార్వతీ! అట్లు మూఁడువిధములుగ విభజింపఁబడిన రామాయణము నందలి ౩౩, ౩౩, ౩౩, ౩౩౩ శ్లోకములను దేవతల కిచ్చె. ఇన్నిన్ని శ్లోకములుకల గ్రంథమునే పన్నగులకును మానవులకును గూడ నొసంగె. అంతట దేవతలు పరమసంతోషము కలవారై తమ భాగమును స్వర్గమునకుఁ దీసికొని పోయిరి. పన్నగులు తమ భాగమును పాతాళ లోకమునకుఁ దీసికొని పోయిరి. మానవుల భాగము భూలోకమునందలి మునులయొద్ద నుండె. ఓ పార్వతీ! ఇఁకను మానవుల భాగము వృద్ధిని పొందిన విషయమును తెల్పెదను. సావధాన చిత్తము కలదానవై వినుము. ఓ పార్వతీ! మానవుల భాగము మరల నేడు విధములుగ విభజింపఁబడి సప్తద్వీపములయందును నుంచఁబడియె. ఒక్కొక ద్వీపమునందు ౪౭౬౧౯౦౪౭ శ్లోకముల గ్రంథము నుంచఁగా నాలుగు శ్లోకములు మిగిలియుండె. ఆ నాలుగు శ్లోకములను నా కిమ్మని యాచించుటచేత విష్ణువు బ్రహ్మదేవుని కొసంగె. ఓ పార్వతీ! అంతట పుష్కరద్వీపమునందలి భాగమును మరల రెండుభాగములుగఁ జేసె. అం దొక్కొక్క భాగము ౨౩౮౦౯౫౨౩ శ్లోకములు గలదిగఁ జేయఁబడియె. అట్లు చేసి యా రెండుభాగములను ఆ ద్వీపమునందలి రెండు వర్షములయందును నుంచె. అనంతరమం దో పార్వతీ! శాకద్వీపము మొదలగు ద్వీపముల భాగములను రెండేసిగ భాగించి యయ్యై వర్షములయం దుంచె. అట్లు అనేకవిధములుగ విభజింపఁగ నొక శ్లోకము మిగిలె. అ దొక్కటియును నవఖండములయందును నుంచఁబడియె. ఓ పార్వతీ! కలియుగమునందలివారు మందబుద్ధు లగుదు రను తలంపుతో రావణుఁడు వేదములను అనేకవిధములుగ విభజించె. రాఁబోవు ద్వాపరయుగమునందు శ్రీకృష్ణుఁడు వ్యాసరూపమును ధరించి మానవులకు హితమును చేయుటకొఱకు రామాయణ కావ్యమునందలి భాగముల నన్నింటిని కలియ వెదకి పదునేను పురాణములను నిర్మించె. మఱియు నా వ్యాసుఁడు భారతాది పురాణములను చేసియును తృప్తి నొందక సరస్వతీతీరమునందుఁ గూర్చుండి వ్యగ్రచిత్తుఁడై యుండె. ఆసమయమునందు బ్రహ్మదేవుఁడు నారదమహామునికి తాను దీసికొనిపోయిన నాలుగు శ్లోకములను నుపదేశించె. అంతట నారదమహాముని యా నాలుగు శ్లోకములను వీణమీఁద మ్రోగించుచు వ్యాసమునివరునిదగ్గఱకు వచ్చి

యా వేదవ్యాసమునివరున కా నాలుగు శ్లోకములను ఉపదేశించె. అప్పుడు వేదవ్యాసుఁ డా నాలుగు శ్లోకములను గ్రహించిన పిమ్మట శాంతచిత్తుఁ డయ్యె. అనంతరము డా నాలుగు శ్లోకములను విస్తరింపఁ జేయఁ దలఁచి పదునెనిమిదివేల గ్రంథము కల మహాభాగవతాఖ్య గ్రంథమును రచించె. ఆ గ్రంథము సకలజన మనోరంజక మయ్యె. అంతట వేదవ్యాస మునివరుఁడు పదునెమి దగు నుపపురాణములను గూడ నిర్మించె. ఓ పార్వతీ! విశేషముగఁ జెప్పనేల? పురాణాదుల కన్నిటికిని వాల్మీకిమునివరుని వాక్యములే కారణము లయ్యె. ఓ పార్వతీ! రామాయణమువలనఁ గలిగిన మహాభారతము ననుసరించి షట్ఛాస్త్రములను నిర్మించిరి. మఱియు నో పార్వతీ? శ్లోకరూపముగ నున్న గ్రంథ మంతయును రామాయణమువలననే కలిగిన దని తెలియవలయు ననిన పార్వతీదేవి యి ట్లనియె. ఓ దేవోత్తమా! వ్యాసమునివరుఁడేనాలుగు శ్లోకములను నారదమునివరునివలనఁ దెలిసికొని మహాభాగవతమను గ్రంథమును రచించెనో యా నాలుగు శ్లోకములను పరమదయాళుఁడవై నాకుఁ దెలుపు మనినఁ బరమశివుఁ డి ట్లనియె. ఓ పార్వతీ! నీవు చక్కని ప్రశ్నము చేసితివి. నారదమునివరుఁడు చెప్పిన నాలుగు శ్లోకములను చెప్పెదను. సావధానచిత్తము కలదానవై వినుము.

“శ్లో. అహమేవాసమేవాగ్రే నాన్యత్సదసత్పరమ్,
పశ్చాదహం యదేతచ్చ యోవశిష్యేత సోస్మ్యహమ్. ౧
ఋతేర్థం యత్ప్రతీయేత నప్రతీయేత చాత్మని,
తద్విద్యాదాత్మనోమాయాం యథాభాసో యథాతమః. ౨
యథామహాంతి భూతాని భూతేషూచ్చావచేష్వను,
ప్రవిష్టాన్యప్రవిష్టాని తథా తేషు న తేష్వహమ్. ౩
ఏతావ దేవ జిజ్ఞాస్యం తత్త్వజిజ్ఞాసునాత్మనః,
అన్వయవ్యతిరేకాభ్యాం య త్స్యాత్సర్వత్ర సర్వదా.” ౪

అను శ్లోకములు బ్రహ్మదేవునిచేత నారదున కుపదేశింపఁ బడియె. ఆశ్లోకములనే యిప్పుడు నీకు నేను జెప్పితిని. ఓపార్వతీ! ఈనాలుగుశ్లోకములును పావనములును మానసిక పాపములను నశింపఁజేయు శక్తియును అజ్ఞానమును నశింపఁజేయు శక్తియును అగుటచేత మానవులచేత కీర్తింపఁదగినవి. ఓపార్వతీ! ప్రసక్తానుప్రసక్తముగ నీ వడిగిన ప్రశ్నములకు తగిన సమాధానమును చెప్పితిని. ఇఁకను పూర్వ మారంభించినకథను చెప్పెదను విను మని యా పరమశివుఁడు మరల నిట్లనియె. ఓపార్వతీ! అంతటఁ గొన్ని దినములకు మునులచేత విధ్వస్తమైన రామాయణ మొకానొకచోట సప్తకాండాత్మకమై నిలిచియుండె. అయ్యది యిరువదినాలుగువేలు పరిమితి కలదై యుండె. ఆ రామాయణమును అగస్త్యాది మునివరు లనేకవిధములుగఁ జేసిరి. ఆ రామాయణములు కన్నిటికిని వాల్మీకిమునివరునిచేతఁ జేయఁబడిన రా

మాయణమే మూలకారణ మని తెలియవలయును. ఓపార్వతీ ! ఇదివఱకు నాచేతఁ జెప్పఁబడిన సారకాండము వాల్మీకిమునికృత రామాయణమునందలి సారము నెత్తి చెప్పితిని. నీవు సవిస్తారముగఁ జెప్పు మనుటచేత నేను జెప్పితిని. ఓ పార్వతీ ! శతకోటిప్రవిస్తర మగు రామాయణమును నేను అనేకవేల దివ్యసంవత్సరములకుఁ గూడ వ్యాఖ్యానమును చేయఁజాలను. కావున రామాయణ సారమును మాత్రము నీకుఁ దెలిపితిని. ఓ పార్వతీ ! నీకుఁ బ్రియము కలుగుటకొఱకు రామదాసుఁడు విష్ణుదాసునకుఁ జెప్పినవిధముగ యాత్రాకాండమును చెప్పెదను. వినుము.

ఇట్లు శ్రీమదానందరామాయణాంతర్గత యాత్రాకాండము నందలి
రెండవసర్గ ముగిసెను.

✱ యాత్రకు నేనుగూడ వచ్చెద నని సీత రాముని ప్రార్థించుట. ✱

అట్లు పరమశివుఁడు చెప్పినవాక్యమును విని పార్వతి యిట్లనియె. ఓ దేవోత్తమా ! రామదాస విష్ణుదాసు లనువా రెవ్వరు ? ఆరామదాసుఁడు విష్ణుదాసున కేవిధముగఁ జెప్పెను. ఆవిషయమును సర్వమును తెలియఁజెప్పు మనిన పరమేశ్వరుఁ డిట్లనియె. ఓ పార్వతీ ! భారత వర్షాంతర్గత దండకారణ్యమునందుఁ గోదానాభము లను క్షేత్రములు రెండు కలవు. అక్కడ ఇంకమీఁద నృసింహుఁ డను మునివరుఁడు పుట్టఁగలఁడు. అమ్మునివరునకు రామనామము కల పుత్రుఁడు పుట్టును. అతనికి విష్ణు వనుశిష్యుఁడు కలుగును. ఆ గురుశిష్యు లిరువురును రామసేవాతత్పరులై దినదినమందును రాముని సేవించుచుందురు. ఆయిరువురును విశేషముగ రాముని సేవించుటవలన రామదాస విష్ణుదాసు లను నామధేయము కలవారైరి. అంతట వా రిరువురును తీర్థయాత్రలను సేవించుచుండఁగ రామదాసునవాఁ డొకనాఁడు పితృశ్రాద్ధమును గయాక్షేత్రమునందు మిక్కిలి శ్రద్ధతో నెరవేర్చె. అనంతరమందు భూలోకమునందలి సకల తీర్థములను సేవించిరి. అంతట నొక్కనాఁడు రామదాసు చెప్పుచున్న సారకాండమును విని విష్ణుదాసుఁ డిట్లనియె. ఓ గురూత్తమా ! నీవలన రామాయణమునందలి సారకాండమును వింటిని. ఇంతవఱకు విన్నకథయందు సీతారాములు సౌఖ్యమును పొందినట్లు చెప్పఁబడియుండలేదు. మఱియు నోగురూత్తమా ! రాముని రాజ్యవిస్తారముకూడ చెప్పఁబడలేదు. రాముని సంతానవృత్తాంతమునుకూడ చెప్పలేదు. కావున నోగురూత్తమా ! రామునివృత్తాంతమును సర్వమును చెప్పి నన్నుఁ గృతార్థునిగాఁ జేయు మనిన రామదాసుఁ డిట్లనియె. ఓ వత్సా ! రామచంద్రుని కథావృత్తాంతమును చెప్పుమని చక్కఁగ నడిగితివి. కావున రామునివృత్తాంతమును సర్వమును వివరించి చెప్పెదను. నీవు సావధానమనస్కుఁడ వై వినుము. నేను బూర్వమునందు విన్నవిధముగ సర్వమును చెప్పెదను. ఓ శిష్యోత్తమా ! శ్రీరాముఁడు రావణుని సంహరించి లోక

మును నిష్కంటకముగఁ జేసి యయోధ్యాపట్టణమునందుఁ బ్రవేశించి చక్కఁగ రాజ్యమును పాలించె. రాముఁడు రాజ్యమును పాలించుచున్న కాలమునందు దుర్భిక్షబాధ, చోరబాధ, అపమృత్యుభయము, ఈతిబాధలు మొదలగునవి యేవియును లేవు. మఱియు లోకములో నెవ్వరును దారిద్ర్యమును భయమును విచారమును వ్యాధులను అనుభవింపకయుండిరి. మఱియు నో శిష్యోత్తమా! భిక్షార్థియును దుర్వృత్తికలవాఁడును పాపాత్ముఁడును నిష్ఠురుఁడును అగువాఁ డెవ్వఁడును లేఁడు. మఱియును, రాముఁడు రాజ్యమును పాలించుచుండఁగా క్రోధముకలవాఁడును కృతఘ్నుఁడును అగువాఁ డెవ్వఁడును లేఁడు. ఓ శిష్యోత్తమా! సీతామహాదేవి యొకనాఁడు సిగ్గుగలదయ్యును, ఏకాంతమునందు శ్రీరామునితో నిట్లనియె. ఆసమయమునందు సీతామహాదేవి నవ్వుచున్న మోము కలదియును, సుందరమైన నాసిక కలదియును, మనోహరము లయిన యాభరణములచేత నలంకరింపఁ బడినదియును, చామరము నగ్రహస్తమునందుఁ గలదియును, వినయముచేత వంపఁబడిన మోముకలదియును నై యుండి యిట్లనియె. పద్మపత్రములవంటి నేత్రములు కలవాఁడవును, రావణునకు శత్రుఁడవును నాయిన యోరాముఁడా! నే నొక్కవిషయమును విన్నపముచేయఁ దలఁచియున్నాను. ఆజ్ఞనిమ్ము. విన్నపమును చెప్పెదను. నేను ధర్మమూలమైన వచనమునే చెప్పెదననిన విని శ్రీరాముఁడిట్లనియె. పద్మపత్రములవంటి నేత్రములు కలదానవును నాకు ప్రాణప్రియురాలవును, అయిన యోసీతా! నీమనస్సునం దున్న యభిప్రాయమును తెలుపుము. నీయభిప్రాయము నెరవేర్చెద నని శ్రీరాముఁడు సన్మానరూపముగఁ జెప్పినట్టి వచనములను విని సంతోషముకలదై యిట్లనియె. ఓ రఘుకులోత్తమా! నీవు పూర్వము పితృవచనానుసారముగ దండకారణ్యమునకు నన్నును లక్ష్మణుని వెంటఁబెట్టుకొని బయలు వెడలితివి. అట్లు మనమందఱమును బయలు వెడలి పోవునపుడు శృంగిబేరపురమునకుఁ బోయి మనమందఱమును నోడనెక్కి పోవుచున్న కాలమునందు నేనొక్కవిషయమును సంకల్పించితిని. ఆవిషయమును చెప్పెదను సావధానచిత్తము కలవాఁడవై వినుము. ఓ గంగాదేవీ! నేను వనవాసమును గడపి మరల రామలక్ష్మణులతోఁగూడ వచ్చితినేని నిన్నుఁ బూజించెదను. నీకు నానావిధబలులను సమర్పించెదను. అని చెప్పితిని. కావున నాయభీష్టమును నెరవేర్చుటకుఁ బ్రార్థించెదను. నేను పదునాల్గవ సంవత్సరమునందు దండకారణ్యమునుండి మరల వచ్చునపుడు బంధువులను జూడవలయు ననియెడు తలంపు అధికముగఁ గలిగియుండుటచేత ఆవిషయమును మఱచితిని. ఇప్పుడు నా కావిషయము జ్ఞప్తికివచ్చినది. కావున నాయభీష్టమును నెరవేర్పు మన విని శ్రీరాముడు నవ్వుచు సీతాదేవిని కౌఁగిలించుకొని యిట్లనియె. ఓ సీతా! నీ విట్లు చమత్కారముగ మాటలాడుట కెట్లు నేర్చితివి. ఇట్లు మాటలాడుట నీచాతుర్యము కాదనియును, గంగామాహాత్మ్య మని

యమును తలంచుచున్నాను. ఓ సీతా! నీయభిప్రాయమును నెరవేర్చుటకు రేపు బయలు వెడలెదను. నీవు ఏప్రదేశమునందు గంగను పూజింపఁదలఁచితివో చెప్పుము. అట్లయినయెడల నాప్రదేశమునందు నివసించుటకును స్నానపానాదులను చేయుటకును తగినవిధముగ రేవునుకట్టించెదను. అనవిని సీతామహాదేవి యిట్లనియె. ఓరఘుకులోత్తమా! ఎక్కడ గంగా సరయూ సంగమ మయ్యెనో యక్కడఁ బూజింపవలయు నని తలంపు కలిగియున్నది. గంగోత్తరభూమికిఁ బోవలయు నని నాకభీష్టము కలిగియున్నదని సీతామహాదేవి చెప్పినవాక్యమును విని శ్రీరాముఁ డంగీకారమును పొందిసీతామహాదేవి కనఁబడకుండునట్లు వస్త్రములచేత నాచ్ఛాదించి ద్వారపాలకున కిట్లనియె. ఓరీ! ద్వారపాలకా! నాయాజ్ఞానుసారముగనీవు శీఘ్రముగఁబోయి నేనుజెప్పితి నని లక్ష్మణునితోఁ జెప్పుము. సరయూనది గంగయందుఁ గలిసినచోట గంగను పూజింపవలయు నని సీతకును నాకును తలంపు కలిగియున్నది. కావున రేపు పోవలసియున్నది. తల్లులు మంత్రులు సేనలు మిత్రులు భరతుఁడు మొదలగువారిని వెంటఁబెట్టుకొని బయలు వెడలఁదలంచితిని. కావున సేనలు మొదలగువారిని తగినవిధముగ సన్నద్ధమును చేయవలయు నని శ్రీరాముఁడు చెప్పఁగా యాద్వారపాలకుఁడు విని వల్లెయని బయలువెడలి పోయె. పోయి యావృత్తాంతమును సర్వమును లక్ష్మణునకుఁ జెప్పె. ఆవృత్తాంతమును విని యువరాజ్యపదమునందున్న లక్ష్మణుఁడు సభయందు మంత్రులతోఁ గూడుకొనినవాఁడై దూతనుపిలిచి యిట్లనియె. ఓరీ ద్వారపాలకా! శ్రీరామునివాక్యమున కంగీకారమునుపొందితి నని చెప్పుమనియె. అంతట నా రామదూత పోయి యావృత్తాంతమును సర్వమును శ్రీరామున కెఱిఁగించె. అంత నిఁట లక్ష్మణుఁడు బంగారపు బెత్తమును ధరించినవారును కంచుకోష్ణీషములను ధరించినవారును అయినదూతలను పిలిచి మీరు త్వరకలవారై పొండు. పోయి యీవృత్తాంతమును సర్వమును నగరములోనివారి కందఱకును తెలుపుఁడనియె. అంతట నాదూత లందఱును మిగుల వేగముగ బయలువెడలిపోయి యావృత్తాంతమును ఉచ్చైస్స్వరముతో నగరములోనివారి కందఱకును తెలిపిరి. మఱియును, సీతారాములు సకల జనులను వెంటఁబెట్టుకొనిపోవుదురని యెల్లవారికి తెలిపి మరల లక్ష్మణునిదగ్గరకుఁ బోయి యావృత్తాంతమును సర్వమును తెలిపిరి. అంతట లక్ష్మణుఁడు వడ్లంగిపనినిచేయువారును, ఇటుకలనుచేయువారును, కూలిపనులుచేయువారును, లోహకారులును చర్మకారులును భిత్తికర్మములయందును నిపుణులగువారును, క్రయవిక్రయకర్తలును, రజ్జుకుద్దాలములను ధరించినవారును మొదలగువారిని బిలిపించి వారినందఱిని వస్త్రాభరణాదులచేత సంతోషింపఁజేసి సీతారాముల యభిప్రాయమును సర్వమును తెలిపి యనంతరమం పట్లనియె. ఓ మానవోత్తములారా! మార్గమునందు ఱాళ్లు మొదలగునవి లేకయుండునట్లు చేయుఁడు. ఎచ్చటగ్గులు

కలిగియుండు భూమిని సమముగఁ జేయవలయును. మార్గమధ్యమునందు కష్టమును కలుగఁజేయునట్టి పర్వతములు వృక్షములు మొదలగువానిని ఛేదింపవలయును. మఱియు నో మానవోత్తములారా! మార్గమధ్యమునందున్న దిగుడుబావులు కూపములు తటాకములు మొదలగువానిని శోధింపవలయును. మఱియు నుదకము లేనిచోట నుదకముకలుగునట్లు చేయవలయును. మార్గమునం దక్కడక్కడ సేనానివేశస్థానముల నేర్పరుపవలయును. పుష్పములచేత నిండియుండునట్టి యుద్యానవనములను నిర్మింపవలయును. మఱియును అక్కడక్కడ పాకశాలలును ప్రాయ్యులు మొదలగునవి యుండునట్లు చేయవలయును. మఱియు ననేకములగు పటమందిరములను తృణమందిరములను నిర్మింపవలయును. మఱియు ననేకములగు చిత్రగృహములను నిర్మింపవలయును. మఱియు ననేకవిధములగు పుష్పవాటికలను నిర్మింపవలయును. ప్రతిమార్గమునందలి గోడలయందును అనేకములగు చిత్రములను వినోదార్థముగ రచింపవలయును. అనేకవిధములగు పుష్పవృక్షములను మృత్పాత్రలయందుంబెట్టి మనోహరములుగ నుండునట్లు చేయవలయును. సేనానివేశస్థానములయందు చతురంగబలములును నివసించుటకుఁ దగిన గృహములను నిర్మింపవలయును. ప్రతిస్థలమునందును గాయకశాలలను నిర్మింపవలయును. మార్గమునం దంతటను సుగంధద్రవ్యసేచనమును చేయవలయును. మఱియు నానావిధములగు పటమందిరములు నేమిరేఖను పోలియుండునట్లు చేయవలయును. ఏనుఁగులు రథములు తురగములు అనువానిని నానావిధాలంకారములచేత నలంకరింపవలయును. మఱియును, బండ్లయందును ఒంటెలయందును ఏనుఁగులయందును రథాదులయందును ఫిరంగులు పరిఘలు బాణములు శక్తులు కార్ముకములు మొదలగువానిని సంఖ్యేయములుగ స్థాపింపవలయును. మఱియు నానావిధములగు ధ్వజములను స్థాపింపవలయును. మఱియును, రాముని రథములయందు నానావిధములగు పతాకాదులను స్థాపింపవలయును. మఱియును, రాముఁడు కూర్చుండుటకు గజపృష్ఠమునందు చిత్రపటములు మొదలగువానితో నాసనమును గల్పింపవలయును. ఆయాసనమును నానావిధములగు రత్నములచేత నలంకరింపవలయును. సీతామహాదేవి కూర్చుండుకొఱకు కరిణీపృష్ఠమునందు నీలవర్ణముకల మహాసనమును నిర్మింపవలయును. ఆ యాసనము బంగారము వైడూర్యము మొదలగువానిచేత నలంకరింపఁబడి యుండవలయును. మిగుల శ్రేష్ఠమైన హేమకుంభమునుగూడ సిద్ధముగా నుంచవలయును. మఱియు నో మానవోత్తమా! పావనములగు తోరణములు మొదలగువానిని సిద్ధము చేయవలయును. వారస్త్రీలు నృత్యములను చేయునట్లును వందిమాగధులు స్తోత్రపాఠములను చేయునట్లును చేయవలయును. మఱియును, ద్రవ్యములు వస్త్రాభరణములు పూజాద్రవ్యములు గోరసము మొదలగువానిని దివ్యములగు పాత్రలయందు సిద్ధముగా నుంచవలయును. మఱియు నో మానవోత్తములారా! నేను చెప్పకపో

యిన మార్గమునం దుపయోగించునట్టి వస్తువులను సిద్ధముగఁ జేయవలయునని లక్ష్మణుఁ డాజ్ఞాపించి మంత్రులతోఁగూడ సాయం సంధ్యాదికమును నెరవేర్చుకొను టకు గృహమునకుఁ బోయె. అంతట నా భటులందఱును లక్ష్మణాజ్ఞానుసారముగ రామునకు సంతోషమును గలిగించుటకొఱకు సర్వమును నెరవేర్చిరి. అంత న క్కడ శ్రీరాముఁడు రత్నములచేత నిర్మింపఁబడిన గృహమునందలి పుష్పశయ్యయం దు సీతామహాదేవిని కౌఁగిలించుకొని పరుండి సువర్ణకటకాదులను ధరించినదాసీజ నము వింజామరలచేత వీచుచుండఁగ నారాత్రియంతయును సుఖముగ నిద్రించె.

ఇట్లు యాత్రాకాండమునందలి మూఁడవసర్గ ముగిసెను.

✱ రాముఁడు గంగానదికిఁ బయనమై పోవుట. ✱

అట్లు శిష్యుఁ డగు విష్ణుదాసునకు సీతాప్రార్థనావృత్తాంతమును దెలిపినపి మ్మట రామదాసునిట్లనియె. ఓశిష్యోత్తమా! మఱుదిన ప్రాతఃకాలమునకు ముందుగ వందిమాగధులయొక్క స్తోత్రపాఠములచేత సీతారాములు మేల్కాంచి కాలోచిత కృత్యములను దీర్చికొనిరి. అంతట రాముఁడు నిత్యకర్మానుష్ఠానమును నెరవేర్చి సక లదానములను చేసి జ్యోతిశ్శాస్త్రవేత్తయగు గోపాలుఁడను బ్రాహ్మణోత్తముని రప్పించి నమస్కరించి శాస్త్రోక్తవిధానములుగఁ బూజించి యిట్లనియె. విపుల మైన బుద్ధికలవాఁడవును బ్రాహ్మణోత్తముఁడవును అయిన యో గోపాలుఁడా! నేను గంగాతీరమునకుఁ బోయి రావలయు నని తలంచు చున్నాఁడను. కావున చక్కగ మేలగు ముహూర్తమును నిర్ణయించి చెప్పుమనియె. అంతట నాగోపా లుఁడు పంచాంగపటమును విప్పి బలాబలమును విచారించి యిట్లనియె. పద్మపత్ర ములవంటి నేత్రములు కల యోరాముఁడా! ఈదినమునందలి పూర్వయామము నందు సర్వోత్తమమైన ముహూర్తము కలిగియున్నది. ఈముహూర్తము పుష్య మీనక్షత్రములోఁ గూడుకొనియున్నది. కావున ఈముహూర్తఫలమును చెప్పె దను సావధానమనస్కుఁడవై వినుము. మఱియు నిందలి మునులందఱును నేను జెప్పునట్టి ఫలవచనములను వినవలయును. పుష్యమీనక్షత్రము సర్వకార్యములను సఫలములుగఁ జేయును. కావున నీనక్షత్రమునందు సీతామహాదేవితోఁగూడ ప్రయాణమును చేయుమనిన విని శ్రీరాముఁడు లక్ష్మణునితో నిట్లనియె. ఓ లక్ష్మ ణా! సేనలకు ప్రయాణకాలము తెలియుటకొఱకు భేరీమృదంగపణవకాహళానక గోముఖాది వాద్యములను బ్రయోగింపవలయు ననియె. ఆవచనమును లక్ష్మణుఁడు విని బయలువెడలిపోయి యావిధముగఁ జేయించె. అంతట బ్రాహ్మణులతోడను వసిష్ఠుఁ డను పురోహితునితోడను కూడుకొనినవాఁడై ఘృతశ్రాద్ధమును చేసి గణే శాదులను పూజించె. అనంతరమందు వసిష్ఠునితో నిట్లనియె. ఓ మునివర్యా! అగ్నిహోత్రములను పుష్పకవిమానమునం దుంచితిని. కావున నేను అగ్నిహోత్ర

ములతోఁగూడ బయలు వెడలవలసియున్నది. కావున నో మునికులోత్తమా! బంధువులతోడను పట్టణవాసులతోడను విమానము నధిష్ఠించి బయలు వెడలుదము. ఓ మునివర్యా! సీత యరణితోఁగూడ కరిణి నధిష్ఠించి బయలు వెడలుట యుచితము. గజారూఢుఁడనైన నాయంగమును సీత స్పృశించుట యుచితముగాదని చెప్పి సీతతో నిట్లనియె. ఓ సీతా! నీ వేయానము నధిష్ఠించి యున్నావో నీయభిప్రాయమును తెలియఁజేయుమనిన విని సీతామహాదేవి క్షణమాత్రము హృదయమునం దాలోచించి మిగుల సంతోషముకలదై యి ట్లనియె. ఓ రఘుకులోత్తమా! నాకు ఆసుది యగు నేనుగునెక్కి రావలయు నని తలంపు కలిగియున్నదనిన విని శ్రీరాముఁడు లక్ష్మణున కావిధముగానే యాజ్ఞాపించె. అనంతరమందు సీతకును తల్లులకును దివ్యవస్త్రముల నొసంగె. అనంతరమందు గుర్వాదుల కందఱకును దివ్యవస్త్రముల నొసంగె. పిమ్మట బంధువులు మొదలగు వారి కందఱకును దివ్యవస్త్రముల నిచ్చి తానును వస్త్రములను గ్రహించె. అంతట ననేకవిధము లగు వస్త్రములను ధరించి సీతను బయలు వెడలుటకు త్వరపఱిచి తల్లులు గురువులు మొదలగువారలకు నమస్కారమును చేసి మంత్రులు మొదలగువారితోఁగూడ శిబికనెక్కి సభలోనికిఁ బోయె. పోయి సింహాసనమునందుఁ గూర్చుండి లక్ష్మణునితో నిట్లనియె. ఓ లక్ష్మణా! ప్రయాణసూచకము లగు వాద్యఘోషములను చేయింపుమనియె. అంతట లక్ష్మణుఁ డావిధముగానే యాజ్ఞాపించె. పిమ్మట శ్రీరాముఁడు లక్ష్మణునితో మరల నిట్లనియె. ఓ లక్ష్మణుఁడా! ఈ యయోధ్యాపట్టణమును గాపాడుటకొఱకు సుమంత్రుఁ డను మంత్రిపుంగవుని నియమింపుము. మఱియు నో లక్ష్మణుఁడా! భరతుఁడు ముందుగఁబోవునట్లును శత్రుఘ్నుఁడు వెనుకవచ్చునట్లును చేయుము. ఓ లక్ష్మణా! నీవు నా వెంట నంటిరమ్ము. మఱియు నో లక్ష్మణా! సీతోర్మిళా మాండవీ శ్రుతకీర్తులు క్రమముగ నొకరివెంట నొకరు వచ్చునట్లును వారి వెనుక పురస్త్రీలును వారికి వెనుక తల్లులును వచ్చునట్లును చేయుమనియె. అంతట లక్ష్మణుఁడు వల్లెయని యెల్లవారలను తగినవిధముగఁ బయనము చేయించె. ఆసమయమునందు సుమంత్రుఁడను మంత్రిపుంగవుని జూచి తగినవిధముగ సల్లాపమును చేసి వస్త్రముల నిచ్చి దివ్యపట్టణమును అతని యధీనమునం దుంచె. అంతట సుముహూర్తకాలము వచ్చుటచేత శ్రీరాముఁడు లక్ష్మణునియొక్క హస్తమును పట్టుకొని సింహాసనమునుండి లేచి మత్తగజముదగ్గరకుఁ బోయి యాగజమునకు ప్రదక్షిణమును చేసి సోపానములమీఁదుగ నాగజము నధిష్ఠించె. ఆసమయమునందు సకలవాద్యములును మ్రోగె. వారస్త్రీలందఱును నృత్యములను సల్పిరి. ఏనుఁగులమీఁదను గుఱ్ఱములమీఁదను నివసించిన వాద్యగాండ్రు వాద్యములను మ్రోగించిరి. మఱియు నాసమయమున సకలస్థలములయందును జయశబ్దము లతిశయించె. బ్రాహ్మణులందఱును సుస్వరములతో వేదఘోషములను చేసిరి. ఛత్రము

ను ధరించువారు ఛత్రమును ధరించె. విజయుఁ డనువాఁడు పార్శ్వమునందుండి వింజామరమును వైచె. మఱియొక్కఁడు మఱియొకవైపున వింజామరమును వైచె. మఱియును దివ్యకలశములతోఁగూడుకొనిన ఛత్రము శోభిల్లుచుండె. ఆరామునకు పృష్ఠభాగమునందు లక్ష్మణుఁడు గజారూఢుఁడై బయలువెడలె. అనంతరమందు సీతాదులు బయలువెడలిరి. ఆసమయమునందు పురస్త్రీలు మొదలగువారందఱును పుష్పకవిమానమునందుండి గవాక్షములద్వారా ప్రయాణకౌతుకమును చూచుచు బయలువెడలిరి. అనంతరమందు తురగములమీఁదను ఏనుఁగులమీఁదను అధిష్ఠించినవారందఱును రామపార్శ్వమునందుఁ బోవుచుండిరి. మఱియు నెల్లవారును తమతమ వాహనములమీఁద నుండి శ్రీరామునకు నమస్కారములను చేయుచుండఁగా శ్రీరాముఁడు వారి నమస్కారముల నభినందించునట్లు పద్మహస్తములతోఁ దెలుపుచుండె. ఈవిధముగా రాజశ్రేష్ఠుఁ డైన రాముఁడు మెల్లగ మార్గమునఁ బోవుచున్నసమయమునందు నటులు గజముమీఁదఁ గూర్చుండి వీణాగానమును చేయుచుండిరి. అట్లు గానమునుచేయుచుండఁగా రాముఁడు వినియును, పుష్పారామాది కౌతుకమును చూచియును, సంతోషమును పొందె. మఱియును నానావిధములగు వేశ్యాస్త్రీలనృత్యమును చేయుచుండె. మఱియును మిగుల మనోహరములగు వాద్యఘోషములను వినుచుండె. ఇవ్విధముగ నానావిధములగు వినోదములచేత నానందించుచు చతురంగసైన్యముతోఁగూడఁ బోవుచుండె. అట్లు కొంతదూరముపోయి సేనాదులు నివసించుటకుఁ దగిన స్థలమును చూచి యాప్రదేశము అయోధ్యాపట్టణమును పోలియున్నదని తలఁచె. అట్లు తలఁచి శ్రీరాముఁడు గజమునుండి దిగి పౌరులచేతఁ జేయఁబడుచున్న నమస్కారములను గ్రహించుచు లక్ష్మణుని హస్తమును పట్టుకొని పటమందిరంబునందుఁ బ్రవేశించె. అట్లు పటమందిరమునందుఁ బ్రవేశించి సింహాసనమునందుఁ గూర్చుండె. ఆసమయమునందు సీతాదులుకూడ తమవాహనములనుండి దిగి పటమందిరమునందుఁ బ్రవేశించిరి. అంతట శ్రీరాముఁడు లక్ష్మణునితో నిట్లనియె. ఓ లక్ష్మణా! క్రోసెడు క్రోసెడు దూరమున నూరేసిమంది దూతలను నియమించుము. మఱియును, యోజనదూరమున కవ్వల నెనిమిది దిక్కులయందును అనేక నూరుల గుఱ్ఱపురౌతులను నియమింపు మనియె. ఆవచనములను విని లక్ష్మణుఁడు మీయాజ్ఞానుసారముగఁ జేసెద నని చెప్పి యావిధముగానే చేసె. అనంతరమందు శ్రీరాముఁడు శాస్త్రోక్తవిధి నతిక్రమింపక బ్రాహ్మణాదులతోఁగూడ మృష్టాన్నమును భుజించె. అనంతరమందు బ్రాహ్మణులకు తాంబూల దక్షిణాదుల నొసంగి మరల సింహాసనమునందుఁ గూర్చుండె. పిమ్మట వేదశాస్త్రపురాణాదుల యర్థమును వినుచుండె. అంతలోపల సాయంకాలమగుటచేత సాయంసంధ్యావందనాదికమును చేసి హోమమును విధ్యుక్తప్రకారముగఁ జేసె. అనంతరమందు సింహాసనమునందుఁ గూ

ర్చుండి వేశ్యాస్త్రీలయొక్క శ్రేష్ఠమైన నాట్యమును చూచుచు గానమును వినుచు రాత్రియందు రెండుయామములను గడపె. పిమ్మట సీతామహాదేవితోఁగూడ పుష్పశయ్యయందుఁ బరుండె. మరుదిన ప్రాతఃకాలమునకు ముందుగ మేలుకొని పూర్వదినమునందువలె సర్వకార్యములను నెరవేర్చె. ఇవ్విధముగ రెండు మూడు దినములు పయనమును చేసె. ఇట్లు సీతామహాదేవికి సంతోషమును కల్పించుచు మాసము దినములు పయనమును చేసి యొకదినము ముద్గలుని చేత విడిచిపెట్టబడినదియును జీర్ణమైనదియును నగు నరణ్యమును చూచె. అట్లు శ్రీరాముఁడు తనజీర్ణాశ్రమమునకు వచ్చుటను విని గంగానదికి దక్షిణదేశమునం దాశ్రమమును గల్పించుకొనియున్న ముద్గలమునివరుఁడు మిగుల వేగముగ వచ్చె. అట్లు వచ్చిన మునివరుని చూచి శ్రీరాముఁడు నమస్కరించి షోడశోపచారములఁ బూజించి పటమందిరములోనికిఁ దీసికొనిపోయి వినయముగ నిట్లనియె. ఓమునికులోత్తమా! నీ వీయాశ్రమమును విడిచిపెట్టుటకుఁ గారణమేమి? మహానుభావుఁడవైన యోమునివర్యా! వాస్తవమును చెప్పుమనిన ముద్గలమునివరుఁ డిట్లనియె. ఓరఘుకులోత్తమా! వనవాసమునుండి మరలివచ్చిన నిన్నుఁ జూచుటచేత ధన్యుఁడనైతిని. ఓ రఘుకులోత్తమా! పూర్వము భరతుని ప్రాణములను గాపాడుటకొఱకు నీవు దివ్యౌషధములకు వత్తువనుతలంపుతో నిక్కడ నాశ్రమమును కల్పించుకొంటిని. అందువలన నిప్పుడు నిన్నుఁ జూడఁగలిగితిని. ఈయాశ్రమమునకు సమీపముగఁ గంగాసరయువులలో నొక్కటియును ప్రవహించుటలేదు. కావున నీయాశ్రమమును విడిచిపెట్టితిని. ఈయాశ్రమమునందు పూర్వమనేకమంది మునివరులు తపస్సును చేసి సిద్ధినిపొందిరి. నేనును ఈయాశ్రమమునందే తపస్సిద్ధిని పొందితిని. అయినను పుణ్యనదులు సమీపమునందు లేమిం జేసి యీయాశ్రమమును విడిచిపెట్టితిని. ఓరఘుకులోత్తమా! నే నీయాశ్రమమును విడిచిపెట్టుటకుఁ దగినకారణమును చెప్పితిని. ఇంకను నడుగఁదగిన విషయము లుండెనేని యడిగినయెడల చెప్పుటకు సిద్ధముగనున్నాఁడ ననిన విని శ్రీరాముఁడు మరల నిట్లనియె. ఓమునివర్యా! ఇక్కడ నేవిధముగఁ జేసినయెడల నీకు నివసింపఁదగునో చెప్పుమనిన నమ్మునివరుఁ డిట్లనియె. ఓ రఘుకులోత్తమా! సరయూగంగాసంగమ మిక్కడ నైనయెడల నీయాశ్రమమునం దుండెద ననిన విని శ్రీరాముఁడు మరల నిట్లనియె. ఓ మునికులోత్తమా! సరయూనది భూలోకమున కేమినిమిత్తముగ వచ్చినదో తెలుపుమనిన విని ముద్గల మునివరుఁ డిట్లనియె. ఓ రఘుకులోత్తమా! నీవు సర్వమును తెలిసినవాఁడవయ్యును నావలన విని నన్నుఁ దరింపఁజేయఁదలఁచితివి కనుక నేనెఱిగినంతవఱకుఁ జెప్పెదను. ఓ రఘుకులోత్తమా! పూర్వము శంఖుఁడను నొకమహారాక్షసుఁడు దేవతల నపహరించి వారలనందఱను సముద్రమునందు విసరివైచి తానాసముద్రమునందుఁ బడియుండె. అప్పుడు నీ వా

దేవతలను గాపాడుటకొఱకును రాక్షసుని సంహరించుటకొఱకును మత్స్యావతారము నవలంబించితివి. ఆసమయమునందు నీకన్నులనుండి యుదకబిందువులు బయలువెడలె. ఆకన్నీరు హిమాలయమునందుఁబడి యక్కడనుండి నదీరూపముగ బయలువెడలి యా ప్రవాహము మానస సరస్సునందుఁ బడియె. ఆసమయమునందు రఘువంశమునకు మొదటివాఁ డగు వైవస్వతమనువు యజ్ఞమును చేయఁదలఁచి నిజగురువుతో ని ట్లనియె. ఓ గురూత్తమా! సౌఖ్యముగ నివసించుట కీయయోధ్యాపట్టణమును నిర్మించితిని. నీ కభీష్టమైయున్న యెడల నీపట్టణమునందు యజ్ఞమును చేసెదనని నమ్మునివరుఁ డి ట్లనియె. ఓ రాజోత్తమా! ఈపట్టణమునందు శ్రేష్ఠమైన తీర్థ మేదియును లేదు. కావున నిక్కడ యజ్ఞమునుచేయుట యుచితము గనుండలేదు. నీ కీపట్టణమునందే యజ్ఞమును చేయవలయు ననియెడుతలంపు కలిగి యున్న యెడల నిక్కడకు ముందుగ రమ్యమును పావనమునుఅగు నదినిరప్పింపుము ఆనది మానస సరోవరమునుండి వచ్చిన యెడల పావనమైనదై యుండుననియె. ఆవచనమును విని వైవస్వతుఁడు మిగుల గొప్పదగు ధనస్సునందు బాణమును సంధించి ప్రయోగించె. అంతట నాబాణముపోయి మానస సరస్సును బ్రద్దలుసేసి దానినుండి బయలు వెడలి ప్రవాహమును అయోధ్యాపట్టణముమీదుగఁ దీసికొని వచ్చె. మఱియు నో రఘుకులోత్తమా! ఆనది శరమార్గానుసారముగ నయోధ్యాపట్టణముమీదుగవచ్చి గంగయందు సముద్రమునకు పూర్వభాగమున సంగతమయ్యె. ఆనది బాణముచేతఁ దీసికొనిరాఁబడినది కనుక శరయూ యనునామధేయము కలదయ్యె. మఱికొందఱు సరోవరము వలనఁ బుట్టినది కనుక సరయూ యని చెప్పఁబడుచున్నదనిరి. ఓ రామచంద్రా! పిమ్మటఁ గొన్ని దినములకు మీవంశమునందలి సగరుని పుత్రులందఱును కపిలమహామునియొక్క క్రోధాగ్నిచేత దగ్ధమై దుర్గతిం బొందిరి. అంతట వారలను దరింపఁజేయుటకొఱకు నీపాదపద్మములవలనఁ బుట్టిన గంగానదిని భగీరథమహారాజు తీసికొనివచ్చె. ఆభగీరథుఁడు శివానుగ్రహమును పొంది యాగంగానదిని భూలోకమునకు వచ్చునపు డీసరయూ నదిసోయి దానియందు మిళితమయ్యె. పరమశివుని వరమువలన గంగానది యధిక ప్రసిద్ధిని పొందె. నీపాదపద్మములవలనఁ బుట్టిన యీగంగానది సకలలోకములను పవిత్రముగఁ జేయునట్టిది యైయున్నది. ఈసరయూనది నీనేత్రములవలనఁ బుట్టి లోకములను పవిత్రములయినవానినిగాఁ జేయుచున్నది. ఓ రఘుకులోత్తమా! ఈసరయూనదియొక్క మాహాత్మ్యమును అనేకకోట్ల సంవత్సరములకుఁగూడఁ జెప్పఁజాల నని యామునివరుఁడు చెప్పినవాక్యములను విని యాశ్రీరాముఁడు లక్ష్మణునితో ని ట్లనియె. ఓ లక్ష్మణా! బాణమును ప్రయోగించి సరయూనదిని ఇచ్చోటునకుఁ దీసికొనిరమ్ము? అనినవిని లక్ష్మణుఁడు రామాజ్ఞానుసారముగ బాణమును ప్రయోగించి సరయూతటమును బ్రద్దలుచేసి క్షణములో పల సరయూనది నచ్చోటునకుఁ దెచ్చె.

అంతట నాసరయూనది రెండుభాగములగుటచేత నూతనముగవచ్చినభాగము ముగ్గ లాశ్రమముమీఁదుగఁ బ్రవహించె. అట్లు ప్రవహించుచుఁ బోయి గంగయందు సంగతమయ్యె. ఆసమయమునందు శ్రీరాముఁ డిట్లనియె. ఓ లక్ష్మణా! ఇక్కడ నుండి నీ వీనదిని బ్రద్దలుచేసి తెప్పించితి. కనుక ఈనదికి దద్రి యనునామధేయము కలదగును. మఱియు నో లక్ష్మణుఁడా! ఈనది భూమధ్యమునందు దద్రి యను నామధేయముతో మిగుల శ్రేష్ఠమైనదై యుండును. మఱియును నీ విక్కడ నివ సించుటవలన మిగుల శ్రేష్ఠమైనదై యుండు నని చెప్పి పిమ్మట సీతామహాదేవిని పిలిచి యి ట్లనియె. ఓ సీతా! చూడుము. లక్ష్మణుఁడు నానామముచేత చిహ్నిత మైనబాణమును ప్రయోగించి సరయూనదిని బ్రద్దలుచేసి యిచ్చోటునకుఁ దెచ్చె. ఓజానకీ! తల్లులు గురువులు మొదలగువారితోఁగూడ నీవు సరయూనది గంగానది యందుఁ గలసినచోటునకుఁ బోయి నీయభీష్టానుసారముగఁ బూజాదికమును చేసి రమ్ము? అనంతరమందు నూతన సరయూనది సంగమమైనచోట మన మిరువుర మును పూజితమనిన విని సీతాదేవి పూజాసంభారములను గైకొనుటకు పటమం దిరమునందుఁ బ్రవేశించె.

ఇట్లు యానందరామాయణాంతర్గత యాత్రాకాండమునందలి
నాల్గవసర్గ ముగిసెను.

✷ మునివాక్యము ననుసరించి యాత్రాగమము నిశ్చయించుట. ✷

అట్లు సీతామహాదేవి పటమందిరమునందు ప్రవేశించిన దని చెప్పిన పిమ్మట మరల రామదా సిట్లనియె. ఓ విష్ణుదాసా! జానకీదేవి పూజాసంభారము లనుగ్ర హించి కౌసల్యాదులతోఁగూడ పుష్పకవిమానము నధిష్ఠించె. పిమ్మట సరయూనది గంగతో సంగమమైనచోటునకు మిగుల వేగముగఁ బోయె. అట్లు పోవునపుడు ఆహితాగ్నియగు రామునివదలి సీమోల్లంఘనమును చేయుట యుక్తము కా దను విషయమును సీతా రాము లిరువురును దోషముగ నెంచకపోయిరి. అవ్విధముగ సీతామహాదేవి గంగా సరయూ సంగమస్థలమునకుఁ బోయి విమానమునుండి దిగి పురోహితుఁ డగువసిష్ఠ మునివరునాజ్ఞను పొంది వాయనముతోఁగూడ నారికేల ఫలమును గంగానదియందు సమర్పించి శాస్త్రోక్తప్రకారముగ స్నానమును చేసె. పిమ్మట తానుతలఁచినవిధముగ సురామాంసాదులచేత గంగానదిని పూజించె. అనంతరమందు పట్టకులాదివస్త్రములచేతను చందనములతోఁగూడిన ముక్తాహా రములచేతను దివ్యాభరణములచేతను మఱియు నానావిధము లగు వాయనముల చేతను సువాసినీ స్త్రీలను పూజించి పిమ్మట నరుంధతిదేవిని బూజించె. పిమ్మట వసిష్ఠాది బ్రాహ్మణులకు నానావిధాభరణాదులతోఁ గూడిన వాయనాదులచేతఁ బూజసేసె. అనంతరమందు పుష్పకవిమానము నెక్కి శ్రీరామునిదగ్గరకుఁ బోయె.

అప్పుడు శ్రీరాముఁడు సీతను వెంటఁబెట్టుకొని వసిష్ఠాదులతో గూడ నూతన సరయూనది గంగతో సంగమమైనచోట సీతచేసిన పూజకంటె నూరు రెట్లధికముగను శాస్త్రోక్తప్రకారముగను బూజించె. పిమ్మటననేకవేలమంది బ్రాహ్మణుల కన్నదానమును చేసె. మఱియును భూదానాద్యనేకదానముల నొసంగె. అనంతరమందు శ్రీరాముఁడు సీతాది బంధుజనులతోఁగూడ భోజనముచేసి సింహాసనమునందుఁ గూర్చున్నవాఁడై లక్ష్మణునితో నిట్లనియె. ఓలక్ష్మణా ! ఇక్కడ తొమ్మిది దినములు నివసింపవలయు నని తలఁచి యున్నాఁడను. కావున సీమాచారులను నియమించి యీయాశ్రమమునకు సమీపముగఁ బోవువారును, ఈయాశ్రమములోనికి వచ్చువారును అగు బ్రహ్మచార్యాదులలో నెవ్వఁడును నావలనఁ బూజింపఁబడకుండఁ బోఁగూడదని తెలుపుమనియె. నాకుఁ గనఁబడకుండ నెవ్వఁడుపోయినను రామాజ్ఞానుసారముగ మమ్ముల దండించెద నని సీమాచారులకుఁ దెలుపుమనియె. ఇవ్విధముగ శ్రీరాముఁడు చెప్పినవాక్యములను విని యావిధముగానే లక్ష్మణుఁడు నియమించె. అంతట చ్యవనుఁ డనుమునివరుఁడు రాముఁడు వచ్చినవృత్తాంతమును విని రాముని చూచుటకొఱకు వచ్చి రామునిచేతఁ జక్కఁగఁ బూజింపఁబడి పటమందిరమునందుఁ దగినయాసనమునఁ గూర్చుండి యి ట్లనియె. ఓరామా ! రఘుకులోత్తమా ! గంగానదియొక్క దక్షిణతీరమునందలి కీకటదేశమునందు నాయాశ్రమము కలదు. ఆయాశ్రమమునందలి కందమూలఫలాదులకు మాగధులు విఘ్నమును చేయుచున్నారు. కావున రామదూతల నక్కడఁ గావలియుంచునట్లు ప్రార్థించెద ననిన విని శ్రీరాముఁడు ధనుస్సును సంధానముచేసి బాణమును ప్రయోగించి యాయాశ్రమమునకుఁ జుట్టునొక్క రేఖనుగీసి దుష్టులీరేఖను దాటి రాఁజాలఁ డనియె. మఱియు నారాముఁడు రేఖనుగీసినచోట రామబాణరేఖ యనుపట్టణమయ్యె. మఱియు నక్కడ రామరేఖ యనుపేరు కల నదికూడ నుద్భవిల్లె. అంతట చ్యవనుఁడధికసంతోషము కలవాఁడై యి ట్లనియె. ఓ రామా ! ఇదివఱకు కీకటదేశము నింద్యమైయుండె. అట్టిదేశమునం దిప్పుడు నీవాక్యానుసారముగ పుణ్యస్థలము లనేకములుగలుగును. కావున నాకు సుఖముకలుగునట్లు నీవు పలుకుమనిన శ్రీరాముఁ డి ట్లనియె. ఓ మునివర్యా ! కీకటదేశములయందు మిగులఁ బావనమైన గయ యనుక్షేత్రముండును. నీయాశ్రమము మిగుల పావనమైనదగు ననియె. అంతట నమ్మునివరుఁడు సంతసించి తనయాశ్రమమునకుఁ బోయె. మఱియు నక్కడ రామునిచే నిర్మింపఁబడిన యన్నసత్రమునం దనేకకోటి సంఖ్యాకబ్రాహ్మణులు భుజించుచుండిరి. అంతట కుంభోదరుఁడు మునివరుడు సీమాచారులయొక్క సమీపమునకు వచ్చిగంగాయాత్రాప్రసంగముచేత గయకుఁ బోఁదలఁచియుండె. ఆబ్రాహ్మణోత్తముఁడు ప్రయాగనుండి వచ్చుచుండె. అంతట రామదూతలతో నాబ్రాహ్మణోత్తముఁ డిట్లనియె. ఓదూతలారా ! మీర లెవ్వరు. ఎవ్వనియాజ్ఞచే మీ రిక్కడ నివసించితిరి. ఆకాశము

వఱకునువ్యాపించిన యీధ్వజము లెవ్వనివి. మఱియు ననేకములగు పతాకములు కనఁబడుచున్నవి. మఱియును జయధ్వనులు వినఁబడుచున్నవి. ఇవియన్నియును నెవ్వనికి సంబంధించినవి. ఈవిషయమును సర్వమును తెలుపుఁడనిన రామదూత లిట్లనిరి. ఓమునికులోత్తమా ! పద్మపత్రములవంటి నేత్రములు కల శ్రీరాముఁడు అయోధ్యాపట్టణమును పాలించుచున్నాఁడు. ఆమహానుభావుఁడు యాత్రార్థముగ నిక్కడకు వచ్చియున్నాఁడు. మేము రామాజ్ఞచే నిక్కడ నివసించియున్నారము. ఇక్కడ రాముఁడు అన్నసత్రమును పెట్టియున్నాఁడు. నీవు క్షుధార్తునివలెఁ గనఁబడుచున్నావు. కావున నిక్కడ నివసించి భోజనమును చేసి కొంచెముసేపు సుఖముగఁ బరుండిపొమ్మనిన విని యాకుంభోదరమునివరుఁడు అచ్చోట నివసింపకయును, ముందు నడచి పోకయును, వెనుకకు దిరిగిపోవుచుండె. అట్లు తిరిగిపోవుచున్న మునివరునిమార్గమున కడ్డముగఁబోయి రామదూత లిట్లనిరి. ఓ మునివర్యా ! నీవు తిరిగి మునుపువచ్చినమార్గమునే అనుసరించిపోవుటకు కారణమేమి ? నీయభిప్రాయమును తెలుపుమనిన యామునివరుఁడు విని రామదూతలు నిర్బంధింతు రనుతలంపుతో కొంచెముసే పూరకుండి ధ్యానమునుచేసి యి ట్లని యోచించె. శ్రీరాముఁ డింతటితో యాత్రను ముగించి యయోధ్యాపట్టణమునకుఁ బోవును. అట్లయినయెడల లోకములోని మానవులందఱును రాముని నెట్లుఁచూడఁగలరు. మఱియు నీభూలోకమునందు పావనము లగు రామతీర్థము లెట్లుకలుగును. మఱియు నీభూలోకమునందు సద్గతినిపొందించునట్టి రామేశ్వరము నెట్లుకలుగును. కలుగవు. మఱియును, రాముఁడు తీర్థయాత్రలను సేవించినయెడల లోకములోనివారందఱును తీర్థయాత్రలను సేవించుదురు. కావున రాముఁడు సీతతోఁగూడ సకలలోకములయందును సంచరించి భూలోకమును సర్వమును పవిత్రమగునట్లు చేయుద మనితలఁచి యి ట్లనియె. ఓ రామదూతలారా ! నావాక్యమును వినుఁడు. శ్రీరాముఁడు బ్రహ్మపుత్రు డగు రావణుని సంహరించుటచేత బ్రహ్మహత్య కలవాఁడై యున్నాఁడు. అట్టిపాతకమును తొలఁగించుకొనుటకు తీర్థయాత్రల నన్నింటిని సేవించినవాఁడు గాఁడు. మఱియు ననేకము లయిన యశ్వమేధాది యాగములనుకూడ చేసినవాఁడు గాఁడు. కావున రామునియన్నమును నేను భుజింపను. నాకు మార్గమునిండు. నేను వెనుకకుదిరిగిపోయెద ననియె. ఆవచనములు విని రామదూత లామునివరుఁడు శపించుననియెడు తలంపుతో నమ్మునివరునిఁ బోనిచ్చిరి. అంతట రామదూతలు రామునిదగ్గరకుఁబోయి యావృత్తాంతమును సర్వమును చెప్పిరి. ఆవచనములను శ్రీరాముఁడు కుంభోదరుఁ డను మునివరు నభిప్రాయమును దెలిసికొని యావృత్తాంతమును సర్వమును సభికులకుఁ దెలియఁబరుపఁ దలఁచి వసిష్ఠాదుల నందఱను బిలిపించి యి ట్లనియె. ఓ వసిష్ఠాదిసభికులారా ! కుంభోదరుని వచనములను వింటిరా యని యావృత్తాంతమును సర్వమును తెలిపి యిం

కను భూలోకమునందలి తీర్థయాత్రల నన్నియును సేవింపఁదగియున్నవనియె. ఆవ
చనముల కెల్లవారును నంగీకారమును పొందిరి. అంతట రాముఁడు నిజదూతలను
పిలిచి యీవృత్తాంతమును అయోధ్యాపట్టణమునకుఁ బోయి సుమంత్రునకుఁ
జెప్పిరండనియె. అంతట రామదూతలు పోయి యీవృత్తాంతమును సర్వమును
సుమంత్రుఁ డను మంత్రిపుంగవునకుఁ దెలిపిరి. ఆవృత్తాంతమును సర్వమును విని
వస్త్రధనాదులను ఉష్ట్రాశ్వరథనాగాదులచేత మిగుల నాదరముతో నుండె. ఆసమ
యమునందు పుష్పకవిమానముతో రాముఁ డిట్లనియె. ఓ విమానరాజమా! నీకు
సామర్థ్యమున్నయెడల నాపరివారజనములకును రథగజాదులకును చాలినంత చోటు
నిమ్ము? నాయిష్టానుసారముగ స్థూలసూక్ష్మరూపములను పొందుటకు నీకు సామర్థ్య
ములేనియెడల నేను నీకు శక్తినిచ్చెద ననియె. అంతట నావిమానరాజము పదియో
జనముల వెడల్పు కలదయ్యె. ఆవిమానరాజమునందు నానావిధములయిన సోపానా
దులు మనోహరములై యుండె. మఱియు నావిమానరాజము కోటిమందిసూర్యు
లతో సమానమైన కాంతికలదై యుండె. మఱియు నావిమానమునందు నానావి
ధములగు గవాక్షములు కలిగియుండె. మఱియు ననేకములగు పుష్పవాటికలు
మనోహరములైనవై ప్రకాశించుచుండె. మఱియు నాపుష్పకవిమానమునందున్న
సర్పములయొక్క శిరస్సునందలి మణులకాంతులు రాత్రులయందు మిగుల మనో
హరములయినవై దీపములవలెఁ బ్రకాశించుచుండును. అట్టి విమానమునందలి మొ
దటి పఙ్క్తియందు ఉష్ట్రాశ్వరథగజములు నివసించియుండె. రెండవపఙ్క్తియందు
కాష్ఠచయములును ముసలముద్గరాద్యాయుధములును నుంచఁబడియె. మూఁడవ
పఙ్క్తియందు ధాన్యరాసులు మొదలయినవి యుంచఁబడియె. అయిదవపఙ్క్తి
యందు ఫిరంగులు శాస్త్రములు మొదలగునవి యన్నియును నుంచఁబడియె. ఆఱ
వపంక్తియందు రాముఁ డధిష్ఠింపఁదగిన రథగజాదు లుంచఁబడియె. ఎనిమిదవపఙ్క్తి
యందు వస్త్రధాన్యములచేత నిర్మింపఁబడిన రాజకోష్ఠము లుంచఁబడియె. మఱి
యును, అనంతరమందు హద్దాశాలలు మొదలగు వానియందు దాసదాసీజన
ముంచఁబడియె. అనంతరమందు నటాదులయొక్కయు వారస్త్రీలయొక్కయును,
శాలలుంచఁబడియె. అనంతరమందు వీరభటులు మొదలగువారలనందఱను క్రమ
ముగ నుంచునట్లు చేసె. పిమ్మట సుహృన్మిత్రాదులను సామంతరాజాదులను
గూర్చుండ నియమించె. వాని కవ్వల మిగులవిశాలములును రమ్యములును నగు
నిరువదిభోజనశాలలును నియమించె. వానికి పిమ్మటఁ గౌసల్యమొదలగు రాజస్త్రీ
లు నివసించునట్టి మందిరముల నేర్పఱచె. పిమ్మట రామునిసభ జరుగునటుల నియ
మించె. మఱియు నివ్విధముగ స్త్రీలు పక్షులు మొదలగువారు విహరించుస్థలము
లేర్పాటుచేయఁబడియె. మఱియును, వ్యాఘ్రాది జంతువులు నివసించుటకుఁ దగిన
ప్రదేశములను గూడ నేర్పఱచి వానికన్నిటికిని నవ్వల నగ్నిహోత్రశాలలను శివా

ర్పనశాలను నేర్పఱచె. వానికి పిమ్మట బ్రాహ్మణులు నివసించునటుల నియమించె. వారికి పైన యతులు మొదలగువారు నివసించునట్లు చేసె. పిమ్మట జలయంత్రాదులను నిర్మించె. అనంతరమం దార్ద్రివస్త్రముల నెండవేసికొనుటకు తగినశాలల నేర్పఱచె. అంతట రాముఁడు స్వయముగఁ బోయి వానినన్నిటిని జూచె. ఆసమయమునందు వాద్యములు మ్రోగుచుండఁగను, వందిమాగదాదులు స్తోత్రమును చేయుచుండఁగను, వారస్త్రీలు నృత్యములనుచేయుచుండఁగను, పతాకములు చలించుచుండఁగను, దశదిక్కులను ప్రకాశింపఁజేయుచు రామాజ్ఞచేత నావిమానరాజము బయలువెడలె. అవ్విధముగ బయలువెడలిన యావిమానరాజము సూర్యునితో సమముగఁ బ్రకాశించుచు నాకాశమార్గముచేత వాయువేగమునంటి వేగము కలదై ముందుగఁ దూర్పుదిక్కున కభిముఖముగఁ బోయె. అట్లు శ్రీరామధ్వజచిహ్నితమైన యావిమానరాజము ప్రయాగక్షేత్రమున కభిముఖముగ బయలువెడలె నని రామదాసు చెప్పిన విని విష్ణుదాసిట్లనియె. ఓ గురూత్తమా ! ఇదివఱకు రాముని ధ్వజములు నాలుగని చెప్పితివి. ఇప్పు డానాల్గిటి వృత్తాంతములును సర్వమును సంపూర్ణముగఁ దెలిపి నన్ను గృతార్థునిగాఁ జేయవే యనిన విని రామదాసిట్లనియె. ఓ శిష్యోత్తమా ! విష్ణుదాసా ? శ్రీరాముఁడు బాల్యమునందు తండ్రి రథమునెక్కి సంచరించుచుండె. అప్పుడు ఈరామునకు కోవిదారధ్వజ మనఁబడియె. తాటకను వధించునపుడు బాణధ్వజాంకితరథమునెక్కి యొక్కబాణముచేతఁ దాటకం జంపె. అందువలన రామునకు బాణధ్వజుఁ డను నామధేయము కలిగె. ఇంద్రరథము నెక్కి రావణునితో యుద్ధమును చేయునపుడు ఇంద్రధ్వజము రావణునిచేత ఛేదింపఁబడఁగా హనుమంతుని ధ్వజమునందుండ నియమించె. కావున హనుమధ్వజుఁ డను నామధేయము కలవాఁడయ్యె. రావణునితో యుద్ధమును చేయునపుడు మాతలి మూర్ఛను పొందుటచేత నింద్రరథమును విడిచి శ్రీరాముఁడు తనరథము నధిష్ఠించుటచేత గరుడధ్వజుఁ డనఁబడియె. మఱియు నోశిష్యోత్తమా ! శుక్లపతాకమునందు కోవిదారధ్వజము, నీలపతాకమునందు బాణము, పచ్చనిపతాకమునందు వాయుపుత్రుఁడు, పీతవర్ణము కల పతాకమునందు గరుడుఁడు నియమింపఁబడును. ఇవ్విధముగ నాలుగురథములయందును నాలుగుధ్వజము లేర్పడియె. మఱియు నోశిష్యోత్తమా ! కోవిదారధ్వజుఁడు రాముఁడనియును, బాణధ్వజుఁడు శ్రీరాముఁడనియును, కపిధ్వజుఁడు రాఘవేంద్రుఁ డనియును, గరుడధ్వజుఁడు భూతేశుఁ డనియును, చెప్పఁబడును. ఈవిధముగ రామున కనంతనామములు గలిగించె. కాఁబట్టి యోశిష్యోత్తమా ! రామునకు నాలుగుధ్వజము లనిచెప్పఁబడియె. మఱియును, వజ్రధ్వజము కల రథమునెక్కుటచేత రామున కశనిధ్వజుఁ డని నామధేయము కలిగె. ఓ శిష్యోత్తమా ! కోవిదారధ్వజము కల రథము నెక్కినపుడు సుమంత్రుఁడు సారథియయ్యె. బాణధ్వజముల రథమునెక్కినపుడు చిత్రరథుఁడు సారథియయ్యె.

వాయుపుత్రుఁ డగు హనుమంతుఁడు ధ్వజముగాఁ గల రథమునెక్కినపుడు విజయుఁ డనువాఁడు సారథియయ్యె. గరుడధ్వజము కల రథము నెక్కినపుడు దారుకుఁడు సారథియయ్యె. ఓ శిష్యోత్తమా! నీ వడిగిన ధ్వజాదివృత్తాంతమును సర్వమును తెలియఁజెప్పితి నని రామదాసు చెప్పె.

ఇట్లు ఆనందరామాయణాంతర్గత యాత్రాకాండమునందలి
కుంభోదరోపాఖ్యాన మనియెడు నైదవసర్గ ముగిసెను.

---

* పూర్వదేశతీర్థయాత్రావర్ణనము. *

అంతట శ్రీరాముఁడు విమానముతోఁగూడ నిమిషమాత్రముగఁ బడమటి దిక్కునకుఁ బోయి త్రివేణియని చెప్పఁబడు ప్రయాగక్షేత్రమునకుఁ బోయె. అట్లు పోయి ప్రయాగకు క్రోసెడుదూరముగనే విమానమును నిలిపి శ్రీరాముఁడు సీతతోఁగూడ పాదచారియై మెల్లగ త్రివేణీసంగమమునకుఁ బోయె. అట్లు పోయి నారికేళముతో వాయనమును సమర్పించి సీతామహాదేవియొక్క కేశబంధమును నాలుగంగుళములనిచ్చి శ్రీరాముఁడు పిమ్మట క్షురకర్మమును చేయించుకొనియె. అంతట లక్ష్మణాదులుకూడ నవ్విధముగనే చేసి వపనమును చేయించుకొనిరి. అంతట శ్రీరాముఁడు కౌసల్యాదులతోఁగూడ నాదినమంతయు నుపవసించి మఱుదినమునందు శ్రాద్ధమును చేసి దేవబ్రాహ్మణసంతర్పణమును చేసె. అది మొదలు మాఘమాసమగుటచేత నామాసమంతయును నక్కడ నివసించి పిమ్మట అష్టతీర్థములను సేవించి యచ్చట ననేకములగు దానములను చేసె. పిమ్మట ప్రళయకాలమునందు తనకు నిద్రాస్థాన మగు నక్షయవటమును చూచి నవ్వి సీతాలక్ష్మణాదులతోఁగూడ పూజించి వస్త్రాద్యలంకారములచేత నా త్రివేణిని పూజించె. అట్లు చేసి యనేకనూరుల సువర్ణకలశములయందు గంగోదకమును పూరించి విమానాగ్రమునందుంచె. అంతట తీర్థవాసులగు పురోహితులను పూజించి మాటిమాటికిని నమస్కరించి వారియనుమతమునుపొంది మరల సకలపరివార సమేతముగ విమానమునెక్కి యాకాశమార్గముగ వింధ్యపర్వతమునందు దుర్గాదేవి నివసించుచోటునకుఁ బోయె. అక్కడ స్నానమునుచేసి మునుపటివలె తీర్థవిధులనుసల్పి వింధ్యావాసినియగు దుర్గాదేవినిపూజించి వస్త్రాద్యాభరణములచేత నలంకరింపఁజేసి యనేకములగు దానములనుచేసి తీర్థవాసులగు పురోహితులను సంతసింపఁజేసి మరల పుష్పకవిమానముమీఁదనెక్కి కాశీపట్టణమునకుఁ బోయె. అట్లు శ్రీరాముఁడు కాశీపట్టణమునకుఁ బోవుచుండఁగ కాశీపట్టణమునందలి వారందఱును కోటిసూర్యప్రకాశముకల విమానమునుచూచి మేడలయందెక్కి నానావిధములను తర్కవితర్కములను చేయుచుండిరి. ఆసమయమునందు ప్రకాశమానమగు విమానమును పర్వత శిఖరమునందలి యగ్నిజ్వాలయని కొందఱు తలఁచిరి. మఱికొందఱు సూర్యుఁడు మార్గము తెలియక

యిటునటు తిరుగుచున్నారనిరి. మఱికొందఱు నారదమహాముని వచ్చుచున్నాఁడని తలఁచిరి. మఱికొందఱు సూర్యుఁడు అంతరిక్షమునుండి క్రిందఁబడుచున్నాఁడనిరి. మఱికొందఱు వచ్చువాఁడు వాయుపుత్రుఁడగు హనుమంతుఁడనిరి. మఱికొందఱు ఆదిశేషుఁడు శిరోమణులచేత ప్రకాశించుచు వచ్చుచున్నాఁడనిరి. మఱికొందఱు చంద్రుఁడు మృగముతోఁగూడ క్రిందఁ బడవేయఁబడుచున్నాఁడనిరి. మఱికొందఱు సుదర్శనాయుధమనిరి. మఱికొందఱు సుదర్శనాస్త్రము వచ్చుచున్నదనిరి. మఱికొందఱు సువర్ణాద్రి యాకాశమునుండి వచ్చుచున్నదనిరి. మఱికొందఱు గరుత్మంతుఁడు వచ్చుచున్నాఁడనిరి. మఱికొందఱు ప్రళయాగ్ని వచ్చుచున్నదనిరి. మఱికొందఱు ఎవ్వఁడో యాగ్నేయాస్త్రమును ప్రయోగించెననిరి. ఇట్లనేకమంది యనేక విధములుగ విచారించుచుండఁగ మిగుల గొప్పదగు విమానముకనఁబడియె. అప్పుడా విమానమునుచూచి యెల్లవారును కోలాహలధ్వనిని చేసిరి. ఆసమయమునందు కొందఱుదూతలువచ్చి శ్రీరాముఁడు నగరజనులు మొదలగువారితోఁగూడ యాత్రార్థముగవచ్చుచున్నాఁడని చెప్పిరి. ఆవృత్తాంతమును విని కాశీవిశ్వనాథుఁడు పార్వతితోఁగూడ వృషభవాహనారూఢుఁడై కాశీనగరమునందలి వారందఱును వెంటరాగ శ్రీరామున కెదురుగఁబోయె. అట్లు పోవునపుడు పరమశివుఁడు కానుకను దీసికొని పోయె. అంతలోపల శ్రీరాముఁడు వినాయకవిశ్వేశ్వరులను జూచి శిరస్సునువంచి నమస్కారమునుచేసె. అంతట పరమశివుఁడారాముని నాలింగనమును జేసికొని తాను దెచ్చినకానుకను సమర్పించె. మఱియు నాసమయమునందు రాముఁడు వస్త్రాద్యాభరణములచేత పరమశివునిబూజించె. అనంతరమందు విశ్వేశుని హస్తమునుపట్టుకొని శ్రీరాముఁడు కాశీనగరమునందుఁ బ్రవేశించె. మఱియు నాసమయమునందు శివరాము లిరువురును తమవాహనములను విడిచి పాదచారులై కాశీపట్టణములోని మణికర్ణికాఘట్టమునందుఁ బ్రవేశించిరి. అంతట రాముఁడు పుష్కరిణీజలమునందు సీతామహాదేవితోఁగూడ శ్రీఫలమునుసమర్పించి స్నానమునుచేసె. అట్లు స్నానమునుచేయుటకు పూర్వమునందు వపనమును చేయించుకొనియె. అనంతరమందు నిత్యయాత్రనుచేసి యొకదినమం దుపవసించె. తీర్థశ్రాద్ధాదికమునుచేసి పంచతీర్థములయందును చేయఁదగినకృత్యములను జక్కగనెరవేర్చె. పిమ్మట అంతర్గృహియను మహాయాత్రను చేసె. మఱియును మానసద్వయమునుగూడ సలిపె. అనంతరమందు ఇరువదిరెండులింగములను ఎనిమిదిలింగములను అరవదాఱురగు గణపతులను అష్టభైరవులను పూజించె. మఱియు నరువదినాలుగగుయోగినీ గణదేవతలనుపూజించె. అంతట నావిధముగనే యష్టదిక్పతులను నవగ్రహములను పూజించె. అంతట రఘుకులోత్తముఁడగు రాముఁడు పంచక్రోశ యాత్రనుచేసె. ఈవిధముగ శ్రీరాముఁడు పదునాలుగగు యాత్రలనుచేసి రామేశ్వరమనుపేరుకల లింగమును కాశీపట్టణమునకు వాయువ్యభాగమునందు వరుణానదీతటమునందు స్థాపించె. పిమ్మ

ట గంగానదియందు రామతీర్థమనుపేరుతో నొకతీర్థమును నిర్మించె. అంతలోపల నక్కడకు హనుమంతుఁడువచ్చి యావృత్తాంతమును సర్వమునువిని సీతారాములదగ్గరకుఁబోయి వారికి నమస్కరించి హనుమత్తీర్థ మనునామధేయముతో నొక్కతీర్థమును గంగాతటమునందు స్థాపించె. ఇప్పటికిని కాశీపట్టణమునందు హనుమంతఘట్టమని యొకఘట్టము శిలాబద్ధమైయున్నది. అంతట రాముఁడుకూడ రామేశ్వరఘట్టమునుశిలాబద్ధముగఁజేసె. అంతట రాముఁ డొక్కసంవత్సరకాలము కాశీనగరమునందు వాసముచేసి దినదినమందును సకలయాత్రలను చేయుచుండె. పిమ్మట తీర్థవాసులగు యాచకులనందఱను వేఱువేఱుగఁబూజించి రత్నాద్యాభరణములచేత వారలనందఱను తృప్తినిపొందించె. మఱియును దివ్యాన్నములచేత నెల్లవారికిని సంతోషమును గల్పించుచుండె. మఱియును తపోవంతులును యతులును వారలకందఱికిని నీయదగినపదార్థము లన్నిటిని సమర్పించుచుండె. మఱియు ననేకములగు మఠములను వైద్యశాలలను గట్టించె. అనేకములగు నన్నసత్రములను గట్టించె. దేవాలయముల కన్నిటికిని పాలగచ్చును చేయించె. మఱియును దినదినమునందును నానావిధ వైభవములతో విశ్వేశ్వరాది సకలదేవతలను పూజించుచుండె. మఱియును జపహోమాదికార్యముల నన్నిటిని నెరవేర్చుచుండె. ఈవిధముగ నొక్క-యేడాదికాల మక్కడ నివసించి దీనులకందఱకును సంతోషమునుకల్పించి మరలమరల విశ్వనాథుని కాలరాజును గణాధిపతిని అన్నపూర్ణను దండపాణినిపూజించి నమస్కరించి శివాజ్ఞనుపొంది సపరివారసమేతముగ విమానముదగ్గరకుఁబోయి విమానమునధిష్ఠించి యాకాశమార్గమునఁబోవుచు కర్మనాశనదిని సందర్శించె. అనంతరమందు చ్యవనాశ్రమమునకుఁ బోయి పుష్పకవిమానమునందుండియే స్నానమును చేసి యామునివరునకు నమస్కరించి యక్కడ రామతీర్థమును రామేశక్షేత్రమును నిర్మించె. పిమ్మట తనబాణముచేత కల్పించినరేఖను ఎల్లవారికిని కనఁబఱచె. అనంతరమందు అక్కడ కాశీపట్టణమునందుచేసిన దానములకంటె నధికములగు దానములనుచేసి విమానారూఢుఁడై శోణభద్రానదీ సంగమస్థలమునకుఁ బోయె. మఱియును ఆరాముఁడు ఏయేతీర్థాదులను సేవించెనో ఆయాతీర్థములయందు పూర్వపూర్వతీర్థములయందుఁ జేసినదానములకంటె నధికముగ దానములనుచేసె. మఱియును సీతారాము లెక్కడెక్కడకుఁ బోయిరో అక్కడక్కడ నధికముగఁ బూజ్యములగు తీర్థములుకలిగె. ఆతీర్థము లిన్నియనిచెప్పుటకు ఆదిశేషుఁడుకూడ సమర్థుఁడుకాఁడు. అంతట రాముఁడు సోనభద్రసంగమస్థలమునందు స్నానమునుచేసి యక్కడ మూఁడుదివసములు నివసించి గండకీసంగమ స్థలమునకుఁ బోయె. ఇట్లనేకతీర్థములకుఁ బోవుచు నొక్కొక క్షేత్రమునందు మూఁడేసిదినము లయినను అయిదేసి దినములయినను నివసించుచుండె. మఱికొన్ని క్షేత్రములయందు ఏఁడు దినములయినను పదునైదు దినములయినను నివసించుచుండె. మఱి కొన్నిస్థలము

లయందు పదునెనిమిది దినములును మఱికొన్ని తీర్థములయందు ఇరువదొక్క దినములును, మఱికొన్ని తీర్థములయందు మూఁడుమాసముల కాలమును నివాసముఁజేయుచువచ్చె. ఇవ్విధముగ నయ్యై తీర్థములయందు సంచరించుచు గండకీనదియందు స్నానమునుచేసి హరిహరక్షేత్రమును సేవించి యక్కడనుండి బయలు వెడలిపోయె. ఈవిధముగా రఘునందనుఁడగు రాముఁడు సకలతీర్థములను సేవించుచు మరల మరల గంగలోఁ గలియునట్టి సకల నదులయందును స్నానమును చేయుచుండె. అంతట నక్కడనుండి బయలువెడలి వైకుంఠ నగరమునకును జరాసంధపురమునకును బయలువెడలిపోయె. అట్లుపోయి యందలి నదీజలమునందు స్నానమునుచేసి గయాక్షేత్రమునకుఁబోయె. పోయి ఫల్గునీనదియొక్క పూర్వతటమునందు విమానమును నిల్పి దివ్యమగు విష్ణుపదమునకు నమస్కారాదికమును చేసి మరల విమానము దగ్గరకుఁబోయె. పోయి యారాత్రిని సర్వమును నక్కడఁ గడపి ప్రాతఃకాలమునకు ముందుగ లేచి ఫల్గునీనదియందు స్నానమునుచేసి బ్రాహ్మణులతోఁగూడ తీర్థములకుఁబోయె. ఇంతలోపల సీతామహాదేవి సకల స్త్రీలతోడను చుట్టుకొనఁబడినదియై ఫల్గునీనదియందు స్నానమునుచేసి సువాసినీస్త్రీలను పూజించె. అట్లుపూజించి పార్వతిదేవిని పూజించుటకొఱకు క్షణము సేపు ఇసుకతిన్నెలయందు నివసించె. అనంతరమందు అయిదగు సైకతపిండములచేత దుర్గాదేవిని చేయుటకు యత్నించినదై యెడమ హస్తముతో నిసుకను గ్రహించి యాయిసుకను దడిపి సవ్యహస్తముతో పిండమునుచేసి యాపిండమును భూమియందు స్థాపించునంతలో దశరథుని హస్తము భూమినుండి బయలునకువచ్చి కనఁబడియె. అట్లు దశరథుఁడు నిజహస్తమును కనఁబఱచి యాహస్తముచేత నాపిండమును గ్రహించిపోవుచుండె. ఆకౌతుకమును చూచుచు సీతామహాదేవి రెండవపిండమును స్థాపించె. అంతట నాపిండముకూడ తీసికొనిపోఁబడియె. ఇట్లు నూటయెనిమిది పిండములు దశరథునిచేతఁ గైకొనఁబడియె. అట్లు సకల పిండములనిచ్చి శాంతురాలగు సీతామహాదేవి మనస్సుచేతనే దుర్గాదేవిని పూజించి యతివేగముగ విమానము దగ్గరకుఁబోయె. ఆవృత్తాంతమును స్త్రీలెవ్వరును రామునకుఁ జెప్పకపోయిరి. సీతామహాదేవికూడ రాముఁ డేమనునోయను తలంపుతో రామునకుఁ దెలుపకపోయె. అనంతరమందు రాముఁడు పంచతీర్థములను సేవించి ప్రేతపర్వతమునెక్కి పిండదానములనుచేసె. ఆసమయమునందుఁ దన కనిష్ఠికయందలి బంగారపు ముద్రికను బయలునకుఁదీసి దక్షిణాభిముఖుఁడై "అపహత" అనుమంత్రము నుచ్చరించుచు భూమియందు మూఁడు రేఖలనుగీసె. ఆరేఖలిప్పటికిని స్పష్టముగఁ గనఁబడుచున్నవి. అనంతరమందు పేలపిండితో పిండములనుచేసి తిలాజ్యమధు సంయుతములనుగాఁ జేసె. పిమ్మట నాపిండములను దానముచేయుటకు యత్నించి సవ్యహస్తముచేతఁ బట్టుకొని భూమియందుఁ బెట్టుటకు చూడఁగా తండ్రియగు దశరథుని హస్తము కనఁ

బడకపోయె. అప్పుడు బ్రాహ్మణులందఱును మిగుల నాశ్చర్యము కలవారును త్వరకలవారును నగుచు రామునితో నిట్లనిరి. ఓరఘుకులోత్తమా! ఇక్కడి సకల జనులయొక్కయును దక్షిణకరములు కనఁబడుచున్నవిగాని నీతండ్రియగు దశరథుని హస్తము కనఁబడకయున్నది. ఇందుకుఁ దగిన కారణము తెలియకున్నదనిరి. ఆసమయమునందు రాముఁడుకూడ మిగుల నాశ్చర్యముకలవాఁడై లక్ష్మణునితో నిట్లనియె. ఓలక్ష్మణా! ఇప్పుడు మనతండ్రియగు దశరథునిహస్తము కనఁబడక పోవుటకు నాకుఁ గొంచెముగఁ దెలియును. కారణము నీకేమైనఁ దెలియునా? అనిన లక్ష్మణుఁ డిట్లనియె. రఘుకులోత్తమా! గోదావరీ నదియందు మనము పిండదానము చేయునపుడు మనతండ్రియగు దశరథునిహస్తమును చూచితిని. అట్టిహస్తమిప్పుడు కనఁబడలేదు. కావున నాకును ఆశ్చర్యము కలిగియున్నదనిన విని సీతామహాదేవి భయము కలదగుచు నిట్లనియె. ఓరఘుకులోత్తమా! రామచంద్రా! నేను గొంచెముగ నపరాధమును చేసితిని. కావున నన్ను మన్నింపవలయును. తమయాజ్ఞయయ్యేనేని చెప్పెద ననిన విని శ్రీరాముఁ డిట్లనియె. ఓసీతా! నీవు భయమును పొందకుము. నాతండ్రియగు దశరథునిహస్తము కనఁబడకుండుటకుఁ గారణమును చెప్పుమనినవిని సీతామహాదేవి జరిగిన వృత్తాంతమును సర్వమును చెప్పె. ఆవృత్తాంతమును విని శ్రీరాముఁ డోసీతా! నీవు చేసిన కార్యమునందు సాక్షియెవ్వఁడై నఁగలఁడా? అనిన విని యాసీతామహాదేవి చూతవృక్షముసాక్షిగా నున్నదనియె. అంతట శ్రీరాముఁ డావృక్షమునడుగఁగా నేనెఱుఁగననియె. అప్పుడు సీతామహాదేవి కోపోద్దీపితురాలై యావృక్షమును ఫలపుష్పాదులు లేనిదానవగుదువని శపించె. అంతట నాసీతామహాదేవి నాకర్మమునందు సాక్ష్యమును ఫల్గుప్ర సాక్ష్యమును చెప్పె. అప్పుడు రాముఁడడుగఁగా నదియును నేనెఱుఁగననియె. ఆసమయమునందు సీతామహాదేవి దానినిగూడ శపించి యిట్లనియె. ఓ రామచంద్రా! ఇవియన్నియును నీకు భయపడి సాక్ష్యమును చెప్పకయున్నవి. నేను నిన్నుఁ బ్రమాణముగాఁ జేసి చెప్పెదను. నావాక్యమును సత్యముగ నమ్ముము. మఱియు నాసమయమునందు నావద్దనున్న బ్రాహ్మణులనడుగుము. వారు నిజమును చెప్పుదురని తోఁచుచున్నదనిన విని శ్రీరాముఁ డాబ్రాహ్మణుల నడుగఁగా వారును భయముచేత మేమెఱుఁగమనిరి. అంతట సీతామహాదేవి మును పటికంటె నధికకోపముకలదై గయాక్షేత్రవాసులగు బ్రాహ్మణుల కెంతద్రవ్యమిచ్చినను తృప్తి కలుగనేరదని శపించె. అంతట మరల సీతామహాదేవి అప్పుడు నావద్దనున్న మార్జారము నడుగుమనఁగా నదియును భయముచేత నేనెఱుఁగననియె. అంతట సీతామహాదేవి యిట్లనియె. ఓమార్జారమా! నీవుచ్ఛమును నాయెదుటఁ బెట్టుకొని యసత్యమును చెప్పితివికనుక ఇది మొదలుకొని పుచ్ఛము స్పృశింపఁ దగనిదియగునని మరల నిట్లనియె. ఓరామఁడా! ఆసమయమునందు నావద్ద నొక్క

గోవు నివసించియున్నది. దాని నడిగినయెడల నది చెప్పననియె. అంతట రాముఁ డడుగఁగా నాగోవుకూడ నాకుఁ దెలియదనియె. అప్పుడు సీతామహాదేవి కోపోద్దీపితురాలై నీముఖము అపవిత్రమైనదగునని శపించి మరలనిట్లనియె. ఓ రఘుకులోత్తమా! ఆసమయమునందు నావద్దనున్న యశ్వత్థ వృక్షము నడుగుమనఁగా నదియును నేనెఱుఁగననియె. అంతట సీతామహాదేవి యాయశ్వత్థమును కూడశపించె. అప్పుడు శ్రీరాముఁ డింక నెవ్వఁడైన సాక్షియున్న యెడల చెప్పుమనిన సూర్యదేవుఁ డున్నాఁడనియె. అంతట శ్రీరాముఁడు అడుగఁగా సూర్యుఁడుమాత్రము భయరహితుఁడై నీతండ్రియగు దశరథుఁడు తృప్తినొందెననియె. ఆసమయమునందు దశరథుఁడు సూర్యునివలెఁ బ్రకాశించుచున్న విమానము నెక్కివచ్చి రామునిచూచి విమానమునుండిదిగి రాముని కౌఁగిలించుకొని యిట్లనియె. ఓపుత్రోత్తమా! నీవు మిగుల దుస్తరమగు నరకమునుండి తరింపఁజేసితివి. సీత పిండదానమును చేయుటచేత తృప్తినొందితిని. అయినను లోకశిక్షకొఱకు నీవుకూడ గయాశ్రాద్ధమును చేయుమనిన శ్రీరాముఁ డిట్లనియె. ఓరఘుకులోత్తమా! దశరథమహారాజా! నీవు మిగుల త్వరగలవాఁడవై సికతాపిండముల నేల గ్రహించితివో చెప్పుమనిన దశరథమహారా జిట్లనియె. ఓపుత్రోత్తమా! గయయందు అనేకములగు విఘ్నములు కలుగును. కనుక నేను త్వరపడితి నని చెప్పి రాముఁడిచ్చిన పిండమును కొంచెముగఁ గైకొని మరల విమానము నెక్కిపోయె. అనంతరమందు రాముఁడు ప్రేతపర్వతమునందు పిండదానమును నెరవేర్చి యాపర్వతమునందలి ప్రేతశిలయందు కాకబలిని పెట్టి యక్కడనుండి యతిశీఘ్రముగ ధర్మారణ్యమునకుఁబోయె. అట్లుపోయి యక్కడపేలపిండి తిలాజ్యములు పాయసము శర్కర మొదలగువానితో విడివిడిగ పిండదానములను చేసి యనంతరమందు వటశ్రాద్ధమునుచేసె. పిమ్మట నష్టతీర్థములను చేసి యనంతరమందు అనేకదానములనుచేసె. అంతట గదాధరునకు మహావిభవపూర్వకముగఁ బూజనుచేసి కీటకములతోఁ గూడుకొనియున్న చూతవృక్షమునకు సేచనమునుచేసె. మఱియు నొక్కముని కుంభకుశాగ్రహస్తుఁడై చూతవృక్షముయొక్క మూలమునం దుదకమును ధరించె. మఱియును చూతవృక్షమును తడుపుటచేత పితృదేవతలు కూడఁ దృప్తినొందిరి. అనంతరమందు రాముఁడు విష్ణుపాదమును పూజించుచు మూఁడుమాసములకాల మక్కడనివసించె. అంతట శ్రీరాముఁడు విమానము నెక్కి యక్కడనుండి తూర్పుదిక్కునకుఁబోయె. అట్లు పోవునపుడు సకలజనులను సంతోష పఱచుచుండె. శ్రీరాముని విమానము నిలిచినచోటు రామగయయను నామధేయముతో నిప్పటికిని ప్రసిద్ధమైయున్నది. మఱియు నక్కడ రామేశ్వరమును పావనమైన రామతీర్థమును గలవు. అంతట శ్రీరాముఁడు ఫల్గునీనది గంగానదియందుఁ గలిసినచోటునకుఁ జోయె. ఆఫల్గు అనునది గయకు

వెలుపట మహానదియైయున్నది. అక్కడనుండి శ్రీరాముఁడు ముద్గలమునివరుని యొక్క నూతనాశ్రమమునకుఁబోయె. ఆ ముద్గలాశ్రమమునందు గంగానదియుత్తరవాహినియును పావనమైనదియును నై యున్నది. ఆస్థలమునందు అనేకములయిన తీర్థములు కలవు. మఱియు నక్కడ రామతీర్థములుకూడ ననేకములు కలవు. మఱియును, రామునిబంధువులందఱును తమతమ నామధేయములతో ననేక తీర్థములను గల్పించిరి. సీతాదేవిమాత్రము అక్కడ తననామధేయముతో తీర్థమును నిర్మింపలేదు. సీతకుమాత్రము అక్కడ తనపేర తీర్థముకలుగునని తెలిసియుండుటచేత తీర్థమును నిర్మింపకపోయె. అంతట నక్కడనుండి శ్రీరాముఁడు విమానముమీఁదనెక్కి గంగానదీసమీపమునందలి బిల్వేశ్వరమను పర్వతమునకుఁబోయి యచ్చట రామునిచేత స్థాపింపఁబడిన వైజనాథేశునకు నమస్కరించి యక్కడనుండి విమానమునెక్కి నానావిధములగు దివ్యస్థలములను సేవించుచుఁ బోయి గంగాసాగర సంగమమునందుఁ బ్రవేశించె. అంతట అక్కడస్నానముచేసి కాళిందీ సంగమస్థలమునందుఁగూడ స్నానమునుచేసె. పిమ్మట పూర్వసాగరసమీపమునందున్న పురుషోత్తమక్షేత్రమునకుఁ బోయె. పోయి యాదేవోత్తమునకు నమస్కారమును చేసి యక్కడనుండి నానావిధములగు నదీక్షేత్రాదులను సేవించుచు ననేకదేశములను గతించిపోయె. అట్లు పోవుచు గోదావరీనదియొద్దకుఁ బోయి యక్కడ స్నానమునుచేసి యక్కడ తననామధేయము కలగిరిని (రామగిరిని) స్థాపించె. అనంతరమందు సప్తగోదావరులును సముద్రమునందుఁ గలసినచోటునకుఁబోయి యక్కడ స్నానదానాదుల నధికముగఁజేసె. అంతట నక్కడనుండి బయలువెడలి దక్షిణమార్గము నవలంబించిపోవుచుఁ దూర్పుదేశమునందలి రాజులందఱిచేతను పూజింపఁబడుచుండె. అట్లు సకలరాజులవలనను పన్నును గైకొని వారలతోఁగూడ మెల్లమెల్లగఁబోవుచుండె. అట్లు సకలరాజులతోఁగూడ ననేకములగు తీర్థములను సేవించె. అంతట నారాముఁడు దక్షిణాభిముఖుఁడై పోవుట కారంభించె.

ఇట్లు యాత్రాకాండమునందలి పూర్వదేశయాత్రావర్ణనమనియెడు
నాలవసర్గ ముగిసెను.

* దక్షిణ తీర్థయాత్రావర్ణనము. *

అట్లు శ్రీరాముఁడు దక్షిణాభిముఖుఁడై పోవుచు మత్స్యతీర్థమునుసేవించి యక్కడనుండి మహానదినిదాఁటి కృష్ణానదిని మఱియు ననేకములగు పుణ్యనదులను పుణ్యతీర్థములను సేవించె. అనంతరమందు శ్రీరాముఁడు పానకనామధేయముకల నరసింహక్షేత్రమునకుఁబోయె. పిమ్మట కృష్ణాసాగరసంగమమునందు స్నానమునుచేసి యక్కడ ననేకములగు దానములనుచేసె. అంతట నక్కడనుండి నానాక్షేత్రములను చూచుచు నక్కడక్కడ దానాదులనుచేయుచు శ్రీశైలపర్వతమునకుఁ బోయె.

పోయి మల్లికార్జునుఁ డను దేవుని సేవించి యాపర్వత సమీపమునఁ బ్రవహించుచున్న నీలగంగయను కృష్ణానదిని సేవించె. మఱియును శ్రీశైలశిఖరమునుచూచువారికి పునర్జన్మముకలుగదని పెద్దలుచెప్పుదురు కనుక శ్రీశైలశిఖరమునుచూచి బ్రహ్మకుండమునందు స్నానమునుచేసె. అనంతరమందు భీమకుండమునందు స్నానమును చేసినవెనుక నివృత్తిసంగమమునందు స్నానమునుచేసె. పిమ్మట తుంగభద్రానదియు కృష్ణానదియందుఁ గలిసినచోటునందలి మహానదీసరోవరమునందు స్నానమునుచేసె. అనంతరమందు భవనాశినియందు స్నానమునుచేసి యక్కడనుండి బయలువెడలి యహోబిలక్షేత్రమునకుఁబోయి యక్కడనుండు తీర్థమునందు స్నానముచేసి నరసింహదేవుని ప్రార్థించె. అనంతరమందు పుష్పగిరికిఁబోయి పినాకినియందు స్నానమునుచేసె. అంతట నక్కడనుండి బయలువెడలి యనేకములగు పుణ్యతీర్థాదులను సేవించుచు పంపాసరోవరమునకుఁబోయె. అనంతరమందు కిష్కింధాపట్టణమునకుఁబోయి సుగ్రీవాదులచేత పూజింపఁబడి సుగ్రీవాది వానరులతోఁగూడ విమానమునెక్కి పోయి ప్రవర్షణాచలమునందలి రామనామకగుహను సీతామహాదేవికిఁ జూపి నవ్వుచు నచ్చోటువాసిపోయె. అట్లు పోయి భీమకుండమునందు స్నానమునుచేసి షడాననక్షేత్రమునకుఁబోయె. అంత నక్కడస్నానమునుచేసి యక్కడనుండి బయలు వెడలి యగస్తికుండమధ్యమునందు స్నానమునుచేసె. అనంతరమందు అనేక తీర్థాదులను చూచుచుఁ బోయి కనకగిరియందున్న శంభునకు పూజానమస్కారములనుచేసె. పిమ్మట వీరభద్రునకు నమస్కరించి యంతటనుండి బయలువెడలి వేంకటాచలమునకుఁబోయె. పోయిత్రిపత్తనమందున్న గోవిందరాజునకు నమస్కరించి కపిలధారయందు స్నానమునుచేసి యక్కడ తీర్థశ్రాద్ధము నాచరించె. అనంతరమందు శేషాచలము మీఁదికిఁ బోయి పుష్కరిణియందు స్నానమునుచేసి వేంకటేశునకు పూజానమస్కారములనుచేసి పంచతీర్థములయందును శాస్త్రోక్తప్రకారముగఁ జేయఁదగిన కర్మములనుచేసె. అనంతరమందు సువర్ణముఖరీతీరమునందున్న శ్రీకాలహస్తినామకదేవుని పూజించి యచటనుండి బయలువెడలి హరిహర ప్రియమగు కాంచీపట్టణమునకుఁబోయె. పోయి ముందుగ నేకామ్రేశ్వరుని పూజించి సర్వతీర్థమునందు స్నానమునుచేసి కామాక్షియను నంబికకు నమస్కారమునుచేసి యక్కడనుండి బయలు వెడలిపోయి వరదరాజునకు పూజానమస్కారములనుచేసి యక్కడనుండి పక్షితీర్థమునకుఁబోయె. అట్లుపోయి సీతామహాదేవితోఁగూడ పూషవిధాతలను నామధేయముకల రెండు పక్షులను పూజించె. అంతట నక్కడనుండి బయలువెడలి క్షీరనదియొద్దకుఁబోయి యక్కడ స్నానదానాదుల నాచరించి త్రివిక్రమదేవునకు నమస్కారమును చేసి యక్కడనుండి యరుణాచలమునకుఁబోయె. అరుణాచలేశునకు నమస్కరించుటచేత నిరాతంకముగ ముక్తి కలుగును. అనంతరమందు మణిముక్తానదీతీరము

నందలి వృద్ధాచలమునకుఁబోయె. పిమ్మట వృద్ధాచలేశునకు పూర్భానమస్కారముల నుచేసి యక్కడనుండి వటపాలక్షేత్రమునకుఁబోయె. అంతట వటపాలేశ్వరుని సేవించి యక్కడనుండి శ్రీముష్టిక్షేత్రమునకుఁబోయె. అట్లుపోయి యక్కడ జగదీశ్వరుఁడగు యజ్ఞవరాహదేవునిఁబూజించె. అనంతరమందు దర్శనమువలననే ముక్తి నిచ్చునట్టి చిదంబరక్షేత్రమునకుఁబోయె. ఆచిదంబరక్షేత్రమునందు శిలయందు దాది శేషునిచేత వ్రాయఁబడిన తాండవాకృతికలదు. అంతట కావేరీనదిని దాఁటి సింహక్షేత్రమునకుఁబోయె. అక్కడనున్న బ్రహ్మపురేశునకు నమస్కరించి యక్కడనుండి వైజనాథునకు నమస్కరించి అంతట నక్కడనుండి శ్వేతారణ్యమునకుఁబోయి శంఖముఖ్యయను నదియందు స్నానమునుచేసె. అనంతరమందు ఛాయావనమును సేవించి యక్కడనుండి గౌరీమయూరకమను క్షేత్రమునకుఁబోయె. అనంతరమందు వేదారణ్యమునకుఁబోయి మధ్యార్జుననామకశివునకు నమస్కరించి స్నానదానాదులనాచరించె. అనంతరమందు వృద్ధకావేరీనదికిఁ బోయి యక్కడస్నానమును చేసి యక్కడనుండి కుంభకోణమునకుఁబోయి కుంభకోణేశుని సేవించె. అనంతరమందు శ్రీనివాసునిచూచి పావనమగు బృందావనమునకుఁబోయె. అనంతరమందు సారనాథుని సేవించి యక్కడనుండి బయలువెడలిపోయి శ్రీవాంఛమునందుఁ బ్రవేశించి ప్రయాగమాధవునకు నమస్కరించి యక్కడనుండి యభ్రిశిరస్థలమునకుఁబోయె. అనంతరమందు కమలాలయమునకుఁబోయి త్యాగేశునకు నమస్కరించె. అనంతరమందు గయాతీర్థమునందు స్నానమునుచేసె. అనంతరమందు దక్షిణద్వారకయందలి శ్రీగోవిందునకు నమస్కారమునుచేసె. పిమ్మట జేపాలాఖ్య పట్టణమునకుఁబోయి యభయదేశ్వరునకు నమస్కరించె. అనంతరమందు విఘ్నేశ్వరునకు నమస్కరించి పిమ్మట నవపాషాణమునందు నమస్కరించి యక్కడనుండి దేవీపట్టణమునకుఁబోయె. అనంతరమందు ఫేతాల తీర్థమునందు స్నానమునుచేసి యక్కడనుండి సముద్రమునుదాఁటె. అనంతరమందు భైరవతీర్థమునందు స్నానముచేసి విమానమును వదలి పాదచారియై సకలజనులతోఁ గూడఁబోయి ముందుగ లక్ష్మణకుండమునందు స్నానమునుచేసె .అనంతరమందు రామకుండమను పేరుకల తనగుండమునందు స్నానమునుచేసె. పిమ్మట నగ్నితీర్థమునందు స్నానమునుచేసి యక్కడనుండి ధనుష్కోటికిఁబోయి యాధనుష్కోటియందు స్నానమునుచేసె. అంతట జటాయుతీర్థమునందు స్నానమునుజేసి యక్కడనుండి గంధమాదనక్షేత్రమునకుఁ బోయె. పోయి ముందుగ పూర్వము హనుమంతునిచేతఁ దీసికొనిరాఁబడిన విశ్వనాథునకు నమస్కరించి యనంతరమందు రామేశ్వరునకు నమస్కరించె. అంతట నారామేశునకు గంగాభిషేచనమునుచేసె. అనంతరమందు కాచకుంభాదికమును విడిచిపెట్టి యాధనుష్కోటియందుఁ దన ధనుష్కోటిచేత కోటితీర్థ మను నామధేయముకల శ్రేష్ఠమైనకూపమును నిర్మించె.

పిమ్మట క్షేత్రమునందు చేసినపాపమును పోఁగొట్టునట్టి శ్రీశ్వేతమాధవునకు నమస్కరించి యక్కడ నానావిధములైన దానములను చేసి యక్కడ మాసము దినములు నివసించె. అట్లు నివసించినకాలమునందు ఉత్సవవిగ్రహములకు నానావిధములగు నుత్సవములనుచేసె. పిమ్మట క్షేత్రపాపశాంతికొఱకు కోటితీర్థమునందు స్నానమునుచేసి ద్వారమునందున్న గణపతినిపూజించి యంతట విమానమునెక్కి దర్భశయనమునకుఁ బోయె. అనంతరమందు తామ్రపర్ణీసాగరసంగమమునందు స్నానమునుచేసి తామ్రపర్ణీనదివెంటనున్న యనేక క్షేత్రములను సేవించుచు నవవేంకటనాథక్షేత్రమునకుఁ బోయి యక్కడ పూజనమస్కారములనుచేసి సింధుతీరమందున్న కన్యాకుమారీక్షేత్రమునకుఁ బోయె. ఆసమయమునం దాకన్యాకుమారి హస్తమునందు పుష్పమాలికను ధరించి శ్రీరామున కభిముఖురాలై యుండఁగ శ్రీరాముఁ డిట్లనియె. ఓసువ్రతురాలా! నీకభీష్టమైన వరమును గోరుమనిన యామహానుభావురాలు విని శ్రీరామునకు నమస్కరించి యిట్లనియె. ఓరఘుకులోత్తమా! చిరకాలము నుండి వ్రతమునవలంబించి యుంటిని. నేనుమునివరునిపుత్రికను. నాతండ్రి నన్నుసుసేంద్రునకిచ్చి వివాహమును చేయనిశ్చయించె. అంతట నాసుసేంద్రుని ఇక్కడకు యోజనదూరమునకుఁ గొనివచ్చె. ఇంతలో నీవుయాత్రార్థము గవచ్చుచున్నావను వృత్తాంతమునువిని నేను నిన్నువరింపఁదలఁచితిని. అట్టినాయభిప్రాయమును నాతండ్రియగు మునివరుఁడు తెలిసికొనియె. ఆ సుసేంద్రుఁడును నాయభిప్రాయమును తెలిసికొని మరలిపోయె. మఱియు నతఁడిప్పటికిని యోజనదూరమునయున్నాఁడు. అంతట నాతల్లిచేత సంపాదింపఁబడిన వివాహయోగ్యపదార్థములనన్నిటిని నాతండ్రి కోపముతో సముద్రమునందుఁ బడవైచె. ఓరఘుకులోత్తమా! ఆపదార్థములన్నియును సముద్రతరంగములచేత బయలునకుఁ జిమ్మఁబడి ఇప్పటికిని కనఁబడుచున్నవి చూడుము. ఓరఘుకులోత్తమా! నన్ను నీవు దాసినిగాఁగై కొనుమనియె. అంతట శ్రీరాముఁడు దానియభిప్రాయమును దెలిసికొని యిట్లనియె. ఓసువ్రతురాలా! నేనీజన్మమునం దేకపత్నీవ్రతము నవలంబించితిని. కావున నాకిప్పుడు నిన్నుఁబరిగ్రహించుటకు వీలు లేదు. నేనుద్వాపరాంతమందు కృష్ణావతారము నవలంబించెదను. అప్పుడునీవు నన్నుఁబొందుమనియె. అంతట నాయంగన శ్రీరాముని వచనములను నమ్మి యమనియమాదులనవలంబించి దేహమును ధరించియుండి కృష్ణుఁ డవతరించిన పిమ్మట జాంబవంతునియందుఁబుట్టునట్లు అనుగ్రహింపఁబడియె. ఆయంగన జాంబవంతునకుఁ బుత్రికయై జాంబవతి యనునామధేయము కలదియగును. అంతట శ్రీరాముఁడు సుసేంద్రిక్షేత్రమునకుఁ బోయి యక్కడ స్నానదానాదులనుచేసి యక్కడనుండి బయలువెడలి తామ్రపర్ణీనదీతీరమునందలి యాదర్యానంతమనుక్షేత్రమునకుఁబోయి శేషశాయియై లక్ష్మీగరుడులచేత సేవింపఁబడుచున్న విష్ణుదేవుని సేవించె. అంతట నక్కడనుండి బయలువెడలి తామ్రపర్ణీనది పశ్చిమవాహిని

యని తెలిసికొని యనంతశయనమునకుఁ బోయి పద్మతీర్థమునందు స్నానమునుచేసి యక్కడనుండి బయలువెడలి శంఖతీర్థమునందు స్నానమునుచేసి మత్స్యనదికిఁబోయె. అంతట నక్కడ స్నానదానాదుల నాచరించి యెల్లవారలతోఁగూడ విమానమునెక్కి ధర్మాధర్మసరోవరమునకుఁ బోయెఁ. పోయి దానియందు స్నానాదికము నాచరించి జనార్దనుని పూజించి యక్కడనుండి నారీరాజ్యమునకుఁబోయి అంతట శ్రీరాముఁడు లోకశిక్షకొఱకు అక్కడనుండి యవ్వలకుఁబోక మరలి ఘృతమాలానదియందు స్నానదానాదికమునుచేసె. పిమ్మట సింధునదియందు స్నానమునుచేసి యక్కడనుండి తామ్రపర్ణీ తీరమునందున్న గజేంద్రమోక్షమను క్షేత్రమునకుఁ బోయి యక్కడఁజేయఁదగిన సత్కర్మములనుచేసె. అనంతరమందు తామ్రపర్ణీనది పుట్టిన చోటునకుఁబోయి స్నానదానాదికమునుచేసి యక్కడనుండి మైరాళతీర్థమునకుఁ బోయె. అనంతరమందు శ్రీరాముఁడు చంద్రకుమారమను పర్వతమునుచూచి విమానమునెక్కి దక్షిణకాశికిఁబోయి యక్కడనుండు విశ్వనాథునకు నమస్కరించె. పిమ్మట చంపకారణ్యమునకుఁబోయె. అనంతరమందు చిత్రగంగాజలమునందు స్నానమునుచేసి హరిహరులకు నమస్కరించి యక్కడనుండి బయలువెడలి మధుపురియందుఁ బ్రవేశించె. ప్రవేశించి వేగవతీజలమునందుస్నానమునుచేసి సుందరేశ్వరునకు నమస్కరించి మీనాక్షియను నంబికకుఁ బ్రదక్షిణ నమస్కారంబులనుసలిపె. అనంతరమందు కావేరీమధ్యయందలి శ్రీరంగశయనమను క్షేత్రమునకుఁబోయె. పిమ్మట మాతృభూతేశ్వరునకు నమస్కరించి యనంతరమందు జంబుకేశ రంగనాథులకు నమస్కారములనుచేసె. పిమ్మట శ్రీరామపత్తనమునకుఁబోయి హైమవతీజలమునందు స్నానమునుచేసి సాలగ్రామమునకు నమస్కరించి యక్కడనుండి రామనాథపట్టణమునకుఁబోయె. పోయి కుమారధారయందు స్నానమునుచేసి సుబ్రహ్మణ్యునకుఁ బ్రదక్షిణ నమస్కారములను చేసి యనంతరమందు ఉడుపియనుపేరుకల కృష్ణునకు నమస్కరించె. అనంతరమందు తుంగానదీతీరమునందలి శృంగగిరియందు శారదాంబకు నమస్కరించి యక్కడనుండి కుంభకాశికిఁబోయి కోటీశ్వరుఁడను శివునకు నమస్కారాదికమునుచేసి యక్కడనుండి బయలువెడలి మూకాంబికకు నమస్కరించి ముండేశ్వరుఁడను శివునకు నమస్కారాదులనొనర్చె. అనంతరమందు గుణవంతేశ్వర ధారేశ్వరులకు నమస్కరించి యక్కడనుండి బయలువెడలి గౌరేశ్వరునకు నమస్కరించి సర్వేశునకు నమస్కరించె. అనంతరమందు గోకర్ణమునకుఁబోయి మహాబలునకు నమస్కరించి హరిహరేశ్వరక్షేత్రమునకుఁబోయె. పిమ్మట మహేంద్రపర్వతమునందున్న జామదగ్న్యమునివరునకు నమస్కరించి యంతట భీమేశ్వర క్షేత్రమునకుఁబోయి ధోముఁడను మహాబలునకు నమస్కరించి యక్కడనుండి కోలాపురమునకుఁబోయె. అనంతరమందు కరవీరపురమునకుఁబోయి కృష్ణావేణులయొక్క సంగమమునందు

స్నానమునుచేసి యంతట విమానమునెక్కి గదాలక్ష్మీశ్వరస్థానమునకుఁ బోయెను. అనంతరమందు ఘటప్రభాతీర్థమునందు స్నానమునుచేసి యనేకములగు పుణ్యస్థలములనుజూచి మహాదేవక్షేత్రమునకుఁ బోయి మహాదేవునకు నమస్కరించి యనంతరమందు మల్లారియను నీశ్వరునకు నమస్కరించెను. పిమ్మట కరనదీతీరమందున్న వక్రతుండునకు నమస్కరించెను. అనంతరమందు నీరానదీజలమునందు స్నానమునుచేసి నారసింహునకు పూజానమస్కారములనుచేసెను. పిమ్మట పాండురంగునకు నమస్కరించి యక్కడనుండి చంద్రభాగానదియందు స్నానమును చేసి యనంతరమందు భీమానదీసంగమమునందు స్నానమునుచేసెను. పిమ్మట చంద్లానదికిఁబోయి యక్కడ స్నానదానములనుచేసెను. అనంతరమందు మాణిక్యాంబకు నమస్కరించి యక్కడనుండి యనేకతీర్థములను చూచుచుఁ బోవుచుండెను. అట్లుపోవుచు ప్రేమపురమునకుఁబోయి మార్తాండునకు నమస్కరించి నలదుర్గమునుసేవించెను. అనంతరమందు తురజాపురమునందున్న దేవతకు నమస్కరించెను. అనంతరమందు యోగీశ్వరికి నమస్కరించి యక్కడనుండి యంబాపురమునకుఁ బోయి వైజనాథునకును నమస్కరించి యక్కడనుండి వంజరాజసంగమమునకుఁ బోయెను. అనంతరమందు నాగేశుఁడను దేవునిజూచి యంతట విమానమునెక్కి పోయి పూర్ణాసంగమమునందు స్నానమునుచేసి బయలు వెడలిపోయి గోదావరీనది యొక్క యుత్తరతటమునందు తనపేరుతో నొకపట్టణమును నిర్మించి యక్కడనుండి ముద్గలాశ్రమమునకుఁబోయెను. అనంతరమందు బాణతీర్థమునందు స్నానమునుచేసి సింధుఫేనాసంగమ స్థలమునకుఁబోయి యక్కడ స్నానదానాదులనుచేసెను. అనంతరమందుగోదానాభమందును అబ్జకమందును స్నానమునుచేసి విక్రమమునకు ప్రదక్షిణనమస్కారములనుచేసెను. అనంతరమందు గోదావరీతీరమున తనపేరుకలపట్టణమును నిర్మించియంబికకు నమస్కరించి చండికాదేవునిపూజించి యాత్మతీర్థమునందు స్నానమునుచేసి విజ్ఞానేశ్వరునకునమస్కారాదికము నాచరించెను. పిమ్మట మహాలక్ష్మినిచూచియక్కడనుండి బడబాసంగమమునందు స్నానమునుచేసెను. అనంతరమందు ప్రతిష్ఠాననగరమునుచూచి వృద్ధైలసంగమమునందు స్నానమునుచేసి యక్కడనుండి బయలువెడలి శివానందాసంగమమునందు స్నానమునుచేసి యక్కడనుండు నృసింహదేవునకు పూజానమస్కారాదులనుచేసెను. అంతట నక్కడ తనపేరుతో ప్రసిద్ధమయిన తీర్థమునునిర్మించి యక్కడనుండి ప్రవరాసంగమమునకుఁబోయెను. అనంతరమందు సిద్ధేశ్వరునకు నమస్కరించి వాసమనుపట్టణమునకుఁబోయెను. పిమ్మట నూపురమను పట్టణమునకుఁబోయి యక్కడనుండిబయలువెడలి నానాస్థలములనుసేవించుచు గోదాతటమునందు పుణ్యస్తంభమును నిర్మించెను. అనంతరమందు కద్రూసంగమ వినతాసంగమములయందు స్నానాదికము నాచరించెను. పిమ్మట జనస్థానమునకుఁబోయి

యక్కడనుండి బయలు వెడలి త్ర్యంబకేశ్వరునకు పూజానమస్కారాదులను నాచరించె. అనంతరమందు దాక్షిణాత్యులగు రాజులచేతఁ బూజింపఁబడి వారివలన పన్నునుగ్రహించి వారితోఁగూడ బయలువెడలిపోయె. ఈవిధముగా శ్రీరాముఁడు దక్షిణయాత్రను చేసెనని యారామదాసుచెప్పె.

ఇట్లు యాత్రాకాండమునందలి యేడవ సర్గ ముగిసెను.

---

* పశ్చిమదేశయాత్ర. *

అట్లు రామదాసు శ్రీరాముని దక్షిణయాత్రావృత్తాంతమును చెప్పినపిమ్మట విష్ణుదాసిట్లనియె. ఓగురూత్తమా! నాకొక సందేహముకలిగియున్నది. ఆసందేహమునుదీర్చి నన్నుఁ గృతార్థునిగఁజేయుము. ఓగురూత్తమా! యానమునెక్కి యాత్రలను చేయఁగూడదని యార్యులు చెప్పఁగవిందును. రాముఁడు యానారూఢుఁడై యాత్రనెట్లుచేసెను? ఈవిషయమును తెలుపుమనిన గురుఁడగు రామదాసిట్లనియె. ఓశిష్యోత్తమా! ఛత్రచామరాదులను ధరించినరాజు పాదచారియై యాత్రను చేయఁగూడదు. మఱియునోశిష్యోత్తమా! ద్వీపాధిపతియును మాండలికుఁడును మఠాధిపతియును పాదచారులై యాత్రను చేయఁదగరు. కావున నీవిషయమునందు సందేహమును పొందఁగూడదు. మఱియును, రామునితోఁగూడ యాత్రకువచ్చినవారు రామాజ్ఞచేత పుష్పకము నధిష్ఠించిరి. దేవునివ్యాపారములను నెవ్వఁడు తెలియఁగలఁడు. ఇప్పుడు శ్రీరాముని పశ్చిమదేశ యాత్రావృత్తాంతమును చెప్పెదనువినుము. అంతట శ్రీరాముఁడు త్ర్యంబక క్షేత్రమునుండి బయలు వెడలి యక్కడనుండు పర్వతమునందు సీతతోఁగూడ మూఁడుదినములు నివసించి యనంతరమందు సప్తశృంగగిరికిఁబోయి యగస్త్యాశ్రమమును సుతీక్ష్ణాశ్రమమును సేవించి యక్కడనుండి చైలపురమునకుఁబోయె. అంతట నక్కడనుండు దేవతకు నమస్కరించి యనేకములగు పుణ్యస్థలములను సేవించుచుఁబోయి దేవవాటమను క్షేత్రమునందలి నారసింహునకు పూజానమస్కారముల నొనర్చె. అనంతరమందు శ్రీరాముఁడు సీతామహాదేవితోడను పయోష్ణి యనునదియందు స్నానముచేసి యక్కడనుండి పశ్చిమాభిముఖుఁడై యనేకములగు పుణ్యస్థలములను సేవించుచుఁ బోయె. అనంతరమునందు తాపీనదియొక్క సంగమమునందును మహానదీజలమునందును స్నానమునుచేసి యక్కడనుండి ప్రభాసతీర్థమునకుఁ బోయె. అనంతరమందు పంచసరస్వతీనదులయొక్క సంగమములయందు స్నానమునుచేసి యక్కడనుండి బయలు వెడలి సౌరాష్ట్రదేశమునందలి సోమనాథక్షేత్రమునకుఁబోయి సోమనాథదేవునకు నమస్కరించి యక్కడనుండి బయలువెడలి సాభ్రమతీనదికిఁబోయి దానియందు స్నానమునుచేసి యనంతరమం దనేకములగు పుణ్యస్థలములను సేవించుచు శంఖోద్ధారమునకుఁ బోయె. పిమ్మట గోమతియందు శాస్త్రో

స్త్రప్రకారముగ స్నానదానములనుచేసి ద్వారావతికిఁబోయె. అంతట నక్కడనుండు నట్టి యేడగుపట్టణములయందు అనాదిసిద్ధమును, ప్రసిద్ధమును, శుభకరమును అయిన నదియందు స్నానమునుచేసి తీర్థవిధులను జరపి యనేకములయిన దాన ములనుచేసి యక్కడనుండి బయలువెడలి యనేకములయిన పుణ్యక్షేత్రములను చూచుచుఁబోయె. అట్లుపోయి పశ్చిమదేశపురాజులచేతఁ బూజింపఁబడినవాఁడై వారివలన పన్నును గ్రహించి వారితోఁగూడ బయలువెడలి పోయె. పిమ్మట సరస్వతీనదియొక్క తటమును అనుసరించియే పోవుచు ననేకములయిన పుణ్యస్థల ములను సేవించె. మఱియు నంతట విమానమునెక్కిపోవుచు సీతామహాదేవికి ననేక ములగు కౌతుకములను చూపుచుఁబోయె. అట్లు పోవుచుఁ బుష్కరతీర్థమునకుఁ బోయి యక్కడనుండి యనేకములగు పుణ్యస్థలములను సేవించుచుఁబోయె. మఱి యు నారాముఁడు దినదినమందును విమానమునందుండియే యనేకకోట్లమంది బ్రా హ్మణుల కన్నదానమును చేయుచుండె. మఱియును రామునితోఁ గూడ వచ్చిన రాజులందఱును తమతమ వాహనాదులతోఁగూడ పుష్పకవిమానమునందే నివసిం చిరి. మఱియును రామునిచేత వారందఱును చక్కఁగఁ బూజింపఁబడిరి. ఆరాజులలో నొక్కఁడును భిన్నపాకమును చేసినవాఁడు లేఁడు. మఱియును, కాష్ఠతృణాదులలో నొక్కటియును విమానమునందు లేక యుండలేదు. ఆవిమానమునందు సర్వకాల ములయందును వాద్యఘోషము లతిశయించియుండుటచేత నెల్లవారికిని నిద్రాదా రిద్ర్యమున్మాత్రము పట్టియుండె. మఱియు నావిమానమునందు నృత్యాదులను చేయు వారస్త్రీలకు మణిదీపములు వెలుఁగుచుండుటచేత రాత్రింబవళ్ళు తెలియ కుండె. మఱియును సర్వకాలములయందును వారస్త్రీలయొక్క నూపురధ్వనులు మ్రోఁగుచుండె. మఱియు నావాద్యములయొక్కయును ఘంటలయొక్కయును ధ్వనులు సర్వకాలములయందును అతిశయించుచుండె. మఱియును వారస్త్రీల యొక్క కటితటమునందలి యొడ్డాణములధ్వనులు సర్వకాలములయందును సంతో షమును గలిగించుచుండె. మఱియును, ఏనుఁగులు, ఆయుధములు, ఒంటెలు మొద లగువానివలన సర్వకాలములయందును అత్యధికమైన ధ్వని కలిగియుండె. మఱియు ను, వీరులు వేదములు శిష్యులు మొదలగువారివలనఁ గూడ సర్వకాలములయందు ను ధ్వనికలుగుచుండె. గోదోహమువలనఁగూడ ధ్వనిగలుగుచుండె. మఱియును, పె రుగునుద్రచ్చుటవలనఁ గలుగుధ్వనియును,శిశువులయొక్క రోదనధ్వనియును, బాలు రూఁగుచున్న యుయ్యెలధ్వనులును, నానావిధములయిన తూర్యధ్వనులును,పిష్టచక్ర ములవలనఁ బుట్టునట్టిధ్వనులును, నారదాదిమునివరుల వీణాధ్వనులును,పురాణకథన ములవలనఁబుట్టినధ్వనులును,హరికీర్తనమువలనఁ బుట్టినధ్వనులును, రామనామస్తోత్ర ములవలనఁ గలుగుధ్వనులును, ధనుష్టంకారధ్వనులును, కంకణధ్వనులును, పాద ప్రక్షాళనాది కార్యములవలనఁ గలుగుధ్వనులును, సర్వస్థలములయందును అధిక

ముగ మ్రోఁగుచుండె. ఇట్లు కలుగుచున్న నానావిధములగుధ్వనులను పుష్కరము నందున్నవారు వినుచుండిరి. అంతనారాత్రి కడచినపిమ్మట పశ్చిమపుదిక్కును జూచి యెల్లవారును విస్మయమునుపొందిరి. ఆసమయమునందుఁ గొందఱాధ్వని నందిఘంటాధ్వనియని చెప్పిరి. మఱికొందఱు దేవేంద్రుఁడు విమానమునెక్కి యంతరిక్షము నకుఁ బోవుచున్నాఁడనిరి. అంతరిక్షమునుండి రంభాద్యప్సరసలు వచ్చుచున్నారనిరి. మఱికొందఱు మేఘధ్వనియని చెప్పిరి. కొందఱు ఐరావతముయొక్క యాగమనధ్వని యనిరి. మఱికొందఱు సముద్రము ప్రపంచమును ముంచివేయుటకు వచ్చుచున్న దనిరి. కొంద ఱీమహాధ్వని హనుమంతునిధ్వనియనిరి. మఱికొందఱు గరుత్మంతుని యాగమనధ్వనియనిరి. గంధర్వులు అంతరిక్షమునందుండి నృత్యగానములను చేయుచున్నారనిరి. కొందఱు నాగకన్యకలు గానమును చేయుచున్నారనిరి. ఇవ్విధముగ నెల్లవారును నానావిధములుగ నూహించుచుండిరి. పిమ్మటఁ గొంతసేపటికి నెల్లవారును శ్రీరాముఁడు వచ్చుటను తెలిసికొని మిగుల సంతోషమునుపొందిరి. అంతట నెల్లవారును ప్రేమతోఁ గూడుకొనిన మనస్సుకలవారై యనేకములయిన కానుకలను గ్రహించి యారామున కెదురుగ నేఁగుదెంచిరి. అట్లు వచ్చి శ్రీరామునకు నమస్కరించి తమజన్మము సఫలమైనదని తలఁచి రామునిచేత నధికముగఁ బూజింపఁబడిరి. అంతట శ్రీరాముఁడు విమానాగ్రమునుండి దిగి బ్రాహ్మణోత్తములకందఱకును నమస్కరించి వారినందఱిఁబూజించి యా తీర్థవాసులగు బ్రాహ్మణులతోఁ గూడ సర్వోత్తమమగు పుష్కరమునకుఁ బోయె. అనంతరమందు సచేలస్నానమునుచేసి తీర్థశ్రాద్ధాదుల నాచరించె. పిమ్మట కాశీపట్టణమునందుఁ జేసినదానములకంటె నధికదానములను చేసె. మఱియును ద్రవ్యాలంకారాన్నాదులచేత నాబ్రాహ్మణులనందఱను సంతృప్తులనుగాఁ జేసి యందలి బ్రాహ్మణోత్తముల యాజ్ఞనుపొంది విమానమునెక్కి యక్కడనుండి బయలువెడలి పోయె.

ఇట్లని యానందరామాయణమునందలి యెనిమిదవసర్గ ముగిసెను.

---

* ఉత్తరదిగ్యాత్ర. *

అంతట రామదా సిట్లనియె. ఓశిష్యోత్తమా! ఆవిధముగా శ్రీరాముఁ డుత్తరాభిముఖుఁడై యనేకములగుఁ పుణ్యస్థలములను సేవించుచుఁ బర్వతతీర్థమునకు బోయె. అంతట నక్కడనుండి బయలువెడలి జ్వాలాముఖినదికిఁ బోయె. అనంతరమందు అనేకములగు పుణ్యస్థలములను సేవించుచుఁ బోయి శ్రీమనకర్ణికయను నదికిఁబోయె. అనంతరమందు కరతోయానదియందు స్నానముచేసి యానదినిదాఁటి పోఁగూడదని ధర్మశాస్త్రములయందుఁ జెప్పఁబడియుండుటచేత నక్కడనుండి మరలె. మఱియును, కర్మనాశానదినిస్పృశించుటవలనను కరతోయానదిని దాఁటుటవలనను గండకీనదినిబాహులతో దాఁటుటవలనను ధర్మమంతయును నశించిపోవునని యార్యు

లుపలుకుదురు. కావున శ్రీరాముఁడా నదినిదాఁటక యలకనందాతటము ననుసరించి దేవప్రయాగకుఁ బోయె. అనంతరమందు నరనారాయణక్షేత్రమునకుఁబోయి ముక్తిదాయకులగు నరనారాయణులనుజూచె. అంతట నక్కడనుండి బయలువెడలి పోయి బదరికాశ్రమమునందలి కేదారేశునకు నమస్కరించి యక్కడనుండి బయలువెడలి దేవగంధర్వాదులచేత సేవింపఁబడుచున్న హిమాలయమునకుఁ బోయె. అంతట శ్రీరాముఁడు మహాపథమును పొంది మానససరోవరమునకుఁ బోయె. ఆ మానస సరోవరమునుండియే గంగ సరయుపాపనాశని అను నదులుకలిగినవి. మఱియు నాసరస్సునందు రాజహంస లనేకములు నివసించుచుండిరి. మఱియు నాప్రదేము నందు దేవగంధర్వకిన్నరులు అప్సరస్త్రీలతోఁగూడ క్రీడించుచుందురు. అంతట శ్రీరాముఁడామానససరోవరమునందు స్నానమునుచేసి యక్కడనుండి బిందుసరోవరమునకుఁ బోయె. పిమ్మట నాసరోవరమునందుఁగూడ స్నానమునుచేసి యనేకములగు దానాదులను చేసె. అనంతరమందు హిమాలయపర్వతమందున్న బ్రహ్మసభనుచూచి సీతమొదలగువారితోఁ గూడ పుష్పకవిమానమునుండి దిగి బ్రహ్మదేవునకు నమస్కరించుచున్న యింద్రాదులను కౌఁగిలించుకొని బ్రహ్మమొదలగు దేవతలను పూజించె. అంతట బ్రహ్మదేవుఁడు శ్రీరాముని పూజించె. అనంతరమందు బ్రహ్మదేవుఁడు కామధేనువును శ్రీరామునకు సమర్పించె. అంతట శ్రీరాముఁడాకామధేనువును విమానాగ్రమునందుంచుకొని బ్రహ్మాదిదేవతలతోఁగూడ కైలాసమునకుఁ బోయె. అప్పుడు పరమశివుఁడు కైలాసపర్వతమునకు వచ్చిన వృత్తాంతమును విని వృషభవాహనాధిష్ఠితుఁడై పార్వతితోఁగూడ నెదురుగఁ బోయె. అట్లు పరమశివుఁడు వచ్చుటను తెలిసికొని పుష్పకవిమానమునుండి దిగి పరమశివునకు నమస్కరించె. అంతటఁ బరమశివునిచేత కౌఁగిలించుకొనఁబడియె. పార్వతీదేవి సీతామహాదేవిని కౌఁగిలించుకొనియె. అనంతరమందు వస్త్రాద్యలంకారములచేత సీతారాములు పూజింపఁబడిరి. మఱియును, సీతామహాదేవికి తాటంకములు నూపురములు మొదలగు నాభరణములను సమర్పించె. మఱియును పార్వతీదేవి మహాసంతోషముకలదై యనేకములగు దివ్యాభరణముల నొసంగె. అంతట పరమశివుఁడు శ్రీరాముని పూజించి యిట్లనియె. ఓరఘుకులోత్తమా! ఈబ్రహ్మదేవుఁడు నీనాభికమలమువలన జన్మమునొందె. ఆబ్రహ్మదేవునివలన నేను బుట్టితిని. పుట్టునపుడు రోదనమును చేయుటవలన రుద్రుఁడను నామధేయముకలవాఁడనైతిని. ఓరఘుకులోత్తమా! నేను నీకు మనుమఁడను. కావున నీయాజ్ఞను పరిపాలించువాఁడనైతిని. ఓరాముఁడా! నీయాజ్ఞచేత నేను జగత్సంహారమును చేయుచున్నాఁడను. ఓరాముఁడా! ప్రళయకాలమునందు నేను సకలప్రపంచమును నాశమును చేయుటవలనఁ గలుగుపాపము నీదేకదా? అదియెట్లు పోవుచున్నది. ఆపాపమంతయును పోకయుండఁగా నీవు రావణునిజంపుటవలనఁ గలి

గినపాపము పోవుటకు నీవు తీర్థయాత్రను చేయుటవిచిత్రముగనున్నది. నీవు యాత్రార్థముగ గ్రీడించుచున్నావని తలఁచుచున్నాను. కావున సీతతోఁగూడఁ గ్రీడింపుము. మఱియును నీవు లోకశిక్షకొఱకు ఇట్లు చేయుచున్నావని తలఁచుచున్నాఁడను.నీ యభిప్రాయచేష్టలనన్నింటిని నేనెఱుఁగుదు ననియె. ఈవిధముగ నానావిధములగుచరిత్రములచేత పరమశివుఁడు శ్రీరామునిస్తోత్రముచేసి సింహాసనచ్ఛత్రములను చామరములను శ్రేష్ఠమగు మంచకమును, పానపాత్ర భోజనపాత్రలను కంకణకుండలములను నానావిధములగు భూషణములను మకుటోత్తమములను ఇచ్చి రాముని హృదయమునందుచింతామణినికట్టి ప్రయాణమును చేయించి పంపె. అంతట సీతామహాదేవి రాముని హృదయమునందుఁ గట్టఁబడియున్న చింతామణిని చూచి సిగ్గుగలదై యిట్లనియె. ఓరఘుకులోత్తమా ! చింతామణి నీదియనియును కామధేనువు నాదియనియును నేను తలఁచుచున్నాననియె. శ్రీరాముఁ డందుల కంగీకారమును పొంది యెల్లవారితోఁ గూడ విమానము నెక్కి బ్రహ్మశివులకు నమస్కరించి తాను మాసముదినములకుఁ బిమ్మట యజ్ఞమును చేసెదననియును అప్పుడు హవ్యములను గైకొనుటకు రావలయుననియును సూచనను చేసె. అంతట నారాముఁడు భాగీరథీతటము వెంబడి హరిద్వారమను క్షేత్రమునకు వచ్చె. అంతట కురుక్షేత్రమునకుఁబోయి యక్కడ స్నానదానాదుల నాచరించి యక్కడనుండి బయలువెడలి యింద్రప్రస్థమునకుఁ బోయె. అనంతరమందు రమ్యమగు మధువనమునకుఁ బోయి యక్కడనుండి బృందావనమునకుఁబోయె. అనంతరమందు గోవర్ధనపర్వతమును చూచి యక్కడనుండి గోకులమునకుఁబోయె. అనంతరమందు క్షిప్రాతీరముచేత ప్రకాశించుచున్నదియును పావనమైనదియును, అయిన యవంతికాక్షేత్రమునకుఁ బోయె. అంతట మహాకాళేశ్వరునకు నమస్కరించి యక్కడనుండి యనేకములయిన తీర్థములను సేవించుచుఁ బోయె. అనంతర మంగజాహ్వయక్షేత్రమును కూపసాగరమును జూచి యక్కడనుండి నైమిశారణ్యమునకుఁ బోయె. అట్లుపోయి గోమతీనదియందు స్నానమును చేసి పౌరాణికుఁడగు సూతునిజూచి శౌనకాదిమునివరులను బూజించె. అనంతరమందు బ్రహ్మావైవర్తమను సరస్సునందు స్నానమునుచేసె. అనంతరమందు తమసానదియందు స్నానమునుచేసి యంతట నిజనగరమగు నయోధ్యాపట్టణమునకుఁ బోయె. ఆసమయమునందు సుమంత్రుఁడను మంత్రిపుంగవుఁడు శ్రీరాముఁడు సపరివారముగవచ్చిన వృత్తాంతమును విని మిగుల త్వరకలవాఁడై యయోధ్యాపట్టణమును సర్వమును నలంకరింపఁ జేసె. మఱియును, పట్టణమునందంతటను తోరణధ్వజాదులచేత నలంకారమును గావించె. మఱియును, రాజమార్గములయందు చందనోదకములచేత సేచనమును చేసె. పట్టణమునందంతటను దీపాద్యలంకారములను చేయించె. మఱియును, పట్టణమునందంతటను పూలమాలికలను కట్టించె. అనంతరమందు వారణేంద్రమును ముందిడుకొని సేనాసమేతుఁడై పుష్పకవిమానమునం

దున్న శ్రీరాముని కభిముఖముగఁ బోయె. అట్లుపోయి నమస్కరించి యనేకము లయిన కానుకలను సమర్పించె. మఱియును, ఆసమయమునందు వారస్త్రీలయొక్క నృత్యములును గాయకుల గానములును మిగుల మనోహరములై యుండె. అప్పుడు శ్రీరాముఁడు సుమంత్రుని కౌఁగిలించుకొనుటచేత సుమంత్రుఁడు ధన్యుఁడనైతి ననియె. ఆసమయమునందు బ్రాహ్మణుల వేదఘోషములతోఁ గూడ శ్రీరాముఁడు మెల్లగ రామతీర్థమునకుఁ బోయె. పోయి సరయూజలమునందు స్నానమును చేసి పూర్వము నిత్యకర్మానుష్ఠానముకొఱకు తనచేతఁ జేయఁబడిన తీర్థమునందు వసిష్ఠుఁడు చెప్పినరీతిగా నొకదిన ముపవసించి యనంతరమందు దధిశ్రాద్ధమును చేసి యక్కడ ననేకములయిన దానములను చేసె. అంతట మూఁడవదినమునందు విమానమునెక్కి హేమరత్నాది నిర్మితములయిన ప్రాకారములను అతిక్రమించి గోపురాట్టాలములచేత నలంకరింపఁబడినదియును రమ్యమైనదియును, అయిన యయోధ్యాపట్టణమును సర్వమును చూచుచు రాజు సభాద్వారమునందుఁ బ్రవేశించె. అనంతరమందు పుష్పకవిమానముకూడ క్రిందికివ్రాలి భూమియందు స్వస్థముగనుండె. పిమ్మట సుమంత్రునిభార్యలు సీతారామాదులకు దధ్యోదనాదులచేత శాంతికర్మములను చేసిరి. అనంతరమందు రాముండు విమానాగ్రమునుండి దిగి నాగరులతోడను రాజులతోడను కూడుకొనినవాఁడై సభయందుఁ బ్రవేశించె. అంతట చింతామణిచేత ప్రకాశించుచున్న శ్రీరాముఁడు సింహాసనమునందుఁ గూర్చుండె. పిమ్మట రామునిచేత సన్మానింపఁబడి యెల్లవారును తగినయాసనములయందుఁ గూర్చుండిరి. అంతట సీతామహాదేవి కామధేనువును ముందిడుకొని విచిత్రరత్నములచేత నిర్మింపఁబడిన యంతఃపురమునందుఁ బ్రవేశించె. పిమ్మట నాసీతామహాదేవి కామధేనువువలనఁ బుట్టిన ఘృతాదులవలన చేయఁబడిన పక్వాన్నాదులచేత బ్రాహ్మణులకు మిగులఁ దృప్తికలుగునటుల నన్నదానమునుచేసె. మఱియు ననంతరమందు ఆచండాలాంతము కల జనులకందఱకును షడ్రసోపేతమగు నన్నమును పెట్టించె. అంతట రాముఁడు తనతోవచ్చిన రాజాదులందఱును విహారనిద్రాదులను పొందుటకు విమానమునందుండుఁడని నియమించె. అవ్విధముగ నైదుదినములు నివసింపఁజేసి యనంతరమందు వస్త్రాలంకారాదులచేత నెల్లవారిని సన్మానించి వారితో నిట్లనియె. ఓ రాజోత్తమాదులారా! నాయజ్ఞాంగమగు తురగమును వెంబడించి మీరందఱును మరల విమానమునెక్కి మీదేశములకుఁ బోయి చూచి సపరివారముగ మరలవచ్చునట్లు ప్రార్థించెదననియె. అట్లు శ్రీరాముఁడు చెప్పినవాక్యములను విని రాజులందఱును అంగీకరించి పరివారజనముతోఁగూడ తమతమ దేశములకుఁ బోయిరి. అంతట శ్రీరాముఁడు సుగ్రీవాదివానరులనందఱను పరివారముతోఁగూడ నశ్వమేధయాగమునఱకును ఇక్కడనే యుండుడని చెప్పి వారికిఁ దగినమందిరముల నేర్పఱిచె. అంతట పట్టణమునందంతటను ఇది

మొదలుకొని నేనుజీవించినపఱకును పట్టణములోనివారందఱును భిన్నపాకమును చేసి ముగింపఁగూడదని దుందుభిధ్వనులతో జాటింపఁజేయించె. మఱియును గృహస్థధర్మము నవలంబించి పరపక్వాన్నమును భుజింపనివారు స్వయముగాపాకమును చేసికొని నాగృహమునందే భుజింపవలయుననియును, వారివారి యిష్టానుసారముగ స్వగృహమునందు ప్రవర్తించు నావలన నిర్బంధమేదియును లేదనియును తెలిపించె. ఇవ్విధముగ నెల్లరకును దెలిపి శ్రీరాముఁడు యథేచ్ఛముగ సీతామహాదేవితోఁగూడ స్వగృహమునందు నివసించె. మఱియు నయోధ్యాపట్టణమునందలి ప్రతిగృహము నందును వేదఘోష మతిశయించె. మఱియును, పట్టణమునందంతటను వారస్త్రీల నృత్యములు మనోహరములై యుండె. మఱియును పట్టణమునందంతటను పురాణకథలుప్రవర్తించుచుండె. హరినామసంకీర్తనలెల్లయెడలను జరుగుచుండె. ఈవిధముగ నయోధ్యాపట్టణము సకలశుభములచేతను నొప్పియుండె. ఓశిష్యోత్తమా! ఇప్పుడునాచేత చెప్పఁబడిన యాత్రాకాండమును వినునట్టివారు యాత్రాఫలమును పొందుదురు. యాత్రాధనార్జనోద్యోగపరులు ఈకథను పఠించిపోయిన యెడల సుఖముగ మరల గృహమునకు వత్తురు. ఈయాత్రాకాండమును భక్తితోపఠించువారికి బ్రహ్మహత్యాది సకలపాపములును తొలఁగిపోవును. మఱియు నీయాత్రాకాండమునువినువారుసకలతీర్థస్నానఫలమును పొందుదురు. ధనార్థియగువాఁడు ధనమును పొందును. మఱియును, యాత్రాకాండమును వినుటచేత పాపరహితుఁడగును. మఱియు నోశిష్యోత్తమా! విష్ణుదాసా! లోకములో నెవ్వఁడైనను ప్రాతఃకాలమునకు ముందుగ నిద్రనుండిలేచి శౌచాచమనాదుల నాచరించి యీ యాత్రాకాండమును పఠించెనేని అట్టివానికి రాముఁడు సంతుష్టుఁడై సర్వతీర్థములయందును స్నానమును చేయుటవలనఁ గలుగుఫలమును కలుగఁజేయును. మఱియు నీ యాత్రాకాండమును వినుటచేత సకలపాపములును నశించును.

ఇట్లని శతకోటిరామచరిత్రములోనిదియును, వాల్మీకిమునివరునిచేత రచింపఁబడినదియును అయిన శ్రీమదానందరామాయణమునందలి యాత్రాకాండమునందు రామదాస విష్ణుదాస సంవాదమును తెలుపునట్టి తొమ్మిదవసర్గ ముగిసెను.

ఆనందరామాయణము, యాత్రాకాండము

సంపూర్ణము.

స్త్రప్రకారముగ స్నానదానములనుచేసి ద్వారావతికిఁబోయె. అంతట నక్కడనుండు నట్టి యేడగుపట్టణములయందు అనాదిసిద్ధమును, ప్రసిద్ధమును, శుభకరమును అయిన నదియందు స్నానమునుచేసి తీర్థవిధులను జరపి యనేకములయిన దానములనుచేసి యక్కడనుండి బయలువెడలి యనేకములయిన పుణ్యక్షేత్రములను చూచుచుఁబోయె. అట్లుపోయి పశ్చిమదేశపురాజులచేతఁ బూజింపఁబడినవాఁడై వారివలన పన్నును గ్రహించి వారితోఁగూడ బయలువెడలి పోయె. పిమ్మట సరస్వతీనదియొక్క తటమును అనుసరించియే పోవుచు ననేకములయిన పుణ్యస్థలములనుసేవించె. మఱియు నంతట విమానమునెక్కిపోవుచు సీతామహాదేవికి ననేకములగు కౌతుకములను చూపుచుఁబోయె. అట్లు పోవుచుఁ బుష్కరతీర్థమునకుఁ బోయి యక్కడనుండి యనేకములగు పుణ్యస్థలములను సేవించుచుఁబోయె. మఱియు నారాముఁడు దినదినమందును విమానమునందుండియే యనేకకోట్లమంది బ్రాహ్మణుల కన్నదానమును చేయుచుండె. మఱియును రామునితోఁ గూడ వచ్చిన రాజులందఱును తమతమ వాహనాదులతోఁగూడ పుష్పకవిమానమునందే నివసించిరి. మఱియును రామునిచేత వారందఱును చక్కఁగఁ బూజింపఁబడిరి. ఆరాజులలో నొక్కఁడును భిన్నపాకమును చేసినవాఁడు లేఁడు. మఱియును, కాష్ఠతృణాదులలో నొక్కటియును విమానమునందు లేక యుండలేదు. అవిమానమునందు సర్వకాలములయందును వాద్యఘోషము లతిశయించియుండుటచేత నెల్లవారికిని నిద్రాదారిద్ర్యముమాత్రము పట్టియుండె. మఱియు నావిమానమునందు నృత్యాదులను చేయు వారస్త్రీలకు మణిదీపములు వెలుఁగుచుండుటచేత రాత్రింబవళ్ళు తెలియకుండె. మఱియును సర్వకాలములయందును వారస్త్రీలయొక్క నూపురధ్వనులు మ్రోఁగుచుండె. మఱియు నావాద్యములయొక్కయును ఘంటలయొక్కయును ధ్వనులు సర్వకాలములయందును అతిశయించుచుండె. మఱియును వారస్త్రీలయొక్క కటితటమునందలి యొడ్డాణములధ్వనులు సర్వకాలములయందును సంతోషమును గలిగించుచుండె. మఱియును, ఏనుఁగులు, ఆయుధములు, ఒంటెలు మొదలగువానివలన సర్వకాలములయందును అత్యధికమైన ధ్వని కలిగియుండె. మఱియును, వీరులు వేదములు శిష్యులు మొదలగువారివలనఁ గూడ సర్వకాలములయందును ధ్వనికలుగుచుండె. గోదోహమువలనఁగూడ ధ్వనిగలుగుచుండె. మఱియును, పెరుగునుద్రచ్చుటవలనఁ గలుగుధ్వనియును,శిశువులయొక్క రోదనధ్వనియును, బాలురూఁగుచున్న యుయ్యెలధ్వనులును, నానావిధములయిన తూర్యధ్వనులును,పిష్టచక్రములవలనఁ బుట్టునట్టిధ్వనులును, నారదాదిమునివరుల వీణాధ్వనులును,పురాణకణనములవలనఁబుట్టినధ్వనులును,హరికీర్తనమువలనఁ బుట్టినధ్వనులును,రామనామస్తోత్రములవలనఁ గలుగుధ్వనులును, ధనుష్టంకారధ్వనులును, కంకణధ్వనులును, పాదప్రక్షాళనాది కార్యములవలనఁ గలుగుధ్వనులును, సర్వస్థలములయందును అధిక

ముగ మ్రోఁగుచుండె. ఇట్లు కలుగుచున్న నానావిధములగుధ్వనులను పుష్పకము నందున్నవారు వినుచుండిరి. అంతనా రాత్రి కడచినపిమ్మట పశ్చిమపుదిక్కును జూచి యెల్లవారును విస్మయమునుపొందిరి. ఆసమయమునందుఁ గొందఱాధ్వని నందిఘంటాధ్వనియని చెప్పిరి. మఱికొందఱు దేవేంద్రుఁడు విమానమునెక్కి యంతరిక్షమునకుఁ బోవుచున్నాఁడనిరి. అంతరిక్షమునుండి రంభాద్యప్సరసలు వచ్చుచున్నారనిరి. మఱికొందఱు మేఘధ్వనియని చెప్పిరి. కొందఱు ఐరావతముయొక్క యాగమనధ్వనియనిరి. మఱికొందఱు సముద్రము ప్రపంచమును ముంచివేయుటను వచ్చుచున్నదనిరి. కొంద ఱీమహాధ్వని హనుమంతునిధ్వనియనిరి. మఱికొందఱు గరుత్మంతుని యాగమనధ్వనియనిరి. గంధర్వులు అంతరిక్షమునందుండి నృత్యగానములను చేయుచున్నారనిరి. కొందఱు నాగకన్యకలు గానమును చేయుచున్నారనిరి. ఇవ్విధముగ నెల్లవారును నానావిధములుగ నూహించుచుండిరి. పిమ్మటఁ గొంతసేపటికి నెల్లవారును శ్రీరాముఁడు వచ్చుటను తెలిసికొని మిగుల సంతోషమునుపొందిరి. అంతట నెల్లవారును ప్రేమతోఁ గూడుకొనిన మనస్సుకలవారై యనేకములయిన కానుకలను గ్రహించి యారామున కెదురుగ నేఁగుదెంచిరి. అట్లు వచ్చి శ్రీరామునకు నమస్కరించి తమజన్మము సఫలమైనదని తలఁచి రామునిచేత నధికముగఁ బూజింపఁబడిరి. అంతట శ్రీరాముఁడు విమానాగ్రమునుండి దిగి బ్రాహ్మణోత్తముల కందఱకును నమస్కరించి వారినందఱిం బూజించి యా తీర్థవాసులగు బ్రాహ్మణులతోఁ గూడ సర్వోత్తమమగు పుష్కరమునకుఁ బోయె. అనంతరమందు సచేలస్నానమునుచేసి తీర్థశ్రాద్ధాదుల నాచరించె. పిమ్మట కాశీపట్టణమునందుఁ జేసినదానములకంటె నధికదానములను చేసె. మఱియును ద్రవ్యాలంకారాన్నాదులచేత నాబ్రాహ్మణులనందఱను సంతృప్తులనుగాఁ జేసి యాదలి బ్రాహ్మణోత్తముల యాజ్ఞనుపొంది విమానమునెక్కి యక్కడనుండి బయలువెడలి పోయె.

ఇట్లని యానందరామాయణమునందలి యెనిమిదవసర్గ ముగిసెను.

---

* ఉత్తరదిగ్యాత్ర. *

అంతట రామదాసిట్లనియె. ఓశిష్యోత్తమా! ఆవిధముగా శ్రీరాముఁడుత్తరాభిముఖుఁడై యనేకములగుఁ పుణ్యస్థలములను సేవించుచుఁ బర్వతతీర్థమునకు బోయె. అంతట నక్కడనుండి బయలువెడలి జ్వాలాముఖినదికిఁ బోయె. అనంతరమందు అనేకములగు పుణ్యస్థలములను సేవించుచుఁ బోయి శ్రీమనకర్ణికయను నదికిఁబోయె. అనంతరమందు కరతోయానదియందు స్నానముచేసి యానదినిదాఁటి పోఁగూడదని ధర్మశాస్త్రములయందుఁ జెప్పఁబడియుంచుటచేత నక్కడనుండి మరలె. మఱియును, కర్మనాశానదినిస్పృశించుటవలనను కరతోయానదిని దాఁటుటవలనను గండకీనదినిబావులతో దాఁటుటవలనను ధర్మమంతయును నశించిపోవునని యాత్య

లుపలుకుదురు. కావున శ్రీరాముఁ డానదినిదాఁటక యలకనందాతటము ననుస
రించి దేవప్రయాగకుఁ బోయె. అనంతరమందు నరనారాయణక్షేత్రమునకుఁబోయి
ముక్తిదాయకులగు నరనారాయణులనుజూచె. అంతట నక్కడనుండి బయలువెడలి
పోయి బదరికాశ్రమమునందలి కేదారేశునకు నమస్కరించి యక్కడనుండి బయ
లువెడలి దేవగంధర్వాదులచేత సేవింపఁబడుచున్న హిమాలయమునకుఁ బోయె.
అంతట శ్రీరాముఁడు మహాపథమును పొంది మానససరోవరమునకుఁ బోయె. ఆ
మానస సరోవరమునుండియే గంగ సరయుపాపనాశని అను నదులుకలిగినవి. మఱియు
నాసరస్సునందు రాజహంస లనేకములు నివసించుచుండిరి. మఱియు నాప్రదేశము
నందు దేవగంధర్వకిన్నరులు అప్సరస్త్రీలతోఁగూడ క్రీడించుచుందురు. అంతట
శ్రీరాముఁ డామానససరోవరమునందు స్నానమునుచేసి యక్కడనుండి బిందు
సరోవరమునకుఁ బోయె. పిమ్మట నాసరోవరమునందుఁగూడ స్నానమునుచేసి
యనేకములగు దానాదులను చేసె. అనంతరమందు హిమాలయపర్వతమం దున్న
బ్రహ్మసభనుచూచి సీతమొదలగువారితోఁ గూడ పుష్పకవిమానమునుండి దిగి బ్ర
హ్మదేవునకు నమస్కరించుచున్న యింద్రాదులను కౌఁగిలించుకొని బ్రహ్మమొద
లగు దేవతలను పూజించె. అంతట బ్రహ్మదేవుఁడు శ్రీరాముని పూజించె. అ
నంతరమందు బ్రహ్మదేవుఁడు కామధేనువును శ్రీరామునకు సమర్పించె. అం
తట శ్రీరాముఁ డాకామధేనువును విమానాగ్రమునం దుంచుకొని బ్రహ్మాది
దేవతలతోఁగూడ కైలాసమునకుఁ బోయె. అప్పుడు పరమశివుఁడు కైలాసప
ర్వతమునకు వచ్చిన వృత్తాంతమును విని వృషభవాహనాధిష్ఠితుఁడై పార్వతితోఁ
గూడ నెదురుగఁ బోయె. అట్లు పరమశివుఁడు వచ్చుటను తెలిసికొని పుష్పకవిమా
నమునుండి దిగి పరమశివునకు నమస్కరించె. అంతటఁ బరమశివునిచేత కౌఁగిలించు
కొనఁబడియె. పార్వతీదేవి సీతామహాదేవిని కౌఁగిలించుకొనియె. అనంతరమందు వ
స్త్రాద్యలంకారములచేత సీతారాములు పూజింపఁబడిరి. మఱియును, సీతామహా
దేవికి తాటంకములు నూపురములు మొదలగు నాభరణములను సమర్పించె.
మఱియును పార్వతీదేవి మహాసంతోషముకలదై యనేకములగు దివ్యాభరణ
ముల నొసంగె. అంతట పరమశివుఁడు శ్రీరాముని పూజించి యిట్లనియె. ఓరఘు
కులోత్తమా! ఈబ్రహ్మదేవుఁడు నీనాభికమలమువలన జన్మమునొందె. ఆబ్ర
హ్మదేవునివలన నేను బుట్టితిని. పుట్టునపుడు రోదనమును చేయుటవలన రుద్రుఁడను
నామధేయముకలవాఁడ నైతిని. ఓరఘుకులోత్తమా! నేను నీకు మనుమఁడను. కా
వుననీయాజ్ఞను పరిపాలించువాఁడ నైతిని. ఓరాముఁడా! నీయాజ్ఞచేత నేను జగత్సం
హారమును చేయుచున్నాఁడను. ఓరాముఁడా! ప్రళయకాలమునందు నేను సకల
ప్రపంచమును నాశమును చేయుటవలనఁ గలుగుపాపము నీదేకదా? అదియెట్లు
పోవుచున్నది. ఆపాపమంతయును పోకయుండఁగా నీవు రావణునిజంపుటవలనఁ గలి

గినపాపము పోవుటకు నీవు తీర్థయాత్రను చేయుటవిచిత్రముగనున్నది. నీవు యాత్రార్థముగ గ్రీడించుచున్నావని తలఁచుచున్నాను. కావున సీతతోఁ గూడఁ గ్రీడింపుము. మఱియును నీవు లోకశిక్షకొఱకు ఇట్లు చేయుచున్నావని తలఁచుచున్నాఁడను. నీ యభిప్రాయచేష్టలనన్నింటిని నేనెఱుఁగుదు ననియె. ఈవిధముగ నానావిధములగుచరిత్రములచేత పరమశివుఁడు శ్రీరాముని స్తోత్రముచేసి సింహాసనచ్ఛత్రములను చామరములను శ్రేష్ఠమగు మంచకమును, పానపాత్ర భోజనపాత్రలను కంకణకుండలములను నానావిధములగు భూషణములను మకుటోత్తమములను ఇచ్చి రాముని హృదయమునందుచింతామణినికట్టి ప్రయాణమును చేయించి పంపె. అంతట సీతామహాదేవి రాముని హృదయమునందుఁ గట్టఁబడియున్న చింతామణిని చూచి సిగ్గుగలదై యిట్లనియె. ఓరఘుకులోత్తమా! చింతామణి నీదియనియును కామధేనువు నాదియనియును నేను తలఁచుచున్నాననియె. శ్రీరాముఁ డందుల కంగీకారమును పొంది యెల్లవారితోఁ గూడ విమానము నెక్కి బ్రహ్మశివులకు నమస్కరించి తాను మాసముదినములకుఁ బిమ్మట యజ్ఞమును చేసెదననియును అప్పుడు హవ్యములను గైకొనుటకు రావలయుననియును సూచనను చేసె. అంతట నారాముఁడు భాగీరథీతటము వెంబడి హరిద్వారమను క్షేత్రమునకు వచ్చె. అంతట కురుక్షేత్రమునకుఁబోయి యక్కడ స్నానదానాదుల నాచరించి యక్కడనుండి బయలువెడలి యింద్రప్రస్థమునకుఁ బోయె. అనంతరమందు రమ్యమగు మధువనమునకుఁ బోయి యక్కడనుండి బృందావనమునకుఁబోయె. అనంతరమందు గోవర్ధనపర్వతమును చూచి యక్కడనుండి గోకులమునకుఁబోయె. అనంతరమందు క్షిప్రాతీరముచేత ప్రకాశించుచున్నదియును పావనమైనదియును, అయిన యవంతికాక్షేత్రమునకుఁ బోయె. అంతట మహాకాళేశ్వరునకు నమస్కరించి యక్కడనుండి యనేకములయిన తీర్థములను సేవించుచుఁ బోయె. అనంతర మంగజాహ్వయక్షేత్రమును కూపసాగరమును జూచి యక్కడనుండి నైమిశారణ్యమునకుఁ బోయె. అట్లుపోయి గోమతీనదియందు స్నానమును చేసి పౌరాణికుఁడగు సూతునిజూచి శౌనకాదిమునివరులను బూజించె. అనంతరమందు బ్రహ్మావర్తమను సరస్సునందు స్నానమునుచేసి. అనంతరమందు తమసానదియందు స్నానమునుచేసి యంతట నిజనగరమగు నయోధ్యాపట్టణమునకుఁ బోయె. ఆసమయమునందు సుమంత్రుఁడను మంత్రిపుంగవుఁడు శ్రీరాముఁడు సపరివారముగవచ్చిన వృత్తాంతమును విని మిగుల త్వరకలవాఁడై యయోధ్యాపట్టణమును సర్వమును నలంకరింపఁ జేసె. మఱియును, పట్టణమునందంతటను తోరణధ్వజాదులచేత నలంకారమును గావించె. మఱియును, రాజమార్గములయందు చందనోదకములచేత సేచనమును చేసె. పట్టణమునందంతటను దీపాద్యలంకారములను చేయించె. మఱియును, పట్టణమునందంతటను పూలమాలికలను కట్టించె. అనంతరమందు వారణేంద్రమును ముందిడుకొని సేనాసమేతుఁడై పుష్పకవిమానమునం

డున్న శ్రీరామున కభిముఖముగఁ బోయె. అట్లుపోయి నమస్కరించి యనేకము లయిన కానుకలను సమర్పించె. మఱియును, ఆసమయమునందు వారస్త్రీలయొక్క నృత్యములును గాయకుల గానములును మిగుల మనోహరములై యుండె. అప్పుడు శ్రీరాముఁడు సుమంత్రుని కౌఁగిలించుకొనుటచేత సుమంత్రుఁడు ధన్యుఁడనైతి ననియె. ఆసమయమునందు బ్రాహ్మణుల వేదఘోషములతోఁ గూడ శ్రీరాముఁడు మెల్లగ రామతీర్థమునకుఁ బోయె. పోయి సరయూజలమునందు స్నానమును చేసి పూర్వము నిత్యకర్మానుష్ఠానముకొఱకు తనచేతఁ జేయఁబడిన తీర్థమునందు వసిష్ఠుఁడు చెప్పినరీతిగా నొకదిన ముపవసించి యనంతరమందు దధిశ్రాద్ధమును చేసి యక్కడ ననేకములయిన దానములను చేసె. అంతట మూఁడవదినమునందు విమానమునెక్కి హేమరత్నాది నిర్మితములయిన ప్రాకారములను అతిక్రమించి గోపురాట్టాలములచేత నలంకరింపఁబడినదియును రమ్యమైనదియును, అయిన యయోధ్యాపట్టణమును సర్వమును చూచుచు రాజు సభాద్వారమునందుఁ బ్రవేశించె. అనంతరమందు పుష్పకవిమానముకూడ క్రిందికిదిగి భూమియందు స్వస్థముగనుండె. పిమ్మట సుమంత్రునిభార్యలు సీతారామాదులకు దధ్యోదనాదులచేత శాంతికర్మములను చేసిరి. అనంతరమందు రాముండు విమానాగ్రమునుండి దిగి నాగరులతోడను రాజులతోడను కూడుకొనినవాఁడై సభయందుఁ బ్రవేశించె. అంతట చింతామణిచేత ప్రకాశించుచున్న శ్రీరాముఁడు సింహాసనమునందుఁ గూర్చుండె. పిమ్మట రామునిచేత సన్మానింపఁబడి యెల్లవారును తగినయాసనములయందుఁ గూర్చుండిరి. అంతట సీతామహాదేవి కామధేనువును ముందిడుకొని విచిత్రరత్నములచేత నిర్మింపఁబడిన యంతగపురమునందుఁ బ్రవేశించె. పిమ్మట నాసీతామహాదేవి కామధేనువువలనఁ బుట్టిన ఘృతాదులవలన చేయఁబడిన పక్వాన్నాదులచేత బ్రాహ్మణులకు మిగులఁ దృప్తికలుగునటుల నన్నదానమునుచేసె. మఱియు ననంతరమందు ఆచండాలాంతము కల జనులకందఱకును షడ్రసోపేతమగు నన్నమును పెట్టించె. అంతట రాముఁడు తనతోవచ్చిన రాజాదులందఱును విహారనిద్రాదులను పొందుటకు విమానమునందుండుఁడని నియమించె. అవ్విధముగ నైదుదినములు నివసింపఁజేసి యనంతరమందు వస్త్రాలంకారాదులచేత నెల్లవారిని సన్మానించి వారితో నిట్లనియె. ఓ రాజోత్తమాదులారా ! నాయజ్ఞాంగమగు తురగమును వెంబడించి మీరందఱును మరల విమానమునెక్కి మీదేశములకుఁ బోయి చూచి సపరివారముగ మరలవచ్చునట్లు ప్రార్థించెదననియె. అట్లు శ్రీరాముఁడు చెప్పినవాక్యములను విని రాజులందఱును అంగీకరించి పరివారజనముతోఁగూడ తమతమదేశములకుఁ బోయిరి. అంతట శ్రీరాముఁడు సుగ్రీవాదివానరులనందఱను పరివారముతోఁగూడ నశ్వమేధయాగమువఱకును ఇక్కడనేయుండుడని చెప్పి వారికిఁ దగినమందిరముల నేర్పఱిచె. అంతట పట్టణమునందంతటను ఇది

మొదలుకొని నేనుజీవించినవఱకును పట్టణములోనివారందఱును భిన్నపాకమును చేసి ముగింపఁగూడదని దుందుభిధ్వనులతో జాటింపఁజేయించె. మఱియును గృహస్థధర్మము నవలంబించి పరపక్వాన్నమును భుజింపనివారు స్వయముగాపాకమును చేసికొని నాగృహమునందే భుజింపవలయుననియును, వారివారి యిష్టానుసారముగ స్వగృహమునందు ప్రవర్తింప నావలన నిర్బంధమేదియును లేదనియును తెలిపించె. ఇవ్విధముగ నెల్లరకును దెలిపి శ్రీరాముఁడు యథేచ్ఛముగ సీతామహాదేవితోఁగూడ స్వగృహమునందు నివసించె. మఱియు నయోధ్యాపట్టణమునందలి ప్రతిగృహమునందును వేదఘోష మతిశయించె. మఱియును, పట్టణమునందంతటను వారస్త్రీల నృత్యములు మనోహరములై యుండె. మఱియును పట్టణమునందంతటను పురాణకథలుప్రవర్తించుచుండె. హరినామసంకీర్తనలెల్లయెడలను జరుగుచుండె. ఈవిధముగ నయోధ్యాపట్టణము సకలశుభములచేతను నొప్పియుండె. ఓశిష్యోత్తమా! ఇప్పుడునాచేత చెప్పఁబడిన యాత్రాకాండమును వినునట్టివారు యాత్రాఫలమును పొందుదురు. యాత్రాధనార్జనోద్యోగపరులు ఈకథను పఠించిపోయిన యెడల సుఖముగ మరల గృహమునకు వత్తురు. ఈయాత్రాకాండమును భక్తితోపఠించువారికి బ్రహ్మహత్యాది సకలపాపములును తొలఁగిపోవును. మఱియు నీయాత్రాకాండమునువినువారుసకలతీర్థస్నానఫలమును పొందుదురు. ధనార్థియగువాఁడు ధనమును పొందును. మఱియును, యాత్రాకాండమును వినుటచేత పాపరహితుఁడగును. మఱియు నోశిష్యోత్తమా! విష్ణుదాసా! లోకములో నెవ్వఁడైనను ప్రాతఃకాలమునకు ముందుగ నిద్రనుండిలేచి శౌచాచమనాదుల నాచరించి యీ యాత్రాకాండమును పఠించెనేని అట్టివానికి రాముఁడు సంతుష్టుఁడై సర్వతీర్థములయందును స్నానమును చేయుటవలనఁ గలుగుఫలమును కలుగఁజేయును. మఱియు నీ యాత్రాకాండమును వినుటచేత సకలపాపములును నశించును.

ఇట్లని శతకోటిరామచరిత్రములోనిదియును, వాల్మీకిమునివరునిచేత రచింపఁబడినదియును అయిన శ్రీమదానందరామాయణమునందలి యాత్రాకాండమునందు రామ దాస విష్ణుదాస సంవాదమును తెలుపునట్టి తొమ్మిదవసర్గ ముగిసెను.

ఆనందరామాయణము, యాత్రాకాండము

సంపూర్ణము.

శ్రీ ర స్తు.

శ్రీరామచంద్రపరబ్రహ్మణేనమః.

ఆనందరామాయణము

యాగకాండము.

✷ యజ్ఞోపకరణములను వర్ణించుట. ✷

అట్లు యాత్రాకాండమును చెప్పి ముగించినపిమ్మట శ్రీరామదాసు శిష్యుఁడగు విష్ణుదాసునితో నిట్లనియె. ఓశిష్యోత్తమా! విష్ణుదాసా! శ్రీరాముఁడు సభామధ్యమునం దొకనాఁడు గురుఁడగు వసిష్ఠమునివరునితో నిట్లనియె. ఓగురూత్తమా! కుంభోదరమునివరుని వాక్యానుసారముగఁ దీర్ఘయాత్రను చేసితిని. ఇప్పుడు మునివరుని వాక్యముచేతనే యశ్వమేధయాగమును చేసెదను. కావున యజ్ఞసాధనముల లక్షణములను వివరించి చెప్పుము. మఱియు నోగురూత్తమా! మిగుల పావనమయిన లగ్నమునందు చెవులయందును పాదములయందును పుచ్ఛమునందును నైల్యముకల గుఱ్ఱమును వస్త్రాద్యలంకారములచేత నలంకరించి విడిచిపెట్టి భూప్రదక్షిణము చేయించెదను. మఱియు నాయశ్వమును వెంబడించి పదివేలసైన్యము పోవునట్లు చేసెదను. మఱియు నాసేనతోఁగూడ శత్రుఘ్నసుమంత్రులు పోవునట్లు చేసెదనని శ్రీరాముఁడు చెప్పినవాక్యమును విని వసిష్ఠమునివరుఁడు జ్యోతిశ్శాస్త్రవేత్తలతోఁగూడ సుముహూర్త నిర్ణయమును చేసెను. అంతట లక్ష్మణునితో నిట్లనియె. ఓలక్ష్మణా! నేఁటి కేడవదినమునందు అశ్వమేధయాగమును చేయుటకుఁ దగినముహూర్తముకలదు. ఆదినము అశ్వమేధయాగమునకు శ్రీరాముఁడు దీక్షితుఁడగుటకు యుక్తమైయున్నది. మఱియు నోలక్ష్మణా! సువర్ణనిర్మితములయిన హలాదులచేత రామతీర్థమునందు బ్రాహ్మణులద్వారా యజ్ఞభూమిని శోధింపవలయును. మఱియు నోలక్ష్మణా! అయోధ్యాపట్టణమునకు వెలుపట పదిక్రోసులవఱకును గల భూమియందు గులకరాళ్లు మొదలయినవి లేకుండునట్లు చేయవలయును. మఱియును చందనోదకములచేత భూమినిసర్వమును తడపవలయును. సర్వస్థలములయందును అఖండమైన మండపమును నిర్మింపవలయును. ఆమండపమునందంతటను తోరణములను బంపవలయును. నానావిధములగు ఫలాదులను

పుష్పమాలికలను ఆమండపమునందుఁ గట్టవలయును. చలువరాళ్లు ఇటుకలు మొదలగువానితో దివ్యములగు వేదికల ననేకములను నిర్మింపవలయును. అనంతరమందు నన్ను దగ్గఱఁబెట్టుకొని యత్యధికమైన కుండమును మృత్తుతో నిర్మింపవలయును. కుండోపరిభాగమునందు మిగుల మనోహరమైన గోముఖమును ఖదిరముతో నిర్మింపవలయును. మఱియు నోలక్ష్మణా! ఎఱుపు నలుపు తెలుపు అనువర్ణమును కలవియును, నీలపీతాదివర్ణములు కలవియును, నానావిధములును, నాఁడుపధాతువులచేత నిర్మింపఁబడినవియును అయిన నానావర్ణములచేత స్వస్తికాదులను నిర్మింపవలయును. మఱియును, యజ్ఞభూమియందంతటను పుష్పములను చల్లవలయును. మఱియు నెనిమిది దళములుకల కమలములను శంఖచక్రగదాపద్మవల్లులను సర్వస్థలములయందును నియమింపవలయును. మఱియు నిరువదినాలుగు యజ్ఞస్తంభములను నిర్మింపవలయును. మఱియును, కుండమధ్యమునందు సర్వతోభద్రవృత్తమును వ్రాయవలయును. యజ్ఞపాత్రములను అన్నిటిని చక్కఁగఁ బరిపాలింపవలయును. మఱియును, ఋషులు పరుండుటకును కూర్చుండుటకును తగిన యాసనాదులను నిర్మింపవలయును. మఱియును, పటమందిరములను తృణాలయములను నిర్మింపవలయును. మఱియును, పాకశాలలను భోజనశాలలను ఋషిశాలలను స్త్రీశాలలను నిర్మింపవలయును. మఱియు నోలక్ష్మణా! శుభకరములయిన స్త్రీశాలలను మిగుల సుందరములయిన యజ్ఞోపకరణశాలలును, సద్వస్త్రములచేత విచిత్రముగాఁ జేయఁబడిన రాజసభలును నిర్మింపఁదగినవి. ఇంతియగాక రాజులుకూర్చుండుటకు తగినట్లు దివ్యములగు వస్త్రాసనములను నిర్మింపవలయును. మఱియు నోలక్ష్మణా! సభయందు మిగులవెలకల పానపాత్రములను నిర్మింపవలయును. మఱియు నోలక్ష్మణా! పక్వఫలాదులతోడను, నానావిధములయిన రసాదులతోడను, నానావిధ సుగంధద్రవ్యములతోడను, నానావిధములయిన రాగద్రవ్యములతోడను, విచిత్రములును మధురములును అయినవస్తువులతోడను, మాదకద్రవ్యములతోడను, నానాసుగంధతైలములతోడను పూర్ణములయిన కాచకుంభాదులను సిద్ధముగనుంచవలయును. మఱియును, చందనములు సుగంధాక్షతలు నానావిధములయిన యుపకరణములు మొదలగువానితోఁగూడుకొనిన తాంబూలముల ననేకముల సిద్ధముగ నుంచవలయును. మఱియు ననేకములగు వింజామరములను రప్పింపవలయును. అనేకములగు నద్దములను తెప్పింపవలయును. మఱియును క్రీడించుట కుపయుక్తములయిన క్రీడోపకరణములనేకములుచేర్పఁదగినవి. మఱియు సభయందనేకములయిన విచిత్రవస్తువులనుంచవలయును. మృత్పాత్రిలయందుండునట్టి పుష్పవాటిక లనేకములును నిర్మింపవలయును. మఱియు నానావర్ణములుకలవియును, రమ్యములయినవియును, అయినపక్షులయొక్క పంజరములను రప్పింపవలయును. మఱియును ప్రతిమండపమునందును

అప్సరోగణము నృత్యములను చేయవలయును. సర్వస్థలములయందును చక్కని ధూపములను కలిగింపవలయును. గాయకులు గానమును చేయుచుండవలయును. నానావిధములయిన వాద్యములను మ్రోఁగింపవలయును. మఱియు నోలక్ష్మణా! పూజోపకరణములయిన ద్రవ్యములను విశేషముగఁ దెప్పింపవలయును. ఓ లక్ష్మణా! ఇవియన్నియును సభయందు విడివిడిగ నుంచవలయును. మఱియు నోలక్ష్మణా! ఋషులసభయందు దర్భలు సమిధలు దండములు కమండలములు మొదలగువానిని స్థాపింపవలయును. మఱియును, బహిర్వాసములను చేయవలయును. మఱియును, కౌపీనములను నారచీరలను వ్యంజనములను పూజాద్రవ్యములను హవ్యములను జలకుంభములను విశేషముగ నుంచవలయును. మఱియు నోలక్ష్మణా! శౌచముకొఱకు మృత్తికలను శుద్ధములగు దంతకాష్ఠములను పాదుకలను గైరికలను మఱియు, నానావిధములగు వస్తువులను ముఖశుద్ధికొఱ కీయవలయును. అనంతరమందు స్త్రీసభలయందు పూజాపాత్రముల నధికముగ నీయవలయును. మఱియును, సౌభాగ్యద్రవ్యపూర్ణములు సుగంధములతోఁ గూడుకొనినవియును నానావిధములయిన విచిత్రవర్ణములను స్థాపింపవలయును. మఱియును, కజ్జలముల పాత్రములను కబరులను కుంకుమపాత్రములను, ఆభరణముల నుంచుపెట్టెలను, హరిద్రాది వస్తువులను, రవికలను, వస్త్రములను, నుంచవలయును. మఱియును, వ్యజనచామరాదులనుగూడ సిద్ధముసేయవలయును. మఱియును, మిత్రాదులకు తమసంగతులను వ్రాసికొనుటకుఁ దగినపత్రములను సిద్ధముచేయవలయును. ఆపత్రములమీఁద రామముద్రను వేయవలయును. ఓ లక్ష్మణా! రామదూతలను జనకచక్రవర్తియొద్దకుఁ బంపవలయును. మఱియును, కైకేయీసుమిత్రాకౌసల్యల తండ్రులకు జాబును వ్రాయించవలయును. మఱియు ఓలక్ష్మణా! శ్యామకర్ణములుకలదియును, శ్యామవర్ణముగల పాదములుకలదియును, నల్లనిపుచ్ఛముకలదియును మిగులవెలగల వస్త్రమాల్యాంబరాదులచేత నలంకరింపఁబడినదియును, చామరాదులచేత భూషింపఁబడినదియును, ఫాలభాగమునందు స్ఫుటాక్షరములతోఁగూడిన హేమపత్రముకలదియును, అయిన రాముని యజ్ఞాశ్వమును సిద్ధముసేయవలయును. మఱియు నోలక్ష్మణా! ఆయజ్ఞాశ్వమును సకల రాజులకును తెలియునట్లు భూప్రదక్షిణమును చేయవలయును. ఏరాజులును ఈయజ్ఞాశ్వమును పట్టుకొనకుండునట్లు చేయవలయును. మఱియును, మన యజ్ఞాశ్వమును పట్టుకొనినవానిని సైన్యములతోఁగూడ నెదిరించి బంధించి యయోధ్యాపట్టణమునకుఁ దీసికొని రావలయును. శత్రుఘ్నుఁడు చతురంగ బలసమేతుఁడై యజ్ఞాశ్వముతోఁగూడ పోవునట్లు చేయవలయును. శత్రుఘ్నుఁడు యజ్ఞాశ్వమును వెంబడించి పోవునపుడు సుమంత్రుఁడుకూడ పోవునట్లు చేయవలయును. మఱియును, నానావిధములగు పుణ్యనదులయందలి యుదకమును జలకుంభములతోఁ గైకొని రావలయును. మఱియు నోలక్ష్మణా! నానాదేశముల

యందలి మృత్తికలను శత్రుఘ్నునిచేతఁ దెప్పింపవలయును. మఱియును పతాకధ్వజ తోరణాదులచేత పట్టణమును సర్వమును రమ్యముగ నలంకరింపఁ జేయవలయును. ప్రతిదేవాలయమునకును సున్నపుగారను చేయింపవలయును. దేవాలయముల మధ్యమునందు మిగుల మనోహరమైన చిత్రశాలను నిర్మింపవలయును. మఱియు ననేకములయిన రత్నదీపముల నుంచవలయును. ప్రతిదేవాలయమునందును పూజోపకరణములను సిద్ధముసేయవలయును. మఱియును నానావిధములగు వాద్యములను దేవాలయమునందును మ్రోగునట్లు చేయవలయును. రాజమార్గములను చక్కఁగఁజేయించి నీళ్లను జల్లవలయును. మఱియు నోలక్ష్మణా! ప్రతిమేడయొక్కయును పరిభాగమునందును నానావిధములును రమ్యములును అయిన చిత్రములను వ్రాయింపవలయును. మఱియు నోలక్ష్మణా! ప్రతివీథియందును ముత్యాలహారములను కట్టవలయును. ఇంతియగాక నవరత్నమాలికలను ఫలపుష్పాదిమాలికలను బంధింపవలయును. ఓలక్ష్మణా! ఇప్పుడు నే నేయేకార్యములను చేయింపుమని చెప్పితినో వాని నన్నింటిని చేయింపుమని కులగురుఁడగు వసిష్ఠమునివరుఁడు చెప్పినవాక్యములను విని లక్ష్మణుఁడు వినయముతో చేయించెదనని చెప్పి గురుఁడు చెప్పినదానికంటె నూరురెట్లధికముగఁజేసె.

ఇట్లు యాగకాండమునందలి మొదటిసర్గ ముగిసెను.

---

* యా గా ర ం భ ము. *

అంతట రామదాసు మరల నిట్లనియె. ఓశిష్యోత్తమా! విష్ణుదాసా! శ్రీరాముఁడు సీతతోఁగూడ నేడవదినము నందలి సుముహూర్తకాలమునందు నవనీతోద్వర్తనాదులచేత స్నానమునుచేసి అంజనాదికమునుచేసి తూర్యధ్వనులతోడను వేదఘోషములతోడను పురస్త్రీలయొక్క గాయనములతోడను పౌరులయొక్క జయధ్వనులతోడను రమ్యమైనమండపము లోనికివచ్చి చిత్రాసనముమీఁదఁ గూర్చుండె. అంతట శ్రీరాముఁడు గురుఁడగువసిష్ఠుఁడు, అరుంధతి, పురజనులు, పురజనుల భార్యలు, తల్లులు, ముత్తైదువలు, అత్తమామలు, సకలబ్రాహ్మణులు, జనకచక్రవర్తి, మిత్రులు బంధువులు, బంధుభార్యలు, స్నేహితులు, మంత్రులు, వీరులు, దాసదాసీజనములు, నటనాటవంద్యాదులు, వారస్త్రీలు, మొదలుకొని చండాలజనమువఱకును కల సకలజనులకును దివ్యములగు వస్త్రములనిచ్చె. అనంతరమందు బంగారపుసరిగ్గైచి నేయఁబడినదియును ముక్తామాణిక్యములచేతఁ గూర్పఁబడినదియును, రత్నకాశ్మీర నీలాదులచేత మధ్యమధ్య చిత్రముగఁ జేయఁబడినదియును, ముక్తప్రవాలమణులచేత నలంకరింపఁబడినదియును, అద్దముతో సమానమైనదియును, మెఱపుతీగలయొక్క తేజస్సువంటి తేజస్సుకలదియును, అయిన దివ్యవస్త్రమును సీతామహాదేవికిచ్చె. పిమ్మట శ్రీరాముఁడు బంగారపుసరిగచేత నేయఁబడిన

దియును నానావిధములగు తీగలు పుష్పములు మొదలగువానిచేత చిత్రముగఁ జేయఁబడినదియును, అయిన దివ్యవస్త్రమును ధరించె. అనంతరమం దుత్తరీయమునుధరించె. పిమ్మట నానావిధములగు నాభరణములను ధరించె. అంతట వసిష్ఠమునివరుఁడు శ్రీరాముని ముత్యములచేత రచింపఁబడిన స్వస్తికాసనముయొక్కయు పరిభాగమునందు కూర్చుండఁ నియమించె. అంతట నావసిష్ఠమునివరుఁడు సీతామహాదేవిని శిష్యులచేరప్పించి రాముని వామాంకమునందుఁ గూర్చుండ నియమించె. పిమ్మట సమ్మునివర్యుఁ డనేకమునులతోఁ గూడుకొనినవాఁడై విఘ్నేశాది పూజనుగావించె. మఱియును పుణ్యాహాది క్రియమునుకూడఁ జేసె. అనంతరమం దయ్యిరువురికిని దీక్షనిప్పించె. పిమ్మట ధ్వజారోపవిధానముచేత శ్రేష్ఠములగు ధ్వజములనుస్థాపించె. అంతట శ్రీరాముఁడు పదునాల్గురగు ఋత్విజులనుగోరె. ఆమహాయజ్ఞమునందు సకలకర్మములను దెలిసిన వసిష్ఠమునివరుఁ డధ్వర్యుడయ్యె. బ్రహ్మదేవుడువచ్చి బ్రహ్మత్వమును వహించె. గాధిపుత్త్రుఁడగు విశ్వామిత్ర మునివరుఁడు హోతయయ్యె. జనకుని గురుఁడగు శతానందుఁడు ఉద్గాతయయ్యె. యముఁడు శమితయయ్యె. మఱియును దక్షిణకార్యములకు కశ్యపాదిమునివరులు శ్రీరామునిచేత నయ్యజ్ఞమునకుఁగా వరింపఁబడిరి. ప్రధానులగు పదునాల్గురగు ఋత్విజులను వరించినపిమ్మట ననేకవేలమంది మునీశ్వరులుకూడ వరింపఁబడిరి. అంతట శ్రీరాముఁడు కుండమునందు అగ్నినిస్థాపించి యనంతరమందు పాత్రాసాదనమునుజేసె. పిమ్మట నల్లనిచెవులుకల యశ్వమునుపూజించి భూమికిసవ్యయముగ ప్రదక్షిణముచేసి వచ్చుటకు నియమించె. ఆయశ్వమునుగాపాడు సుమంత్రశత్రుఘ్నులు చతురంగబలముతోఁగూడఁ బోయిరండని యాజ్ఞాపించె. అనంతరమందు ఋషులచేత నిండియున్న యాగశాలయందు శ్రీరాముఁడు శుభకరములయిన కథలను వినుచునుండె. మఱియును, రామకృష్ణాజినధారుఁడును దాంతుఁడునుకుశపాణియును, ఉచితకార్యములను చేయువాఁడునునై కోటిమంది సూర్యులవలెఁ బ్రకాశించుచు కులగురుఁడగు వసిష్ఠమునివరునిదగ్గరఁ గూర్చుండియుండె. ఆయజ్ఞదీక్షయారంభమైనది మొదలుకొని రామునితమ్ములందఱును పుష్కరమాలికలు కలవారై సువస్త్రములనుధరించి చక్కఁగనలంకరింపఁబడి ప్రకాశించుచుండిరి. మఱియు నాలక్ష్మణాదులభార్యకూడఁ జక్కఁగనలంకరింపఁబడి యాయజ్ఞశాలలోనికి వచ్చిరి. ఆకాలమునందు నానావిధములయిన వాద్యములు మ్రోగుచుండె. వారస్త్రీలు మొదలగువారు నృత్యాదులను సల్పుచుండిరి.ఇంతలోపల: మునివరు లనేకులు దినదినక్రమముగ వచ్చిరి. మఱియును అశ్వమేధ వృత్తాంతమునువిని దినదినక్రమముగ కాశ్యపుఁడు, అత్రి, భరద్వాజుఁడు, విశ్వామిత్రుఁడు, గౌతముఁడు, మార్కండేయుఁడు, మృకుండుఁడు, చ్యవనుఁడు, ముద్గలుఁడు, అసితుఁడు, జామదగ్న్యుఁడు, దేవలుఁడు, వ్యాసుఁడు, నారాయణుఁడు, క్రతువు, విభాండకుఁడు,

నారదుఁడు, తుంబురుఁడు, గాలవుఁడు, శివదాసుఁడు, భానుదాసుఁడు, హరిదాసుఁడు, మహాతపుఁడు, శివవర్మ, రుద్రవర్మ, శివశర్మ, ఏకశృంగుఁడు, చతుశ్శృంగుఁడు, సప్తశృంగుఁడు, త్రిశృంగుఁడు, తిలభాండుఁడు, భృగువు, భార్గవుఁడు, వాక్పతి, ధౌమ్యుఁడు, కణ్వుఁడు, ఏకపాదుఁడు, త్రిపాదుఁడు, ఊర్ధ్వబాహుకుఁడు, ఊర్ధ్వపాదుఁడు, ఊర్ధ్వనేత్రుఁడు, ఊర్ధ్వాస్యుఁడు, త్రిశిరుఁడు, వృద్ధగౌతముఁడు, వర్ణదుఁడు చంద్రసంజ్ఞకుఁడు, ఋష్యశృంగుఁడు, మతంగుఁడు, జాబాలి,కుంభశంభవుఁడు, దధీచి, శౌనకుఁడు, సూతుఁడు, సుతీక్ష్ణుఁడు, లోమశుఁడు, వాల్మీకి, దుర్వాసుఁడు, వేదనిధి, అనునట్టి మునివరులందఱును శిష్యప్రశిష్యులతోఁగూడ నేగుదెంచిరి. ఆమునులలోఁ గొందఱు పర్ణములను దినువారును, కొందఱు వాయుభక్షకులును, కొందఱు కుశాగ్రజలపానులును, కొందఱు ఆశాత్యాగులును, కొందఱు త్వక్కాశనులును, కొందఱు భిక్షాశనులును, కొందఱు పరదత్తాశనులును, కొందఱు ఆయాచ్ఞావ్రతులును, కొందఱు అభరణములను వదలినవారును, కొందఱు నారచీరలను ధరించినవాఱును, కొందఱు కాషాయవస్త్రములను ధరించినవారును, మృగచర్మధరులుకొందరును, కొందఱు దిగంబరులును, కొందఱు ఆకులేవస్త్రములుగాఁగలవారును, కొందఱు పంచాగ్నిసాధకులును, కొందఱు ధూమ్రపానవ్రతులును, కొందఱు ఈషణత్రయములను వదలినవారును, అయియుండిరి. మఱియు నక్కడకు వచ్చిన మునివరులు కొందఱు వనారామగిరి దుర్గములయందు నివసించుచున్నారు. మఱియు కొందఱు మునివరులు భార్యాపుత్రులతోఁ గూడుకొనియుండిరి. మఱికొందఱు శిష్యాదులతోఁగూడుకొని యుండిరి. అట్టి మునివరులందఱును రామునియజ్ఞోత్సవమును చూచుటకు నేగుదెంచిరి. మఱియును, దశదిక్కులనుండియును వచ్చిన మునివరు లనేకకోట్లుగానుండిరి. అట్లు వచ్చిన మునివరులనందఱిని శ్రీరాముఁడు ప్రత్యుత్థానాదులచేతఁ బూజించె. మఱియు నా శ్రీరాముఁడు మిగుల రమ్యమైన యజ్ఞవాటమునందు కామధేనువునకు వస్త్రాద్యాభరణములనిచ్చి శాస్త్రోక్త ప్రకారముగఁ బూజించె. మఱియును, సువర్ణశృంగభూషాదులచేతను కింకిణీనూపురాదుల చేతను ఆకామధేనువు నలంకరించి యిట్లని ప్రార్థించె. ఓకామధేనూ! సముద్రమునందుఁ బుట్టినదానా! నాయజ్ఞమునందువచ్చిన సకలజనులకును అన్నాదులను ఇచ్చి తృప్తినొందింపవలయునని ప్రార్థించె. ఈ విధముగా శ్రీరాముఁ డాకామధేనువును ప్రార్థించి నమస్కరించి పాకశాలయందు పట్టకూలాసనము యొక్కయు పరిభాగమునందు కట్టివైచె. అంతట నాకామధేనువు సంతోషించినదై యాయజ్ఞకర్మము షడ్రసోపేతమైన యన్నమును దానమునుచేయుచుండె. అందువలన నాయాగశాలయందు నెవ్వఁడును అగ్నికార్యమును అనఁగా పాకమును చేయువాఁడు లేడయ్యె. మునివరులందఱును అధికముగ సంతోషించిరి. శ్రీరాముఁడు మనస్సునందు ఏయేవిషయములను గోరుచుండునో

వానినన్నిటిని కామధేనువిచ్చుచుండె. మఱియును, చింతామణికూడ రాముఁడు కోరినవస్తువుల నిచ్చుచుండె. మఱియును సీతామహాదేవి తనమనస్సునందు ఏయే వస్తువుల నపేక్షించునో కామధేనువు వానినన్నింటిని ఇచ్చుచుండె. మఱియును ఆయజ్ఞశాలయందు భుజించుచున్న బ్రాహ్మణాదులయొక్క పంక్తులయందు స్త్రీలయొక్క కంకణధ్వను లతిశయించె. అంత, శ్రీరాముఁడు లక్ష్మణుని పిలిచి యిట్లనియె. ఓలక్ష్మణా! సీమాచారులను పిలిచి నేను చెప్పువిధముగ సర్వ విషయములను చెప్పుము. బ్రహ్మచారి గృహస్థుఁడు వానప్రస్థుఁడు, యతి మొదలగువారిలో నెవ్వఁడైనను వచ్చుచుండెనేని నివారింపఁగూడదని తెలుపుము. మఱియు నోలక్ష్మణా! సత్కార్యములకు నాయాజ్ఞను నిరీక్షింపనక్కర లేదు. ఎవ్వనియందును కోపమును పొందఁగూడదనియె. ఇట్లని రాముఁడు చెప్పిన వాక్యములను విని లక్ష్మణుఁడు వల్లెయని సీమాచారులను పిలిచి రాముఁడు చెప్పినవృత్తాంతమును సర్వమును దెలియఁజేసె. అంతట రాముఁడు మరల లక్ష్మణునిబిలచి యిట్లనియె. ఓలక్ష్మణా! బ్రహ్మచారియైనను గృహస్థయినను వానప్రస్థాశ్రమము నవలంబించిన వాఁడైనను,యతియైనను మునులభార్యాపుత్త్రశిష్యాదులలో నెవ్వరయినను పౌరజానపదులలో నెవ్వడైనను, దాసదాసీజనమైనను దేనిదేనిని కోరునో వానినన్నింటిని నాయాజ్ఞను పొందకయే యిచ్చునట్లును తమకుఁదామే తీసికొనునట్లును చేయవలయును. మఱియు నోలక్ష్మణా! బ్రాహ్మణులు మొదలుకొనిచండాలురవఱకునుకల సకల జనులను సంతోషపెట్టవలయును. లోకములో నెవ్వనియభిలాషయును వ్యర్థముకాదు. మఱియు నోలక్ష్మణా! అయోధ్యాపట్టణము, కామధేనువు, జానకి, కౌస్తుభమణి, చింతామణి, పుష్పకవిమానము, రాజ్యకోశాదికము మొదలగువానిలో దేని నెవ్వఁడుకోరినను నిరాతంకముగ నీయవలయును. నీవు యాచకుల యభిలాషను దీర్పనియెడల నాకు సంతోషము లేకపోవును. కావున నాకు సంతోషములేకుండునట్లు చేసి నావలన భయమునుదెచ్చుకొనక యేవిషయమునందును విచారింపక యడిగినవానినీయుము. యాచకులయాశకు భంగమును కల్పించినయెడల నాశిరస్సును ఛేదించినట్లగును. కావున నావాక్యమును సర్వకాలములయందును నాయభీష్టమును తలచుకొని ప్రవర్తించుచుండుము. ఈవిధముగ రాముఁడుచేసిన వాక్యములనువిని రాముఁడు చెప్పినవిషయమును సర్వమును తప్పక జరుపుచుండె.

ఇట్లని యానందరామాయణమునందలి రెండవసర్గ ముగిసెను.

---

* యజ్ఞాశ్వము భూప్రదక్షిణమునుచేయుట. *

అనంతరమందు శ్రీరామునిచేత విడువఁబడినదియును శ్యామకర్ణములు కలదియును, యజ్ఞాంగమును, అయి యశ్వము విడువఁబడిన పిమ్మట నదిముందుగా తూ

ర్వ దేశమునకుఁబోయెను. అప్పుడు శత్రుఘ్నుఁడు సైన్యసమేతుఁడై యాయశ్వమును వెంటనంటిపోవుచుఁ గ్రమముగ భాగీరథీతటమునకుఁబోయెను. అట్లు శత్రుఘ్నుఁడు యజ్ఞాశ్వముతోఁగూడఁబోవుచున్న సమయమునందు శ్రీరాముఁడు తనపరాక్రమమును చూపించుచు శత్రునిముందర మిగుల గొప్పదగు కౌతుకమునుచూపెను. ఆయద్భుతము బ్రహ్మావర్తమును దాటి గంగాతటమును పొందువఱకును కనఁబడెను. మఱియును, గంగానదియందత్యధికమైన ప్రవాహము కలుగుటచేత నోడల రాకపోకలు నిలిచిపోయెను. అందువలన యజ్ఞాశ్వము మొదలగువాని గమనమున కాతంకము కలిగెను. ఆసమయమునందు కాలాతిక్రమమగునను భయముచేత భరతుఁడు తనమనస్సునందిట్లని యోచించెను. ఓహో నేనేమిచేయుచుందును. ఇక్కడనే గొప్పదగు విఘ్నము సంభవించెను. మొదటి ముద్దయందే యీగపడ్డ ట్లయ్యెను. అయినను గానిమ్ము? ఇప్పుడు శ్రీరామచంద్రుని ప్రతాపముచేతనే నా గమనమున కాతంకము కలుగక పోవుగాక అని యాలోచించి యాశత్రుఘ్నుఁడు రథారూఢుఁడై గంగాతటమునకుఁ బోయి గంగకుఁ బూజనుజేసి గంగతో నిట్లనియెను. ఓగంగాదేవీ! సర్వలోకములయందును మునిగణములయందును నీవు మిగులఁ బావనురాలవనుట, నిజమైనయెడల రామకార్యమునకు మార్గము నీయవలయునవియెను. ఇవ్విధముగ శత్రుఘ్నుఁడు చెప్పినవాక్యమును విని గంగాదేవి వేగమును ఖండించెను. అట్లుచేసి స్వోదరప్రదేశమునుచూపెను. ఆసమయమునందు శత్రుఘ్నుఁడు సైన్యముతోఁగూడ కాలినడకచేతనే గంగనుదాటి క్షణములోపల నావలిగట్టునకుఁబోయెను. అట్లు శత్రుఘ్నుఁడు సైన్యసమేతముగ గంగానదినిదాటి మగధదేశమునకుఁ బోయెను. ఆమగధదేశమె కీకటదేశమని చెప్పఁబడును. మఱియు నా మగధదేశమునందు మునుపటివలెనే గంగానది ప్రవహించుచున్నది. అప్పుడెల్లవారును రామచంద్రుని పరాక్రమము మిగుల నద్భుతమైనదని తలఁచి సీతారామ శబ్దములతో జయజయశబ్దముల నుచ్చరించిరి. అంతట నల్లనికర్ణములు కలయశ్వము తూర్పుదిక్కున కభిముఖముగఁ బయనమైపోయెను. ఆసమయమునందు మగధదేశపురాజు రాముని యజ్ఞాశ్వము వచ్చుటను విని మదపుటేనుఁగును ముందు నిడుకొని సేనాసమేతుఁడై యెదురుగనేగుదెంచెను. వచ్చి యా తురగముయొక్క ఫాలభాగమునందుఁ గట్టబడిన పత్రమునందలి వర్ణములను జదివి మిగుల నాదరముకలవాఁడై నానావిధములయిన వైభవములతో శత్రుఘ్నునిబూజించెను. మఱియు నామగధదేశపురాజు తనకోశాదికమును సర్వమును సమర్పించెను. అనంతరమందు పౌరులను జానపదులను స్వస్త్రీలను సుహృత్తనయమంత్రులను పౌరభార్యలను జానపదభార్యలను పురోధనులనుతద్భార్యలను అయోధ్యాపట్టణమునందలి మహోత్సవమును చూచుటకుఁబంపెను. అంతట శత్రుఘ్నుఁడక్కడనుండి బయలువెడలిపోవునపుఁడనేకమందిరాజులు తమ తమ సైన్యములతోఁగూడ నెదురుగవచ్చి యనేకవిధములయిన కానుకలను సమ

ర్పించె. మఱియును, సకలదిక్కులయందును గల రాజులందఱును తమతమ శక్త్యనుసారముగ కానుకలను సమర్పించిరి. మఱియు నాయశ్వమునకడ్డముగ వచ్చువాఁడెవ్వఁడును లేకపోయె. మఱియును, ఇంద్రుఁడు మొదలగుదేవతలుకూడ నాయశ్వము అంగవంగకళింగాది దేశములకు బయలువెడలిపోయె. మఱియు ననేకములయిన దేశముల నతిక్రమించిపోయె. అంతట నాయశ్వము దక్షిణాభిముఖమై బయలువెడలి గోదావరినదినిదాటి యాంధ్రద్రవిడదేశముల నతిక్రమించి యక్కడనుండి యారవారదేశమునుకూడ నతిక్రమించిపోయె. అనంతరమందు కాంచీప్రదేశముల నన్నింటిని నతిక్రమించి యక్కడనుండి బయలువెడలి కావేరీనదినిదాటి చోళదేశమునకు బోయె. అంతట సేతుబంధమునుచూచి యక్కడనుండి పశ్చిమాభిముఖముగ బయలు వెడలె. అనంతరమందు తామ్రపర్ణీనదినిదాటి యక్కడనుండి కేరళదేశమునకుఁబోయి యాదేశములనుండి ద్విపట్ప్రికాలములయిన దేశములకుఁబోయె. అంతట నాయజ్ఞాశ్వము గోకర్ణమునుదాటి యక్కడనుండి కృష్ణాతీరప్రదేశముల నతిక్రమించి కర్ణాటకమహాదేశమునకుఁ బోయె. పిమ్మట కొంకణదేశము నతిక్రమించిపోయి యయ్యైదేశాధిపతులతోఁగూడ నక్కడనుండి బయలువెడలిపోయె. అంతట శ్యామకర్ణములుకల యజ్ఞాశ్వము భీమాప్రదేశముల నన్నింటిని చూచుచు మహారాష్ట్రదేశమునకుఁబోయె. అంతట నక్కడనుండి గౌతమీనదినిదాటి విదర్భదేశమునకుఁబోయి యక్కడనుండి యాభీరమండలమునకుఁ బోయె. అనంతరమందు మాలవదేశము నతిక్రమించిపోయె. అంతట మిగుల పావనమైన మహానదినిదాటి యక్కడనుండి మిగులఁబుణ్యాకరమైన సాభ్రమతీనదిని దాటి యక్కడనుండి ఘూర్జరదేశమునకుఁబోయె. అనంతరమందు ప్రభాసతీర్థమునకుఁబోయి యక్కడనుండి యావర్తదేశమునకుఁబోయె. అంతట సౌవీరదేశముల నతిక్రమించి యాయజ్ఞాశ్వము మరుదేశమునకుఁ బోయె. అనంతరమందు ధన్వదేశము నతిక్రమించి యక్కడనుండి సారస్వతదేశములకుఁ బోయె. పిమ్మట మత్స్యదేశముల నతిక్రమించిబోయి యక్కడనుండి మధురదేశములను శూరసేన దేశములను అతిక్రమించె. అంతట నాయశ్వము పాంచాలదేశములను కురుదేశములను అతిక్రమించి యక్కడనుండి కురుజాంగలదేశమునకుఁ బోయె. అనంతరమందు కైకేయదేశములకుఁ బోయి యక్కడనుండి కాశ్మీరదేశమునకుఁ బోయె. అక్కడనుండి ఖిల్లదేశ గౌడదేశ శకదేశములనుచూచుచుఁ బోయె. పిమ్మట యవనదేశ తామ్రదేశములను దాటిపోయె. అనంతరమందు నానావిధదేశములను దాటిపోయి కరతోయంతటము ననుసరించిపోయె. అంతట నాగుఱ్ఱము వాయుగతిచేత మిగుల శీఘ్రముగ జ్వాలాముఖీదేశమునకుఁ బోయె. పిమ్మట దోషమువచ్చునను తలంపుతో కరతోయానదినిదాటి పోకపోయె. మఱియును, కర్మనాశనదిని స్పృశించుటవలనను, కరతోయానదిని దాటుటవలనను గండకీబాహుతరణమువలనను ధర్మము నశించిపోవునుకనుక ఆనదులను దాట

కుండా. అంతట నాయజ్ఞాశ్వము గంగాతటమునుండి హరిద్వారమునకుఁబోయి యక్కడనుండి హిమాలయమునకు సమీపముననున్న సకలదేశములను అతిక్రమించె. పిమ్మట బదరికాశ్రమమును దాటి కలాపగ్రామమునందలి వారిచేతఁ బూజింపఁబడియె. అనంతరమందు కాశి త్రివేణి అంతర్వేది అను పుణ్యక్షేత్రములకుఁ బోయె. పిమ్మట శృంగబేరపురమునకుఁ బోయి యా తమసానదినిదాటి యక్కడనుండి నైమిశారణ్యమునకుఁ బోయె. పిమ్మట గౌతమినిదాటి యక్కడనుండి బ్రహ్మావర్తనామక సరోవరమునుచూచి యక్కడనుండి మనోహరములగు ననేకదేశములను చూచుచుఁ గోసలదేశమునకుఁ బోయె. అనంతరమందు సాకేతపట్టణమునకుఁబోయి యజ్ఞశాలయందుఁ బ్రవేశించె. ఆయశ్వము బయలువెడలిన యాఱుమాసములకు సకలరాజులతోఁగూడ వచ్చుటనుజూచి శ్రీరాముఁడు లక్ష్మణునితో నిట్లనియె. ఓ లక్ష్మణా ! నీవు వారణేంద్రమును ముందునిడుకొని నానావిధములయిన వాద్యఘోషములతోఁగూడ నెదురుగఁ బొమ్ము ? మఱియును నీవుపోవునపుడు నృత్యగానాదులను చేయువారలనుగూడఁ దోడ్కొనిపొమ్ము ? పోయి యజ్ఞాశ్వమును యజ్ఞాశ్వముతోఁగూడ వచ్చినరాజులను పూజించి తోడ్కొనిరమ్మనియె. అంతట లక్ష్మణుఁడు బయలువెడలిపోయి రామాజ్ఞానుసారముగఁ బ్రవర్తించి సకలరాజులతోఁగూ యజ్ఞాశ్వమును యాగశాలలోనికిఁ దోడ్కొనివచ్చె. ఆయజ్ఞాశ్వమును చూచినపుడు పదియోజనముల వఱకును నధికమైన యుత్సవముజరిగె. మఱియు నయోధ్యాపట్టణమంతయును పరదేశపురాజులచేత వ్యాప్తమయ్యె. మఱియు నారాజులందఱును తమకంటె ముందుగవచ్చియున్న భార్యాపుత్రాదులను జూచి యత్యంతానందమునుపొందిరి. మఱియు నాయాగశాలయందు జనసమ్మర్దము గలిగియుండుటచేత నొకరినొకరు గుర్తించుట మిగుల దుర్లభమైయుండె. మఱియును కొందఱు తమవారిని పరదినమందుఁ జూచిరి. కొందఱు రెండుమూఁడు దినములకు తమవారినిజూచిరి. మఱికొందఱు పదునైదు దినములకును మఱికొందఱు నెలదినములకును తమవారినిజూచిరి. కొందఱికి ఆ యాగశాలయందు తమవారిదర్శనమే కాకపోయె. ఆవిషయమును తెలిసికొని రామచంద్రుఁడు లక్ష్మణునితో నిట్లనియె. ఓలక్ష్మణా ! జనసమ్మర్దమధికముగ నుండుటచేత ఎవరివారిని వారుచూచుటకు వీలుపడకయున్నది. కావున నీవు దీనికిఁ దగినయుపాయము నొక్కదానిని జేయుము. తమసానదిగట్టున నత్యధికమైనశాల నొకదాని నిర్మింపుము. పిమ్మట నెవ్వరెవ్వరు తమవారిని కనుగొనలేదో అట్టివారందఱును తమసానదీతీరమునందలి శాలలోనికిఁబోయి యొకరితోనొకరు కలిసికొనవలసినదని దుందుభి నిర్ఘోషమును చేయువలయును. అట్లయినయెడల నెల్లవారికిని బంధుదర్శనము గునని యె. మఱియును, వారివారి చతుష్పాదివస్తువులనుగూడ స్థాపింపవలయునని యె. అట్లు శ్రీరాముఁడుచెప్పిన వాక్యములనువిని లక్ష్మణుఁడు వల్లెయని

శ్రీరామాజ్ఞానుసారముగ సర్వమునుచేసె. ఆసమయమునందు జనసమ్మర్దమధికమై యుండుటచేత తమ బంధువులనుగానక వెదకుచున్నవారు తమసాతీరములోని శాలలోనికిఁ బోవలసినదని భటులచాటింపుధ్వని యెవరికిని వినఁబడకపోవుటచేత నెల్లవారును తమతమ విడిదిమందిరములయందు నివసించియున్న కాలమునందు చాటింపును చేయించె.

ఇట్లు ఆనందరామాయణాంతర్గత యాగకాండమునందలి
మూఁడవసర్గ ముగిసెను.

---

* అగస్తిరామసంవాదము. *

అంతట నాఋత్విజులందఱును నానావిధములును శుభకరములును అయిన మంగళములచేత అశ్వమేధయాగమును శాస్త్రోక్తప్రకారముగ జరుపుచుండిరి. ఆ యాగమునందు రత్నకౌశేయాది వస్త్రములనుధరించిన ఋత్విజులందఱును దేవేంద్రుని యాగమునందలి ఋత్విజులను పోలియుండిరి. ఆ సమయమునందు పిలుచుటచేత సకలదేవతలతోఁగూడ దేవేంద్రుఁడును విఘ్నేశుఁడు మొదలుగాఁగల ప్రమథగణములతోఁగూడ పార్వతీపరమేశ్వరులును వచ్చిరి. అట్లు పరమశివుఁడువచ్చినవృత్తాంతమును లక్ష్మణుఁడువిని వారణేంద్రమును ముందునిడుకొని తోరణధ్వజాదులతోఁగూడనెదురుగఁబోయి మిగుల భక్తితో శివునిపూజించి యజ్ఞశాలలోనికిఁదీసికొనివచ్చె. ఆసమయమునందు శ్రీరాముఁడుకూడ అయిదారడుగుల దూరము ఎదురుగఁబోయి పార్వతీ పరమేశ్వరులకును విఘ్నేశ్వరునకును నమస్కరించి బంగారుగద్దియయందుఁగూర్చుండ నియమించి హేమపాత్రయందు పార్వతీపరమేశ్వరుల పాదములను సీతతోఁగూడుకొనిన వాఁడై ప్రక్షాళనమునుచేసె. అనంతరమందు పార్వతీపరమేశ్వరులకు నమస్కరించె. అంతట దేవతల నందఱునుచూచె. అప్పుడుదేవతలందఱును సీతారాములవైభవాదికమునుచూచి యత్యాశ్చర్యము కలవారై చిత్తరువులోని బొమ్మలవలె నిశ్చేష్టితులైరి. మఱియు సీతారాములనుగుఱించి పరమానందమును పొందిరి. ఆసమయమునందు కొందఱు దేవతలు చేతులనుముకుళించి సీతారాములకు నమస్కరించుచుండిరి. అంతటసీతారాములు పార్వతీపరమేశ్వరులను పూజించినపిమ్మట రామాజ్ఞానుసారముగ లక్ష్మణుఁడు దేవతలనందఱను పూజించె. అట్లు పార్వతీపరమేశ్వరులను పూజించిన పిమ్మట శ్రీరాముఁడు పార్వతీపరమేశ్వరులతో నిట్లనియె. ఓదేవోత్తములారా ! మిమ్ములదర్శించుటచేత నేను ధన్యుఁడనైతిని. నేను సూర్యవంశమునందు జన్మించుటచేత నాజన్మము సఫలమయ్యెనని రాముఁడు సెప్పిన వచనములను విని యాపరమశివుఁడు నవ్వుచు శ్రీరామునితో నిట్లనియె. ఓరామచంద్రా ! నీమాయను నేనెఱుఁగుదును. ఓనారాయణా ! నీనాభి

కమలమువలన బ్రహ్మదేవుఁడుపుట్టె. ఆబ్రహ్మదేవునివలన మరీచ్యాది మునులందఱును జన్మించిరి. అందుమరీచివలన కశ్యపుఁడుజన్మించె. ఆకశ్యపుఁడు సృష్టినిచేయువాఁడయ్యె. ఆకశ్యపునకు సూర్యుఁడుజనించె. ఆసూర్యునివలనఁ బుట్టినవంశమునందు నీవవతరించితివి. ఆసూర్యుఁడు నీవంశమునందుఁ బుట్టినవాఁడే. నీవుసాక్షాన్నారాయణుఁడవై యుండి ప్రాకృతజనునివలె నన్ను మోసపుచ్చుచున్నావు. దేవకార్యమును నెరవేర్చుటకు నీవవతరించితివి. నీయిష్టానుసారముగఁ బ్రవర్తింపుము. నీవులోకులకు నేర్పుటకొఱకు ఈవిధముగా యాత్రాయాగములను చేయుచున్నావనుసంగతిని నేనెఱుఁగుదుననియె. ఈవిధముగా పరమశివుఁడు చెప్పినవాక్యములను విని సీతారాములు నవ్విరి. అట్లునవ్వుచు యజ్ఞకుండముయొక్క సమీపమునందు నవ్వుచు గురుసన్నిధియందుఁగూర్చుండిరి. ఇంతలోపల నక్కడకు ననేకవేలమంది గంధర్వులేఁగుదెంచిరి. మఱియు నపరిమితముగ నప్సరోగణమువచ్చె. రసాతలమునందు నివసించిన లోకపాలురందఱును వచ్చిరి. మఱియును నవగ్రహములును షడృతువులును షష్టిసంవత్సరములునునేఁగుదెంచె. మఱియును, నక్షత్రములును తిథులును యోగములును కరణములును రాసులును పర్వతములును సముద్రములును నదులును సరోవరములును నదములును వాపీకూపఖగాదులును జంగమరూపములనుధరించి యేఁగుదెంచె. మఱియు నాసమయమునందు సంపాతిగుహాకమకరధ్వజు లేఁగుదెంచిరి. విభీషణుఁడు రామునియశ్వమేధవృత్తాంతమును విని రాక్షసులతోఁగూడ నేఁగుదెంచె. అట్లు ఎల్లవారునువచ్చుచున్న సమయమునందు కుంభోదరుఁడను మునివరుఁడామార్గమున వచ్చుచుండఁగా సీమాచారులు చూచిరి. చూచిమిగుల భయముకలవారై అయ్యో! పూర్వమీమునివరుఁడు శ్రీరాముని తీర్థయాత్రలకుఁ బంపెనే ఇప్పుడేమిచేయునో గదాయని వ్యసనముపొందిరి. పిమ్మటఁ గొంతసేపటికి ధైర్యమును తెచ్చుకొని శ్రీరాముని యశ్వమేధయాగమునుచూచి పోవలసినదని విన్నవించిరి. ఆవృత్తాంతమునువిని యాకుంభోదర మునియజ్ఞశాలలోనికిఁబోయె. అట్లుకుంభోదరమునివరుఁడు యజ్ఞశాలలోనికివచ్చుటకుపూర్వమునందే సీమాచారులువచ్చి యావృత్తాంతమును శ్రీరామునకుఁదెలిపిరి. ఆవచనములను విని యెల్లవారును ఆకుంభోదరుని చూడవలయుననియెడు తలంపుకలవారై తమతమకృత్యములను విడిచిపెట్టి లేచిరి. సీతారాములును ఋత్విజులును ఆకుంభోదరునివలన భయమును పొందకుండిరి. అంతట నెల్లవారును చూచుచుండఁగ నాకుంభోదరమునివరుఁడు యజ్ఞశాలలోనికి వచ్చె. ఆమునివరుఁడు మిగుల పొట్టివాఁడును, స్థూలశిరస్కుఁడును, నల్లనిచెవులుకలవాఁడును, స్థూలోదరుఁడును, పచ్చనినేత్రములు కలవాఁడును, కౌపీనమును ధరించినవాఁడును, జటాధరుఁడును, నారవస్త్రములు కలవాఁడును, కురుచలగు పాదములుకలవాఁడును కురుచలగుహస్తములు కలవాఁడును, పసుచువాఁడును, చిన్నచిన్న మీసములు కలవాఁడును, దండకమండలములను ధరించినవాఁడును, నైయుండె.

అట్టిమునివరునిజూచి యెల్లవారు భయభ్రాంతచిత్తులైరి. ఇంతలోపల శ్రీరాముఁడెదురుగఁబోయి నమస్కరించి యామునివరుని హస్తమునుపట్టుకొని తీసికొనివచ్చి బంగారుగద్దియయందుఁ గూర్చుండ నియమించె. అంతట నామునివరుఁడు దండకమండలువులను క్రిందఁబెట్టి నారచీరలనుగూడ క్రిందఁబెట్టి శ్రీరామునకు నమస్కరించె. అప్పుడు శ్రీరాముఁ డామునివరుని తనహస్తములచేత లేవఁదీసి గాఢముగ నాలింగనమును చేసికొని యిట్లనియె. ఓమునికులోత్తమా ! నేను నమస్కారమును పొందుట కర్హుఁడను గాననియె. అట్లు శ్రీరాముఁడు చెప్పినవాక్యములను ఆమునివరుఁడువిని మనస్సునందు మిగులఁగాలుష్యము కలవాఁడై, యిట్లనియె. అధికమైన భుజబలముకలవాఁడవును, సర్వోత్తముఁడవును, అయిన యోరామచంద్రా ! నాయందుఁ గోపమును చెందఁగూడదు. ఓరఘుకులోత్తమా ! నీయెడల నేను అపరాధమును చేసితిని. కార్యాంతరమందలి యభిప్రాయముచేత నీయందు దోషము నారోపించితిని. మఱియు నోరఘుకులోత్తమా ! పరోపకారముకొఱకును నీకు కీర్తి కలుగుటకొఱకును అట్లు చేసితిని. నావచనానుసారముగ నీవును లోకశిక్షకొఱకు తీర్థయాత్రలనుచేసి యశ్వమేధయాగమును చేయుచుంటివి. మఱియు నోరఘుకులోత్తమా ! సకలమునులవలెనే నేనుగూడ నీసత్రమునందు భుజించినయెడల నీకీర్తి యెల్లలోకములయందును విస్తరింపదనియును, ఎల్లవారును తరించుటకు వీలులేక పోవుననియును పూర్వము నేనట్లు ప్రవర్తించితిని. నేనట్లు చేయనియెడల లోకమంతయును పావనమగుటకు ఎల్లవారును నిన్నుఁ జూచుటకును వీలులేక పోవును. మఱియు నెల్లవారును కుంభోదరునియనుగ్రహముచేత సీతారాములను చూచితిమని సంతోషించిరి. మఱియు నిది మొదలుకొని యెల్లవారును రాముఁడే ప్రాయశ్చిత్తము నాచరింపఁగా మనమెంతటివారమని ప్రాయశ్చిత్తములను చేసికొందురను తలంపుతో నట్లుచేసితిని. మఱియు నోరఘుకులోత్తమా ! పరబ్రహ్మరూపుఁడవగు నీయందు దోషారోప మెట్లగును. పద్మపత్రమున నీళ్లంటని విధముగ నీయందు దోషములుండవు. నీభ్రూభంగమాత్రముచేత బ్రహ్మాండమునకు ప్రళయము కలుగును. బ్రహ్మాండాంతర్గత సకలజంతువులను నీవు హరించుచున్నావు. నీయాజ్ఞానుసారముగ మృత్యుదేవత సకలజంతువులను సంహరించుచున్నది. కుడ్యమునందు అనేకములగు చిత్రములను వ్రాసి తుడిచివేయువానికి లోపముకలుగునా ? కలుగదు. ఓరఘుకులోత్తమా ! సత్త్వరజస్తమోగుణములచేత మూఁడురూపములను ధరించి సృష్టిస్థితిలయములను చేయుచున్నావు. మేము నీకు సంతోషము కలుగుటకొఱకు తీర్థయాత్రను విధించితిమి. తీర్థభూతుఁడవగు నీకు తీర్థమువలనఁ బ్రయోజనమేమి కలుగును. సకల తీర్థములలోపల శ్రేష్ఠమైన గంగానది నీపాదములయందుఁ బుట్టినది. నీపాదరేణువులు నేఁటివఱకును గంగానదియందుఁ గనఁబడుచున్నవి. నూఁటయెనిమిదిపర్యాయ

ములు శ్రీరామరామ యని నిన్నుఁ బొగడుటచేత సకల శుభములును చేకూరునని యె. ఇవ్విధముగ కుంభోదరుఁడను మునివరుఁడు చెప్పుచున్న సమయమునందు సీతారాములు గురుసన్నిధియం దేమియును తెలియనివారివలె నూరకుండిరి.

ఇట్లు ఆనందరామాయణాంతర్గతయాగకాండమునందలి
నాల్గవసర్గ ముగిసెను.

✷ రామనామాష్టోత్తరశతము. ✷

అట్లు కుంభోదరుఁడు చెప్పినవిధమును విని విష్ణుదాసిట్లనియె. ఓగురూత్తమా! రామదాసా! కుంభోదరునిచేత స్తోత్రము చేయఁబడిన రామాష్టోత్తర శతమును వినవలయునని కుతూహలము కలిగియున్నది. కావున దానిం జెప్పి నన్నుఁ గృతార్థుం జేయవే యనిన రామదాసిట్లనియె. శ్రేష్ఠమైన బుద్ధికల యోశిష్యోత్తమా! నీవు సర్వోత్తమమైన ప్రశ్నమును చేసితివి. నీయభీష్టానుసారముగఁ జెప్పెదను. వినుము. సర్వేశ్వరుఁడును, సర్వమయుఁడును, సర్వభూతములకును ఉపకారమును చేయువాఁడును, అయిన నారాయణుఁడు ఎల్లవారికిని ఉపకారమును చేయుటకొఱకై లోకమునం దవతరించుచున్నాఁడు. ఎప్పుడెప్పుడు లోకములకు భయముకలుగునో అప్పుడప్పుడు నారాయణుఁ డవతరించి దుష్టశిక్షణ శిష్టపరిపాలన ధర్మసంస్థాపనలను చేయును. ఓ శిష్యోత్తమా! నారాయణుఁడు రాముఁడై యవతరించునపుడు ఆదిశేషుఁడు లక్ష్మణుఁడుగా నవతరించె. లక్ష్మీదేవి సీతయయ్యె. శంఖచక్రములు భరతశత్రుఘ్నులైరి. కావున రామనామస్మరణమాత్రముచేతనే సకల పాపములును నశించును. మఱియు నోశిష్యోత్తమా! రామరామ యనుటచేత సకలహత్యలును తొలఁగిపోవును. మఱియు నీకు రామాష్టోత్తరస్తోత్రమును చెప్పెదను. సావధానుఁడవై వినుము. అస్య శ్రీరామచంద్ర నామాష్టోత్తరశత మంత్రస్య, బ్రహ్మఋషిః, అనుష్టుప్ ఛందః. జానకీవల్లభ శ్రీరామచంద్రో దేవతా. ఓమ్ బీజం. నమశ్శక్తిః. శ్రీరామచంద్ర ఇతి కీలకమ్. శ్రీరామచంద్ర ప్రీత్యర్థే జపే వినియోగః. ఓం నమో భగవతే రాజాధిరాజాయ రామాయ పరమాత్మనే హృదయాయనమః, ఓం నమో భగవతే రాజాధిరాజాయ పంచాశద్వర్ణాత్మనే శిరసేస్వాహా, ఓం నమో భగవతే విద్యాధిరాజాయ హయగ్రీవాయ శిఖాయైవషట్, ఓం నమోభగవతే రఘునందనాయ అమితతేజసే కవచాయహుమ్, ఓం నమోభగవతే క్షీరాబ్ధిమధ్యస్థాయ నారాయణాయ నేత్రత్రయాయ వౌషట్, ఓం నమోభగవతే సత్ప్రకాశాయ రామాయ అస్త్రాయఫట్, ఇతిషడంగః, ఏవమంగుళిన్యాసః కార్యః.

అథ ధ్యానమ్. మందారాకృతిపుణ్యధామ విలసద్వక్షస్థలంకోమలం
శాంతం కాంతమహేంద్రనీలరుచిరాభాసం సహస్రాననమ్,

వందేహం రఘునందనం సురపతిం కోదండదీక్షాగురుం
రామం సర్వజగత్సుసేవితపదం సీతామనోవల్లభమ్. ౧
సహస్రశీర్ష్ణవై తుభ్యం సహస్రాక్షాయతేనమః,
నమస్సహస్రహస్తాయ సహస్రచరణాయచ. ౧
నమోజీమూతవర్ణాయ నమస్తేవిశ్వతోముఖ,
అచ్యుతాయనమస్తుభ్యం నమస్తే శేషశాయినే. ౨
నమోహిరణ్యగర్భాయ పంచభూతాత్మనేనమః,
నమోమూలప్రకృతయే దేవానాం హితకారిణే. ౩
నమస్తేసర్వలోకేశ సుఖదుఃఖనిషూదన,
శంఖచక్రగదాపద్మజటామకుటధారిణే. ౪
నమోగర్భాయ తత్త్వాయ జ్యోతిషాం జ్యోతిషేనమః,
ఓం నమోవాసుదేవాయ నమో దశరథాత్మజ. ౫
నమోనమస్తే రాజేన్ద్ర సర్వసంపత్ప్రదాయచ,
నమః కారుణ్యరూపాయ కైకేయీప్రియకారిణే. ౬
నమోదాంతాయ శాంతాయ విశ్వామిత్రప్రియాయతే,
యజ్ఞేశాయనమస్తుభ్యం నమస్తే క్రతుపాలక. ౭
నమోనమః కేశవాయ నమోనాథాయ శార్ఙ్గిణే,
నమస్తే రామచంద్రాయ నమోనారాయణాయచ. ౮
నమస్తేరామచంద్రాయ మాధవాయ నమోనమః,
గోవిందాయనమస్తుభ్యం నమస్తేపరమాత్మనే. ౯
నమోవిష్ణుస్వరూపాయ రఘునాథాయతేనమః,
నమస్తేనాథనాథాయ నమస్తేమధుసూదన. ౧౦
త్రివిక్రమనమస్తేస్తు సీతాయాః పతయేనమః,
వామనాయనమస్తుభ్యం నమస్తేరాఘవాయచ. ౧౧
నమోనమశ్శ్రీధరాయ జానకీవల్లభాయచ,
నమస్తేస్తుహృషీకేశ కందర్పాయ నమోనమః. ౧౨
నమస్తేపద్మనాభాయ కౌసల్యాహర్షకారిణే,
నమోరాజీవనయన నమస్తేలక్ష్మణాగ్రజ. ౧౩
నమోనమస్తేకాకుత్స్థ నమోదామోదరాయచ,
విభీషణపరిత్రాతర్నమస్సంకర్షణాయచ. ౧౪
వాసుదేవనమస్తేస్తు నమస్తేశంకరప్రియ,
ప్రద్యుమ్నాయనమస్తుభ్య మనిరుద్ధాయతేనమః. ౧౫

సదసద్భక్తిరూపాయ నమస్తే పురుషోత్తమ,
అధోక్షజనమస్తేస్తు సప్తతాలహరాయచ. ౧౬
ఖరదూషణసంహర్త్రే శ్రీనృసింహాయ తే నమః,
అచ్యుతాయ నమస్తుభ్యం నమస్తే సేతుబంధక. ౧౭
జనార్దననమస్తేస్తు నమో హనుమదాశ్రయ,
ఉపేంద్రచంద్రవంద్యాయ మారీచమథనాయచ. ౧౮
నమో వాలిప్రహరణ నమస్సుగ్రీవరాజ్యద,
జామదగ్న్యమహాదర్పహరాయ హరయే నమః. ౧౯
నమో నమస్తే కృష్ణాయ నమస్తే భరతాగ్రజ,
నమస్తే పితృభక్తాయ నమస్తే శత్రుఘ్నపూర్వజ. ౨౦
అయోధ్యాధిపతే తుభ్యం నమశ్శత్రుఘ్నసేవిత,
నమో నిత్యాయ సత్యాయ బుద్ధ్యాదిజ్ఞానరూపిణే. ౨౧
అద్వైతబ్రహ్మరూపాయ జ్ఞానగమ్యాయ తే నమః,
నమః పూర్ణాయ రమ్యాయ మాధవాయ చిదాత్మనే. ౨౨
అయోధ్యేశాయ శ్రేష్ఠాయ చిన్మాత్రాయ పరాత్మనే,
నమోఽహల్యోద్ధారణాయ నమస్తే చాపభంగినే. ౨౩
సీతారామాయ సేవ్యాయ స్తుత్యాయ పరమేష్ఠినే,
నమస్తే బాణహస్తాయ నమః కోదండధారిణే. ౨౪
నమః కబంధహంత్రేచ వాలిహంత్రే నమోస్తుతే,
నమస్తేస్తు దశగ్రీవప్రాణసంహారకారిణే. ౨౫

ఇట్టి రామాష్టోత్తరశతము మిగులఁ బావనమైనదియును పాపనాశకమైనదియునని తెలియవలయును. ఓశిష్యోత్తమా! ఈరామాష్టోత్తరశతము ప్రాణులను తరింపఁజేయవలయు నని యెంతోతలంపుతోఁ జెప్పితిని. ఈరామాష్టోత్తరశతమును కీర్తించినమాత్రముచేతనే మానవులు సద్గతినిపొందుదురు. మఱియును దీనిని పఠించినపిమ్మట బ్రహ్మహత్యాది సకలపాపములును నశించును. శ్రీరామాష్టోత్తరశతమును పఠించినపిమ్మట కలికృతదోషము నిలువఁజాలదు. మఱియును దీనిపఠించినపిమ్మట యమభటులు సమీపమునకు రాఁజాలరు. మఱియు నోశిష్యోత్తమా! ఈ రామాష్టోత్తరశతమును పఠనమననాదులఁ జేయువారును ముక్తులగుదురు. బ్రహ్మహత్యాదిపాపములకు నిష్కృతినిగోరువారు మాసముదినములు రామస్తోత్రమును విడువక పఠింపవలయును. దుష్ప్రతిగ్రహాదులవలనఁ గలుగుపాపము దీనినొక్కమాఱు పఠించుటచేత నశించిపోవును. ఈరామాష్టోత్తరశతమును పఠించుటచేత శ్రుతిస్మృతిపురాణాదులనన్నింటిని పఠించుటచేత గలుగు పుణ్యముకంటె నూఱుభాగములధికమగుపుణ్యము లభించును. మఱియును దీనిని ప్రతిదినమందును పుత్రార్థి పఠించెనే

ని పుత్రులను పొందును. ధనార్థి ధనమును పొందును. పత్నినికోరువాఁడు సద్భార్యనుపొందును.

ఇట్లు యానందరామాయణాంతర్గత యాగకాండమునందలి
ఐదవసర్గ ముగిసెను.

✱ ఆగమునందలి దినచర్యావర్ణనము. ✱

ఓశిష్యోత్తమా! విష్ణుదాసా! ఆకుంభోదరుఁడు దివ్యమైనసింహాసనమునం దుఁ గూర్చుండియుండఁగా ఋత్విజులందఱును నల్లనికర్ణముకల యా గుఱ్ఱమును బంధించిరి. పిమ్మట దానియంగములనన్నిటి శాస్త్రోక్తప్రకారముగ ఖండించిరి. అనంతరమం దామాంసఖండముల నన్నిటిని నేతియందుఁ దడిపి వేఱువేఱువిధములగు మంత్రములచేత హోమమునుచేసిరి. పిమ్మట నానావిధములయిన దర్వులను చేఁబూని సక్తుపాయస గోఘృతములు మధువుచేతఁ దడుపఁబడిన తిలదూర్వాదులు మొదలగువానిచేత హోమమును చేసిరి. అనంతరమందు గోఘృతముచేత మిగులస్థూలమును తెంపులేనిదియునునగు వసుధారను అగ్నియందుంచిరి. పిమ్మట నూర్ధ్వముగా బద్ధమైనగోముఖముచేత నానావిధమంత్రములతో హోమాదులను సల్పిరి. చిరకాలముదనుక అనఁగా, యాగకాలము ముగియువఱకును హోమకుండమునుండి బయలువెడలు ధూమము ఆకాశమునందంతటను వ్యాపించియుండె. మిగులఁ బావనమైన చైత్రమాసమునందు మునీశ్వరులందఱును నీవిధముగ నశ్వమేధయాగమును ప్రవర్తింపఁజేసిరి. మఱియును, అగ్నిహోత్రాదిలక్షణములచేతను, ప్రాకృతములును వైకృతములును అయిన యజ్ఞములచేతను ద్రవ్యజ్ఞానక్రియేశ్వరుఁడగు నారాయణునియజించిరి. ఇవ్విధముగ శ్రీరాముఁడు సీతతోఁగూడ ప్రతి దినమునందును ప్రాతఃకాలమునకు ముందుగ నిద్రనుండి మేల్కాంచి శివబ్రహ్మలకును మునీశ్వరులకును నమస్కరించును. అనంతరమందు కౌసల్యాదులకును కామధేనువునకును నమస్కరించును. అంతట హృదయమునందున్న చింతామణిని, కంఠమునందలి కౌస్తుభమణిని దర్శించును. పిమ్మట యజ్ఞవాటమునకును పుష్పకవిమానమునకును యజ్ఞపురుషునకును నమస్కరించును. అనంతరమందు రామతీర్థమునకుఁ బోయి శాస్త్రోక్తవిధానముగ స్నానమునుచేసి నిత్యవిధిని సర్వమునుదీర్చికొని శంకరుని పూజించును. పిమ్మట కామధేనువువలనఁ గలిగినవియును, సీతాదేవిచేత రత్నమయపాత్రలతోఁ దేఁబడినవియునగు నుపహారములను సమర్పించి యనంతరమందు కామధేనువును శాస్త్రోక్తప్రకారముగఁ బూజించును. అనంతరమందు ఋత్విగ్గణమును పూజించి గురుసన్నిధియందు సీతాసమేతముగ నియమముతోఁ గూర్చుండును. అట్లు రాముఁడు ప్రవర్తించుచుండఁగా ఋత్విజులు దేవతలు మునీశ్వరులు మొదలగువారందఱును ప్రాతఃకాలమునందే స్నానమునుచేసి నిత్యవిధిని దీర్చికొని య

జ్ఞమండపసమీపమునందుఁ గూర్చుండిరి. అంతట రామాజ్ఞనుపొంది లక్ష్మణుఁడు ఆఋత్విజాదులనందఱను పూజించె. మఱియును నాఋత్విజాదులకు కామధేనువు వలనఁ గలిగినవియును దివ్యములును, అయిన నానావిధవస్తువులచేత సంతృప్తిని గలిగించె. అనంతరమందు సీతామహాదేవియొక్క యనుమతిచేత లక్ష్మణునిప్రియు రాలగు నూర్మిళయును, భరతశత్రుఘ్నుల వల్లభలగు మాండవీ శ్రుతకీర్తులును, సకలస్త్రీలకును తగిన యుపచారములను సల్పిరి. అనంతరమందు ఋత్విజులందఱు ను స్వాహాకారములతో శాస్త్రోక్తప్రకారముగ మిగుల పరిమళముకల నానావిధము లగు ద్రవ్యములచేత హోమమునుచేసిరి. పిమ్మట రాముఁడు సీతాదేవితోఁగూడ శ్రేష్ఠములైన నానావిధద్రవ్యములచేత హోమమునుచేసిరి. మఱియు నారాముని యశ్వమేధయాగమునందు దేవతలందఱును స్వయముగానే హవ్యములను గ్రహిం చుచువచ్చిరి. ఋత్విజులచేత నుచ్చరింపఁబడుచున్న యస్తుశ్రౌషడను ధ్వని మేఘ ధ్వనివలె మ్రోఁగుచుండె. మఱియు నా ఋత్విజులందఱియొక్కయును మధ్యము నందు యజ్ఞకుండము మిగుల రమ్యముగఁ బ్రకాశించుచుండె. అనంతరమందు మునీ శ్వరులును, దేవతలును, సకలస్త్రీలును, విద్యాధరులును, యక్షులును, గంధర్వు లును, కిన్నరులును, ప్లవగోత్తములును, క్షత్రియులును, క్షత్రియభటులును, ఆ యజ్ఞకుండమునకుఁ జుట్టును కూర్చుండిరి. అనంతరమందు వారస్త్రీలును, వంది మాగధులును, యజ్ఞమండపముదగ్గరఁ గూర్చుండి యజ్ఞమునందలి యుత్సవము లను చూచుచుండిరి. ఆఋత్విజులు మధ్యాహ్నకాలమువఱకును హోమ మునుచేసిరి. మఱియు నాసమయమునందు దేవతలందఱును బంగారఁపు గద్దె యలయందుఁ గూర్చుండి యుండిరి. అప్పుడు లక్ష్మణుఁడు భరతశత్రుఘ్ను లతోఁగూడుకొనినవాఁడై యాదేవాదుల నందఱను పూజించి సువర్ణపాత్ర ములను వారిముందరనునిచి వడ్డనచేయుటకు సీతామహాదేవిని త్వరఁబరచిరి. అంతట సీతోర్మిళామాండవీశ్రుతకీర్తులు అనేకులగు రాజస్త్రీలతోఁగూడ వడ్డనచేసిరి. నానావిధములయిన పక్వాన్నాదులను వడ్డించిరి. ఆస్త్రీలువడ్డించునపుడు వారియా భరణముల ధ్వనులు మిగుల మనోహరములై యుండె. మఱియు నాసమయమునం దులక్ష్మణాదులిట్లనిరి. ఓపురుషోత్తములారా! మీకభీష్టములగు పదార్థములను ని స్సందేహముగభుజింపుఁడనిరి. మఱియు నాసమయమునందు సమృద్ధిగవడ్డించుచుండు టచేత వలదువలదని చెప్పుటవలనఁ గలిగెడుధ్వనియే నలుదిక్కులయందును వ్యాపిం చుచుండెనుగాని కావలయునని యెడు ధ్వనిమాత్రమెందును కలుగుట లేదు. మఱియు నాభోజనకాలమునందు రామాదులు వింజామరములను వైచుచుండిరి. మఱియు నాసమయమునందు రామభటులు రామముద్రాంకితములగు రూప్యాదుల నపరిమి తముగ దానముచేయుచుండిరి. ఆదక్షిణలను గ్రహించి బ్రాహ్మణాదులు తమతమ విడిదలలకుఁబోయిరి. మఱియు నాబ్రాహ్మణాదులు తమతమ విడిదలలకుఁ బోవున

పుసు దివ్యములగు తాంబూలములను గ్రహించిరి. అనంతరమందు దేవతాస్త్రీలు మొదలగు వారందఱును యథేచ్ఛముగ భుజించిరి. అట్లు సకల జనులును సమృద్ధిగ భుజించుటచేత నాయాగశాలయందు క్షుద్బాధచేత పీడింపఁబడు జంతువొక్కటి యును లేకయుండె. అఖిలవారును భోజనమును చేసినపిమ్మట సీతారాములుబంధు మిత్రాదులతోఁగూడ యథేష్టముగభుజించిరి. విశేషముగఁజెప్పనేల, ఆకాశమునందె న్నినక్షత్రములు కలవో రాముని యాగశాలయందందఱు యథేష్టముగభుజించిరి. అట్లు సకలజనులును భోజనమును చేసినపిమ్మట నాల్గవయామమునందు యాగమండపమునందలి సభయందుఁగూర్చుండి నృత్యగీతాదులచేతను శాస్త్రవాదములచేతను కాలక్షేపమును చేయుచుందురు. అంతట సాయంకాలము కాఁగానే యెల్లవారును సంధ్యావందనాదికమునుచేసి శాస్త్రోక్తప్రకారముగ మరల హోమము చేయుదురు. అనంతరమందు మరల నృత్యగీతాదులచేత రాత్రియందు రెండుజాముల వఱకును కాలమును గడపుచుందురు. పిమ్మట శ్రీరాముఁడెల్లవారును నిద్రనుపొందునటుల నాజ్ఞాపించును. అంతట నెల్లవారును తమతమ స్థానములకుఁ బోయి యథేష్టముగ నిద్రను పొందుదురు. పిమ్మట సీతారాములు పట్టుపరుపుల తూలాసనమునందు జితేంద్రియులై నిద్రను పొందుదురు. అట్లుసీతారాములు నిద్రించుటకుఁ బూర్వమునందు తమ యిష్టదేవతలను పూజింతురు. మఱియును, రాజుల కాజ్ఞాభంగమును చేయుటయును, బ్రాహ్మణులకు మానహానిచేయుటయును, స్త్రీలకు పృథక్శయ్యను గల్పించుటయును శస్త్రముచేతఁ గొట్టకయే వధించుటయగును. కావున శ్రీరాముఁడు భిన్నశయ్యయందుఁ బరుండక సీతతోఁగూడ నేకశయ్యయందుఁబరుండె. ఈవిధముగ శ్రీరాముఁడా యాగకాలమునందు దినచర్యకలవాఁడై యుండె.

ఇట్లు ఆనందరామాయణాంతర్గత యాగకాండమునందలి
యాజ్ఞవసర్గ ముగిసెను.

✷ ధ్వజారోపణ విధానము ✷

అట్లు రామునిదినచర్యావృత్తాంతమును చెప్పినపిమ్మట రామదాసు మరల నిట్లనియె. ఓవిష్ణుదాసా! ఆవిధముగ శ్రీరాముఁడు దినదినమందును మహానుభావులగు మునులు మొదలగువారలనందఱును పూజించుచుండె. అంతట చైత్రశుక్ల ప్రతిపత్తిథియందు రాజులందఱును యాగశాలయందు శాస్త్రోక్తప్రకారముగ ధ్వజారోపణమును చేసి రనినవిని విష్ణుదాసిట్లనియె. ఓ గురూత్తమా! యాగమండపమునందు రాజులచేత ధ్వజములు ఆరోపింపఁబడె నని చెప్పితివి. ఆ ధ్వజారోపణ విధానమును సర్వమును సవిస్తరముగఁ జెప్పి నన్ను గృతార్థుం జేయవేయనిన శ్రీరామదాసిట్లనియె. ఓ శిష్యోత్తమా!, నీవు లోకోపకారమైన ప్రశ్నమును చేసితివి. కావున సావధానమనస్కుఁడవై వినుము. ఈ వ్రతము ఒక్క సంవత్సరకాలము జరుగఁదగినదని తెలి

సికొని రాజులందఱును యాగశాలయందు ధ్వజముల నారోపించిరి. అట్లు గాదేని యాధ్వజములు విష్ణుమందిరములయందే ఆరోపింపఁ దగినవి. మఱియును ప్రతిసంవత్సరమునందును ప్రతిపచ్ఛుక్లప్రతిప త్తిథియం దయినను శ్రీరామనవమీతిథియందైనను దశమియందైనను లేక ఆశ్వయుజశుక్లదశమియందైనను లేక కార్తిక శుక్లప్రతిప త్తిథియందైనను ధ్వజారోపణము చేయుట యుక్తమై యున్నది. ఓ శిష్యోత్తమా! ఈ ధ్వజారోపణమని యెడు నామధేయముకల వ్రతము మిగులఁ బావనమైనదియును శ్రీరామునకు సంతోషమును కలుగఁజేయునట్టిదియునునై యున్నది. మఱియు నో శిష్యోత్తమా! విష్ణుదేవాలయమునందు ధ్వజారోపణమును చేయువానిని బ్రహ్మాదులు పూజింతురు. మఱియు నట్టిమహానుభావుఁడు యోగ్యుఁడగు గృహస్థు వేయిభారముల బంగారమును దానమునుచేసినవానిపుణ్యమునకు సమానమగు పుణ్యముకలవాఁడగును. గంగాస్నానఫలముకూడ ధ్వజారోపణ పుణ్యమునకు సమమైనది కాదు. మఱియు నో శిష్యోత్తమా! తులసీసేవయును శివలింగపూజయును మిగులఁ బావనములయినవి. ధ్వజారోపణమను కర్మము సకలపాపములను హరించునట్టిది. మఱియు నో శిష్యోత్తమా! చైత్రశుక్ల ప్రతిప త్తిథి, చైత్రశుక్ల దశమి, చైత్రశుక్ల నవమి, ఆశ్వయుజ శుక్ల దశమి, కార్తికశుక్ల ప్రతిప త్తిథి, అనునవి ధ్వజారోపణమునకు సర్వోత్తమములయిన దినములు. ఓ శిష్యోత్తమా! ముఖ్యముగ చైత్రశుక్లమునందే ధ్వజారోపణమును చేయవలయును. చైత్రమాస మతిక్రమించెనేని యితరపర్వములయందు చేయవలయును. ఓ శిష్యోత్తమా! చైత్రశుక్లప్రతిప త్తిథియందలి ప్రాతఃకాలమునందు నిద్రనుండి లేచి నియతుఁడై ప్రయత్నపూర్వకముగ స్నానమును చేయవలయును. అనంతరమందు నిత్యకర్మమునుచేసి యనంతరమందు విష్ణుదేవుని నారాధింపవలయును. పిమ్మట నలుగురు బ్రాహ్మణులతోఁగూడ స్వస్తివాచనికమును చేయింపవలయును. అనంతరమందు ధ్వజారోపణకర్మాంగమయిన నాందీశ్రాద్ధమును చేయవలయును. పిమ్మట వస్త్రసంయుతమయిన ధ్వజస్తంభమునందు గాయత్రిచేత ప్రోక్షణనుచేయవలయును. అనంతరమందు పతాకములయందు వైనతేయహనుమంతులను వ్రాయవలయును. పిమ్మట సూర్యచంద్ర హనుమద్గరుడులను పూజింపవలయును. అనంతరమందు కుంభకద్వయమునందు ధాతవిధాతలను పూజింపవలయును. మఱియును, హరిద్రాక్షతలు తెల్లనిపుష్పములు మొదలగువానిచేత పూజనుచేయవలయును. అనంతరమందు గోచర్మమాత్రమగు భూమియందుపలేపమునుచేసి స్వగృహ్యాసూత్రోక్తప్రకారముగ క్రమముగ నగ్నిని స్థాపించి ఘృతభాగాదికమును చేయవలయును. పిమ్మట ఘృతపాయసములచేత నూటయెనిమిది పర్యాయములు హోమమును చేయవలయును. మఱియును ముందుగ పురుషసూక్తముచేతను, విష్ణోర్నుక, అను మంత్రముచేతను చేయఁదగిన సంస్కారములను చేయవలయును. అనంతరమునందు

నైనతేయునకు స్వాహాకారముతో నెనిమిది యాహుతులను వ్రేల్వవలయును. ఆవిధముగానే హనుమంతునకును నెనిమిదియాహుతులను వ్రేల్వవలయును. అనంతరమందు "సోమోధేనుమ్" అను మంత్రము నుచ్చరించి హోమముచేయువలయును. పిమ్మట సౌరమంత్రములను శాంతిసూక్తములను పఠింపవలయును. పిమ్మట రాత్రియందు విష్ణుసమీపమునఁ గూర్చుండి జాగరణమును చేయవలయును. ఈవిధముగా పరమోత్సవములతో తొమ్మిదిదినము లుత్సవమును చేయవలయును. మఱియును, తొమ్మిదిరాత్రులయందును జాగరణమును చేయవలయును. అనంతరమందు పదియవదినమునందు ప్రాతఃకాలమునకు ముందుగలేచి నిత్యకర్మానుష్ఠానమును సమాప్తినిపొందించి మునుపటివలెనే గంధపుష్పాక్షతాదులచేత దేవునిపూజింపవలయును. పిమ్మట మంగలవాద్యములచేతను మంగళకరములయిన శుక్లపీఠములచేతను నృత్యగీతాదులచేతను ఆధ్వజమును దేవాలయముదగ్గఱకుఁ దీసికొని పోవలయును. అనంతరమందు దేవునిద్వారదేశముపైనను శిఖరమునందైనను సంతోషముతోఁ గూడుకొనినవాఁడై యాధ్వజస్తంభమును స్థాపింపవలయును. పిమ్మటఁ జక్కఁగఁ బ్రకాశించుచున్న గంధపుష్పాక్షతలు మనోహరములయిన ధూపములు భక్ష్యభోజ్యాదులతోఁ గూడుకొనిన నైవేద్యములు మొదలగువానిచేత విష్ణుదేవునకుఁ బూజను చేయవలయును. మఱియును, ప్రతిపత్తిథిమొదలుకొని దశమివఱకును ధ్వజములకుఁ బూజనుచేసి యేకాదశీతిథియందు విష్ణ్వాలయమునందు స్థాపింపవలయును. ఇట్లుగాదేని యాధ్వజములను దశమియందైనను స్థాపింపవలయును. మఱియును, నవమియందైనను ద్వితీయయందైనను చతుర్థియందైనను అష్టమీదినమునందైనను షష్ఠియందైనను ధ్వజములను స్థాపింపవలయును. మఱియు నేదినమునందు ధ్వజారోపణమును చేసినను ప్రతిపత్తిథియందే ప్రారంభింపవలయును. మఱియు నిప్పుడు చెప్పఁబడిన మాసములయందుఁ దప్పఁ దక్కినమాసములయందు ధ్వజారోపణకార్యమును చేయఁగూడదు. శివాలయమునందు మాఘకృష్ణచతుర్దశియందుమాత్రమే ధ్వజారోపణమును చేయవలయును. శివాలయమునందు స్థాపించునట్టి ధ్వజములయందు నందీభృంగుల యాకారములను చిహ్నితములుగఁ జేయవలయును. పార్వతీ దేవాలయమునందు ఆశ్వయుజ శుక్లాష్టమియందైనను చైత్రశుక్లాష్టమియందైనను ధ్వజారోపణమును చేయవలయును. భాద్రపదశుక్ల చతుర్థియందు వినాయకుని గృహమునందు ధ్వజారోపణమును చేయవలయును. మార్గశీర్ష శుక్లషష్ఠియందు సూర్యాలయమునందు ధ్వజారోపణమును చేయవలయును. మఱియు నీవిధముగా సకలదేవతలకును నుత్సవదినములయందు ధ్వజారోపణమును జేయవలయును. మఱియు నో శిష్యోత్తమా! చైత్రకార్తికాశ్వయుజమాసములు తప్పఁ దక్కినమాసములయందు విష్ణ్వాలయమునందు ధ్వజారోణపమును చేయవలయును. ఈవిధముగా దేవాలయము

నందు మిగుల శ్రేష్ఠములయిన రెంకుధ్వజములను స్థాపింపవలయును. మఱియును, శాస్త్రోక్తప్రకారముగ విష్ణుదేవునిపూజించి విత్తశాఠ్యమునుమాత్రము చేయఁగూడదు. అనంతరమందు ప్రదక్షిణ నమస్కారమునుచేసి యిట్లని స్తోత్రముచేయవలయును. ఎట్లనిన:—

" శ్లో. నమస్తే పుణ్డరీకాక్ష నమస్తే విశ్వభావన,
నమస్తేస్తు హృషీకేశ మహాపురుషపూర్వజ. ౧
యేనేద మఖిలంజాతం యస్మిన్సర్వం ప్రతిష్ఠితమ్,
లయమేష్యతి యత్రైతత్తం ప్రపన్నోస్మిమాధవమ్. ౨
నజానంతి పరందేవం సర్వే బ్రహ్మాదయస్సురాః,
ధ్యాయంతి యోగినోయంవై తంవందే జ్ఞానరూపిణమ్. ౩
అంతరిక్షంతు యన్నాభిర్ద్యౌ ర్మూర్ధ్నా యస్యచైవహి,
పాదాచ్చా భూచ్చవై పృథ్వీ తంవందే విశ్వరూపిణమ్. ౪
యస్యశ్రోత్రౌ దిశస్సర్వా యచ్చక్షుర్దినకృచ్ఛశీ,
ఋక్సామయజుషీయేన తంవందే బ్రహ్మరూపిణమ్. ౫
యన్ముఖాద్ బ్రాహ్మణాజాతా యద్బాహ్వో రభవన్నృపాః,
వైశ్యాయ స్యోరుతోజాతాః పద్భ్యాంశూద్ర స్త్వజాయత. ౬
మనస శ్చంద్రమాజాతో పనేశశ్చక్షుష స్తథా,
ప్రాణేభ్యః పవనోజాతో ముఖాదగ్నిరజాయత. ౭
పాపసందాహమాత్రేణ వదంతి పురుషంతుయమ్,
స్వభావవిమలంశుద్ధం నిర్వికారం నిరంజనమ్. ౮
క్షీరాబ్ధిశాయినం దేవ మనంత మపరాజితమ్,
మద్భక్తవత్సలం విష్ణుం భక్తిగమ్యం నమామ్యహమ్. ౯
పృథివ్యాదీనిభూతాని తన్మాత్రాణీంద్రియాణిచ,
సుసూక్ష్మాణిచయేనాసన్ తం వందే సర్వతోముఖమ్. ౧౦
యద్బ్రహ్మపరమంధామ సర్వలోకోత్తమోత్తమమ్,
నిర్గుణంపరమంసూక్ష్మం ప్రణతోస్మిపునఃపునః. ౧౧
నిర్వికారమజంశుద్ధం సర్వతోవహ్నిమీశ్వరమ్,
యమామనంతియోగీంద్రా స్సర్వకారణకారణమ్. ౧౨
ఏకోవిష్ణుర్మహద్భూతం పృథగ్భూతాన్యనేకశః,
త్రీన్లోకాన్వ్యాప్యభూతాత్మా భుఙ్క్తేవిశ్వభుగవ్యయః. ౧౩
నిర్గుణః పరమానంద స్సమేవిష్ణుః ప్రసీదతు,
చతుర్భిశ్చచతుర్భిశ్చ ద్వాభ్యాంపంచభిరేవచ. ౧౪
హూయతేచపునర్ద్వాభ్యాం సమేవిష్ణుఃప్రసీదతు,

జ్ఞానినాం కర్మిణాం చైవ తథా భక్తిమతాం నృణామ్. ౧౫
గతిదాతా విశ్వభుగ్యస్స మే విష్ణుః ప్రసీదతు,
జగద్ధితార్థం యో దేహం దధల్లీలయా హరిః. ౧౬
యమర్చయంతి విబుధా స్స మే విష్ణుః ప్రసీదతు.
యమామనంతి వై సంత స్సర్వదానందవిగ్రహమ్. ౧౭
నిర్గుణం చ గుణాధారం స మే విష్ణుః ప్రసీదతు,
పరేశః పరమానందః పరాత్పరతరః ప్రభుః. ౧౮
చిద్రూపశ్చ పరిజ్ఞేయ స్స మే విష్ణుః ప్రసీదతు."

అనునట్టి సర్వోత్తమస్తోత్రమును కీర్తించువాఁడు సకలపాపరహితుఁడగును. మఱియు నీస్తోత్రమును పఠించి విష్ణుబ్రాహ్మణాచార్యులను దక్షిణాదులతోఁ గూడఁ బూజించి బ్రాహ్మణులకు మృష్టాన్నమును పెట్టి భుజింపవలయును. అనంతరమందు పుత్త్రమిత్త్రకళత్రాదులతోఁ గూడుకొని భుజింపవలయును. మఱియు నో శిష్యోత్తమా! ధ్వజమునకుఁ గట్టినవస్త్ర మెంతకాలము చలించుచుండునో అంతకాలముదనుక సకలపాపములును నశించుచుండును. మహాపాతకములను చేసినవాఁడైనను సకలపాతకములను చేసినవాఁడైనను విష్ణ్వాలయమునందు ధ్వజస్తంభమును స్థాపించెనేని సకలపాపరహితుఁడగును. మఱియును తాను స్థాపించిన ధ్వజస్తంభ మెన్నిదినములు విష్ణ్వాలయమునందుండునో అన్నివేల దివ్యసంవత్సరములు విష్ణుసాయుజ్యమును పొంది యుండును. ఆరోపింపఁబడిన ధ్వజస్తంభమును చూచి నమస్కరించునట్టి వారుకూడ పాతకరహితులగుదురు. మఱియును విష్ణ్వాలయమునం ధ్వజస్తంభమునందలి దుమ్మును తనవస్త్రముతోఁ దులుపువాఁడు సకలపాపరహితుఁడగును. ఓశిష్యోత్తమా! నీవడిగినవిషయమును సర్వమును సంపూర్ణముగఁ దెలియఁ జెప్పితిని. ఇఁకను ప్రారంభించినవిషయమును చెప్పెదను. సావధానచిత్తుఁడవై వినుము. ఓశిష్యోత్తమా! సకలరాజులును చైత్రశుక్లపాడ్యమివచ్చుటను తెలిసికొని వేఱువేఱుగ ధ్వజస్తంభములను స్థాపించిరి. మఱియును రాజులందఱును రాముని శ్రీమహావిష్ణువునుగాఁ దలఁచుటచేత రామునియాగమంటపమునందు ధ్వజములను స్థాపించిరి. మఱియు నారాజులందఱును తమతమవాసగృహములయందు తొమ్మిదిదినములదనుక ధ్వజస్తంభములను పూజించిరి. మఱియు నారాజులందఱును యజ్ఞోత్సవమును చూచుటకొఱకు కొక్కదినమునందే ధ్వజారోపణమును చేసిరి. వీరుచేయుటకు పూర్వమునందు రాముఁడుకూడ ధ్వజారోపణమును చేసె. మఱియు నారాముఁడు మాఘకృష్ణచతుర్దశియందు శివుని కెదుట గగనాంగణమునందుఁ బ్రకాశించుచుండె. ఓశిష్యోత్తమా! మనోహరమైన యీధ్వజారోపణచరిత్రమును విన్నవారును పఠించినవారును సకలపాపరహితులై సర్వాభీష్టములను పొందుదురు.

ఇట్లు ఆనందరామాయణాంతర్గత యాగకాండమునందలి యేడవసర్గము గిసెను.

✱ శ్రీరామునియొక్క యవబృథస్నానవృత్తాంతము ✱

అంతట నారామదాసు మరల నిట్లనియె. ఓశిష్యోత్తమా! శ్రీరామజన్మదినమగు చైత్రశుక్లనవమియందు అశ్వమేధయాగఫలమును పొందుటకుఁదగిన యవబృథస్నానమును చేయుటకొఱకు గురుఁడగు వసిష్ఠమునివరుఁడు శ్రీరామునకు సూచనను చేసె. మఱియును, ఎండవేడిమి యెక్కుఁడగునను తలంపుతో శ్రీరాముని నవబృథస్నానముకొఱకుఁ ద్వరపెట్టెను. అట్లు వసిష్ఠమునివరుఁడు చెప్పినవాక్యములను శ్రీరాముఁడు విని లక్ష్మణునితో నిట్లనియె. ఓలక్ష్మణా! ఇప్పుడు అవబృథస్నానముకొఱకు నేనుబోవలసియున్నది. కావున నీవు రామతీర్థమునకుఁ బోయి చేయఁదగినకార్యములను చెప్పెదను. ఓలక్ష్మణుఁడా! సకలరాజులును తమతమగజతురగాది సైన్యముతోఁగూడ నక్కడకువచ్చునట్లు చేయవలయును. మఱియు నోతమ్ముఁడా! సకలరాజులును అంతఃపురస్త్రీలతోఁ గూడ మంటపమునందుండు నట్లుచేయుము. మఱియును మనసైన్యమును గూడ సన్నద్ధముగఁ జేయవలయును. నవవాద్యములయొక్కయును మంగళవాద్యములయొక్కయును ధ్వనులు విరామము లేకుండఁగఁ బోవునట్లు చేయవలయును. పతాకాధ్వజతోరణాదులు సర్వస్థలములయందును ప్రకాశించునట్లు చేయవలయును. మఱియును ముక్తాప్రవాళ పుష్పాదితోరణములు రామతీర్థమువఱకును నుండునట్లు చేయవలయును. మఱియును, కదళీస్తంభములను ఇక్షుదండములను స్థాపింపవలయును. పుష్పవాటికలను మృత్పాత్రలయందు విచిత్రముగనుంచవలయును. మఱియును, సర్వస్థలములయందును వారస్త్రీలు నృత్యములను చేయునట్లు చేయవలయును. రామతీర్థమునకుఁబోవుమార్గము నందంతటను చందనోదకములను జల్లవలయును. మఱియు, పట్టుశాలువాదులచేత పుష్పాదులచేతను మార్గమును కప్పవలయును. మఱియు నోలక్ష్మణా! నేను ఇంకను దేనినైన మఱచినయెడల వానినన్నిటిని చేయవలయును. చేయఁదగినకార్యములను గుఱించి నన్నడుగకయే చేయవలయుననియె. ఈవిధముగ రాముఁడు చెప్పినవాక్యములను విని సర్వమును నెరవేర్చెదనని చెప్పి సర్వమును నావిధముగానే చేసెను. అనంతరమందు ఋత్విజులు సవిస్తరముగ గమనేష్టిని చేయవలయును. పిమ్మట గుఱ్ఱములనుగట్టిన రథమునందు వహ్నిని పాత్రములను రాముని సీతను ఎక్కించి వసిష్ఠమహాముని ఋత్విజులతోఁగూడ రథమునెక్కె. నలుదిక్కులయందును మునులు వేదఘోషములను చేయుచుండిరి. ఆసమయమునందు శ్రీరాముఁడు రథమునెక్కి వందిమాగధులు స్తోత్రమును చేయుచుండఁగా మెల్లమెల్లగ బయలువెడలిపోయెను. ఆరథమునకు ముందుగ నేనుఁగులును ఆయేనుఁగులకు వెనుక గుఱ్ఱములును పోవుచుండె. అనంతరమందు తూర్యఘోషధ్వనులును వచ్చుచుండె. పిమ్మట రాజదూతలు చిత్రములగు తలగుడ్డలు కట్టుకొని బయలువెడలిరి. పిమ్మట వందిమాగధులును నటులును పోవుచుండిరి. పిమ్మట వారస్త్రీలు బయలువెడలిరి. అనంతరమం

దు దేవతలును గంధర్వులును బయలు వెడలిరి. అనంతరమందు సీతారాముల రథము బయలు వెడలె. మఱియు నాసమయమునందు ఋత్విగ్జనులతోడను అగ్నితోడనుకూడ రథమునెక్కి బయలు వెడలె. అనంతరమందు మునీశ్వరులును ఋషిపత్నులును బయలువెడలి వచ్చుచుండిరి. పిమ్మట వారిసైన్యములును రాజసేవకులును నవవాద్య ఘోషములతోఁగూడ బయలు వెడలిరి. అనంతరమందు బాణములను ధరించినవారును శకటముల నెక్కినవారును బయలు వెడలిపోయిరి. అనంతరమందు లోహకారులును తక్షకులును బయలు వెడలిరి. అనంతరమందు భూమి మానమును దెలిసినవారును రజ్జు కుద్దాలధారులును బయలు వెడలిరి. ఈవిధముగా నెల్లవారును పరమోత్సవములతో బయలు వెడలిపోయిరి. ఆసమయమునందు వాద్యములు మ్రోగుచున్నవి. వారస్త్రీలు నృత్యములను చేయుచుండిరి. మఱియు నప్పుడు మునిభార్యలు పుష్పవర్షమును గురిపించిరి. మార్గమునందు వందిమాగధులు శ్రీరాముని స్తోత్రముచేసిరి. గంధర్వులు మార్గమునందు షడ్జాదిస్వరములను పాడుచు బయలు వెడలిరి. మునులందఱును స్వరయుక్తముగ వేదఘోషములను చేయుచుండిరి. ఈవిధముగా శ్రీరాముఁడు అనేక విధములయిన కౌతుకములను చూచుచుఁబోవుచుండె. మఱియును, భటులువింజామరలను వైచుచుండఁగ సీతామహాదేవితోఁగూడఁ బోవుచుండె. ఆసమయమునందు సకలజనులును సీతామహాదేవియొక్క ముఖపద్మమును జూడఁగలిగెనుగదా! యనుసంతోషముతో కోలాహలధ్వనులను చేసిరి. అప్పుడు వేత్రపాణులగు భటుల ఆజనసమ్మర్దము నడపఁజాలక మిగులశ్రమమును పొందిరి. ఆ వేత్రపాణులు జనసమ్మర్దము నివారించునపు డత్యధికమగు కోలాహలధ్వనికలిగె. ఆవిషయమును సర్వమును దెలిసికొని శ్రీరాముఁడు లక్ష్మణునితో నిట్లనియె. ఓలక్ష్మణా! ఈ జనమంతయును పుష్పకవిమానమునందుండి నన్నును సీతనుచూచునట్లుచేయుము. మమ్ములఁజూచుటకు జనులు కలహించుచున్నారు. అట్లుకలహమును పొందకుండునట్లు చేయుమనియె. అందులకు లక్ష్మణుఁ డంగీకారమునుపొంది యెల్లవారిని పుష్పకవిమానమునం దెక్కుటకు నియమించె. అంతట నెల్లవారును పుష్పకవిమానమునెక్కి సీతాసమేతుఁడగు శ్రీరాముని జూచుచుండిరి. ఆసమయమునందు సీతారాములు మెల్లమెల్లగఁ బోవుచుండిరి. అప్పుడు కొందఱు ఈమహోత్సవమునందు సీతారాములను జూచుటచేత ధన్యులమైతిమనిరి. మఱికొందఱు సీతారాములను చూచునట్లు మనలను గనిన మనతలిదండ్రులుకూడ ధన్యులైరనిరి. మఱియు నీవిధముగా సీతారాములు పోవుచున్నపుడు స్త్రీలందఱును ఈపుష్పకవిమానముమీఁద మమ్ములఁగూర్చుండఁబెట్టుమని సీతామహాదేవిని ప్రార్థించిరి. అప్పుడు సీతామహాదేవి తనయొద్దనున్న లక్ష్మణునితో నిట్లనియె. ఓలక్ష్మణా! ఈస్త్రీలందఱును పుష్పకవిమానమునందలి నారీశాలయందుఁ బ్రవేశించునట్లు చేయుమనియె. అంతట నెల్ల

వారును పుష్పకవిమానమునందుండునట్లు లక్ష్మణుఁ డాజ్ఞాపించె. అంతట స్త్రీలందఱును పుష్పకవిమానమునం దెక్కి పరమానందముతో సీతారాములను జూచుచు వారిమీఁద పుష్పవర్షమును గురిపించుచుండిరి. మఱియు నాయవభృథోత్సవకాలమునందు నానావిధములగు వాద్యములు మిగులగంభీరముగ మ్రోగుచుండెను. నానాదేశరాజులు తమతమ సైన్యములతోఁగూడ వచ్చియుండుటచేత సైన్యకోలాహలధ్వనిచేత భూమియంతయును గంపించె. మఱియు నాసమయమునందు సభయందలి బ్రాహ్మణులందఱును దేవర్షి పితృగంధర్వులును వేదఘోషములతో సీతారాములను స్తోత్రముచేసిరి. మఱియును గంధర్వాదులు సీతారాములమీఁద పుష్పవర్షమును గుఱిపించిరి. మఱియు నానావిధములగు నుత్సవములు జరుగుచుండె. ఇట్లు నానావిధములుగ జరుగుచున్న యుత్సవములను జూచుచు సీతారాములు రథారూఢులై మెల్లమెల్లగఁ బోవుచుండిరి. అంతట సీతారాములు సరయూనదీతీరమునకుఁబోయిరి. పిమ్మట సీతారాములు రథమునుండిదిగి సరయూజలమునందు జలక్రీడ నిచేసిరి. మఱియు నాసమయమునందు శ్రీరాముఁడు ఋత్విగ్జనులతోఁ గూడుకొనినవాఁడై భార్యతోఁగూడ నవభృథస్నానముచేయుటకు యత్నించె. అప్పుడు ఋత్విజులందఱును సీతారాములను సరయూనదియందు ఆచాంతమువఱకును స్నానమును చేయుంచిరి. మఱియు నాసమయమునందు ఋత్విజులందఱును శత్రుఘ్నునిచేతఁ దేఁబడిన నానాతీర్థజలములచేత రామునకభిషేకమును చేసిరి. మఱియు నప్పుడు దేవదుందుభులును నరదుందుభులును మ్రోగె. మఱియును దేవర్షిపితృమానవులు పుష్పవర్షమును గుఱిపించిరి. అప్పుడెల్లవారును నానావిధములగు స్తోత్రములనుచేసిరి. మఱియు నీయవభృథస్నానమువలన మహాపాతకులుకూడ పవిత్రులగుదురు. అంతట రాముఁడు పరిశుద్ధమగు వస్త్రములనుధరించి దివ్యములైన కంకణాదులచేత నలంకరింపఁబడి మిగుల మనోహరముగఁ బ్రకాశించుచుండె. మఱియు నాసమయమునందు కేయూరకుండల నూపురహారాదులచేతఁగూడ మిగులమనోహరముగ నలంకరింపఁబడియె. మఱియును, నానాప్రసూనహారములచేతను రత్ననూపురములచేతను నలంకరింపఁబడియె. ఇంతియగాక రామునిహృదయమునందు చింతామణియును కంఠమునందు కౌస్తుభమణియును ప్రకాశించుచుండె. మఱియు నాసమయమునందు చింతామణియొక్కయును కౌస్తుభమణియొక్కయును కాంతిచేత ప్రకాశించుచున్నవాఁడయ్యె. మఱియు నప్పుడు శ్రీరాముఁడు కోటిమందిసూర్యులతో సమానమైన కాంతికలవాఁడై యుండెను. ఇట్లు ప్రకాశించుచు సీతామహాదేవితోడను ఋత్విజులతోడను గూడుకొనియుండె. మఱియు నప్పుడు ఋత్విజులకు అలంకారములుచేయించి దక్షిణలతోఁగూడ గోభూతురగగజములను దానముచేసె. అనంతరమందు కామధేనువు నలంకరించి గురుఁడగు వసిష్ఠమునివరునకిచ్చుట కుద్యమించెను. అవిషయమును దెలిసికొని వసిష్ఠమునివరుఁడు తనమనమ్మునం దిట్లు దలంచెను. నాకు

నందినియను ధేనువుకలదు. కావున నాకిప్పుడు నీవీయఁదలఁచినగోవుతోఁ బ్రయోజనములేదు. కావున నేను కామధేనువును కోరక సర్వాభరణభూషితురాలగు సీతను యాచించి శ్రీరాముఁడు మిక్కిలి యౌదార్యము కలవాఁడనువిషయమును లోకులకుఁ దెలియఁజేసెదనని నిశ్చయించి యావసిష్ఠమునివరుఁడు శ్రీరామునితో నిట్లనియె. ఓరఘుకులోత్తమా ! ధేనుదానమును చేయఁదలఁచినట్లు తోఁచుచున్నది. నాకు కామధేనువునిచ్చుటవలనఁ దృప్తికలుగనేరదు. కావున సర్వాభరణభూషితురాలగు సీతామహాదేవినిదానముచేయుము. అట్లు చేసినయెడల నాకుఁదృప్తికలుగునుగాని వేఱొకదానమును చేయుటవలననాకుఁ దృప్తికలుగదనియె. అట్లు వసిష్ఠమహాముని చెప్పినవచనములను విని జనులందఱును హాహాకారములను చేసిరి. మఱియు నెల్లవారును భయవిహ్వలులై మిగుల దుఃఖమును పొందిరి. అప్పుడు కొందఱు ఈ వసిష్ఠుఁడు ముసలివాఁడు కనుక భ్రాంతుఁడయ్యెనా ? ఏమి ? అనిరి. మఱి కొందఱు వసిష్ఠమునివరుఁడేమో వినోదమును చేయఁదలఁచి యివ్విధముగ నడిగెననిరి. మఱికొందఱు శ్రీరాముని ధైర్యమును చూడఁదలఁచి యీవిధముగ నడిగెననిరి. కొందఱు శ్రీరాముఁ డిందుకేమి చేయునో చూతమని తలఁచిరి. ఇంతలోపల శ్రీరాముఁడీవృత్తాంతమును విని నవ్వుచు సీతను సంజ్ఞచేతఁ బిలిచి సీతామహాదేవియొక్క వామహస్తమును తనహస్తముతో పట్టుకొని గురువునొద్దకుఁబోయి గురుఁడగువసిష్ఠునకు సంతోషమును గల్గించుచు సభయందలివారందఱును వినుచుండగ నిట్లనియె. ఓగురూత్తమా ! స్త్రీదానమంత్రమును చెప్పుము. సీతనుదానముచేసెదననినవిని వసిష్ఠమునివరుఁడు మునులందఱు వినుచుండఁగ విధ్యుక్తప్రకారముగ మంత్రమును చెప్పుచు శ్రీరామునిచేత సమర్పింపఁబడిన స్త్రీదానము నంగీకరించె. ఆసమయమునందు స్థావరజంగమాత్మకమైన ప్రపంచమంతయును గడగడవణఁకె. మఱియునప్పు డెల్లవారును చిత్తరువులలోని బొమ్మలవలె నిశ్చేష్టితులైరి. ఆసమయమునందు వసిష్ఠమహాముని సీతామహాదేవితో నిట్లనియె. ఓబాలికా ! రాముఁడు నిన్ను నాకొసంగె. కావున నికమీఁదనీవు నాదగ్గరనుండుము. నిన్ను నేను కుమార్తెనుపోషించు విధముగఁబోషించెదననియె. ఆవచనమునువిని సీతామహాదేవి ఖిన్నమానసురాలై యెడమవైపునకుఁ ద్రిప్పఁబడిన చూపుకలదై వసిష్ఠమునివరుని ప్రక్కను కన్నులనీరుగారుచుండఁగఁ గూర్చుండె. అంతట రాముఁడు మిగుల వినయము కలవాఁడై వసిష్ఠమునివరునితో నిట్లనియె. ఓమునికులోత్తమా ! పూర్వముసీత కర్పింపఁబడిన కామధేనువునుగూడఁ గైకొనుము. మఱియును నాయొద్దనుండు చింతామణిని కూడఁగైకొను మనినవిని వసిష్ఠమహాముని యిట్లనియె. ఓరఘుకులోత్తమా! రామచంద్రా! నీయౌదార్యము నెల్లవారికిని చూపుటకొఱకు నీభార్యయగు సీతామహాదేవిని యాచించితిని. పరమపావనురాలగునీ సీతామహాదేవిని మరల నీవుగైకొని యామెకు నేను పర్యాయములు సమానముగఁ దూఁగునట్టి

బంగారమును ఇమ్ము ? అట్లుచేసి నావచనానుసారముగ మరలసీతామహాదేవిని గైకొనుము. ఓరఘుకులోత్తమా ! ఇంకొక్కవిషయమును చెప్పెదను, వినుము. ఓరఘుకులోత్తమా ! ధేనువును, చింతామణిని, సీతను, కౌస్తుభమణిని, పుష్పకవిమానమును, అయోధ్యాపట్టణమును, రాజ్యమును నీవు ఇతరులకు దానము చేసినయెడల నాయాజ్ఞను దప్పినవాఁడవగుదువు. మఱియు నాయాజ్ఞ నతిక్రమించినయెడల మిగుల దుఃఖము కలవాఁడవగుదువు. ఓ రామచంద్రా ! ఇప్పుడు నేనుచెప్పిన వస్తువుల నేడింటిని దప్పఁదక్కిన వస్తువులను నీకిష్టమున్నయెడల నిచ్చుచుండుమనియె. ఇట్లు చెప్పినగురునివచనములను విని శ్రీరాముఁడు అంగీకరించి వసిష్ఠమునివరుఁడు చెప్పినవిధముగ సీతామహాదేవికి సమముగ నేడుపర్యాయములు తూగినంత బంగారమునిచ్చి మరల సీతామహాదేవిని గైకొనియె. ఆసమయమునందు సకలవాద్యములును మ్రోగె. దేవతాస్త్రీలు విమానములయందుండి పుష్పవర్షమును గురిపించిరి. అప్పుడు సీతామహాదేవి మునుపటికంటె నధికముగ నలంకరింపఁబడియె. సకలజనులును మహాసంతోషముకలవారైరి. అప్పుడు సీతామహాదేవి భర్తయగు రామునకు నమస్కరించి రామునిసమీపమునందుఁ గూర్చుండె. మఱియు నప్పుడు శ్రీరాముఁడుచూడఁగా స్మితాననముకలదై సిగ్గుచేతఁ దలవంచుకొని యుండె. అనంతరమందు శ్రీరాముఁ డనేకములయిన దానములనుచేసి ఋత్విగాదులకు ననేకవిధములయిన యాభరణాదులచేతఁ బూజనుసల్పె. మఱియును, తనజ్ఞాతులను మిత్రసుహృదులను, ఇతరులగు బంధువులను అధికముగఁ బూజించె. ఆసమయమునం దెల్లవారును నానావిధములయిన మాల్యాంబరాభరణాదులచేతఁ బూజింపఁబడిరి. ఆయాగమునకు వచ్చినస్త్రీలందఱును నానాభరణాదులచేతఁ బూజింపఁబడిరి.

ఇట్లని ఆనందరామాయణాంతర్గత యాగకాండమునందలి

యెనిమిదవసర్గ ముగిసెను.

✷ అశ్వమేధసమాప్తి వర్ణనము. ✷

అంతట రామదాసుతో నిట్లనియె. ఓశిష్యోత్తమా ! శ్రీరాముఁడు అవబృధస్నానమును చేసినపిమ్మట బ్రహ్మ విష్ణు మహేశ్వరులు వేదమంత్రములచేత స్తోత్రమునుచేసియిట్లనిరి. ఓరఘుకులోత్తమా ! మంగళస్నానమును చేసిన నిన్నుఁ జూచి మేము ధన్యులమైతిమి. సకలబంధువులతోడను సీతామహాదేవితోడను కూడుకొనియున్న నిన్నుఁ జూచినకాలమే మాకు సంతోష కాలమైయున్నది. కావున నోరఘుకులోత్తమా ! ఇది యెప్పుడును పుణ్యకాలమై యుండును. మాకభీష్టములయిన వరములను వేఁడెదము. సావధానుఁడవై మేము కోరినవరముల నిమ్ము. ప్రతిసంవత్సరమునందును నీదర్శనమగునట్లు వరమునిమ్ము. మఱియు నో రామచంద్రా ! నీవు యాత్రలనుచేయునపుడే యేస్థలములయందు నీపేరుతో లింగ

ములను తీర్థములను స్థాపించితివో అవి యన్నియును సర్వోత్తమ పుణ్యదాయక
ములై యుండునట్లు వరమునిమ్ము. మఱియును, సకలపట్టణములయందును అయో
ధ్యాపట్టణము శ్రేష్ఠమైనదియును, సకల నదులలో సరయూనది యుత్తమమైనది
యును, అగునట్లు వరముల నొసంగుము. మఱియు నో రఘుకులోత్తమా! మేమడి
గిన వరముల నిరాతంకముగ నిమ్మనిన విని శ్రీరాముఁడు నవ్వుచు శివునితో నిట్ల
నియె. ఓదేవోత్తమా! నీచేతఁ బ్రార్థింపఁబడినవిషయ మంతయును నాహృదయ
మునందున్నది. మఱియు నోదేవోత్తమా! సకలమాసములయందును చైత్రమాస
ము శ్రేష్ఠమైన దగును. మఱియును, వైశాఖమాసముకంటె కార్తికమాసమును
కార్తికమాసముకంటె మాఘమాసమును మాఘమాసముకంటె చైత్రమాసమును శ్రే
ష్ఠమైన దగును. మఱియు నోదేవోత్తమా! నేను చైత్రమాసమునందుఁ బుట్టితిని
గనుకను, ఈచైత్రమాసమునందే అవభృథస్నానమును చేసితిని కనుకను, సకల
మాసములలోపల చైత్రమాసము శ్రేష్ఠమైనదగును. మఱియు నోదేవోత్త
మా! చైత్రమాసమునందు చేయఁబడినదియును, ఈయఁబడినదియును, హో
మము చేయఁబడినదియును స్నానముచేయఁబడినదియును, స్మరింపఁబడినదియును,
మొదలగు నవియన్నియును కోటిగుణితము లగును. ఈకార్యములను అయోధ్యా
పట్టణమునందుఁ జేసిన యెడల మఱియు నధికములగును. సకల నగరములలోపలను
ఈ యయోధ్యానగరము మొదటిది యగును. మఱియు నీ యయోధ్యాపట్టణము
ముక్తి నిచ్చునట్టిదియగును. ఇతరములగు పుణ్యక్షేత్రాదులయం దఱువదిసంవత్సర
ములకాలము చేసినపుణ్యము అయోధ్యాపట్టణమునం దొక్కదినము చేయుటమా
త్రముచేతనే కలుగును. మఱియు నో గౌరీనాథా! ఈ యయోధ్యాపట్టణము
కాశీనగరముకంటె నూఱురెట్లధికమైనదగును. ఈ సరయూనదికూడ సకలనదులకం
టె శ్రేష్ఠమైన దగుఁగాక. ఈసరయూనదియందు నాచేత నిర్మింపఁబడిన రామతీర్థ
ము సకలతీర్థములకును శిరోభూషణమై యుండును. మఱియును సకల పాపములను
నశింపఁజేయునది యగును. ఓపార్వతీపతీ! భూలోకమునందు నాపేరుతో నిర్మింపఁ
బడిన తీర్థములును లింగములును స్నానదానార్చనాదులచేత ముక్తినిచ్చునట్టివి
యగుఁగాత. ప్రతిచైత్రమాసమునందును రామతీర్థమునందు నియమములతో
స్నానదానాదులను చేయువాఁడు సోమయాగమువలనఁగలుగు పుణ్యముగలవాఁడ
గును. మఱియును, సూర్యగ్రహణకాలమునందు కురుక్షేత్రమున స్నానదానాదు
లవలన నెట్టి పుణ్యముకలవాఁడగునో అట్టిపుణ్యము చైత్రమాసమునందు సరయూ
నదిలో స్నానదానాదులను జేయుటవలనఁగలుగును. మఱియు నోదేవోత్తమా!
ఈయయోధ్యాపట్టణమునందలి సరయూనదిలోని రామతీర్థమునందు చైత్రమాస
మున స్నానదానాదులను చేయుమానవులు మోక్షమునుపొందువారగుదురు. మఱి
యు నోదేవోత్తమా! మాఘమాసమునందుఁ బ్రయాగయందును, కార్తికమాసము

నందు కాశియందును, వైశాఖమాసమునందు ద్వారకయందలి చక్రతీర్థమునందును, స్నానమును చేయుటవలన నెట్టిఫలముకలుగునో యట్టిఫలము చైత్రమాసమునందయోధ్యాపట్టణమునందలి సరయూనదిలోని రామతీర్థమునందు స్నానమును చేయుటవలనఁగలుగును. కావున నెల్లవారును చైత్రమాసమునందు సరయూనదియందలి రామతీర్థమునందు స్నానమునుచేయవలయును. మఱియు నోపార్వతీపతీ! సకలదేవతలయందును నీవు మొదటివాఁడవైనవిధముగ మాసములలోపల చైత్రమాసము మొదటిదై యున్నది. ఓదేవోత్తమా! చైత్రమాసము సంప్రాప్తమైనపుడు దేవతలందఱును బహిర్జలము నాశ్రయించియుండునట్లు నియమింపుము. ఇప్పుడు దేవతలందఱును చేరియొకటిగాఁజేరినట్లు చైత్రమాసమునందు మీరందఱును నొకటిగాఁజేరి యుండవలయుననియె. ఇవ్విధముగ శ్రీరాముఁడు చెప్పినవాక్యములనువిని పార్వతీదేవి సీతామహాదేవితోనిట్లనియె. ఓసీతా! నీవు నాకుఁ గొన్నివరములనీయవలయును. నేను అడుగునట్టివి సకలలోకస్త్రీలకును నుపకారకరములై యుండు ననిన విని సీతామహాదేవి యిట్లనియె. ఓపార్వతీ! నాపేరుగలతీర్థములును నేను స్నానముచేసినతీర్థములును భూలోకమునందెన్నికలవో యవియన్నియును మిగుల శ్రేష్ఠములయినవియగును. మఱియునోగౌరీ! చైత్రశుక్లతృతీయమొదలుకొని వైశాఖమాసమువఱకును తీర్థములయందు స్నానమునుచేయుటవలన స్త్రీలకుమిగులఁ బుణ్యముగలుగును. మఱియును, చైత్రమాసమంతయును మిగుల నధికమయిన సౌభాగ్యముకలుగును. ఓపార్వతీ! ప్రతిరామతీర్థమునకును వామభాగమునందు సీతాతీర్థముకలదనియె. ఈవిధముగాఁ జెప్పి సీతామహాదేవి రామునిసన్నిధియందు దూరక కూర్చుండె. అంతటవసిష్ఠమహాముని శ్రీరామునితో యజ్ఞశాలలోపలఁ బ్రవేశింపుమనియె. అట్లువసిష్ఠమునివరుఁడు చెప్పినవచనములను శ్రీరాముఁడు వల్లెయని సీతాఋత్విజులతోఁ గూడ రథము నెక్కె. ఆసమయమునందు దుందుభులును భేరులును మ్రోగె. మఱియును, మృదంగపణవాదులయొక్క ఘోషములుకూడ నతిశయించె. మంత్రధ్వనులు సకలదిక్కులయందును వ్యాపించె. అప్సరోగణములు నృత్యములను జేసె. మఱియును, మునుపటివలె నానావిధములయిన యుత్సవము కలిగె. ఇవ్విధముగ జరుగుచున్న యుత్సవములను చూచుచు శ్రీరాముఁడు మెల్లమెల్లఁగ యజ్ఞశాలలోనికిఁ బోయె. అట్లుపోయినపిమ్మట రథమునుండి దిగి యగ్నిహోత్రమును మునుపటివలె యజ్ఞకుండమునందు వైచె. అనంతరమందు ఋత్విగాదులతోఁ గూడ నగ్నిదేవునకు ప్రాణాహుతులనిచ్చె. పిమ్మట వస్త్రాభరణాదులచేత నగ్నిపూజను చేసె. అవ్విధముగ నగ్నిపూజను చేసియజ్ఞపాత్రలను విడిచిపెట్టె. అనంతరమందు ఋత్విజుల కందఱకును దక్షిణలనీయఁ దలఁచి శ్రీరాముఁడు లక్ష్మణునితో నిట్లనియె. ఓలక్ష్మణా! ఈఋత్విజుల నందఱను ధనాగారములోనికిఁ దీసికొనిపోయి వీరికిష్టమయినంత ధనమును దీసికొమ్మని చెప్పి యాధనమును వారివారి యాశ్రమ

ములకు దూతలచేతఁబంపుమనిన విని లక్ష్మణుఁడావిధముగా నేచేసె. అనంతరమందు శ్రీరాముఁడు శాస్త్రోక్తప్రకారముగ ఋత్విగ్జనులను విడిపించె. పిమ్మట శ్రీరాముఁడు శివుఁడు మొదలుగాఁగల దేవతలనందఱను వస్త్రాలంకారాదులచేతఁ బూజించె. పిమ్మట రాజాదులలో కొందఱికి దివ్యమైన తురగములనిచ్చె. మఱికొందఱికి శిబికము లనిచ్చె. కొందఱికి రథములను కొందఱి కేనుఁగులను కొందఱికి ఆయుధములను నొసంగె. ఈవిధమున యజ్ఞమునకు వచ్చినరాజాదులను వారివారిపరివారజనముతోఁ గూడఁ బూజించె. మఱియు నెల్లవారిని వస్త్రమాల్యాంబరాభరణాదులచేత పూజించె. అనంతరమందు శ్రీరాముఁడు దివ్యవస్త్రములను ధరించె. ఆసమయమునందు రాజులందఱును దివ్యములును నానావిధములును అయినకానుకలచేత శ్రీరాముని పూజించిరి. మఱియు నాసమయమునందు నదులు సముద్రములు పర్వతములు దిగ్గజములు గోవులు పక్షులు మృగములు భూమ్యంతరిక్షములు మొదలగు సకల భూతములును కానుకలను దీసికొనివచ్చిరి. అప్పుడు శ్రీరాముఁడు సీతతోఁ గూడఁ జక్కఁగనలంకరింపఁబడియె. ఇట్లుబంధువులు మొదలగువారిచేతఁ బూజింపఁబడి శ్రీరాముఁడు త్రేతాగ్నులకంటె నితరమగు మఱియొక యగ్నివలెఁ బ్రకాశించుచుండె. ఆసమయమునందు కుబేరుఁడు శ్రీరామునకు బంగారముతోఁ జేయబడినదియును వీరులకుఁ దగినదియును, మిగుల శ్రేష్ఠమైనదియును నగుసింహాసనము నొక్కదానిని కానుకగా సమర్పించె. వరుణదేవుఁ డుదకబిందువులను స్రవించునట్టిదియును చంద్రునియొక్క కాంతివంటి కాంతికలదియును నగుఛత్రము నొసంగె. వాయుదేవుఁడు సర్వోత్తమములగు వింజామరములనొసంగె. ధర్మదేవత కీర్తిమయమైన పూలమాలిక నొసంగె. ఇంద్రుఁడు సర్వోత్తమమగుకిరీటమును సమర్పించె. యముఁడు దివ్యమగు దండమునిచ్చె. బ్రహ్మదేవుఁడు బ్రహ్మమయమగుకవచమునిచ్చె. సరస్వతీదేవి శ్రేష్ఠమైనహారము నొసంగె. రుద్రుఁడు దశచంద్రాయుధమును పార్వతి శతచంద్రాయుధమునిచ్చిరి. చంద్రుఁడు అమృతమయములయిన గుఱ్ఱములనొసంగె. విశ్వకర్మరూపాశ్రయమగు రథమునిచ్చె. అగ్నిదేవుఁడు అజగవమను ధనుస్సునిచ్చె. సూర్యుఁడు రశ్మిమయములగు బాణములను సమర్పించె. భూదేవి యోగమయములగు పాదుకలను సమర్పించె. అంతరిక్షము పుష్పసముదాయమునిచ్చె. ఖేచరులందఱును అంతర్ధానమును పొందియుండి నృత్యగీతవాద్యాదులను సల్పుచుండిరి. ఋషులందఱును సత్యములయిన యాశీర్వచనములను చేసిరి. సముద్రుఁడు దివ్యమైనశంఖమునొసంగె. మఱియును, సింధువులు పర్వతములునదులు మొదలగునవి యన్నియును మిగుల విచిత్రములయిన వస్తువులను కానుకగానిచ్చె. అనంతరమందు సకలరాజులును అనేకములయిన రథగజతురగాదులను కానుకలనుగా నొసంగిరి. మఱియు ననేకములయిన శిబికములు గోవులు వృషభములు ఖడ్గములు దాసదాసీజనములు ఒంటెలు మొదలగువానిని కానుకలనుగానొసంగిరి. మఱి

యు నాసమయమునందు రాజభార్యలందఱును నానావిధములయిన వస్త్ర
మాల్యాంబరాభరణాదుల నొసంగిరి. మఱియు ననేకములయిన క్రీడోపకరణముల
నొసంగిరి. అట్లుసీతారాములు యాగమునకువచ్చిన వారలందఱిచేతను పూజిం
పఁబడిన పిమ్మట దివ్యరథమునెక్కిరి. అట్లురథమునెక్కినపుడు శ్రీరాముఁడు అగ్ని
హోత్రమును వందిమాగధులను సకలరాజాదులను వారి భార్యలను మఱియును
యాగమునకు వచ్చినవారలనందఱను తనరథముపై నెక్కించుకొనియె. అంతట మెల్ల
మెల్లగ శ్రీరామునిరథము కదలివచ్చిపట్టణమునందుఁ బ్రవేశించె. ఆసమయమునం
దు శ్రీరాముని సూతమాగధులు స్తోత్రముచేసిరి. లక్ష్మణుఁడు ముత్యాలసరముల
చేతఁ బ్రకాశించుచున్న ఛత్రిమునుపట్టె. భరతుఁడు తాలవ్యజనముచేత వీచుచుం
డె. శత్రుఘ్నుఁడు వింజామరములను వైచుచుండె. సుగ్రీవుఁడు తాంబూలపాత్రి
మునుపట్టె. హనుమంతుఁడు జలపాత్రిమునుపట్టె. నలుఁడు తమ్మపడగను పట్టుకొ
నియుండె. అంగదుఁడు విలువ్రుటద్దమును ధరించియుండె. విభీషణుఁడు వాసకోశము
నుధరించె. జాంబవంతుఁడు ధూపపాత్రిమునుబట్టె. మంత్రివరులు నానావిధముల
యిన ఫలపాత్రిములను, అనేకవిధములయిన పూజాపాత్రిములను, వివిధములయిన
సుగంధద్రివ్యపాత్రిలను ధరించిరి. అనేకులగు వారస్త్రీలు సుగంధద్రివ్యములను
జల్లుచుండిరి. ఆసమయమునందెల్లవారును ధరించిన వస్త్రిమాల్యాంబరాభరణా
దులచేత మిగుల విచిత్రిములయిన కాంతులుకలవారై యుండిరి. మఱియు నప్పుడు
వారస్త్రీలు నృత్యములనుచేయుచుండిరి. వాద్యములన్నియును మ్రోగుచుండె. వం
దిమాగధాదిబృందములు స్తోత్రిములను చేయుచుండిరి. ఖేచరులు పుష్పవర్షమును
గురిపించుచుండిరి. ఇట్లు నానావిధములయిన యుత్సవములు జరుగుచుండఁగా శ్రీరా
ముఁడు రాజమార్గముచేత మెల్లగగృహద్వారము దగ్గరకుఁబోయె. అట్లు శ్రీరాముఁ
డు పోవునపుడు పురస్త్రీలందఱును దఢ్యోదన వినిర్మితములయిన కుంభప్రిదీప
ములు బలిదీపములు పూర్ణకుంభములు మొదలగువానిచేత సీతారాములకు శుభ
ములు కలుగుటకొఱకు నీరాజనములను గావించిరి. అట్లు గృహద్వారము దగ్గరకుఁ
బోయినపిమ్మట శ్రీరాముఁడు సీతతోఁగూడ రథమునుండిదిగి అగ్నిహోత్రమును
గృహమునందు స్థాపించి తనసభయందలి సింహాసనమునందుఁ గూర్చుండె. ఆసమ
యమునందు సకలరాజులును శ్రీరామునకు నమస్కారములను సల్పిరి. అప్పుడు
శ్రీరాముని పాదపద్మములు రాజులయొక్క కిరీటములయందలి రత్నకాంతులచేత
మిగుల మనోహరములై ప్రకాశించుచుండె. మఱియు నారాముని పాదపద్మము
లను స్పృశించుటచేత సకలరాజులయొక్కయును కిరీటములు మిగుల మనోహరము
లై ప్రకాశించుచుండె. మఱియు నాసమయమునందు రాజపత్నులయొక్క సీమం
తములయందలి మణులచేత సీతామహాదేవియొక్క పాదసరోరుహములు ప్రకా
శించె. అప్పుడా సభయందు సకలదేవతలతోఁగూడ మహేశ్వరుఁడు శ్రీరాముని

స్తోత్రముచేసె. పిమ్మట శ్రీరాముఁడా పరమశివుని ననేకవిధములఁ బూజించె. అంతట మహేశ్వరుఁడు రామాజ్ఞనుపొంది పార్వతితోఁగూడ వృషభవాహనారూఢుఁడై దేవతలందఱును వెంటరా నిజనివాసమగు కైలాసమునకుఁబోయె. మఱియు నా సమయమునందు రాజులందఱును రామాజ్ఞనుపొంది తమతమ వాహనముల నధిష్ఠించిరి. రాజపత్నులు కూడ సీతామహాదేవియొక్క యనుమతినిపొంది తమతమ యానముల నధిష్ఠించిరి. అట్లు బయలువెడలి యెల్లవారును తమ తమ దేశములకుఁబోయిరి. అంతట శివుఁడు కైలాసమునకుఁబోయె. బ్రహ్మదేవుఁడు సత్యలోకమునకుఁబోయె. ఇంద్రాదులందఱును స్వర్గలోకమునకుఁబోయిరి. మిగుల యోగ్యమగు స్వభావముకల ఋత్విజులును, బ్రహ్మవాదులగు సదస్యులును, సకల మునీశ్వరులును, తమతమ నివాసములకుఁబోయిరి. అనంతరమందు శ్రీరాముఁడు మునుపటివలె జగతీతలమును శిక్షించె. మఱియు నీవిధముగా ప్రజాపరిపాలనమును చేయుచు శ్రీరాముఁడు సీతామహాదేవితోఁగూడ చిరకాలము క్రీడించుచుండె. పిమ్మట వేలువేలు సంవత్సరములయందు ఇరువది సంవత్సరములలోపల శ్రీరాముఁడు పదియశ్వమేధయాగములనుచేసె. ఆపదియవ యశ్వమేధ యాగకాలమునందు గురుఁడగు వసిష్ఠ మహామునియొక్క యనుమతినిపొంది శ్రీరాముఁడు సకలధనములను నాలుగు దిక్కులను ఋత్విజులకు దక్షిణార్థముగనిచ్చె. పిమ్మట నాఋత్విజులందఱును భూమండలమును పరిపాలింపఁజాలమిచేత పరిపాలనార్థము రామునకు సమర్పించిరి. శిష్యుఁడవైన యోవిష్ణుదాసా! నీవడిగిన విధముగ మంగళకరమైన శ్రీరాముని యశ్వమేధవృత్తాంతమును సర్వమును సవిస్తరముగఁ జెప్పితిని. ఓశిష్యోత్తమా! లోకములో నే మానవుఁడు ప్రాతఃకాలమునకు ముందుగ నిద్రనుండిలేచి కాలోచిత కృత్యములను దీర్చికొని యీయాగకాండమును భక్తితోఁ బఠించునో అట్టివాఁడు ఎల్లకోర్కెలను సఫలములనుగాఁ బొందును. పుత్రార్థి పఠించెనేని పుత్రులను పొందును. ధనార్థి ధనమునుపొందును. ఈయాగకాండమును వినుటచేత అశ్వమేధయాగఫలము కలుగును. హోమశ్రాద్ధాదికాలములయందు పఠించుటచేత సర్వోత్తమమైన తేజస్సుకలుగును.

ఇట్లు ఆనందరామాయణాంతర్గత యాగకాండమునందలి

తొమ్మిదవసర్గ ముగిసెను.

యాగకాండము సంపూర్ణము.

శ్రీ రస్తు.

శ్రీరామచంద్రపరబ్రహ్మణే నమః.

ఆనందరామాయణము

విలాసకాండము.

✷ శ్రీరాముని స్తవరాజము. ✷

అట్లు అశ్వమేధవృత్తాంతమును సర్వమును వినినపిమ్మట విష్ణుదాసు మరల నిట్లనియె. ఓగురూత్తమా! పరమశివుఁడు శ్రీరాముని ఎట్టిస్తోత్రముచేత స్తుతించెనో ఆస్తోత్రమును వివరించిచెప్పి నన్నుఁ గృతార్థునిగాఁ జేయవేయనిన రామదాసిట్లనియె. ఓవత్సా! శిష్యోత్తమా! నీవు చక్కఁగాఁ బ్రశ్నమును చేసితివి. మోక్షదాయకమగు రామస్తవరాజమును చెప్పెదను. సావధానమనస్కుఁడవై వినుము. ఓశిష్యోత్తమా! సర్వకాలములయందును శ్రీరామరామా! అనియెవ్వరు స్మరింతురో అట్టివారికి నిరాతంకముగ భుక్తిముక్తులు కలుగును. ఓశిష్యోత్తమా! రామస్తవరాజము తాపత్రయాగ్నులను నశింపఁజేయునదియును, సకలపాపములను నశింపఁజేయునదియును, దారిద్ర్యదుఃఖములను నశింపఁజేయునదియును, సకలసంపదలను కలుగఁజేయునదియును, విజ్ఞానఫలము నిచ్చునదియును, దివ్యమైనదియును, మోక్షమే ముఖ్యమైన ఫలముగాఁగలదియునునై యున్నది. కావున శ్రీరామునకు నమస్కరించి అట్టి స్తవరాజము చెప్పెదను, వినుము. ఎట్లనిన :—

“శ్లో. అయోధ్యానగరే రమ్యే రత్నమండపమధ్యగే, స్మరేత్కల్పతరోర్మూలే రత్నసింహాసనే శుభే. తన్మధ్యేష్టదలం పద్మం నానారత్నోపశోభితమ్, స్మరేన్మధ్యే దాశరథిం సహస్రాదిత్యతేజసమ్. పద్మాసనసమాసీన మింద్రనీలసమప్రభమ్, కోమలాంగం విశాలాక్షం విద్యుద్వర్ణాంబరావృతమ్. భానుకోటిప్రతీకాశం కిరీటేన విరాజితమ్, రత్నగ్రైవేయకేయూరవరకుండలమండితమ్. రత్నకంకణమంజీరకటిసూత్రైరలంకృతమ్, శ్రీవత్సకౌస్తుభోరస్కం ముక్తాహారోపశోభితమ్. చింతామణిసమాయుక్తం రత్నమాలావిరాజితమ్, దివ్యరత్నసమాయుక్తం ముద్రికాభిరలంకృతమ్. కర్పూరాగరుకస్తూరీదివ్యగంధానులేపనమ్, తులసీకుందమందార పుష్పమాల్యైరలంకృతమ్. రాఘవం ద్విభుజం వీరం రామమీషత్స్మితాననమ్, యోగశాస్త్రైర్విభూషితం యోగేశం యోగదాయకమ్. సదా సౌమిత్రిభరత

శత్రుఘ్నై రుపశోభితమ్, విద్యాధరసురాధీశసిద్ధగంధర్వకిన్నరైః. యోగీంద్రై
ర్నారదాద్యైశ్చ స్తూయమాన మహర్నిశమ్,విశ్వామిత్రవసిష్ఠాద్యైరృషిభిః పరివా
రితమ్. సనకాదిమునిశ్రేష్ఠై ర్యోగిబృందైస్సమావృతమ్, రామంరఘువరంవీరం ధను
ర్వేదవిశారదమ్. మంగలాయతనందేవం రామంరాజీవలోచనమ్. సర్వశాస్త్రార్థత
త్త్వజ్ఞ మానంద మతిసుందరమ్. కౌసల్యాతనయం రామం ధనుర్బాణధరంహరిమ్,
ఏవంసంచితయేద్విష్ణుం యజ్జ్యోతిర్జ్యోతిషాంపరమ్. ప్రహృష్టమానసోభూత్వా సభా
యాం వృషభధ్వజః,సర్వలోకహితార్థాయ తుష్టావ రఘునందనమ్.కృతాంజలిపుటో
భూత్వా చింతయన్నద్భుతం హరిమ్, శ్రీశివఉవాచ— యదేకం యత్పరంనిత్యం
యదనంతం చిదాత్మకమ్,యదేకంవ్యాపకంలోకే తద్రూపంచింతయామ్యహం.సర్వ
త్రైలోక్యసౌఖ్యార్థం రామభక్త్యతివృద్ధయే. విజ్ఞానహేతుం విమలాయతాక్షం
ప్రజ్ఞానిసం దివ్యసుఖైకరూపమ్, శ్రీరామచంద్రం హరిమాదిదేవం విశ్వేశ్వరంరామ
మహంభజామి. కవింపురాణం పురుషంపరేశం సనాతనం యోగినమీశితారమ్,అ
ణోరణీయాంస మనంతవీర్యం ప్రాణేశ్వరం రామమహంభజామి. నారాయణం జగ
న్నాథ మభిరామంజగత్పతిమ్, కవింపురాణంవాగీశం రామందశరథాత్మజమ్,రాజరా
జంరఘువరం కౌసల్యానందవర్ధనమ్.భర్గంవరేణ్యంవిశ్వేశం రఘునాథం జగద్గురుమ్,
సత్యంసత్యప్రియంశ్రేష్ఠం జానకీవల్లభంప్రభుమ్.సౌమిత్రిపూర్వజంశాంతం కామదంక
మలేక్షణమ్, ఆదిత్యంరవిమీశానం ఘృణింసూర్యమనామయమ్.ఆనందరూపిణంసౌ
మ్యం రాఘవంకరుణాకరమ్,జామదగ్న్యంతపోమూర్తిం రామంపరశుధారిణమ్. వా
క్పతింవరదంవాచ్యం శ్రీపతింపక్షివాహనమ్,శ్రీశార్ఙ్గధారిణంరామం చిన్మయానం
దవిగ్రహమ్. హలధారిణమీశానం బలరామం కృపానిధిమ్, శ్రీవల్లభంకలానాథం
జగన్మోహనమచ్యుతమ్.మత్స్యకూర్మవరాహాది రూపధారిణమవ్యయమ్,వాసుదేవం
జగద్యోనిమనాదినిధనంహరిమ్.గోవిందంగోపతింవిష్ణుం గోపీజనమనోహరమ్, గోపా
లంగోపరీవారం గోపకన్యాసమావృతమ్. విద్యుత్పుంజప్రతీకాశం రామంకృష్ణంజగ
న్మయమ్, గోగోపికాసమాకీర్ణం వేణువాదనతత్పరమ్.కామరూపంకలావంతం కామి
నాంకామదంప్రభుమ్, మన్మథంమథురానాథం మాధవంమకరధ్వజమ్. శ్రీధరంశ్రీక
రంశ్రీశం శ్రీనివాసం పరాత్పరమ్, భూతేశంభూపతింభద్రం భూతిదంభూరిభూ
షణమ్.సర్వదుఃఖహరంవీరం దుష్టదానవమర్దనమ్,శ్రీనృసింహంమహావిష్ణుం మహాం
తందీప్తతేజసమ్. చిదానందమయంనిత్యం ప్రణవం జ్యోతిరూపకమ్, ఆదిత్యమణ్డ
లగతం నిశ్చితార్థస్వరూపిణమ్. భక్తిప్రియంపద్మనేత్రం భక్తానామీప్సితప్రదమ్,
కౌసలేయంకలామూర్తిం కాకుత్స్థంకమలాప్రియమ్. సింహాసనేసమాసీనం నిత్యవ్ర
తమకల్మషమ్, విశ్వామిత్రప్రియందాంతం స్వదారనియతవ్రతమ్. యజ్ఞేశంయజ్ఞపు
రుషం యజ్ఞపాలనతత్పరమ్, సత్యసంధంజితక్రోధం శరణాగతవత్సలమ్. సర్వక్లే

శాపహరణం విభీషణవరప్రదమ్. దశగ్రీవహరం రుద్రం కేశవం కేశిమర్దనమ్, వాలిప్రమథనం వీరం సుగ్రీవేప్సితరాజ్యదమ్. నిరీహం నరదేవైశ్చ సేవితం హనుమత్ప్రియమ్, శుద్ధం సూక్ష్మం పరం శాంతం తారకబ్రహ్మరూపిణమ్. సర్వభూతాత్మభూతస్థం సర్వాధారం సనాతనమ్, సర్వకారణకర్తారం నిదానం ప్రకృతేఃపరమ్. నిరాతంకం నిరాభాసం నిరవద్యం నిరంజనం, నిత్యానందం నిరాకార మద్వైతం తమసఃపరమ్. పరాత్పరతరం నిత్యం సత్యానందం చిదాత్మకమ్, మనసా శిరసానిత్యం ప్రణమామి రఘూత్తమమ్. భవోద్భవం వేదవిదాంవరిష్ఠ మాదిత్యచంద్రానిలసుప్రభాసమ్, సర్వాత్మకం సర్వగతస్వరూపం నమామిరామం తమసఃపరస్తాత్. నిరంజనం నిష్ప్రతిమం నిరీహం నిరాశ్రయం కారణ మాదిదేవమ్, నిత్యం ధ్రువం నిర్విషయస్వరూపం నిరంతరం రామమహంభజామి. భవాబ్ధిపోతం భరతాగ్రజంతం భక్తప్రియం భానుకులప్రదీపమ్, భూతాధినాథం భువనాధిపత్యం భజామిరామం భవరోగవైద్యమ్. సర్వాధిపత్యం రణరంగధీరం సత్యం చిదానందసుఖస్వరూపమ్, సత్యం శివం సజ్జనహృన్నివాసం ధ్యేయం పరానంద మహంభజామి. త్రైలోక్యనాథం సరసీరుహాక్షం దయానిధిం ద్వంద్వ వినాశహేతుమ్, మహాబలం వేదనిధింసురేశం సనాతనంరామ మహంభజామి. వేదాంతవేద్యం కవిమీశితార మనాదిమధ్యాంతమచింత్యమాద్యమ్, అగోచరం నిర్మలమేకరూపం పరాత్పరం రామమహంభజామి. అశేషవేదాత్మక మాదిదేవమజం హరిం రామమనంతమూర్తిమ్, అపారసంవిత్సుఖమేకరూపం నమామిరామం తమసఃపరస్తాత్. తత్త్వస్వరూపం పురుషం పురాణం స్వతేజసాపూరిత మేకమేవ, రాజాధిరాజం రవిమండలస్థం విశ్వేశ్వరం రామమహంభజామి. యోగీంద్రసంఘైరపిసేవ్యమానం నారాయణం నిర్మలమాదిదేవం, నతోస్మినిత్యం జగదేకనాథం హరించిదానందమయం ముకుందమ్. అశేషవిద్యాధిపతిం నమామిరామం పురాణం తమసఃపరస్తాత్. విభూతిదం విశ్వసృజం విరాజం రాజేంద్రమీశం రఘువంశనాథమ్, అచింత్యమవ్యక్త మనంతరూపం జ్యోతిర్మయం రామమహంభజామి. అశేషసంసారవికారహీన మానందసంపూర్ణసుఖాభిరామమ్, నారాయణం విష్ణుమహంభజామి సమస్తసాక్షిం తమసఃపరస్తాత్. మునీంద్రగుహ్యం పరిపూర్ణమేకం కలానిధిం కల్మషనాశహేతుమ్. పరాత్పరం యత్పరమంపవిత్రం నమామిరామం మహతో మహాంతమ్, బ్రహ్మావిష్ణుశ్చ రుద్రశ్చ దేవేంద్రో దేవతా స్తథా. ఆదిత్యాదిగ్రహాశ్చైవ త్వమేవరఘునందన. సర్వేశ స్త్వం పరంబ్రహ్మ త్వద్రూపం విశ్వమేవచ, త్వమక్షరంపరంజ్యోతి స్త్వమేవ రఘునందన, తాపసా ఋషయస్సిద్ధా స్సాధ్యాశ్చ మునయ స్తథా. విప్రావేదాశ్చ యజ్ఞాశ్చ పురాణం ధర్మసంహితాః, వర్ణాశ్రమా స్తథాధర్మా వర్ణధర్మా స్తథైవచ; నాగాయక్షాశ్చ గంధర్వా దిక్పాలాదిగ్గజాదిశః. వసవోష్టౌత్రయఃకాలా రుద్రా ఏకాదశస్మృతాః. తారకాద్వాదశాదిత్యా స్త్వమేవ రఘునాయక, సప్తద్వీపా స్సముద్రాశ్చ నదానద్య

స్తథాముహుః. స్థావరాజంగమాశ్చైవ త్వమేవరఘునందన. దేవతిర్యఙ్మనుష్యాణాం దానవానాం దివౌకసామ్, మాతాపితా తథాభ్రాతా త్వమేవరఘునందన. సర్వేశస్త్వం పరంబ్రహ్మ త్వద్రూపం విశ్వమేవచ, త్వమక్షరం పరంజ్యోతి స్త్వమేవ రఘుపుంగవ. శాంతం సర్వగతం సూక్ష్మం పరంబ్రహ్మసనాతనమ్, రాజీవలోచనంరామం ప్రణమామిజగత్పతిమ్. తతఃప్రసన్నశ్శ్రీరామః ప్రోవాచ వృషభధ్వజమ్. శ్రీరామఉవాచ — తుష్టోహం గిరిజాకాంత వృణీష్వ వరముత్తమమ్, శ్రీశివఉవాచ — యదితుష్టోసిదేవేశ శ్రీరామకరుణానిధే. తవాద్యదర్శనేనైవ కృతార్థోహం నసంశయః, ధన్యోహం కృతకృత్యోహం పుణ్యోహం పురుషోత్తమ. అద్యమేసఫలంకర్మ హ్యద్యమే సఫలంతపః, అద్యమేసఫలంజ్ఞాన మద్యమే సఫలంశ్రుతమ్. అద్యమేసఫలంసర్వం త్వత్పదాంభోజదర్శనాత్, అద్వైతం విమలం జ్ఞానం త్వన్నామస్మరణంతథా. త్వత్పాదాంభోరుహద్వంద్వే సద్భక్తిం దేహిరాఘవ, తతఃపరంసుసంప్రీతో రామఃప్రాహ సదాశివమ్. గిరిజేశమహాభాగ పునరిష్టం దదామ్యహం, శ్రీశివఉవాచ — వరంనయాచే రఘునాథయుష్మత్పదాబ్జభక్తిస్సతతంమమాస్తు, ఇదంప్రియం నాథ వరం ప్రయచ్ఛ పునఃపునస్త్వా మిదమేవయాచే. రామదాసఉవాచ — ఇత్యేవమీడితోరామః ప్రాదాత్తస్మైవరాంతరమ్. తేనోక్తస్తవరాజాయ దదౌ నానావరాన్బహూన్, ఏవంశివేనయఃప్రోక్త స్తవరాజ శ్శుభావహః. సఏవాద్య త్వయాపృష్ట స్తవాగ్రే కథితోమయా, అయంశ్రీరఘునాథస్య స్తవరాజోహ్యనుత్తమః. సర్వసౌభాగ్యసంపత్తిదాయకో ముక్తిద స్స్మృతః, కథితో గిరిజేశేన వేదానాం సారసంగ్రహః. గుహ్యాద్గుహ్యతరోనిత్య స్తవస్నేహాత్ప్రకీర్తితః, యఃపఠేచ్ఛృణుయాద్వాపి త్రిసంధ్యం శ్రద్ధయాన్వితః. బ్రహ్మహత్యాదిపాపాని తత్సమాని బహూనిచ, హేమస్తేయసురాపాన గురుతల్పయుతానిచ. గోవధాద్యుపపాపాని చింతనాత్సంభవానిచ, సర్వైస్సముచ్యతేపాపైః కల్పాయుతశతోద్భవైః. మానసంవాచికంపాపం కర్మణాసముపార్జితమ్, శ్రీరామస్మరణేనైవ వ్యపోహతినసంశయః. ఇదంసత్యమిదం సత్యం సత్యంనైవాన్యదుచ్యతే, రామస్సత్యంపరంబ్రహ్మ రామాత్కించిన్నవిద్యతే. తస్మాద్రామస్వరూపం హి రామస్సర్వమిదంజగత్, శ్రీరామచంద్ర రఘుపుంగవరాజవర్య రాజేంద్రరామ రఘునాయకరాఘవేశ, రాజాధిరాజరఘునాయక రామచంద్ర దాసోహమద్య భవతశ్శరణాగతోస్మి. ఉత్ఫుల్లామలకోమలోత్పలదలశ్యామాయరామాయ చాకామాయప్రశమాయ నిర్మలగుణగ్రామాయ రామాత్మనే, ధ్యానారూఢమునీంద్రమానససరోహంసాయ సంసారవిధ్వంసాయస్ఫురదోజసే రఘుకులోత్తంసాయపుంసేనమః. ఏవంశిష్యమయాప్రోక్తో యథాపృష్ట స్త్వయామమ, స్తవరాజోరాఘవస్య శ్రవణాత్పాపనాశనః.

ఇట్లని యానందరామాయణాంతర్గత విలాసకాండమునందు
రామస్తవమును తెలుపునట్టి మొదటిసర్గ ముగిసెను.

* జానకీరతిశాలావర్ణనము. *

అట్లురామస్తవరాజమును చెప్పినపిమ్మట విష్ణుదాసుఁడనువాఁడు మిగులసంతోషముకలవాఁడై మరలనిట్లనియె. ఓగురూత్తమా! రూపలావణ్యాదులచేత మిగులఁ బ్రసిద్ధురాలగు సీతతోఁగూడ శ్రీరాముఁడు అయోధ్యాపట్టణమునం దెట్లుక్రీడించెను. శ్రీరాముఁడయోధ్యాపట్టణమునం దేమేమి కార్యములను చేసెను. ఆవృత్తాంతమును సర్వమును చెప్పి నన్నుఁ గృతార్థునిగాఁ జేయుమనిన రామదాసిట్లనియె. ఓ వత్సా! నీవుచక్కని ప్రశ్నమును చేసితివి. రామునివృత్తాంతము నీకనుజెప్పెదను. సావధానమనస్కుఁడవై వినుము. శ్రీరాముఁడు రణదీక్షను అశ్వమేధదీక్షను నెరవేర్చిన పిమ్మట అయోధ్యాపట్టణమునందు సీతతోడను బంధువులతోడను సుఖముగఁ గ్రీడించుచుండె. మఱియును, నానావిధములును మనోహరములును అయిన భోగములచేత సీతామహాదేవిని రంజింపఁజేసె. మిగులఁ బవిత్రమును శుభకరమును అయిన యాచరిత్రమును చెప్పెదను. సావధానమనస్కుఁడవై వినుము. సీతారాముల చరిత్రమును సంపూర్ణముగఁ జెప్పఁజాలను. కావున సంక్షేపముగఁ జెప్పెదను. పరమశివుఁడు కైలాసమునందు పార్వతితోఁగూడ క్రీడించినవిధముగ శ్రీరాముఁడయోధ్యాపట్టణమునందు సీతామహాదేవితోఁగూడఁ గ్రీడించె. బంగారముచేత కట్టఁబడి రత్నములచేతఁ జెక్కఁబడినదియును, శ్రేష్ఠమైనదియును నగు మందిరమునందు శ్రీరామునకు నిద్రాస్థానమేర్పఱుపఁబడియె. మఱియును, రాముని పడక చంద్రతుల్యమై యుండె. ఆక్రీడాగృహముయొక్క గోడలు బంగారపిసుకతోడను రత్నములతోడను కట్టఁబడియుండె. మఱియు నాక్రీడాగృహమునందలి స్తంభములు స్ఫటికమణులచేత నిర్మింపఁబడియె. క్రీడాగృహమునందలి నిసుఁలు మరకతమణులచేత నిర్మింపఁబడియుండె. మఱియు నాగృహమునందలి గోడలు అద్దములచేత చిత్రితములైనవయ్యె. మఱియు నాగృహమునందలి భూమియంతయును హేమమయమును రత్నమయమును నై యుండె. మఱియు నక్కడ భిత్తివస్త్రములు బంగారపుతంతులచేత నిర్మింపఁబడియుండె. మఱియు నా క్రీడామందిరమునందు పదివేలమంది జనులు చేరినను సమ్మర్దము కలుగనిదై యుండె. ఇవ్విధముగ మిగుల రమ్యమును విశాలమును అయిన మందిరము రత్నదీపములచేతఁ బ్రకాశించుచుండె. మఱియు నప్పట్టణమునందలి మేడలయొక్క యగ్రభాగములయందు సువర్ణకలశములు మిగుల మనోహరములై ప్రకాశించుచుండె. మఱియు నక్కడ నుండు నట్టి చిత్రములు స్త్రీలకందఱకును మోహమును కల్పించుచుండె. ఆ క్రీడాగృహమునందు బంగారముచేత రచింపఁబడినవియును, రమ్యములును, నానావిధములయిన చిత్తరువులు కలవియును, బంగారపు పట్టు వస్త్రములచేత నలంకరింపఁబడినవియును, తంతుపట్టములచేతఁ గూర్పఁబడినవియును, మిగులవెలగల వస్త్రములచేతను, పుష్పజాలములచేతను, ఆచ్ఛాదనచేయఁబడినవియును, శుభకరము

లయినవియును, నాలుగు కోణములయందును వ్రేలాడుచున్న ముత్యముల సమ్మర్ద ధ్వనులచేతఁ బ్రకాశించుచున్నవియును, అయిన శయ్యలు మిగుల మనోహరములై యుండెను. మఱియు నా క్రీడాగృహమునందు దివ్యములయిన దిండ్లు కలిగియుండెను. మఱియును, అక్కడ ననేకములును మిగుల గొప్పవియును, అయిన వింజామరములు కలిగియుండెను. మఱియు నందలి మంచకముల నాలుగు కోణములయందును మిగుల మనోహరము లగునట్లుగా ప్రకాశించుచున్న రత్నదీపములు ప్రకాశించుచుండెను. మఱియు నా క్రీడామందిరమునందెప్పుడును అగ్నిజ్వాలలతో తుల్యములయిన రత్నదీపములు ప్రకాశించుచుండును. మఱియు నక్కడ ఉశీరవ్యజనములును చామరములును అధికములైనవై యుండెను. మఱియు నక్కడ బంగారముచేతఁ జేయఁబడి రత్నములచేతఁ జెక్కఁబడిన తాంబూలపాత్రములు మెండుగఁ గలిగియుండెను. నిష్ఠీవనపాత్రములుకూడ నధికముగఁ గలిగియుండెను. ఆక్రీడామందిరమునందు రంభయును నప్సరస్త్రీలతో సమానలయిన దాసీస్త్రీలు వేనవేలుగనుండిరి. ఆ దాసీస్త్రీలందఱును సీతారాములకు రాత్రింబగళ్లు నియమము లేక వింజామరలను వైచుచుండిరి. మఱియు నా క్రీడాగృహమునందు రత్నపంజరము లధికముగఁ బ్రకాశించుచుండెను. యాగకాలమునందు రాజులచేతను రాజుల భార్యలచేతను సీతారాముల కర్పింపఁబడిన చిత్రవస్తువులచేత నా క్రీడామందిరము ప్రకాశించుచుండెను. మఱియు నాపంజరములయందు నానావిధములగు శుకాదులు మిగులమనోహరముగ శబ్దించుచుండెను. ఓ శిష్యోత్తమా! ఆ చిలుకలు మొదలగువాని శబ్దప్రావీణ్యము నేమని చెప్పుదును. ఆ పక్షులన్నియును రామనామోచ్చారణముచేత ముక్తినిపొందెను. ఓ శిష్యోత్తమా! ఆపక్షులు పలికినవిధమును చెప్పెదను. సావధానమనస్కుఁడవై వినుము.

"శ్లో. జయతురాఘవో జానకీయుతో జయతు రాజరాజేశ్వరః సదా, దశరథాత్మజో లక్ష్మణాగ్రజో జయతు మాపతిస్తాటకాంతకః. జయతుకౌశికస్యాధ్వరంగతో జయతురక్షసాంమారకో మహాన్, జయతుగౌతమాహల్యయాస్తుతో జయతుజానకీతాతమానితః. జయతునః పతిశ్చాపఖండనో జనకజాకరాన్ముక్తమాలయా, నృపసభాంగణే కౌశికానుగః పరమశోభితశ్చాతిహర్షితః. జయతుభూమిజాంఘ్రఘ్యోస్తదాముదానిజకరోత్పలేస్థాప్యరాఘవః, కమలమస్తకే నాకరోన్నతిం సరఘునందనః పాతునస్సుఖమ్, జయతుభూమిజాలింగితో మహాన్ జనమనోహరశ్చాతిశోభనః. భృగుభవార్పితం ధృత్యవైధనుర్నిజపితుస్తదాదర్శయన్బలమ్, జయతుసీతయా భోగకృచ్చిరంజయతు కైకయీ ప్రేరితో వనమ్. జయతుపర్వతేవాస కృచ్చిరం జయతుయోతిరిణా పూజితో వనే, జయతుయో విరాధస్య పాతకృజ్జయతు దూషణాదిప్రమర్దనః. జయతుయోమృగం మోచయద్భవాజ్జయతుయోకబంధం తృణాజ్జహౌ. జయతువాలికానేతు కారకో జయతు రావణాద్యసురమర్దకః. జయతుస్వంపదం ప్రాప్తసీతయా

యతు మంగలస్నానకృన్మృదా, జయతు వాక్యతో భూసురస్య యస్సకలభూతలం పర్యటన్చిరమ్. జయతుయాగ కృల్లోకశిక్షయా జయతు జానకీం రంజయన్నితః,"

అని యాశుకాదిపక్షులు శ్రీరాముని సర్వకాలములయందును స్తోత్రముచేయుచుండును. ఓశిష్యోత్తమా! ఈవిధముగా పక్షులచేత చేయఁబడినస్తోత్రమును పఠించువారు తమ యభీష్టములను పొందుదురు. ఓశిష్యోత్తమా! అట్లు మిగుల రమ్యమైనగృహమునందు శ్రీరాముఁడు ఏకపత్నీవ్రతస్థుఁడై సీతామహాదేవితోఁగూడఁగూర్చుండెను. ఆక్రీడాగృహమునందు జానకీదేవికూడ శ్రీరామునకు మిగుల సంతోషమునుకల్పించుచుండెను. అంతట శ్రీరాముఁడు సుఖాధిక్యముతో మంచమునందున్నవాఁడై సీతాసౌందర్యమును చూచి సంతోషముతో నిట్లని స్తోత్రముచేసె. ఓసీతా! నేననేకవిధములచేత నాలోచించినను బ్రహ్మదేవుఁడు నిన్ను సృజించెనని నాకుఁదోఁచదు. బ్రహ్మదేవుఁడే నిన్ను సృజించినయెడల నీయట్టివారు భూలోకమునం దింకను ననేకులు గలిగి యుందురు. నీయట్టివారు భూలోకమునం దెవ్వరును లేకపోవుటచేత నిన్ను బ్రహ్మదేవుఁడు సృజింపలేదని తోఁచుచున్నది. ఓ సీతా! నీగోళ్ళు ప్రతిపచ్చంద్రుని తిరస్కరించుచున్నవి. నీగోళ్ల మధ్యమునందలి రక్తవర్ణములు దాడిమ బీజములవలె మిగుల మనోహరములై యున్నయవి. ఓసీతా! నీయంగుష్ఠములు వర్తులములై శిశువులయంగుష్ఠములను పోలియున్నవి. మృదువు లయిన నీపాదములు తామరాకులను పోలియున్నవి. మఱియునీపాదములు స్వస్తికాదిచిహ్నములు కలవై యున్నయవి. ఓసీతా! నీపాదములయందలి యూర్ధ్వభాగములురోమరహితములును మిగుల బలిష్ఠములును నై యున్నయవి. మఱియునో సీతా! నీపాదములు రాజస్త్రీలు నమస్కారము చేయుటకుఁ దగియున్నయవి. మఱియును నీపాదములు కవ్వపుముద్దలతో సమానములై రక్తవర్ణముకలవై యున్నయవి. ఓసీతా! నీ పాదపృష్ఠభాగములు సమములును పీతములును రోమరహితములును నై మిగుల మనోహరములగుచున్నవి. నీగుల్ఫములు వర్తులములును రోమరహితములును మాంసలములును (బలిసినవియును) నై యున్నవి. జంఘులు గోపుచ్ఛములతోసమానములై వర్తులములును మాంసలములునునై యున్నయవి. మఱియు నోసీతా నీ జానువులు నిర్మలములును వర్తులములును నై వరిపొట్టలను పోలియున్నవి. జఘనములు మాంసములును రమ్యములును వర్తులములును పచ్చనివర్ణమును కలవై చిత్తమునకు మోహమును కలుగఁ జేయుచున్నవి. ఓసీతా! నీరతిస్థానమును నేను వర్ణింపఁజాలను. ఓసీతా! నీనాభి గంభీరమును వర్తులమును మిగుల రమ్యమునునై ప్రకాశించుచున్నది. ఓసీతా! నీ యుదరమునందలి వలిత్రయము (ముడతలుమూఁడును) త్రివేణివలెఁ బ్రకాశించుచున్నది. కటిప్రదేశము సింహకటితుల్యమై యున్నది. నీగర్భము సూక్ష్మమును మృదువును మాంసలమును తెల్లనిదియును పీతవర్ణమునునై పుత్రోత్పత్తిని సూచనచేయునట్టిదై యున్నది. ఓసీతా!

నీవెన్నుముక వంశశకలమువలె నున్నది. ఓసీతా! నీపార్శ్వభాగములు మిగుల మృదువులును మాంసలములును లోమరహితములును పీతవర్ణములు కలవియును నై మిగుల మనోహరముగఁ బ్రకాశించుచున్నవి. నీకుక్షి పీతవర్ణము కలదియును లోమరహితమును మాంసలమును నై కొంచెముగ నున్న తదశనుపొందియున్నది. హృదయము కోమలమును రమ్యమును మాంసలమును పీతవర్ణమునుకలదై యున్నతమును పొందియున్నది. మఱియు నోసీతా! నీహృదయము విస్తీర్ణము లోమహీనమును స్నిగ్ధమును నై నాకుసౌఖ్యము నిచ్చుచున్నది. నీస్తనములు బంగారపుకలశములతో సమానములును పీనములును ఘనములును నై నాకు మిగుల సంతోషమును కలుగఁజేయుచున్నవి. ఓసీతా! కోమలములును పీనములును నగు నీభుజములు ఏనుఁగు తుండములను బోలియున్నవి. ఓజానకీ! నీయంగుళములు కృశములును రమ్యములును కోమలములును నై యున్నవి. ఓసీతా! నీహస్తతలములు రక్తవర్ణము కలవియును శంఖధ్వజ మత్స్యాదిరేఖలు గలవై యున్నయవి. కరపృష్ఠభాగములు (మీఁదిచేతులు) మాంసలములును రోమహీనములును కోమలములును శుభకరములును నై యున్నయవి. ఓసీతా! నీస్కంధములు పీనములును వర్తులములును నై మిగుల మనోహరముగనున్నవి. నీజత్రుదేశము మాంసపూరితమైయున్నది. ఓసీతా! నీకంఠము శంఖమునుపోలి మూఁడువిధములయిన మడతలతోఁగూడినదియును నై యున్నయది. నీచుబుకము మధ్యభాగమునందు పల్లమును మిగులబలసినదియును వర్తులమును నై మిగుల మృదుత్వమును పొందియున్నవి. ఓశీతా! నీవక్త్రము ప్రవాలబింబ సదృశమును సుందరమును కోమలమును నై యున్నది. నీయధరోష్ఠము అమృతమువలె మధురమైయున్నయది. ఓజానకీ! నీదంత పఙ్క్తులు మల్లెమొగ్గలను తిరస్కరించుచున్నవి. మఱియు నీదంతపంక్తులు సాంద్రములును కృత్రిమవర్ణముచేత నల్లనివియును నై మిగుల మనోహరములుగ నున్నయవి. మఱియు నీదంతములు హేమపుష్పములచేతను సువర్ణతంతు బంధములచేతను చిత్రవిచిత్రితములై యున్నయవి. నీయూర్ధ్వాధరము రక్తవర్ణమును కోమలమును నై మిగుల మనోహరముగఁ బ్రకాశించుచున్నది. ఓసీతా! నీనాసిక ఋజుగతికలదై తిలపుష్పమునుబోలి ప్రకాశించుచున్నది. నీనేత్రములు మిగులదీర్ఘములై పద్మపత్రములను పోలియున్నవి. మఱియు నోసీతా! నీనేత్రములు లేడినేత్రములనుపోలినవై మన్మథబాణములవలె నున్నవి. నీకనుబొమలు నల్లనివర్ణముకలవై ధనుస్సును బోలియున్నవి. నీలలాటము విస్తీర్ణమును మాంసలమును మృదువును మధ్య చంద్రుని బోలియున్నది. ఓసీతా! నీసీమంతము గంగాకూలమువలె మిగుల మనోహరమై యున్నది. ఓసీతా! నీకేశములు హేమసూత్రములవలె స్నిగ్ధములును మిగులఁగోమలములును నై యున్నవి. నీశిరస్సు సూక్ష్మమును వర్తులమును మాంసలమును శుభకరమును నై యున్నది. వేణీబంధము మిగుల మనోహరమైనదై జఘనమునందుఁ

బడుచున్నది. ఓసితా ! నిముఖముతో చంద్రుండు స్పర్థకలవాఁడై నిన్ను జయింపఁ జాలక క్రమక్రమముగ క్షీణత్వమును బొందుచున్నాఁడు. ఓసీతా ! నీనేత్రముల చేత జయింపఁబడినదై లేడి వనములయందుఁ బరుగిడుచున్నది. ఓసీతా ! ధనుస్సు నీ కనుబొమలతో స్పర్థ కలదగుటచే నాచేత పూర్వము విరువఁబడియె. నీ కటాక్షములు మునులకుఁగూడ మదన వికారమును గలిగించుచున్నవి. నీనేత్రములయందలి చాంచల్యము మత్స్యములకు సిగ్గును కల్పించుచున్నది. నీ నాసికనుజూచి చిలుక తనను ఛీ కొట్టుకొనుచున్నది. ఓసీతా ! నీయోష్ఠములయందలి రక్తిమను చూచి మంకెనపత్రములు సిగ్గుకలవై పచ్ఛాదనమును పొందినవి. ఓసీతా ! నీ సౌందర్య మిట్టిదని చెప్పుటకు బ్రహ్మకుఁగూడ శక్తిలేక యున్నదని చెప్పి శ్రీరాముఁ డా సీతామహాదేవిని కౌగిలించుకొనియె. ఇట్లు శ్రీరాముఁడు చెప్పినవాక్యములనువిని సీతామహాదేవి సిగ్గుచేతఁ దలను వంచుకొనియె. మఱియు నా సీతామహాదేవి కొంచెముగ నవ్వుకలదయ్యె.

ఇట్లు యానందరామాయణాంతర్గత విలాసకాండమునందలి
రెండవసర్గ ముగిసెను.

✷ సీతామహాదేవితో దేహరామాయణ వర్ణనము. ✷

పిమ్మటనారామదాసు మరల నిట్లనియె. ఓ శిష్యోత్తమా ! అట్లు శ్రీరాముఁడు స్తోత్రమును చేసినపిమ్మట సీతామహాదేవి లజ్జచేత పంపఁబడిన మోముకల దయ్యెను వినయముకలదై యిట్లనియె. పద్మపత్రములవంటి నేత్రములుకల యోరామా ! నే నొక్క విషయము నడుగవలయునని తలఁచుచున్నాను. నీవాజ్ఞ నిచ్చిన యెడల నాయభిప్రాయమును విన్నవించెదననిన విని శ్రీరాముఁ డిట్లనియె. ఓసీతా! నీవేమియడుగఁదలచితివో దానిని నిస్సందేహముగ నడుగుము. ఎంతరహస్యమైన విషయమైనను నిరాతంకముగఁ జెప్పెదననిన విని సీతామహాదేవి శ్రీరామునకు నమస్కరించి యిట్లనియె. అధికమైన భుజబలముకల యోరామా ! నిన్నుఁ జక్కఁగ నేను ఎట్లుతెలిసికొందునో యావిషయమును దెలిపి నన్నుఁగృతార్థురాలినిగాఁ జేయుమనిన శ్రీరాముఁడు మరల నిట్లనియె. ఓసీతా ! నీవు మిగులశ్రేష్ఠమైన ప్రశ్నమును చేసితివి. నావిషయమంతయును నీకుఁ దెలియునట్లు చెప్పెదను. సావధానచిత్తురాలవై వినుము. సచ్చిదానందరూపమైన సముద్రమునుండి తరంగరూపమైన యాత్మాంశము బయలు వెడలినది. అయ్యాత్మాంశమిగులఁ బరిశుద్ధమైనది. అదియే యాత్మయను పేరుకలది. ఆ యాత్మ మాతృరూపబుద్ధియొక్క జఠరమునందుఁ బుట్టినది. ఆయాత్మకు శుద్ధసత్వరూపమైన యంతఃకరణము తండ్రియైనది. ఆ యాత్మకు నాలుగు భేదములును నల్గురుబంధువులయిరి. ఆనాలుగవస్థలలో తుర్యావస్థ మిగులశ్రేష్ఠమైనది. దానికంటె జాగ్రదవస్థయుత్తమమైనది. మూఁడవది స్వప్నావస్థయని చె

ప్పఁబడును. నాల్గవది సుషుప్త్యవస్థ యనఁబడును. ఆయాత్మకు హృదయాకాశము నివాసస్థానము. మనోవేగము బహిర్గమము. మనోదుర్వృత్తి ఘాతము మనోవేగమును ఖండించునట్టిది. మాయాయోగము పూర్వసంస్కారనిగ్రహమైనది. కుబుద్ధిహేతువువలన భావారణ్యమునందు చిరకాలము తిరుగుటయగును. విశ్రాంతియనునది యాత్మకు పర్ణశాల యనఁబడును. కామక్రోధలోభజయము ఆశాకృంతనమనఁబడును. శుద్ధమాయాశ్రయము మోహనిగ్రహ మనఁబడును. రజోరూపమాయ జఠరాగ్నినివాసిని యనఁబడును. తమోమాయకు వియోగమనఁబడును. సుఖాలాభముమహత్క్లేశమనఁబడును. శోకభంగమంతకంటె నధికక్లేశ మనఁబడును. భుక్త్యుద్రేకసమాగమము వివేకమున కాశ్రయమనఁబడును. ఉత్సాహము అవివేకనాశకమనఁబడును. త్రిగుణాశ్రయమార్గమునందు లింగాఖ్య నిగ్రహము అజ్ఞానతరణోపాయ మనఁబడును. మదమత్సరకోపములయొక్క నిగ్రహము లింగదేహవియోగ మనఁబడును. అనంతరమందు మాయైక్యమగును. హృదయాకాశగమన మత్యంతానందదాయకము. అనంతరమందు మాయాత్యాగమగును. సాత్త్వికమాయతోఁగూడహృదయాకాశము శ్రేష్ఠమైనది. సచ్చిదానంద సంజ్ఞకమైన మహాకాశమునందు ప్రవేశించుటయే ముక్తినిపొందుటయనఁబడును. అదియె సాయుజ్యముక్తి యనఁబడును. ఓ సీతా ! నీయందలి ప్రేమాతిశయముచేత అజ్ఞాననాశకమైన వృత్తాంతమును తెలిపితిని. ఇప్పుడు నేను జెప్పినవిధమును సర్వమును ఆలోచించిచూచిన యెడల నీకుసర్వవిషయములును తెలియఁగలవనియె. అంతట సీతామహాదేవి రాముఁడు చెప్పిన విధముగ సర్వమును జక్కఁగనాలోచించిచూచె. అట్లుచూచిసర్వమును తెలిసికొనినదై యధికానందమునుపొందె. అవ్విధముగ నానందసముద్రమునందు మునిగిన సీతామహాదేవితో శ్రీరాముఁ డిట్లనియె. ఓ జానకీ! నీవేమిచిత్రమును చూచియానందమును పొందుచున్నావు. నీయజ్ఞానమంతయును నశించినదా ? ఓసీతా ! నీకు నా విషయమైనజ్ఞానమెట్లు కలిగినదో తెలుపుము. నీకేమియును తెలుపకున్నయెడల నింకను బోధించెదననియె. ఇవ్విధముగ శ్రీరాముఁడు చెప్పిన వచనములను విని మంచకమునందున్న యాసీతామహాదేవి యానంద సాగరమునందుమునిగినదై శ్రీరామునితో నిట్లనియె. రావణుని దర్పము నడచినయోరామచంద్రా ! నీవుపదేశించిన జ్ఞానమువలన నాకుసర్వమును తెలిసినది. నీవునిర్గుణుఁడవనియును, నిర్వికారుఁడవనియును, నీక్రీడయంతయును విలాసమాత్రమనియును తెలిసికొంటిని. ఓరఘుకులోత్తమా! నీవిప్పుడు తెలియఁజెప్పినజ్ఞానమునుమరలనీయెదుటఁ జెప్పెదను. సావధానచిత్తముతో నాలకింపుము. ఓరఘుకులోత్తమా ! నీవచనములు మందబుద్ధులకుఁ గూడ జ్ఞానదాయకములై యున్నవియని చెప్పి రాముఁడు చెప్పినవిషయమును సర్వమును అనువదించిచెప్పి మఱియు నిట్లనియె. ఓరఘుకులోత్తమా ! సచ్చిదానందరూపుఁడగు విష్ణువు సాగరుఁడనఁబడును. భూభారహరణేచ్ఛ

శుభేచ్ఛయనఁబడును. ఆత్మాంశలనము తరంగమనఁబడును. ఆపరమాత్మయొక్క బు
ద్ధియే కౌసల్యయనఁబడును. అంతఃకరణము తండ్రియగు దశరథుఁడనఁబడును. ఆత్మ
రూపుఁడైన నారాయణునియొక్క నాలుగగు నవస్థాభేదములు రామలక్ష్మణభరత
శత్రుఘ్నులనఁబడుదురు. ఈనలుగురిలో రాముఁడు తుర్యావస్థయనఁబడును. లక్ష్మ
ణుఁడు జాగ్రదవస్థయనఁబడును. మూఁడవదగుస్వప్నావస్థ భరతుఁడనఁబడును. సుషు
ప్త్యవస్థ శత్రుఘ్నుఁడనఁబడును. అయోధ్యాపట్టణము హృదయాకాశమనఁబ
డును. విశ్వామిత్రునియాగమునకుఁ బోవుటయే మనోవేగమనఁబడును. మనోదు
ర్వృత్తినాశమే తాటకావధ యనఁబడును. మనోవేగభంగమే ధనుర్భంగమయ్యె.
సీతను నాపాణినిగ్రహించుటయే మాయాయోగమనఁబడును. పూర్వసంస్కారనిగ్ర
హమే పరశురామ నిగ్రహమయ్యె. కుబుద్ధిహేతువే కైకేయియయ్యె. అట్టి కైకేయి
కీవరమునిచ్చి దండకారణ్యమునందు సంచరించుటయె భావారణ్య సంచారమనఁబ
డును. దంభనిగ్రహమే విరాధనిగ్రహమని చెప్పఁబడును. పంచవటియే పంచభూ
తాత్మకమైన దేహమనియును అక్కడ నివసించుటయే విశ్రాంతియనియును చెప్పఁ
బడును. ఖరాసురనిగ్రహమే కామనిగ్రహమనఁబడును. క్రోధనిగ్రహమే దూషణ
నిగ్రహమనఁబడును. త్రిశిరానిగ్రహమే లోభనిగ్రహమనఁబడును. శూర్పనఖయొక్క
నాసికాచ్ఛేదనము ఆశాకృంతనమనఁబడును. మృగమారీచవధ మోహనిగ్రహ
మయ్యె. అనంతరమందు దండకావనమున సాత్త్వికరూపురాలగు నన్ను వామాం
కమునందుంచుకొనుటయే శుద్ధమాయాసంయోగ మనఁబడును. జఠరాగ్నియందు
రజోరూపురాలనగు నన్ను నుంచుటయే రజోమాయాప్రవేశన మనఁబడును. తమో
గుణమాయాత్యాగమే నన్ను త్యాగముచేయుట యనఁబడును. నావిరహము మహా
క్లేశమనఁబడును. రావణుఁడు నన్నపహరించుటయే సుఖాలాభమనఁబడును. శోక
భంగమే కబంధభంగమయ్యె. వివేకసంయోగమే సుగ్రీవసంయోగ మనఁబడును.
హనుమంతునియొక్క భక్త్యుద్రేకలాభమే లాభమనఁబడును. వాలివధమే అవివేక
వధయని చెప్పఁబడును. విభీషణసంయోగము ఉత్సాహసంయోగ మనఁబడును.
అజ్ఞానతరణోపాయమే సేతుబంధమగును. త్రికూటాచలమునందు నివసించుటయే
లింగదేహమునందు నివసించుటయనఁబడును. మదనిగ్రహము కుంభకర్ణనిగ్రహ
మయ్యె. మత్సరనిగ్రహము మేఘనాధవధయయ్యె. రావణవధయే అహంకారవధ
యనఁబడును. లంకాపట్టణమును విడుచుటయే లింగదేహత్యాగమనఁబడును. త్రిగు
ణ స్వరూపురాలగు నాతో మరలఁ గలిసికొనుటయే మాయైక్యమనఁబడును.
అయోధ్యాపట్టణమునకు మరలవచ్చుటయే హృదయాకాశమునందు ప్రవేశించుట
యనఁబడును. అయోధ్యాపట్టణమునందు రాజ్యభోగము లనుభవించుటయే ఆనం
దసుఖానుభవమనఁబడును. నన్ను నీఁకమీఁద వాల్మీకాశ్రమమునందు విడిచిపెట్టు
టయే మాయాత్యాగమనఁబడును. సాత్త్వికమాయాగ్రహణమే మరల నన్ను గ్ర

హించుటయగును. హృదయాకాశమును మహాకాశమునందు ప్రవేశపెట్టుటయే అయోధ్యనుండి వైకుంఠమునకుఁ బోవుట యనఁబడును. సముద్రమునందుఁ బ్రవేశించుట సచ్చిదానంద సంజ్ఞయందుఁ బ్రవేశించుట యనఁబడును. ఓరఘుకులోత్తమా! నరరూపమునువిడిచిపెట్టి విష్ణురూపమును చూపించుటయే ముక్తియని చెప్పఁబడును. ఓరాముఁడా! ఈవిధముగా నీచేతనే యేకర్మము చేయఁబడినదో అదియంతయును జనబోధము కొఱకును సకల జనులకును మేలును కలుగఁజేయుట కొఱకును చేయఁబడ్డదని తోఁచుచున్నది. ఓ దేవోత్తమా! కర్మాతీతుఁడవైన నీకు కర్తవ్యాకర్తవ్యము లేవియును లేవు. నీవు చెప్పిన విషయములను విని నేను ముక్తిని పొందినదాననైతిని. ఓ రఘుకులోత్తమా! దేహమునందే రామాయణమును సర్వమునుచూపితివి. ఓ రఘుకులోత్తమా! ఈ విషయమును సర్వమును కంఠస్థమునుగాఁజేసికొనువాఁడు ముక్తుఁడనుటకు సందియ మించుకైనను లేదు. ఓరఘుకులోత్తమా! ఈ దేహరామాయణమువంటిది లోకమునం దేదియును లేదు. ఓరఘువర్యా ఈ దేహరామాయణము గుహ్యమును దుర్బోధమును స్వల్పమును జ్ఞాన ప్రకాశితమును వినువారికి పాతకమును నశింపఁ జేయునట్టిదియును నై యున్నదని సీతామహాదేవి చెప్పినవాక్యములను విని శ్రీరాముఁడు నవ్వుచు నిట్లనియె. ఓసీతా! నీవీ దేహరామాయణమును సర్వమును తెలిసికొని ధన్యురాల వైతివి. నీయట్టి ధన్యురాలు ముల్లోకములయందును లేదు. ఓ జానకీ! నీయందలి ప్రేమాతిశయము చేత ఈ దేహరామాయణమును చెప్పితిని. దీనిని దాంభికుఁడును నాస్తికుఁడును శఠుఁడును భక్తిలేనివాఁడును విప్రద్వేషియును పరదారారతుఁడును మలినుఁడును అతిక్రూరుఁడును నిందకుఁడును జడుఁడును, అయిన వానికి బోధింపఁజనదు. కలియుగమునందు ఇది మిగుల గుహ్యమై నూటిలో నొక్కనికి మాత్రము తెలిసియుండును. ఓసీతా! సర్వవేదాంత సారమైన యీ దేహరామాయణము భుక్తిముక్తుల నిచ్చునట్టిదియై యుండును.

ఇట్లు యానందరామాయణాంతర్గత విలాసకాండమునందలి
మూఁడవసర్గ ముగిసెను.

✱ దినచర్యా సీతాలంకార వర్ణనములు. ✱

ఓ శిష్యోత్తమా! అట్లు శ్రీరాములు మాటలాడుచుండఁగా నాటిరాత్రి నాలవ జామువచ్చె. ఆసమయమునందు రాముని మేలుకొలుపునట్టి వందిమాగధ సూతనర్తక నటాదులువచ్చిరి. వచ్చి యనేకములగు వాద్యములను ప్రయోగించిరి. అప్సరోగణము నృత్యమునుచేసె. వందిమాగధాదులు స్తోత్రపాఠాదులను సల్పిరి. మఱియు నిదివఱకుఁ జెప్పఁబడినవిధముగ పంజరములయందున్న చిలుకలు మొదలగునవికూడ మిగుల మనోహరముగ రాముని స్తోత్రము చేయుచుండె. అట్టి గానాది

ధ్వనులచేత సీతామహాదేవి ముందుగ మేల్కాంచె. అట్లు నిద్రనుండి లేచి రాముఁడు దేవతలు మునులు, తండ్రి, తల్లి, సరయూనది, గురువు, చింతామణి, కామధేనువు మొదలగువారికి నమస్కారమునుచేసి మనస్సునందు స్మరించె. అనంతరమందు ఆసీతా మహాదేవి దుర్గ, గంగ, వాణి, రఘూత్తముఁడు, అనువారిని మనస్సునందధికముగ స్మరించె. పిమ్మట కౌసల్యాదేవి, తనతల్లి మొదలగువారిని స్మరించి రాముని పాదములకు నమస్కరించి వినయముచేతఁ పంపఁబడిన మోముగలదై యుండె. అనంతరమందు రాముఁడుకూడ దేవ గుర్వాదులకుఁగూడ నమస్కరించి కాలోచితములగు శౌచదంత ధావనాది కృత్యములనుచేసె. పిమ్మట స్నానమును చేసి నిత్యవిధిని సర్వమును నెరవేర్చె. అనంతరమందు శాస్త్రోక్త ప్రకారముగ హోమమునుచేసి గృహమునందలి దేవతను అర్చించె. పిమ్మట బ్రాహ్మణుల కనేకములగు దానాదులను జేసె. ఇంతలోపల సీతామహాదేవికూడ నమస్కరించి దేవీపూజనుచేసె. అనంతరమందు దేవాగ్ని బ్రాహ్మణులకు నమస్కరించి పిమ్మట నత్తగారికి నమస్కరించె. అనంతరమందు రామచంద్రునకు నమస్కరించి యారామునకు పార్శ్వభాగమునందు నిలిచియుండె. పిమ్మట శ్రీరాముఁడు వసిష్ఠ మునివరుని ముఖమువలన పురాణ కథలను వినుచుండె. అట్లు పురాణకథలను వినుచుండునపుడు సీతామహాదేవియును, కౌసల్యాదులును రామునిపార్శ్వమునందుండి వినుచుండిరి. అవ్విధముగ శ్రీరాముఁడు సావధానచిత్తుఁడై పురాణకథలను విని పిమ్మట గురుఁడగువసిష్ఠమునివరునకు శాస్త్రోక్తప్రకారముగఁ బూజనుచేసె. అనంతరమందా శ్రీరాముఁడు గురుపత్నియగు నరుంధతికిని తల్లుల కౌసల్యాదులకును నమస్కారమునుచేసె. పిమ్మట వేదవేత్తలును, పండితులును, వైదికులును, మునులును, యోగనిష్ఠాపరులును, తపోనిష్ఠులును, జ్యోతిశ్శాస్త్రవేత్తలును, మీమాంసకులును, తార్కికులును, మంత్రవిశారదులును, ధర్మశాస్త్రవేత్తలును, వయోధికులును, అగుబ్రాహ్మణులకుఁ బూజానమస్కారములనుజేసె. అంతట సీతామహాదేవికూడ నాబ్రాహ్మణాదులకుఁ బూజానమస్కారములను గావించె. పిమ్మట సీతామహాదేవి హేమపాత్రమునందు పూజోపకరణములను బెట్టికొని చెలికత్తియలతోఁ గూడఁబోయి కామధేనునర్చించె. అనంతరమందు పక్వాన్నములచేతను విచిత్రములగు పాయసాదుల చేతను ఆకామధేనువునకు సంతోషమును గలిగించె. అంతటసీతామహాదేవి కామధేనువునకుఁ బ్రదక్షిణనమస్కారములను చేసి యిట్లని ప్రార్థించె. ఓకామధేనువా! నీకునమస్కారమును చేసెదను. రాముఁడుబ్రాహ్మణులుమొదలగువారలకందఱును తృప్తి కలిగింపఁ దగిన పక్వాన్నాదుల నొసంగుమని ప్రార్థించె. ఇట్లుప్రార్థించిన పిమ్మట నాసీతామహాదేవి యనేకవేల సువర్ణపాత్రలను కామధేనువుక్రిందఁ బెట్టించె. అంతటకామధేనువు దివ్యాన్నాదులచేత ఆపాత్రలనన్నిటిని నిండించె. అప్పుడు సీతామహాదేవి మహా సంతోషము కలదై చె

లిక స్త్రీయులతోఁ గూడ దివ్యాన్నాదులను రామాదులకు వడ్డించుటకొఱకు నాపాత్రలను దీసికొనిపోయె. అంతలోపల శ్రీరాముఁడు బ్రాహ్మణులకును బంధువులకును గంధ మాల్యాదుల నొసంగి వారలతోఁగూడ సువర్ణరత్న పీఠములయందు గూర్చుండె. అప్పుడు సీతామహాదేవియును రాముని బంధు పత్నులును ఆదివ్యాన్నాదులను సువర్ణమయములయిన పళ్లెరముల యందువడ్డించిరి. అట్లుస్త్రీలందఱును వడ్డించునపుడు వారియాభరణధ్వనులు మిగుల మనోహరములై యుండె. ఆమనోహరధ్వనిని విని యందలి వారెవ్వరో ముచ్చటగ మాటలాడుచున్నారని తలఁచుచుండిరి. ఆసమయమునందు మెఱపుతీగవలె మెఱయుచున్నదియును, కోటిమంది సూర్యులకాంతి వంటికాంతి కలదియును అయిన సీతామహాదేవిని చూచి తమమనస్సుల యందు మహాలక్ష్మియని తలఁచి నమస్కరించుచుండిరి. ఆసీతామహాదేవియొక్క పాదవిన్యాసస్థలములయందు మత్స్యకచ్ఛప చక్రాదిరేఖలను చూచి యత్యాశ్చర్యమును పొందుచుండిరి. ఆసమయమునందు సీతామహాదేవి శరీరమునందు నానావిధములయిన యాభరణములను పాదములయందు గజ్జలందెలు మొదలగు నాభరణములను మొలయందు నానావిధములగు రశనలను,నానావిధనూపురములను,నాభరణములను, ఉజ్జ్వలములగు కంకణములను, రత్నకంకణములనుచూచి యత్యాశ్చర్యమును పొందుచుండిరి. మఱియు నాసమయమునందు సీతామహాదేవి సకలావయవముల యందునుధరించిన నానావిధాభరణము లిన్నియనిగాని,ఇట్టివియనిగాని,ఇంతమనోహరములయినవి యనిగాని నిర్వచించుటకు నాదిశేషుఁడుకూడ శక్తుఁడుగాఁడయ్యె. అట్టియాభరణాదులనుచూచి యెల్లవారును విస్మయమునుపొంది నిశ్చేష్టితులై యుండిరి.

ఇట్లని శతకోటిరామాయణాంతర్గత విలాసకాండము నందలి
నాల్గవసర్గ ముగిసెను.

* జలయంత్రక్రీడావర్ణనము. *

అంతట మరల రామదాసిట్లనియె. ఓశిష్యోత్తమా ! విష్ణుదాసా ! అవ్విధముగ నెల్లవారును సీతాలంకారమునుచూచి యాశ్చర్యమును పొందుచుండఁగా సీతామహాదేవి క్షణములోపల నెల్లపాత్రలయందును దివ్యాన్నాదులను వడ్డించె. మఱియును,రాజస్త్రీలతోఁగూడ నాసీతామహాదేవి కామధేనువు వలనఁ గలిగిన నానావిధములయిన పక్వాన్నములు,పూర్ణపూరితములయిన పక్వాన్నములు, వడలు, ఫేనికములు, మిగుల మనోహరములయిన పాయసములు, పర్పాటకములు, లడ్డుకములు, కూశ్మాండవటకములు, భృష్టతండులరామలములు, దధిక్షీరఘృతమధువులు మొదలగువానిని వేరువేరు విధములగు సువర్ణపాత్రలయందు వడ్డించె. మఱియును, చక్కెర, ఖండచక్కెర, మిరియములు మొదలగువానిచేతఁ జక్కఁగఁజేయఁబడిన మజ్జిగ, నేతితో వండినకూరలు, అల్లమువేసినవడలు, మామిడిపండ్లరసము, అరటిఫల

ములు మొదలగువానినిగూడ వర్ధించె. మఱియు నివ్విధముగానే లేహ్యపేయము లనుగూడ సమృద్ధిగవర్ధించె. అంతట శ్రీరాముఁడు ఎల్లవారితోడను సుఖాసీనుఁడై యుండి సరసాలాపములను జేయుచు భోజనమునుచేసె. పిమ్మట కరశుద్ధినిగావించు కొని యెల్లవారికిని స్వహస్తముతో తాంబూలమునొసంగె. అంతట శ్రీరాముఁడు తాంబూలమును వైచుకొని వస్త్రాభరణ శస్త్రములనుధరించి యద్దమునందుఁ దన ప్రతిబింబమును చూచికొనియె. అనంతరమందు ముత్యములు మొదలగువానిచేత ప్రకాశించుచున్నదియును, మిగుల శ్రేష్ఠమైనదియును, అయిన శిబికనధిష్ఠించి తన గృహమునుండి బయలునకుఁబోయె. అవ్విధముగ బంధువులు మంత్రులు మిత్రులు దూతలు మొదలగువారు వెంటరాగా వందిమాగధాదులు స్తోత్రమును చేయుచుండఁగా తల్లియగు కౌసల్యయొద్దకుఁబోయి నమస్కరించి యక్కడనుండి బయలువెడలి క్రమముగఁ దల్లులకందఱకును నమస్కరించె. అంతట తల్లుల యాశీర్వచనములను పొంది సభలోనికిఁబోయి మంత్రి లక్ష్మణాదులతోఁగూడ సింహాసనమునధిష్ఠించె. పిమ్మట నీతివేత్తలలో నుత్తముఁడగు నారాముఁడు రాజకార్యములనన్నిఁటిని జక్కఁగ నెరవేర్చె. మఱియు నోవిష్ణుదాసా! బుద్ధిమంతుఁడును చారులే నేత్రములుగాఁ గలవాఁడును, అయిన శ్రీరాముఁడు రాజ్యమును జక్కఁగఁ బరిపాలించె. అనంతరమందు సీతామహాదేవి తన రాజస్త్రీలు మొదలగువారితోఁ గూడ భుజించి కరశుద్ధియైన పిమ్మట నెల్లవారును తాంబూలమును భుజించిరి. అంతట సీతామహాదేవి ధవళవస్త్రమును ధరించి రక్తవర్ణము కలదియును, హేమతంతువులతో సువర్ణపుష్పములతోడను గూడుకొన్నదియును, అయిన కంచుకమునుధరించి నివాసమందిరమునకు సమీపమునందున్న యుద్యానవనములోని దివ్యశాలయందు రాజస్త్రీలు మొదలగువారితోఁగూడ నివసించె. అనంతరమందు దివ్యాలంకారములను ధరించె. ఓశిష్యోత్తమా! విష్ణుదాసా! సీతామహాదేవి శరీరమునందు ధరించిన యాభరణములను తొల్లి కొంతవరకు వర్ణించిచెప్పితిని. ఆయాభరణము లిన్నియనికాని యిట్టివియనికాని వర్ణింపనెవ్వఁడు సమర్థుఁడగును. ఆసీతామహాదేవియొక్క యాభరణములను వర్ణింపఁ బ్రయత్నించి నాలుగు మోములుగల బ్రహ్మదేవుఁడును,అయిదు ముఖములుకల పరమశివుఁడును,ఆఱుముఖములుకల కుమారస్వామియును,ఏడుముఖములుకల యుచ్చైశ్శ్రవస్సును,వేయిమోములుకల యాదిశేషుఁడు మొదలగువారందఱును సమర్థులుగాకపోయిరి.అట్లు సీతామహాదేవి యుద్యానవనమునకుఁ బోయిన వృత్తాంతమునువిని జలపూరకులందఱును మిగుల వేగముగ జలయంత్రములను విడిచిపెట్టిరి.ఆసమయమునందు సీతామహాదేవి రత్నమయమంచకమునందుఁ బరుండఁగా పనికత్తెలువింజామరములను వైచుచుండిరి.అట్లు పరుండియుండి యా యుద్యానవనమునందలి జలయంత్రముల కౌతుకమును చూచుచుండె. ఇంతలోపల శ్రీరాముఁడు రాజకార్యములనన్నిటిని నెరవేర్చి సభనుండి బంధువులు మొదలగువారి

తోఁగూడబయలు వెడలి నిజమందిరమునకుఁ బోయెను. ఆసమయమునందు దుందుభిధ్వనులును, నూతనవాద్యముల నాదములును, శంఖకాహళ గోముఖాది వాద్యముల నిస్వనములును తెంపులేకఁ బ్రవర్తిల్లె. యంత్రధ్వనులును తూర్య నిస్వనములును అతిశయించె. వారస్త్రీలు నృత్యములను సల్పిరి. వందిమాగధాదు లనేకవిధముల స్తోత్రమునుచేసిరి. ఆధ్వనులను విని యుద్యానవనమునందున్న సీతామహాదేవి మిగుల వేగముగ మంచమునుండిదిగి పాద్యోదకపాత్రములను దీసికొని శ్రీరాముని యాగమమును నిరీక్షించుచుండె. ఇంతలోపల శ్రీరాముఁడు శిబికనుండిదిగి సకల జనులను వదలి బంధువులతోఁగూడ గృహమునందుఁ బ్రవేశించె. ఆసమయమునందు నానావిధాభరణములచేత సలంకరింపఁబడిన దాసీస్త్రీలు కోటికోటిగ తమతమ కార్యములయందుఁ ద్వరకలవారై పరుగిడుచుండిరి. కొందఱు స్త్రీలు శ్రీరామునకు వింజామరములను వైచిరి. మఱియొక్కతె రత్నమయమైన యాసనమును సిద్ధపఱచె. ఇంకొకతె తాంబూల పాత్రమును వేఱొకతె నిష్ఠీవనపాత్రమును ధరించియుండె. మఱియొక్కతె మిగుల మనోహరమైన జలకుంభమును ధరించె. మఱియొకతె వస్త్రకోశమును ధరించియుండె. ఇంకొకతె కార్ముకమును ధరించియుండె. వేఱొకతె తూణీరమును ధరించియుండె. మఱియొకతె ఖడ్గమును ధరించె. ఈవిధముగ దాసీజనము నానావిధములయిన యుపకరణములను ధరించియుండిరి. మఱియు ననేకులు రామచంద్రుని జుట్టుకొనియుండిరి. అంతట సీతామహాదేవి లజ్జచేత వంపఁబడిన మోముకలదై ముంగిలియందు నివసించియున్న సీతామహాదేవి యొద్దకుఁ బాదచారియై పోయె. ఆసమయమునందు సీతామహాదేవి చెలికత్తియలతోఁ గూడుకొని మెల్లమెల్లగ శ్రీరామున కెదురుగవచ్చె. అప్పుడు శ్రీరాముఁడు సీతామహాదేవినిచూచి చిరునగవును చూపుచున్న మోముకలవాఁడయ్యె. పిమ్మట సీతామహాదేవి సమర్పించిన జలముచేత నాచమనమును చేసె. అనంతరమం దుదకపానమునుచేసి యక్కడనుండి సీతామహాదేవితోఁగూడ జలయంత్రములున్న చోటునకుఁబోయె. పోయి జలయంత్ర సమీపమునందున్న గృహములోఁ బ్రవేశించి సింహాసనమునందుఁ గూర్చుండి లక్ష్మణునితో నిట్లనియె. ఓలక్ష్మణా! నీవు శీఘ్రముగ భోజనశాలకుఁబోయి యార్మికాదులను త్వరఁబఱచి భోజ్యములగు పదార్థములను సిద్ధముచేయించి బ్రాహ్మణాదులందఱును వచ్చిన పిమ్మట నన్నుఁ బిలిపింపుమనియె. పిమ్మట వసిష్ఠాది మునివరులు భరతశత్రుఘ్న మాండవీశ్రుత కీర్త్యాదులను కూడ త్వరఁబఱచె. అంతట శ్రీరాముఁడు జలయంత్రములను జూచుచు ననేకములయిన జలయంత్రములను నూతనముగ నిర్మింపఁజేసె. పిమ్మట సీతామహాదేవితోఁగూడ జలక్రీడ నాచరించుచున్న సమయమునందు అనేక పర్యాయములు తన భుజములతో సీతామహాదేవిని బట్టుకొని జలమునందు వైచుచుండె. ఇవ్విధముగ గంగోదకముచేత సీతామహా

దేవికి సంతోషమును గల్పించె. అంతట దాసీ జనముచేతఁ దీసికొని రాఁబడిన సుగంధ తైలాదులచేతఁ జేయఁదగిన యలంకారములను చేసికొనియె. ఆసమయమునందు రామునిచేతఁ జేయఁబడిన కను సంజ్ఞను దెలిసికొని యక్కడనుండు వారందఱును తెరల చాటునకుఁ బోయిరి. అట్లు వారును మఱుగునకుఁ బోయిన పిమ్మట సీతారాము లిరువురును చిరకాలము యథేచ్ఛముగ జలక్రీడను సలిపిరి. మఱియు నాక్రీడాకాలమునందు వేడుకఁగా సీతారాములు పిడికిటిదెబ్బలను గొట్టుకొనిరి. మఱియును శ్రీరాముఁడు సీతామహాదేవియొక్క బింబోష్ఠమును ముద్దుపెట్టుకొని కుచాగ్రములను చూర్ణము చేసె. అనంతరమందు సీతామహాదేవియొక్క కంచుకమును దీసివైచి తనహృదయముతో సీతాహృదయమును గాఢముగ నాలింగనమును చేసికొనియె. అంతట శ్రీరాముఁడు సీతామహాదేవియొక్క కుచ్చెలులను తనహస్తముతో విడిచె. అంతలో నావస్త్రమెగిరి క్రిందఁబడె. అప్పుడు రాముఁడు సీతామహాదేవియొక్క యూరుభాగములనుజూచి సంతోషమునుపొందె. అంతట నూరకుండక యాసీతయొక్క నీవీబంధమునుకూడ నూడఁదీసె. అప్పుడు సీతామహాదేవి నవ్వుచు శ్రీరాముని నీవీబంధమును విడిపించె. ఈవిధముగ నాదంపతు లిరువురును సంతోషముతో జలక్రీడను సలుపుచుండిరి. ఓశిష్యోత్తమా! విష్ణుదాసా! ఆసీతారాముల జలక్రీడను సంపూర్ణముగ నెవ్వఁడువర్ణింపఁగలఁడు. ఇట్లు సీతారాములు జలక్రీడను సల్పుచుండఁగా లక్ష్మణుఁడు బంధువులు మొదలగువారినందఱను రప్పించి భోజనముకొఱకు రామునకు సూచనచేయుటకొఱకు లక్ష్మణుఁడు బయలువెడలిపోయె. అట్లుపోవుచు ద్వారపాలికలచేత నివారింపఁబడి యాలక్ష్మణుఁడు వనద్వారమునకువెలుపల నిలిచియుండె. అంతట నాద్వారపాలికలో లక్ష్మణా! సీతారాములు జలయంత్రములయందు జలక్రీడనుచేయుచున్నారు. కావున నీవు పోఁగూడదనిన లక్ష్మణుఁడో ద్వారపాలికలారా! నేను భోజనమునకుఁ బిలువఁదలఁచి వచ్చితిని. శ్రీరామునకుఁ దెలుపుఁడు. నేను మరలిపోయెదననియె. అంతట నాద్వారపాలికలలో నొక్కతెపోయి తెరకుబయలుననుండి భయభీతురాలును లజ్జితురాలును నగుచు లక్ష్మణుఁడు ద్వారదేశమునందు వచ్చియున్నాఁడని శ్రీరామునకుఁ దెలిపె. ఆవార్తనువిని సీతారాములిరువురును జలయంత్రములను విడిచిపెట్టిరి. పిమ్మట నలుగులు మొదలగువానిం బెట్టికొని యుష్ణోదకముతో స్నానమునుచేసిరి. పిమ్మట నాదంపతులిరువురును పీతకౌశేయాదులను ధరించిరి. అంతట నార్ద్రవస్త్రములను దాసదాసీజనముల కిచ్చిరి. అంతట బయలువెడలి భోజనశాలలోనికి వచ్చిరి. అట్లు సీతారాములు భోజనశాలలోనికి వచ్చునంతలో నూర్మిళాదులు మునుపటికంటె నధికముగ కామధేనువువలనఁ గలిగినపదార్థములను భోజనపాత్రములయందు వడ్డించిరి. అంతట శ్రీరాముఁడు మునీశ్వరులు గురుఁడు సుహృన్మిత్రమంత్రులు బంధువులు మొదలగువారితోఁగూడ భోజనమునుచేసి సంతోషమునుపొందె. అట్లు

శ్రీరామాదులు భోజనమును చేయునపుడు సీతామహాదేవి వింజామరముచేత వీఁచుచుండె. మఱియు నాసీతామహాదేవి మృదు మధురవాక్యములచేత రామునకు సంతోషమును గల్పించుచుండె. ఈవిధముగా భోజనమును చేసినపిమ్మట శ్రీరాముఁడు సీతచేత నీయఁబడిన తాంబూలమును భుజించె. అంతట శ్రీరాముఁడు కొలువుదీరి మంత్రిమిత్ర బాంధవాదులతోఁగూడ పుణ్యకథాలాపములను చేయుచుండె. పిమ్మట సీతామహాదేవికూడ భోజనమునుచేసి సర్వాలంకారములచేతను నలంకరింపఁబడినదై చెలికత్తియలతోఁగూడ నిద్రాశాలయందుఁ బ్రవేశించియుండె. అనంతరమందు దాసీజనముతోడను సఖీజనముతోడను పాచికలనాడుచు రామాగమమును నిరీక్షించుచుండె.

ఇది యానందరామాయణాంతర్గత విలాసకాండమునందలి

ఏడవసర్గ ముగిసెను.

✱ బ్రాహ్మణపత్నికి నలంకారదానముచేయుట. ✱

అంతట రామదాసు మరల నిట్లనియె. ఓవిష్ణుదాసా ! అంతట శ్రీరాముఁడు బంధువులు మొదలగువారితోఁగూడ కొలువునుండి లేచి వందిమాగధాదులు స్తోత్రమును చేయుచుండఁగా నేకాంతమందిరమునందుఁ బ్రవేశించె. అట్లు ప్రవేశించునపుడు లక్ష్మణాదులను వెనుకకుఁబంపి దాసీజనముచేతఁ జుట్టుకొనఁబడినవాఁడై పోయి నిద్రాశాలయందున్న సీతామహాదేవినిచూచె. ఆసీతామహాదేవి అప్పుడు శ్రీరాముఁడు వచ్చుటను దెలిసికొని పాచికలనాడుటను విడిచిపెట్టి చెలికత్తెలతోఁగూడ రామున కెదురుగఁబోయె. అట్లెదురుగఁబోయి నమస్కరించి శ్రీరాముని హస్తముచేతఁ గైకొనిపోయి మంచకమునందుఁ బ్రవేశపెట్టె. అనంతరమందు శ్రీరామునకుఁ ద్రాగుటకు జలమునిచ్చి పిమ్మట దివ్యమగు తాంబూలమునిచ్చె. అనంతరమందు దాసీజనము వింజామరములను వైచుచుండఁగ సీతారాములు మంచకమునందు సుఖముగ నిద్రించిరి. పిమ్మటఁ గొంతసేపటికి సీతామహాదేవి మంచకముక్రింద దిండును నానుకొని పరుండె. ఇంతలో రాముఁడు నిద్రనుండి లేచుటను దెలిసికొని త్రాగుట కుదకమును దానముచేసె. మఱియు నాసమయమునందు సీతామహాదేవి మరల తాంబూలము నొసంగె. అప్పుడు రాముని దాసీజనము వింజామరలనువైచిరి. అంతట శ్రీరాముఁడు సీతామహాదేవియొక్క హస్తమును పట్టుకొని ద్రాక్షావల్లీ మండపములోనికిఁ గొనిపోయి యక్కడనుండు నాసనమునందుఁ గూర్చుండె. అనంతరమందు నానావిధములయిన చిత్తరువులతోఁ గ్రీడించిరి. మఱియును పంజరముల యందున్న నానావిధములగు పక్షుల వచనములనువిని యాసీతారాము లానందించిరి. ఇంతలో

వల సీతామహాదేవివలనఁ బలువఁబడి యనేకవేలమంది వారస్త్రీలు నృత్యములను సల్పిరి. మఱియు నా వేశ్యాస్త్రీలందఱును షడ్జాది స్వరములను మిగుల మనోహరముగ వినుపించిరి. పిమ్మట సీతామహాదేవి యావేశ్యలకందఱకును నానావిధాభరణముల నొసంగి వారలనందఱను బంపి శ్రీరామునితో నిట్లనియె. ఓరఘుకులోత్తమా! సీతోఁగూడ మేడమీఁదికిఁబోయి హట్టాలకములయందలి వేడుకలను జూడవలయునని తలఁచుచున్నాననియె. అంతట శ్రీరాముఁడు సీతతోఁగూడ బయలు వెడలిపోయి దివ్యమైన యాసనమునందుఁ గూర్చుండి గవాక్షముల ద్వారముగ హట్టజాతమైన విచిత్రములను చూచుచుండె. మఱియు నారాముఁ డనేకవిచిత్రములను సీతామహాదేవికిఁ జూపించుచుండె. ఆసమయమునం దొకబ్రాహ్మణభార్య వస్త్రాలంకారహీనురాలై కటిభాగమునందు శిశువును ధరించి రాజమార్గమున భిక్షార్థముగఁ బోవుచుండె. అట్టి యాఁడుదానిని జూచి సీతామహాదేవి తన దాసిచేతఁ బిలిపించె. అనంతరమందా విప్రాంగనతో నిట్లనియె. ఓతరుణీ! భూషణాదులు మొదలగు వానిచేత హీనురాల వగుటకుఁ గారణమేమి? అనిన విని యా విప్రాంగన యిట్లనియె. ఓ మహాదేవీ! నాభర్త నన్ను నాతాత గృహమునందు విడిచి తీర్థయాత్రలకొఱకుఁ బోయె. అంతట గొన్నిదినములకు నాతాత మృతుఁడయ్యె. నాకన్నదమ్ము లిరువురు కలరు. ఆయిరువురునుగురు గృహమునందు నివసించియున్నారు. నన్నుఁ బోషించువారు గృహమునందుఁ బోషించువాఁ డెవ్వఁడును లేఁడు. కావున నోమహాదేవీ! నాశరీరమునం దలంకారము లేమియును లేవనియు, ఈవిధముగా నయ్యంగన చెప్పినవచనములను విని సీతామహాదేవి రాముని మోమునుజూచె. అట్లు చూచి తనదేహమునందలి యలంకారముల నన్నింటిని నా విప్రాంగన కొసంగె. అట్లిచ్చి యా బ్రాహ్మణస్త్రీతో మరల నిట్లనియె. ఓ తరుణీ! నీవు లక్ష్మణుని దగ్గఱకుఁబోయి నేను జెప్పితినని చెప్పి లక్షవరహాల నొసంగుమనియె. అంతట నాయంగన భవదాజ్ఞానుసారముగఁ బోయెదనని చెప్పి లక్ష్మణుని దగ్గఱకుఁబోయె. అంత నిక్కడ సీతామహాదేవి మునుపటికంటె నత్యుత్తమములయిన యలంకారములను ధరించె. మఱియును మిగుల శ్రేష్ఠమగు బంగారు సరిగవేసిన చీరను ధరించె. అంతలో నా విప్రాంగన లక్ష్మణుని దగ్గఱకుఁబోయి సీతావాక్యములను విన్నవించె. అప్పుడు లక్ష్మణుఁడు సీతావాక్యానుసారముగ లక్షవరహాల నిప్పించె. లక్ష్మణుఁడు సీత చెప్పియుండదని తలపకపోయె. రామరాజ్యమునందసత్యమును చెప్పఁగల వాఁడెవ్వఁడు కలఁడు. అంతట సీతామహాదేవి తనదాసిని లక్ష్మణుని దగ్గఱకుఁబంపి యిట్లని చాటింపుమనియె. సప్తద్వీపములయందును సకల వర్షములయందును ఏ స్త్రీయైనను వస్త్రాభరణహీనురాలై యుండిన యెడల నిప్పించెదమనియును, చోరులుండిన యెడల విశేషముగ దండింపఁబడుదురనియును జాటింపు చేయుమనియె. మఱియును, భూలోకమునందలి బ్రాహ్మణా

దులకు ఆభరణాదుల నిచ్చుకొనుటకు మనధనాగారమునందలి ద్రవ్యమును సర్వము ను వ్రయముచేయునట్లు నేను చెప్పితినని చెప్పుమనియె. అంతట నాదాసి బయ లువెడలిపోయి యావృత్తాంతమును లక్ష్మణునకుఁ దెలియఁజెప్పె. అంతట లక్ష్మ ణుఁడు సీతావచనానుసారముగ సర్వమును జరిపించె. అదిమొదలుకొని భూలోకము నం దెవ్వఁడును భూషణరహితుఁడు లేకపోయె. మఱియును భూలోకమునందలి స్త్రీ పురుషులందఱును సీతాభయమువలన సకలాభరణములను ధరించిరి. ఈవిధముగ సీతామహాదేవి భూలోకమునందు నానావిధకౌతుకములను జరుపుచుండె. అనంతర మందు రాముఁడు నాల్గవయామమునందు సభకుఁబోయి బంధు మంత్రిమిత్రాదుల తోఁగూడ రాజకార్యములను నెరవేర్చె. రాజకార్యములను నెరవేర్చిన పిమ్మట శ్రీరాముఁడు బంధువులు మొదలగువారితోఁగూడ నటనాటకవేశ్యలయొక్క కౌతు కములనుచూచె. అనంతరమందు అందఱును వారివారి నివాసములకుఁబంపి శ్రీరా ముఁడు సీతాగృహమునకుఁబోయె. పిమ్మట శాస్త్రోక్తప్రకారముగ సాయం సంధ్యా వందనాదికమును నెరవేర్చి గంధపుష్పాక్షతాదులచేత శివునకును బ్రాహ్మణులకును బూజనుచేసె. అనంతరమందు శివునకు నానోపహారనైవేద్యముల నొసంగె. అట్లు సేసిన యనంతరమందు శ్రీరాముఁడు పురాణ కథాశ్రవణమునుచేసి హరిదాసుల హరికీర్తనలు వేశ్యలయొక్క నృత్యములు పౌరులవృత్తాంతములు గాయకుల గాన ములు మొదలగువానిచేత రాత్రియందలి ఒకటిన్నరయామములను గడపె. అంత ట రత్నమయములయిన దివిటీలతో సీతామందిరమునకుఁ బోయె. ఆసమయము నందు సీతమహాదేవి శ్రీరామున కెదురుగవచ్చె. మఱియు నాసమయమునందు సీతామహాదేవి రత్నదీపములను బట్టుకొనిన చెలికత్తియలతోఁగూడ నెదురుగవచ్చె. అంతట శ్రీరాముఁడు సీతతోఁగూడ రత్నచిత్రితమైన పర్యంకము మీదికిఁబోయి యనేక విధములయిన క్రీడలనుసల్పి సీతామహాదేవిని రంజింపఁజేసె. పిమ్మట నాసీ తారాము లిరువురును చెలికత్తియలు వింజామరములను వైచుచుండఁగ సుఖముగ నిద్రించిరి. ఈవిధముగా పతివ్రతయగు సీతతో రాముఁడును రామునితో సీతయును సుఖమునుపొందిరి. మఱియు నిట్లు పరిపూర్ణమనోరథుఁ డగురాముఁడు ప్రతిదినము నందును నానావిధములయిన కౌతుకములను సలుపుచుండె. మఱియు నో శిష్యో త్తమా! విష్ణుదాసా! వెన్నెలయందును, గృహాంగణమునందును, ప్రాసాదమస్తక మునందును, కిటికీలనుండి చల్లనివాయువులు వచ్చెడు ప్రదేశములయందును, ఏకాం తమందిరమందును, ఉయ్యాలలయందును, ద్రాక్షామండపములయందును, బంగా రము రత్నములు మొదలగు వానిచేత చిత్రితమైన భూమియందును, స్ఫటికమయదే శములయందును, పుష్పకమునందును, చిత్రశాలయందును, పుష్పగృహమునందును, రంభావనము నందును, పుష్పవాటికయందును, చెట్లకుఁగట్టిన యుయ్యాలయందును, కాష్ఠమయమును రత్నచిత్రితమును అయిన మంచకమునందును, తులసీవాటిక

యందును, మఱియు ననేకవిధవిచిత్రస్థలముల యందును శ్రీరాముఁడు సీతామహాదేవితోఁగూడ సుఖనిద్రాదులను పొందె.

ఇట్లని శతకోటిరామాయణాంతర్గత విలాసకాండమునందు
ఆఱవసర్గ ముగిసెను.

---

* సువర్ణమూర్తి దానదేవస్త్రీవరదానములు *

ఓశిష్యోత్తమా! విష్ణుదాసా! అట్లుసీతారాములు మిగుల మనోహరముల గుక్రీడలను సలుపుచుండఁగ నొక్కనాఁడు వ్యాసమునివరుఁడు శిష్యులతోఁగూడుకొని నవాడై శ్రీరాముని జూచుటకువచ్చె. అట్లుమునివరుఁడు తన్ను దర్శించుటకు వచ్చిన సమాచారమునువిని శ్రీరాముఁడెదురుగఁబోయి నమస్కరించి తనమందిరమునకుఁ దోడ్కొనివచ్చె. అనంతరమం దామునివరునకును, శిష్యులకును దగినయాసనంబుల నొసఁగె. అవ్విధముగ శ్రీరాముఁడు వారివారికి దివ్యాసనములనొసంగి వేరువేరుగ నెల్లవారికిని పూజలనుచేసె. ఆసమయమునందు సీతామహాదేవి కామధేనువువలనఁ గలిగిన నానావిధ పదార్థములచేత నామునివరులకు సంతోషము కలుగునటుల నన్నదానముచేసె. అట్లు భోజనముచేసిన పిమ్మట తాంబూల దక్షిణలనిచ్చి చేతులను ముకుళించుకొని శ్రీరాముఁడు వ్యాసమునివరుని కుశలవార్తనడిగె. సీతామహాదేవి సత్యవతీసుతుఁడగు వ్యాసమునివరునకు వింజామరముచేత వీచుచుండె. ఆసమయమునందు వ్యాసమునివరుఁడు తన కుశలవార్తనుదెలిపి శ్రీరాముని క్షేమమును తెలిపి యిట్లనియె. అత్యధికమైన భుజబలముకల యోరామచంద్రా! ఇదివఱకీలోకమునం దెవ్వఁడును నీవు ప్రజాపరిపాలనమును చేసినవిధముగఁ బ్రజాపరిపాలనమును చేసినవాఁ డెవ్వఁడునులేఁడు. నీవలె భూమిననుభవించు వాఁడునులేఁడు. ఇఁకమీఁదఁగూడ నెవ్వఁడును నీవలె భూమిని పరిపాలించువాఁడు దొరకఁడు. మఱియు నోరఘుకులోత్తమా! నీవలె మిగుల ధైర్యముగ నేకపత్నీవ్రతము నవలంబించు వాఁడుకూడ నెవ్వఁడును లేఁడు. ఓరఘువీరా! నీ యేకపత్నీవ్రతమునుగుఱించి యాలోచింపఁగా నాహృదయమునందు మిగుల నాశ్చర్యము కలుగుచున్నది. లోకములో నేరాజు తారుణ్యమనియెడు కామదావానలమును సహింపఁగలఁడు. యౌవనమునందుండి యిట్టివ్రతము నవలంబించునంతటి ధైర్యమునీకుఁదప్ప మఱియొక్కనికిలేదని వ్యాసమునివరుఁడు చెప్పినవిని శ్రీరాముఁడు మరలనిట్లనియె. ఓమునికులోత్తమా! నేను రెండవవిధముగ మాటలాడనని యనఁగా మొదటఁజెప్పినమాట దప్పనని నియమమును చేసితిని. నేను ఏకార్యమును చేసెదనననను మృషాగాఁ జేయనని చెప్పితిని. సీతామహాదేవికంటె నితరులగు స్త్రీలందఱును నాకుఁగౌసల్యయట్టివారు. ఓమునికులోత్తమా! నేను సీతకంటె నితరస్త్రీలను తల్లులనుగాఁ దలఁచుచున్నాఁడను. నేను మనస్సుచేతఁగూడ పరస్త్రీల నభిలషింపను. మఱియు నో

మునికులోత్తమా! నేను జంపఁదలఁచిన యొక్క బాణముకంటె నధికముగ బాణ
ములను బ్రయోగింపను. ఈవిధముగ పూర్వము నేను మూఁడునియమములను జేసి
కొంటిని. కావున నానియమములు మూఁడును తప్పిపోకుండునటుల ననుగ్రహింపు
మనిన విని యావ్యాస మునివరుఁడు భవదభీష్టమును నెరవేరునని మఱియు నిట్లని
యె. ఓరఘుకులోత్తమా! నీకు ఏకపత్నీవ్రతము మఱియొక జన్మమునందుండనేరదు.
నీవు కృష్ణావతారమునం దనేకమంది భార్యలుకలవాఁడ వగుదు వనినవిని శ్రీరా
ముఁ డిట్లనియె. ఓమునికులోత్తమా! నేనే నియమదానములచేత ద్వారకానగర
మునందు కృష్ణుఁడనై జన్మించి యనేకవేలస్త్రీలకు భర్తనగుదునో వానిం దెలుపు
మనిన వ్యాసమునివరుఁ డిట్లనియె. ఓరఘుకులోత్తమా! ఏకపత్నీవ్రతముచేతనే
నీవనేకవేలస్త్రీలకు భర్తవగుదువు. మఱియు నోరామా! సీతాభార సువర్ణముతో
నొకమూర్తిని తొలుతఁజేయింపుము. పిమ్మట దానితో సమములగు పదునాఱు
మూర్తులను జేయింపుము. అనంతరమందా విగ్రహములను సరయూతీరమునందు
బ్రాహ్మణులకు దానముచేయుము. మఱియు నామూర్తులతోఁగూడ ననేకము
లైన వస్త్రాలంకారములనుగూడ దానముచేయుము. ఈవిధముగఁ జేసినయెడల న
నేకవేల స్త్రీలకు భర్తవగుదువనియె. అంతట రాముఁడు వ్యాసవచనానుసారము
గఁ బదునాఱుమూర్తులను చేయించి సరయూ నదీతీరమునకుఁబోయి బ్రాహ్మ
ణులకు దానమునుచేసె. అప్పుడాబ్రాహ్మణులు పరమానందభరితులై యోరఘు
కులోత్తమా! నీవు చేసినదానము సహస్రగుణిత మగుననిరి. మఱియును నీవు మ
ఱియొక జన్మమునందు పదునాఱువేలమంది స్త్రీలకు భర్తవగుదువనిరి. అప్పుడు
శ్రీరాముఁడో బ్రాహ్మణోత్తములారా! మీయిష్టానుసారముగ జరుఁగుగాక యని
చెప్పి యాబ్రాహ్మణులను వారివారి నివాసస్థానములకుఁబంపె. అనంతరమందు వ్యా
స మునివరునకు నమస్కరించె. అంతట నా మునివరుఁడు రామాజ్ఞనుపొంది తన
యిచ్ఛానుసారమగు చోటునకుఁబోయె. అంతట శ్రీరాముఁ డొకనాఁడు వసంతకా
లమునందు సరయూనదీ తీరమున వస్త్రకుటీరమునందు సీతామహాదేవితోఁగూడ
క్రీడించె. అట్లు శ్రీరాముఁడు సీతతోఁగూడ విహరించుచున్న కాలమునందు అనేక
దేశములవారు రామతీర్థమునందు స్నానముచేయుట కక్కడకువచ్చిరి. మఱియు
నాసమయమునందు దేవతలు యక్షులు కిన్నరులు గంధర్వులు పన్నగులు వృక్ష
ములు వల్లులు నదులు నదములు రాజులు మొదలగు వారందఱును సరయూనది
యందలి రామతీర్థమునందు స్నానమును చేయుటకు వచ్చిరి. మఱియు నాకాలము
నందు అప్సరస్త్రీలు పన్నగులు క్షేత్రములు వానరములు దేవభార్యలు మొద
లగు వారుకూడ వచ్చిరి. అట్లు వచ్చినవారలలో నుత్తమ స్త్రీలందఱును సీతా
మహాదేవి యస్పృశ్యరాలై యున్న విధమును దెలిసికొని రాత్రియందు శ్రీరాముఁ
డొంటిగ నుండునని తెలిసికొని తామందఱును కామబాణ పీడితులైరి. అంతట

నాస్త్రీలందఱునుచూచి రాముని ద్వారమునందు రక్షకులుగనున్న దూత లిట్లనిరి.
ఓనారీ రత్నములారా! మీరందఱును రామద్వారమునం దర్ధరాత్రి సమయము
నందుఁ గాచియుండుటకుఁ గారణ మేమనిన వారందఱును రాముని జూచుటకు
వచ్చితిమనిరి. అంతట నారామదూతలు లోనికిఁబోయి యావృత్తాంతమును శ్రీరా
మునకు చెప్పుఁడని దూతికలకు నెఱింగించిరి. మఱియు నాస్త్రీలందఱును తమకు
రామదర్శనము కానియెడల జీవితకాలము సరిపోవునని రను వృత్తాంతమును గూడఁ
దెలిపిరి. అంతట దాసీజనము మిగుల శీఘ్రముగఁ బోయి యావృత్తాంతమును శ్రీ
రామునకు నెఱింగించె. అప్పుడు శ్రీరాముఁడు ఆ స్త్రీలనందఱను రప్పించి చూచె.
ఆస్త్రీలును రామునిచూచి ధన్యత్వమునుపొందితిమని తలఁచిరి. అనంతరమం దా
స్త్రీలందఱును శ్రీరామునకు నమస్కరించి లజ్జచేత నేమియును పలుకఁజాలక య
ధోముఖులై యుండిరి. అంతట శ్రీరాముఁ డో నారీమణులారా! మీరందఱు ని
చ్చోటునకుఁ వచ్చుటకుఁ గారణ మేమనిన వారందఱు నిట్లనిరి. ఓ దేవోత్తమా!
నీవు సర్వమును నెఱుఁగుదువు. నీవెఱుగని యర్థమే మున్నదనిన విని శ్రీరాముఁడు
వారి హృద్గతాభిప్రాయమును దెలిసికొని యిట్లనియె. ఓ నారీమణులారా! నేను
ఏకపత్నీ వ్రతము నవలంబించినవాఁడను. కావున నిప్పుడు మీయభిప్రాయమును
నెరవేర్చుటకు వీలులేదు. మఱియొక జన్మమునందు నీయభిప్రాయమును నెరవేర్చె
దను. నావాక్య మసత్యము కానేరదు. కావున మీరు మీ నివేశనస్థలములకుఁ
బొండు. రామరాజ్యమునందు అధర్మము కలుగఁగూడదు. రాజులకు అధర్మము
నాచరించుటచేత నవశ్యముగ నరకము కలుగుననియె. అట్లు పలుకుచున్న శ్రీరా
ముని వాగ్బాణములచేత బ్రద్దలుగాఁ జేయఁబడిన హృదయము కలవారై యా
స్త్రీలందఱును నప్పుడే మూర్ఛనుబొందిరి. అట్లు మూర్ఛనుపొందిన స్త్రీలను
చూచి శ్రీరాముఁడు విహ్వల మనస్కుఁడై యాస్త్రీలకందఱకును సంతోషమును
గల్పింపఁ దలఁచి యిట్లనియె. ఓ నారీమణులారా! నావాక్యమును వినుఁడు. మీ
వాక్యము లిప్పుడు దుఃఖకరములై యున్నవి. ద్వాపరాంతమునందు నేను నంద
గోపకులమునందు కృష్ణనామధేయముతో జన్మించెదను. అప్పుడు దేవతలందఱును
గోపకులగుదురు. దేవేంద్రుఁడు నందుఁడగును. మీరందఱును గోపికలగుదురు.
ఆ సమయమునందు మీ యిష్టమును నెరవేర్చెదను. మఱియు నాసమయమునందు
మీతోఁగూడ రాసక్రీడను సలిపెదను. ఆరాసక్రీడను కాళిందీ నదియందలి యిసుక
తిన్నెలయందు రాత్రికాలంబున సలిపెదను. కావున మీరందఱును స్వస్థచిత్తత
నవలంబించి మీస్థానములకుఁ బొండనియె. ఇట్లు శ్రీరాముఁడు చెప్పిన వాక్య
ములను విని యా స్త్రీలందఱును సంతోషము కలవారై శ్రీరామునకు నమ
స్కరించి తమతమ నివాసములకుఁ బోయిరి. ఓవిష్ణుదాసా! శిష్యోత్తమా! ఇం
తలోపల వసంతకాలీన స్నానము కొఱకు మిగుల నాదరముతో మాయాపట్టణము